# ఈనాడు



విజయవాడ 3-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 113

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

# కబూతర్.. జా!

- రెండేళ్ల క్రితం హైదరాబాద్ సుల్తాన్‌బజార్ సమీపంలోని ఓ కబూతర్ ఖానా(పావురాలకు దాణా వేసే ప్రాంతం)ను మూసేశారు. పావురాల వల్ల ఆ పరిసరాల్లోని ప్రజలకు శ్వాస సమస్యలు, అలర్జీలు రావడమే దీనికి కారణం.
- ఐదేళ్లుగా ముంబయి నడిబొడ్డున ఉన్న దాదర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న కబూతర్ ఖానాల్ని మూసేయాలని అక్కడి హైకోర్టు ఆదేశించింది. పావురాలకు వేస్తున్న దాణా కుళ్లిపోవడం, దీంతో దుర్గంధం వ్యాపిస్తుండటం, పావురాల రెట్టలు, వాటి శరీరంపైన ఉండే సూక్ష్మజీవులు మనిషి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపడమే ఇందుకు కారణం.



నగరాలు, పట్టణాల్లో పావురాల సంఖ్య గణనీయంగా ఉంటోంది. అవి ఉన్నచోట మనుషుల అనారోగ్య సమస్యలు పెరుగుతుండడం, కొన్నిసార్లు అవి ప్రాణాంతకంగా మారుతుండడం, వీటితో పోటీపడలేక వివిధ పక్షి జాతులు కనుమరుగవుతున్నట్లు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. దీంతో పావురాల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరి పావురాలతో పొంచి ఉన్న ముప్పేంటి? ఆ సమస్యలను ఎలా అధిగమించాలి?



### మీకు తెలుసా?

- పావురం రెట్టలు 60 రకాల వ్యాధులకు కారణమవుతాయి...
- వీటి విసర్జకాలు అంటువ్యాధుల్ని కలిగించే క్రిములకు వాహకాలుగా పనిచేస్తాయి
- వీటి ఈకల్లో ఉండే టిక్స్, మైట్స్, పేలు వంటివి హానిచేస్తాయి
- ఒక పావురం ఎగిరినప్పుడు, అది దాని రెక్కలు విప్పుతుంది. ఇది గాలిలో తేలియాడే ప్రొటీన్లను విడుదల చేస్తుంది. అవి చాలా రోజుల వరకు గాలిలో ఉంటాయి. మనం వాటిని పీల్చినప్పుడు నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళతాయి.
- వీటి ఈకల మీద 'డాండర్' (చుండ్రును పోలిన) అనే పదార్థం ఉంటుంది. ఇవి ఎగిరినప్పుడు గాలిలోకి చేరి, అక్కడున్నవారికి ఎలర్జీలకు కారణమవుతుంది.
- ఆయాసం, దగ్గు, ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు వారి పరిసరాల్లో పావురాలు ఉన్నాయేమో చూడాలి

### గణనీయంగా పెరుగుదల...

- స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్-2023 రిపోర్టు ప్రకారం దేశంలో 2000 సంవత్సరం తర్వాత రాక్ పీజియన్ అనే జాతి పావురాల జనాభా 150 శాతానికి పైగా పెరిగింది.
- భవనాలు, ఆకాశహర్మ్యాలు తదితర ఎత్తైన భారీ నిర్మాణాలు ఇవి గూళ్లు పెట్టుకోవడానికి అనువుగా ఉంటున్నాయి.
- సులభంగా దాణా అందుతుండడంతో అటవీ, గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్‌లో వీటి సంతతి ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది.
- పట్టణాల్లో ఉండే పావురాలు ఏటా ఆరుసార్లు సంతానాన్ని కంటాయి. వీటిని వేటాడే జంతువులు, పక్షులు చాలా తక్కువగా ఉండడంతో నియంత్రణ సహజంగా జరగడం లేదు.



### ఇతర పక్షి జాతులకూ అపాయమే...

- ఒక పావురం ఏడాదికి సగటున 11.5 నుంచి 12 కిలోల రెట్ట వేస్తుంది. వీటి గూళ్లు, ఆమ్లత్వాన్ని కలిగి ఉండే విసర్జకాలు పురాతన, చారిత్రక కట్టడాలు, విగ్రహాల్ని దెబ్బతీస్తున్నాయి
- ఈ కారణంతోనే 2019లో హైదరాబాద్‌లోని మొజాంజాహీ మార్కెట్ వద్ద వందలాది పావురాల్ని పట్టుకొని శ్రీశైలం అడవుల్లో వదిలారు
- భారీ సంఖ్యలో ఉండే పావురాలతో ఆహారం, ఆవాసం విషయంలో పోటీపడలేక పిచ్చుకలు, మైనాలు తదితర పక్షులు చాలా ప్రాంతాల్లో కనుమరుగవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి
- ముంబయి, దిల్లీ సహా వివిధ నగరాల్లో పావురాలకు దాణా వేసే ప్రాంతాల్ని తగ్గించారు. బహిరంగ ప్రదేశాల్లో దాణా వేస్తే బెంగళూరు, పుణే, థానే, పన్వేల్ కార్పొరేషన్లు జరిమానా విధిస్తున్నాయి



### హైపర్ సెన్సిటివిటీ న్యూమొనైటిస్ కేసులు...

- నగరాలు, పట్టణాల్లో పావురాల వల్ల అపరిశుభ్రత పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి..
- దేశంలో చాలావరకు హైపర్ సెన్సిటివిటీ న్యూమొనైటిస్ కేసులకు పావురాలే కారణం
- వీటి రెట్టలు, ఈకల నుంచి క్రిప్టోకోకస్, హిస్టోప్లాస్మోసిస్ లాంటి శిలీంధ్రాలు, బ్యాక్టీరియా, వైరస్, ప్రొటీన్లు విడుదలవుతాయి. వీటి వల్ల అనేక వ్యాధులు వస్తాయి.
- వీటిని పీల్చడం వల్ల వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు, పిల్లల్లో అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు, మెదడువాపు తదితర రుగ్మతలు వస్తాయి

– ఎంఎస్ గోపాలకృష్ణ, పల్మనాలజిస్టు, విజయవాడ



### ఈ చర్యలు తీసుకుందాం...

- పక్షులకు సొంతంగా ఆహారం సమకూర్చుకునే లక్షణం ఉంటుంది. దాన్ని మనమే తగ్గిస్తున్నాం
- పావురాలకు ఆహారం వేయడం మానేస్తే... అవి జనావాసాల నుంచి దూరంగా వెళతాయి
- ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలకు నెట్లు బిగించాలి. అపార్టుమెంట్లకు వలలు వేయాలి
- ఇళ్లలో పావురాల రెట్టలు వేసే కిటికీలు, పైపుల్ని మాస్క్ ధరించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. అక్కడ క్రిమి సంహారాలను చల్లాలి
- ఇళ్లపైన ఉండే నీటి ట్యాంకులకు కప్పి తగిన ఆచ్ఛాదనం ఉంచాలి
- కబూతర్ ఖానాలను జన సమూహం ఉండే ప్రాంతాలకు దూరంగా ఏర్పాటుచేయాలి

– డా.శనివరపు సాయిశ్రీనివాస్, జంతు వైద్యుడు, విశాఖపట్నం

- ఈనాడు, అమరావతి




# కార్మిక చీమ జిందాబాద్!

పుల్ల చీమల కాలనీ వ్యవస్థ ఎంతో ప్రత్యేకం. ఒక కాలనీలో ఎన్నో ఆడ చీమలున్నా.. రాణి చీమ మాత్రమే గుడ్లు పెడుతుంది. మిగిలిన ఆడ చీమలన్నీ కార్మిక చీమలే. ఇవే రాణిని, గుడ్లను సంరక్షించడంతో పాటు ఆహారాన్నీ సేకరిస్తాయి. అలా తర్వాతి సమూహం (కాలనీ) తయారుకావడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మగ చీమలు రాణి చీమతో కలిసిన వెంటనే మరణిస్తాయి. వీటి ప్రత్యేకతలపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నందకిశోర్ మాట్లాడుతూ.. కార్మిక చీమలు గుడ్లను కంటికి రెప్పలా కాపాడతాయని వివరించారు. ఇవి మొక్కలతో పాటు రాళ్లు, ఇటుకల కింద, భూమిలో గూళ్లు కడతాయని, అందులో ఉష్ణోగ్రతల నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లూ చేస్తాయని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కొంతమూరు అగ్రహారంలోని ఓ భవనం వద్ద చీమలు ఇలా చెట్ల ఆకులను కలిపి గూడులా తయారుచేశాయి. – న్యూస్‌టుడే, కోనసీమ

# సైకిల్‌పై సంచారం.. హితవుల ప్రచారం



తిన్నామా.. పడుకున్నామా.. ఉద్యోగం చేశామా.. అని మాత్రమే అనుకోకుండా.. దేశం కోసం.. మంచిని పెంపొందించడానికి నావంతు ఏమి చేయగలను.. అని ఆలోచించేవారూ ఉంటారు. ఆ కోవకే చెందుతారు పుణెకు చెందిన సుశీల్ బొబాడే (52). సేంద్రియ వ్యవసాయం చేసే సుశీల్.. తరచూ సైకిల్ యాత్రలు చేస్తూ.. దేశాన్ని ప్రేమించండి, తల్లిదండ్రులకు సేవ చేయండి, గురువులను పూజించండి, ప్లాస్టిక్‌ను నిరోధించి పర్యావరణాన్ని కాపాడండి అని ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా నవంబరు 3న తిరుపతి నుంచి నాగ్‌పుర్‌కు 1,079 కిలోమీటర్ల సైకిల్ యాత్ర ప్రారంభించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి వద్దకు చేరిన ఆయనను 'ఈనాడు' పలకరించింది. 2022లో పుణె నుంచి అమృత్‌సర్‌కు, కన్యాకుమారికి, రేణిగుంటకు విడతల వారీగా 5,207 కిలోమీటర్ల దూరం సైకిల్ యాత్ర చేసినట్లు వివరించారు. – ఈనాడు, హైదరాబాద్

# కండోమ్‌లపై కస్సుబుస్సు!

జననాల రేటును పెంచేందుకు చైనా పలురకాల చర్యలు చేపడుతోంది. పిల్లల్ని కనాలని ప్రజలను ప్రోత్సహిస్తూ వివిధ పథకాలను అమలు చేస్తుండగా.. తాజాగా కండోమ్ సహా గర్భనిరోధక సాధనాలు, ఔషధాలపై 13 శాతం పన్ను బాదుడుకు సిద్ధమైంది. నిన్నమొన్నటి దాకా కుటుంబ నియంత్రణ కఠినంగా అమలుచేసిన చైనాలో 1993 నుంచి వీటిపై పన్ను మినహాయింపు కొనసాగుతోంది. తాజాగా ఈ పన్ను ఎత్తివేతకు సిద్ధమవడమే కాకుండా.. పిల్లల సంరక్షణ సేవల తోపాటు వివాహ సంబంధిత పలు సేవలపై పన్ను మినహాయింపులు ప్రకటిస్తోంది. జనవరి నుంచి ఈ నిర్ణయాలు అమల్లోకి రానున్నట్లు సమాచారం. చైనా సీడీసీ ప్రకారం గత ఇరవై ఏళ్లతో పోలిస్తే ఇటీవలి కాలంలో ఎయిడ్స్ కేసుల సంఖ్య పెరిగింది. ఇటువంటి తరుణంలో కండోమ్‌ల ధరలు పెరగడం ప్రతికూల ఫలితాలకు దారితీస్తుందనే వాదన కూడా వినిపిస్తోంది. – ఇంటర్నెట్ డెస్క్

# ఓరి పిడుగా!




ఏబీసీడీలు కూడా సరిగ్గా తెలియని మూడేళ్ల వయసులో ఓ నర్సరీ విద్యార్థి ప్రపంచ చదరంగంలో ఫిడే రేటింగు (1572) సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాకు చెందిన సర్వజ్ఞసింగ్ కుశ్వాహ 3 సంవత్సరాల, ఏడు నెలల, 20 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. ముగ్గురు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను ఇతడు ఓడించాడు. ఇప్పటిదాకా ఈ 'ఫిడే' రికార్డు పశ్చిమబెంగాల్‌కు చెందిన అనీశ్ సర్కార్ (3.8) పేరుతో ఉండేది. మొబైల్ ఫోను వ్యసనం నుంచి దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు అలవాటు చేసిన చెస్ ఈ బుడతడి మెదడుకు పదును పెట్టింది. అతడి ఆసక్తిని చూసి ప్రత్యేకంగా శిక్షకుడిని నియమించి, ఆన్‌లైన్ బోధన కూడా ఏర్పాటు చేశారు. నిత్యం ఆరు గంటల ఆటతో ఆరేడు నెలల్లోనే సర్వజ్ఞ ప్రతిష్ఠాత్మక ఫిడే ర్యాంకరుగా ఎదిగాడు. తమ కుమారుడి పేరు పదే పదే చూశాక కానీ, ఫిడే రేటింగు వాస్తవమని తాను నమ్మలేకపోయానని తల్లి నేహాసింగ్ అన్నారు. సర్వజ్ఞను గ్రాండ్ మాస్టరుగా చూడాలనేది తమ కలగా తండ్రి సిద్ధార్థ్ సింగ్ కుశ్వాహ తెలిపారు. – ఈటీవీ భారత్

# భాజపా అభ్యర్థిగా సోనియాగాంధీ



కేరళలో డిసెంబరు 9, 11 తేదీల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఇడుక్కి జిల్లా మున్నార్ పంచాయతీ బరి నుంచి భాజపా తరఫున సోనియాగాంధీ పోటీ చేస్తున్నారు. అవును.. ఇది నిజమే. కాకపోతే ఈమె కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ కాదు. స్థానిక భాజపా నేత సుభాష్‌ను పెళ్లాడిన సోనియాగాంధీ (34). దివంగతులైన ఈమె తండ్రి దురేరాజ్ కాంగ్రెస్ వీరాభిమాని. తమ అగ్రనేతపై ఉన్న అభిమానంతో కుమార్తెకు ఆమె పేరును పెట్టుకున్నారు. ప్రత్యర్థిగా కాంగ్రెస్ మద్దతుతో బరిలో ఉన్న మంజులా రమేశ్‌కు ఇదే తలనొప్పి వ్యవహారంగా మారింది. – ఇంటర్నెట్ డెస్క్

# సెప్టెంబరులోనే మమ్మల్ని విడదీశారు.. నేనెలా వేధిస్తా?

- మాధురి ఆత్మహత్యపై అనుమానాలున్నాయి
- మృతురాలి భర్త రాజేష్



బుగ్గానిపల్లె తండాలో మాధురి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్

ఈనాడు, కర్నూలు; బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఐఏఎస్ అధికారి చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి(25) ఆత్మహత్య ఉదంతంపై పలు అనుమానాలున్నాయని ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకున్న రాజేష్‌నాయుడు ఆరోపించారు. తమను విడదీసి, మాధురిని ఆమె తల్లిదండ్రులు సెప్టెంబరులోనే తీసుకెళ్లారని, వారింట్లోనే ఉన్న ఆమె తన వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకుందని ఎలా అంటారని ప్రశ్నించారు. మాధురి తనకు పెట్టిన సందేశాలను బట్టి చూస్తే పుట్టింటివారిపైనే అనుమానం ఉందన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకోగా.. అందుకు ఆమె భర్త రాజేష్ నాయుడి వేధింపులే కారణమని చిన్నరాముడు ఆరోపించారు. మరోవైపు రాజేశ్‌నాయుడి సెల్‌కు మాధురి పంపినట్లుగా చెబుతున్న కొన్ని సందేశాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దీనిపై రాజేష్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన మాట్లాడుతూ.. "పుట్టింటివారి మాట వినలేదని గుండు కొట్టించారని మాధురి నాకు చెప్పింది. మార్చి 5న మహానంది ఆలయంలో పెళ్లి చేసుకొని నంద్యాల రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్తే అక్కడికి వచ్చిన తల్లిదండ్రులకు నాతోనే ఉంటానని మాధురి తేల్చిచెప్పింది. దీంతో వారు ఆమె మెడలో ఉన్న నగలు తీసుకొని వెళ్లిపోయారు. బలవంతంగా గర్భస్రావం చేయించారని మాధురి నాకు చెప్పింది' అని రాజేశ్ వివరించారు. ● మాధురి సాహితీబాయి అంత్యక్రియలు స్వగ్రామమైన బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె తండాలో మంగళవారం నిర్వహించారు.

# ఉత్తరాంధ్ర కేంద్రంగా మెటల్ క్లస్టర్

- విశాఖకు వచ్చే పరిశ్రమలకు మెటీరియల్ లభించాలి
- ఆర్టీజీఎస్ ద్వారా అక్రమ తవ్వకాలు గుర్తించాలి
- కీలక ఖనిజాలకు విలువ జోడిస్తే.. ఎగుమతులకు అవకాశం
- గనులశాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు



గనుల శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, అధికారులు

**ఈనాడు, అమరావతి:** విశాఖలో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, వాటి నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సరఫరా జరిగేలా చూడాలని, దీనికోసం ఉత్తరాంధ్ర కేంద్రంగా మెటల్ క్లస్టర్ ఏర్పాటుచేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆయన మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై సమీక్ష జరిపారు. లీజు ప్రాంతాల్లో కాకుండా, ఇతరచోట్ల ఎక్కడైనా అక్రమ తవ్వకాలు జరిగితే వాటిని ఆర్టీజీఎస్ ద్వారా గుర్తించేలా చూడాలని, దీనికోసం డ్రోన్, శాటిలైట్ చిత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. గనులశాఖ ద్వారా అధిక ఆదాయం వస్తున్న రాష్ట్రాల్లో ఒడిశా మొదటిస్థానంలో ఉందని, ఆ రాష్ట్రం అవలంబిస్తున్న విధానాలను, మన రాష్ట్రంలో ఎలా అమలు చేయవచ్చో అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను మరింత బలోపేతం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

### వాల్యూ ఎడిషన్ పరిశ్రమలకు ప్రోత్సాహం

'ఏ ఖనిజానికైనా విలువ జోడిస్తే మరింత విలువ పెరుగుతుంది. ఇటువంటి వాటిపై దృష్టిపెట్టాలి. సిమెంట్ పరిశ్రమలు సున్నపురాయిని, స్టీల్ పరిశ్రమలు ఇనుప ఖనిజాన్ని వినియోగిస్తున్నాయి. వీటితోపాటు బీచ్ శాండ్ ద్వారా టైటానియం ఉత్పత్తులు, మాంగనీస్‌తో ఫెర్రో ఎల్లాయిస్ ఉత్పత్తులు, క్వార్ట్జ్, సిలికా శాండ్‌లతో సోలార్ ప్యానళ్లు, సోలార్ పీవీ సెల్స్, గ్లాస్ ఉత్పత్తులు చేసే పరిశ్రమలు, గ్రానైట్ ద్వారా వాటి కటింగ్, పాలిషింగ్ చేసే యూనిట్లు వస్తాయి. అలాంటి పరిశ్రమలను ప్రోత్సహించేలా గనులశాఖ చర్యలు ఉండాలి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం ఏయే కంపెనీలకు వర్తిస్తుందో పరిశీలించి, వాటికి అవసరమైతే ప్రోత్సాహకాలు ఇచ్చేలా కేంద్రంతో సంప్రదిద్దాం. వీటివల్ల రాష్ట్రానికి ఆదాయం మరింత పెరుగుతుంది. అలాగే ఫ్యూచరిస్టిక్ మినరల్స్‌పై దృష్టిపెట్టండి.. వాటిపై నిపుణుల సహాయం కూడా తీసుకోండి' అని సీఎం ఆదేశించారు.

### రాజధానికి మెటీరియల్ సరఫరాలో ఇబ్బంది పెడితే చర్యలు

'రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్, మెటల్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటాం. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆయా మెటీరియల్స్ లభ్యమవుతున్నాయి. సింగిల్‌విండో విధానంలో నేరుగా కలెక్టర్లతో మాట్లాడి.. మెటీరియల్ సీఆర్‌డీఏకి అందేలా చూడాలి' అని సీఎం పేర్కొన్నారు. ఇసుక సరఫరా విషయంలో ప్రజల సంతృప్త స్థాయి మరింత పెరగాల్సి ఉందని అన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పరిశీలన ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సంచాలకులు డబ్ల్యూబీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# రూ.274 కోట్లతో స్థిరాస్తి వ్యాపారి పరారీ

- అప్పులు, పెట్టుబడి రూపంలో వసూళ్లు
- బాధితుల్లో పలువురు వైకాపా వారు
- కుటుంబంతో సహా అమెరికా వెళ్లినట్లు ప్రచారం

**ఈనాడు, కర్నూలు; డోన్, డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే:** స్థిరాస్తి వ్యాపారిగా పేరు తెచ్చుకున్న వ్యక్తి.. విదేశీయాత్రలు, పెద్దపెద్ద హోటళ్లలో పార్టీలు ఇచ్చి వివిధ రంగాల్లో ప్రముఖులకు దగ్గరయ్యాడు. తర్వాత వారి నుంచి అప్పులు, స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడుల రూపంలో ఏకంగా రూ.274 కోట్లు వసూలు చేసి.. పరారయ్యాడు. కొన్ని రోజులుగా ఫోన్లకూ స్పందించకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధితులు కుమిలిపోతున్నారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన సదరు స్థిరాస్తి వ్యాపారి కొన్నేళ్ల కిందట నంద్యాల జిల్లా డోన్‌కు వచ్చి స్థిరపడ్డాడు. ఓ సొసైటీలో చిరుద్యోగిగా ప్రస్థానం ప్రారంభించిన వ్యాపారి పదేళ్ల క్రితమే స్థిరాస్తి వ్యాపారంలోకి దిగాడు. అనంతపురం, బెంగళూరుల్లో వెంచర్లు వేసి గుర్తింపు పొందాడు. బెంగళూరులో కార్పొరేట్ స్థాయిలో కార్యాలయం ప్రారంభించాడు. పలువురి స్థలాలను తీసుకొని, 'డెవలప్‌మెంట్' ఒప్పందాలు చేసుకొని భవన నిర్మాణాలు చేశాడు. పేరు రావడంతో దొరికినచోటల్లా అప్పులు చేసి, వడ్డీ చెల్లిస్తూ విశ్వాసం పొందాడు. సొంతఖర్చులతో విదేశాలకు తీసుకెళ్లడం, ఐదు నక్షత్రాల హోటళ్లలో పార్టీలు ఇస్తూ ప్రముఖులకు దగ్గరయ్యాడు. డోన్‌కు చెందిన పలువురు నాయకులు ఆయన్ను నమ్మి రూ.50 కోట్ల వరకు అప్పులిచ్చారు. మరికొందరు ఆయన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టారు. ఇలా ఏపీ, కర్ణాటక, తెలంగాణకు చెందిన ప్రముఖుల వద్ద అప్పులు, పెట్టుబడి రూపంలో రూ.274 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం.

**దిక్కుతోచని స్థితిలో..:** స్థిరాస్తి వ్యాపారి గతనెల 17 నుంచి ఎవరికీ కనిపించడం లేదు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో పలువురికి అనుమానం వచ్చింది. కూపీ లాగగా.. ఆయన కుటుంబంతో కలిసి అమెరికా వెళ్లిపోయారని తెలిసింది. బెంగళూరులో ఉన్న స్థిర, చరాస్తుల్లో చాలావాటిని విక్రయించేశారని, కొన్ని తాకట్టు పెట్టారని తెలియడంతో బాధితులకు దిక్కుతోచట్లేదు. బెంగళూరుకు చెందిన పలువురు బాధితులు కస్తూరినగర్ కార్యాలయానికి వెళ్లి కన్నీరుమున్నీరయ్యారు. బాధితుల్లో అహ్మదాబాద్, కోల్‌కతా, హైదరాబాద్‌లకు చెందిన వారూ ఉన్నారు. ఇంత జరిగినా డోన్‌కు చెందిన ఒక్కరూ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు.

**తండ్రి వైకాపా సానుభూతిపరుడు..:** స్థిరాస్తి వ్యాపారి తండ్రి వైకాపా సానుభూతిపరుడన్న పేరుంది. పలువురు వైకాపా నాయకులతో సంబంధాలు కొనసాగించారు. దీంతో పెట్టుబడులు పెట్టినవారిలో వైకాపాకు చెందినవారే అత్యధికులు ఉన్నట్లు తెలిసింది.

● సంవత్సరం కాలంలో డోన్‌లో ఐదుగురు వ్యాపారులు ఇలా ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేసి పరారవడం గమనార్హం.

# ఆసుపత్రి అరుగుపై ఆగిన గుండె

- 24 గంటల పీహెచ్‌సీకి అర్ధరాత్రి తాళం
- వైద్యుడి సస్పెన్షన్, స్టాఫ్ నర్సుకు తాఖీదు

**గొల్లప్రోలు, న్యూస్‌టుడే:** గుండెనొప్పితో వచ్చిన వ్యక్తికి అత్యవసర చికిత్స అందించాల్సి ఉండగా.. ప్రభుత్వ ఆసుపత్రికి తాళం వేసి ఉండటం, మరో హాస్పిటల్‌కు తరలించేందుకు అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో ప్రాణాలు పోయిన దైన్యమిది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని శరభవరానికి చెందిన ఇమంది మాణిక్యం(56)కు ఎవరూ లేరు. అతను గొల్లప్రోలు శివారులో తాటికొండ నాగు అనే హోటల్ నిర్వాహకుడి వద్ద పని చేస్తూ, అతని ఇంట్లోనే ఉంటున్నాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక 3 గంటల సమయంలో గుండె నొప్పి, ఆయాసంగా ఉందని మాణిక్యం.. నాగుకు చెప్పాడు. అతను వెంటనే చేబ్రోలులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఆసుపత్రికి తాళం వేసి ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లేందుకు 108కు ఫోన్ చేశారు. అది గంట వరకూ రాలేదు. ఈలోగా మాణిక్యం మృతిచెందాడు. పీహెచ్‌సీ అరుగుపైనే మృతదేహాన్ని ఉంచి, నాగు అతని బంధువులకు సమాచారమిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్.. విచారణ జరిపి పీహెచ్‌సీ వైద్యుడు సాయి రతన్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. స్టాఫ్‌నర్సు సూర్యమణికి షోకాజ్ నోటీస్ పంపించారు.

# సచివాలయమా? కమర్షియల్ కాంప్లెక్సా?

- ఎటు చూసినా బారికేడ్లు ఎందుకు?
- సీఎం చంద్రబాబు అసహనం

**ఈనాడు, అమరావతి:** వెలగపూడి సచివాలయంలో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'ఇది రాష్ట్ర సచివాలయమా? కమర్షియల్ కాంప్లెక్సా' అని ఆయన ప్రశ్నించారు. మంగళవారం ఉదయం సచివాలయానికి ముఖ్యమంత్రి వచ్చే సమయంలో.. రహదారిపైకి వాహనాలు, ప్రజలు ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. సచివాలయ ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రకటనలతో కూడిన బారికేడ్లను అడ్డు పెట్టారు. ఈ విషయాన్ని గమనించిన చంద్రబాబు.. ఎందుకిలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. తర్వాత ఆర్టీజీఎస్ సమావేశంలోనూ దీనిపై చర్చ జరిగింది. అక్కడుండే పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తే సరిపోతుందని, పూర్తిగా మూసేస్తూ బారికేడ్లు పెట్టవద్దని సూచించారు. ఇక్కడికంటే పింఛన్ల పంపిణీకి తాను వెళ్తున్న ఊళ్లలోనే ఏర్పాట్లు బాగున్నాయని వ్యాఖ్యానించారు. సచివాలయానికి వచ్చే వారికి ఆహ్లాదకరమైన అనుభూతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సచివాలయ అధికారులు సత్వరమే స్పందించి బారికేడ్లు తొలగించారు. వాటి స్థానంలో పూలకుండీలు ఏర్పాటు చేశారు.

# సర్టిఫికేటుగాళ్లు

- ఏడాదిగా 3,982 జనన ధ్రువీకరణ పత్రాల జారీ
- చిన్న పంచాయతీ నుంచి ఇతర రాష్ట్రాలవారికీ మంజూరు



అగళి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శితో వివరాలు సేకరిస్తున్న జిల్లా గణాంక అధికారులు

**మడకశిర, అగళి, న్యూస్‌టుడే:** నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలను సృష్టించేందుకు అక్రమార్కులు శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ మారుమూల ప్రాంతంలో ఉన్న సచివాలయాన్ని అడ్డాగా మార్చుకున్నారు. అగళి మండలం కోమరేపల్లి సచివాలయం నుంచి వేలకొద్దీ తప్పుడు ధ్రువపత్రాలు మంజూరైనట్లు మంగళవారం బయటపడింది. వినయ్ కుమార్ గుప్తా అనే వ్యక్తి 1985 ఆగస్టు 5న జన్మించినట్లు కొమరేపల్లి సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రం మంజూరైంది. అది నకిలీ సర్టిఫికెట్ అంటూ అశీష్‌కుమార్ గుప్తా అనే వ్యక్తి విజయవాడలోని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా గణాంక, నోడల్ అధికారి కలందర్ మంగళవారం ఈ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సచివాలయం ద్వారా వివిధ రాష్ట్రాల వారికి 3,982 జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరైనట్లు గుర్తించారు. సంబంధిత ఇన్‌ఛార్జి కార్యదర్శి మహేష్‌ను విచారించగా, సెప్టెంబరు 14న తాను ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకుని ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవగా అందులో అప్పటికే 129 జనన ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని ఆపేశానని చెప్పారు. ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకువెళ్లలేదనేది ప్రశ్నార్థకంగా ఉంది. గత శుక్రవారం, ఆదివారం ఒకేసారి వెయ్యికి పైగా ఓటీపీలు వచ్చినట్లు తెలిసింది. ఎవరైనా హ్యాక్ చేసి ఇలా చేశారా.. లేక లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను మరెవరైనా ఉపయోగిస్తున్నారా అనేదానిపై అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది. ఏడాదిగా ఈ తంతు జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం నాటి పరిశీలనలో జిల్లా ఉప గణాంక అధికారి గురు రాజేంద్రప్రసాద్, సహాయ గణాంక అధికారి సూర్యనారాయణ, ఎంపీడీవో గంగాధర్ పాల్గొన్నారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపనున్నట్లు తెలుస్తోంది.

# పిండి పదార్థాలు తగ్గించాలి



భోజనానంతరం రక్తంలో షుగర్ శాతం భారీగా (70%-80%) పెరిగేందుకు పిండిపదార్థాలు ముఖ్యకారణం. అన్నం, రొట్టెలు, అటుకులు, ఇడ్లీ, పండ్లు వంటి ఆరోగ్యకరమైన పిండిపదార్థాలూ 45 నిమిషాల్లో రక్తంలో షుగర్‌ను 100-250కి పెంచేస్తాయి. కాబట్టి ఆహారంలో పిండిపదార్థాలను తగ్గించడం ద్వారా రక్తంలో చక్కెర శాతాన్ని క్రమబద్ధీకరించవచ్చు. తద్వారా మీ శరీరం ఆరోగ్యకరంగా ఉంటుంది.

– సాయాజీరావు గైక్వాడ్, వైద్యుడు

# ఈనాడు



విజయవాడ 3-12-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 113
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



## ఇక ప్రధాని కార్యాలయం పేరు సేవాతీర్థ్

దిల్లీ: ప్రధాన మంత్రి కార్యాలయ (పీఎంవో) కొత్త భవన సముదాయాన్ని 'సేవాతీర్థ్'గా పిలవనున్నారు. దిల్లీలో సెంట్రల్ విస్టా పునరభివృద్ధి పథకంలో భాగంగా 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్' పేరుతో చేపట్టిన కొత్త భవనాల సముదాయంలో పీఎంవో, క్యాబినెట్ సచివాలయం, జాతీయ భద్రత మండలి కార్యాలయంతో పాటు వివిధ దేశాల నేతలు భారత దేశ సందర్శనకు వచ్చినప్పుడు చర్చలు జరిపేందుకు వేదిక కోసం కొత్తగా నిర్మిస్తున్న ఇండియా హౌస్ కార్యాలయం కూడా ఉంది. ఇప్పుడు ఇందులో పీఎంవో భవన సముదాయ నిర్మాణం పూర్తి కావొస్తోంది. ఈ క్రమంలో దాని పేరును అధికారులు మంగళవారం వెల్లడించారు. సేవా స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఇది ఉంటుందని పేర్కొన్నారు. అధికారం నుంచి సేవ, బాధ్యత వైపు పరిపాలన ఆలోచన విధానం మారుతోందని చెప్పారు.



## అనుమతుల్లేని హోర్డింగుకు రోజుకు ₹50 వేల జరిమానా

### సవరించిన నిబంధనలపై మార్గదర్శకాలు జారీ

ఈనాడు, అమరావతి: అనుమతుల్లేని హోర్డింగులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. ఇలాంటివాటిపై రోజుకు రూ.50వేల చొప్పున జరిమానా విధించనుంది. ఉల్లంఘన పునరావృతమైతే సంబంధిత ఏజెన్సీ అనుమతులు రద్దు చేయనుంది. ఈ మేరకు హోర్డింగులు, ఇతర ప్రకటనల బోర్డుల నియంత్రణ నిబంధనలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ సవరించింది. ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు.

మూడేళ్లకు లైసెన్సు: నగరాలు, పట్టణాల్లో పెట్టే హోర్డింగులకు పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల నుంచి అనుమతులు తప్పనిసరి. లైసెన్సు మూడేళ్లపాటు అమల్లో (మిగతా 3లో)

## ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

### రాష్ట్రవ్యాప్తంగా 1,146 మంది నియామకానికి అనుమతి

**సబ్జెక్టు టీచర్‌కు రూ.12,500, ఎస్జీటీకి రూ.10వేల వేతనం**

**ఈ నెల 7లోపు ఎంపిక**


ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు తాత్కాలికంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 1,146 మంది సబ్జెక్టు టీచర్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను తీసుకోవడానికి అనుమతించింది. 892 సబ్జెక్టు టీచర్, 254 ఎస్జీటీ పోస్టుల భర్తీకి జాబితాను విడుదల చేసింది. వీరు ఈ నెల 8 నుంచి (మిగతా 3లో)



## రాష్ట్రంలో చలి తీవ్రత తక్కువే!

తెలంగాణ, కర్ణాటక సహా కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువ 2లో

# విద్యుత్ ప్రాజెక్టులకు 60 రోజుల్లో కార్యరూపం



### క్షేత్రస్థాయిలో సమస్యలుంటే సత్వరం పరిష్కరించండి

**విద్యుత్ శాఖపై సమీక్షలో అధికారులకు సీఎం ఆదేశం • ఫెర్రో ఎల్లాయీస్‌కు మరో ఏడాది ప్రోత్సాహకాల ప్రకటన**

**రిజర్వాయర్లు, ప్రాజెక్టుల వద్ద పీఎస్‌పీల ఏర్పాటుపై అధ్యయనం**

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 60 రోజుల్లో కార్యాచరణ ప్రారంభించేలా అధికారులు చూడాలని, క్షేత్రస్థాయి సమస్యలుంటే పరిష్కరించి అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విద్యుత్ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రావాల్సి ఉందన్నారు. విద్యుత్ సంస్థలు తీసుకున్న రుణాలపై వడ్డీ భారాన్ని, విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. విద్యుత్ సంస్థల సమర్థ నిర్వహణ ద్వారా ఛార్జీలు పెంచి ప్రజలపై భారం వేయకుండా చూడగలిగామని సీఎం పేర్కొన్నారు. విద్యుత్ శాఖపై సచివాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల సీఎండీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి. ఉత్పత్తికి లోటు లేకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. కీలకమైన పరిశ్రమలుగా ఫెర్రో ఎల్లాయీస్‌ను గుర్తించి, వాటికి ప్రోత్సాహకాలు మరో ఏడాది పొడిగిస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వంపై రూ.1,053 కోట్ల భారం పడనుంది. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, సాగునీటి ప్రాజెక్టుల దగ్గర పీఎస్‌పీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను జెన్‌కో, జలవనరుల శాఖ అధికారులు కలిసి అధ్యయనం చేయాలి. ఐదేళ్లలో ఆర్టీసీ 1,000 ఈవీ బస్సులు కొనుగోలు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 5వేల ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి' అని నిర్దేశించారు. సమీక్షలో సీఎం సూచనలివీ..

**విద్యుత్ సరఫరాలో పంపిణీ నష్టాలు తగ్గాలి**

- డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ వినియోగదారులకు అందించాలి. సరఫరా, పంపిణీ నష్టాలు 9.2 శాతం నుంచి 2029 నాటికి గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.
- విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో స్వాపింగ్ (మిగతా 3లో)

## స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించండి

తీవ్రత పెరగకముందే చికిత్స అందించాలని సీఎం ఆదేశం 11లో

# సంచార్ సాథీపై దుమారం


జ్యోతిరాదిత్య సింధియా

- కొత్త ఫోన్లలో ముందుగానే యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలన్న నిబంధనపై విపక్షాల ధ్వజం
- ప్రజల గొంతు నులిమే చర్యన్న కాంగ్రెస్
- వ్యక్తిగత గోప్యతపై దాడేనన్న కేజ్రీవాల్
- వాయిదా తీర్మానాన్ని ఇచ్చిన రేణుకా చౌదరి
- యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చన్న కేంద్రం

దిల్లీ

సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశం తీవ్ర దుమారం రేపింది. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసే చర్యని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎవరితో సంప్రదించకుండా నియంతృత్వంతో ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించాయి. అయితే కంపెనీలు ముందుగానే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఇచ్చినా.. వినియోగదారులు డిలీట్ చేసుకోవచ్చని, రిజిస్టరు అయ్యాకే అది పని చేయడం ప్రారంభిస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ యాప్ విషయంలో ప్రభుత్వ తీరును కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించగా.. టెలికం మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్‌లు వివరణ ఇచ్చారు. సైబర్ మోసాలపై ఫిర్యాదు చేసేందుకు తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్‌ను అన్ని కొత్త మొబైల్ ఫోన్లలో డిఫాల్ట్‌గా ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలని ఇటీవల టెలికంశాఖ ఆదేశాలిచ్చింది. ఫోన్ల తయారీదారులు, దిగుమతిదారులు ఈ నిబంధనను పాటించాలని సూచించింది. 90 రోజుల్లోగా దీనిని అమలు చేయాలని (మిగతా 3లో)

## సర్‌పై రుసరుస

పట్టువీడని విపక్షాలు

పార్లమెంటులో ప్రతిష్టంభన

ప్రతిపక్ష నేతల్ని చర్చకు ఆహ్వానించిన ప్రభుత్వం 8లో


అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న లోకేశ్. చిత్రంలో బస్తిపాటి నాగరాజు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, దగ్గుమళ్ల ప్రసాదరావు, రామ్మోహన్‌నాయుడు, అనిత, సానా సతీష్, కృష్ణప్రసాద్

# మొంథాతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

**తుపాను మిగిల్చిన నష్టం రూ.6,352 కోట్లు**

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నివేదిక సమర్పించిన మంత్రులు నారా లోకేశ్, అనిత
- వ్యవసాయ రంగానికి తగిలిన దెబ్బ గురించి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వివరణ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబరులో సంభవించిన మొంథా తుపాను కారణంగా వివిధ రంగాలకు రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనితలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌లకు తెలిపారు. వారు మంగళవారం కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఇతర ఎంపీలతో కలిసి తుపాను నష్టంపై రాష్ట్రప్రభుత్వం తరఫున నివేదిక అందజేశారు. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా రాష్ట్రంలో (మిగతా 3లో)

## 12న విశాఖలో కాగ్నిజెంట్‌కు భూమిపూజ

అదేరోజు హిల్-2లో తాత్కాలిక కార్యాలయం ప్రారంభోత్సవం

హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కాపులుప్పాడలో 22 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం

## మద్యం స్కాంలో.. మరో ఇద్దరు నిందితులు

ముంబయికి చెందిన సోదరులు చేతన్, రోణక్‌ల పేర్లు

## పరకామణిలో చోరీ కేసు రాజీపై హైకోర్టుకు సీఐడీ, ఏసీబీ నివేదికలు


విచారణ శుక్రవారానికి వాయిదా

## సొరంగంలో నిలిచిపోయిన మెట్రో రైలు

చెన్నైలో ఘటన

లోపలి పేజీల్లో

## ఇదీ సంగతి!




బాగా చదివితే భయమెందుకు..? నడు!!

# క్వాంటమ్ టెస్టింగ్‌కు గ్లోబల్ సెంటర్‌గా అమరావతి

- ప్రపంచంలోనే పెద్దదైన కాంపొనెంట్స్ టెస్టింగ్, బెంచ్‌మార్కింగ్ సదుపాయం
- ఇందుకోసం 100 సిస్టమ్స్ ఏర్పాటు
- లక్ష మంది క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజినీర్లకు శిక్షణ
- 'ఈనాడు'తో ఫిన్లాండ్ కంపెనీ క్వాంట్రోల్ ఓఎక్స్ సీఈఓ విశాల్ చత్రథ్



ఈనాడు - అమరావతి

అమరావతిలో అభివృద్ధి చేస్తున్న క్వాంటమ్ వ్యాలీలో ప్రపంచంలోనే పెద్దదైన క్వాంటమ్ కంప్యూటర్ విడిభాగాల (కాంపొనెంట్స్) టెస్టింగ్, బెంచ్‌మార్కింగ్, వ్యాలిడేషన్ సదుపాయాన్ని ఏర్పాటుచేస్తామని ఫిన్లాండ్‌కు చెందిన క్వాంట్రోల్ ఓఎక్స్ కంపెనీ సీఈఓ విశాల్ చత్రథ్ తెలిపారు. దీంతో క్వాంటమ్ టెస్టింగ్, మెజర్‌మెంట్, బెంచ్ మార్కింగ్‌కు అమరావతి గ్లోబల్ సెంటర్‌గా మారుతుందని ఆయన చెప్పారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న రంగం కాబట్టి కాంపొనెంట్ల టెస్టింగ్‌కు ప్రపంచంలో ఇంకా ఎక్కడా ప్రామాణీకృత సదుపాయం లేదన్నారు. వచ్చే ఐదేళ్లలో క్వాంటమ్ సైన్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి భారత్ స్వయం సమృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా వచ్చే ఐదేళ్లలో తమ కంపెనీ 100 టెస్ట్, మెజర్‌మెంట్, బెంచ్‌మార్కింగ్ సిస్టమ్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తుందన్నారు. (మిగతా 3లో)

## రాజధానికి 16,666 ఎకరాల భూసమీకరణకు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి కోసం తుళ్లూరు, అమరావతి మండలాల్లోని ఏడు గ్రామాల పరిధిలో రెండోవిడత భూసమీకరణకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతుల నుంచి మొత్తం 16,666.57 ఎకరాల భూముల్ని సమీకరిస్తారు. అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో భూమి సమీకరిస్తారు. రెండో విడత భూ సమీకరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవలే ఆమోదముద్ర వేసింది.

**రెండో విడతలో సమీకరించనున్న భూమి వివరాలు**

| గ్రామం | మొత్తం భూమి | పట్టా భూమి | ఎసైన్డ్ భూమి | ప్రభుత్వ భూమి |
|---|---|---|---|---|
| వైకుంఠపురం | 3,361 | 1,965 | 0 | 1,395.48 |
| పెదమద్దూరు | 1,145 | 1,018 | 0 | 127 |
| ఎండ్రాయి | 2,166 | 1,879 | 46 | 241 |
| కర్లపూడి | 2,944 | 2,603 | 51 | 290.75 |
| వడ్డమాను | 1,937 | 1,763.29 | 4.72 | 168.86 |
| హరిశ్చంద్రపురం | 2,428 | 1,448.09 | 2.29 | 977.87 |
| పెదపరిమి | 6,513 | 5,886.18 | 0 | 627.34 |
| మొత్తం | 20,494 | 16,562.56 | 104.01 | 3,828.30 |

## 'రక్త'బంధం నడిపిస్తోంది!

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

జీవితంలో కొన్ని మలుపులు కోలుకోలేనంతగా కుంగదీసినా కొందరు ఆ బాధల నుంచి త్వరగానే బయటపడతారు. తరువాత తమ జీవితాన్ని నచ్చిన రీతిలో మలుచుకుంటారు. ఆ కోవకే చెందుతారు నవీన్‌రెడ్డి. డిసెంబరు 3వ తేదీ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నేపథ్యంలో ఆయన స్ఫూర్తి ప్రస్థానం తెలుసుకుందాం. విశాఖ నగరం పెదగంట్యాడ వాసి పోల నవీన్‌రెడ్డి బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నపుడు 2013లో మేడ మీది నుంచి పడిపోగా వెన్నెముక దెబ్బతింది. దీంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో ఎంతో మంది రోగులు రక్తం కోసం ఇబ్బందులు పడటాన్ని గమనించారు. 'నా వంతుగా ఏదో ఒకటి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని నిశ్చయించుకున్నా. 2015లో 'వైజాగ్ బ్లడ్ డోనర్స్' అనే సంస్థను స్థాపించా. రక్తం అవసరమైనవారు నన్ను సంప్రదిస్తే దాతల నుంచి రక్తాన్ని సేకరించి అందిస్తా. ఇప్పటివరకు సుమారు 1,300 మంది దాతలు మా ద్వారా రక్తం ఇచ్చారు. అలాగే మూడు నెలలకోసారి రక్తదాన శిబిరం నిర్వహిస్తుంటా. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు నెలకు రూ.15,000 పింఛను అందుతోంది' అని నవీన్‌రెడ్డి వివరించారు.
– ఈనాడు, విశాఖపట్నం



నవీన్‌రెడ్డి



రక్తదాన శిబిరంలో నవీన్‌రెడ్డి

# గూగుల్ డేటా సెంటర్‌కు భూముల బదిలీ

- ప్రోత్సాహకాల చెల్లింపునకూ అనుమతి
- రైడెన్, భాగస్వామ్య సంస్థలైన అదానీ, భారతీ ఎయిర్‌టెల్ తదితరులకు వర్తింపు
- ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు భూముల బదిలీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థలు కలిసి ఏర్పాటుచేయనున్న 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌కు ప్రోత్సాహకాలు చెల్లించేందుకూ సమ్మతించింది. డేటా సెంటర్ క్యాంపస్ అభివృద్ధికి వీలుగా రైడెన్, నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థలకు భూముల బదిలీకి అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. నిర్దేశిత వ్యవధిలో ప్రాజెక్టు పూర్తవ్వకపోతే దానికి సరైన కారణాలు చూపకుంటే రైడెన్, దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థలపై వాణిజ్యపరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రపంచ ప్రమాణాలతో డేటా సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ప్రాజెక్టును ఉన్నత స్థాయి ప్రమాణాలతో, నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని.. దీనికోసం ప్రాజెక్టు అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని రైడెన్ పేర్కొంది.

### డేటా సెంటర్ల క్యాంపస్ కోసం ఏపీఐఐసీ గుర్తించిన భూములివీ..

- ◆ విశాఖ జిల్లా అడవివరం, ముడసర్లోవ గ్రామాల్లో 120 ఎకరాలు
- ◆ విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 200 ఎకరాలు
- ◆ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 160 ఎకరాలు
- ◆ ప్రాథమిక నోటిఫైడ్ భాగస్వామిగా అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ఏపీఐఐసీ ద్వారా భూములు అప్పగించాలని రైడెన్ కోరింది. ప్రాథమిక పనుల తర్వాత భూములను ప్రాజెక్టు అవసరాలకు అనుగుణంగా వివిధ సంస్థల మధ్య అంతర్గత బదిలీ చేసుకుంటామని ప్రతిపాదించింది.

**రాంబిల్లి భూములు:** డేటా సెంటర్ క్యాంపస్ అభివృద్ధి కోసం ఎన్‌ఎక్స్‌ట్రా డేటా లేదా దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేయాలని రైడెన్ నిర్ణయించింది.

**తర్లువాడ, అడవివరం, ముడసర్లోవ భూములు:** డేటా సెంటర్ క్యాంపస్‌ల అభివృద్ధి కోసం అదానీ కనెక్స్ లేదా దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది.

### రైడెన్ నోటీపై వేసిన భాగస్వామ్య సంస్థలు

- ◆ అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
- ◆ అదానీ కనెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
- ◆ అదానీ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
- ◆ భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్
- ◆ ఎన్‌ఎక్స్‌ట్రా డేటా లిమిటెడ్ (భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ)
- ◆ ఎన్‌ఎక్స్‌ట్రా వైజాగ్ లిమిటెడ్ (భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ)

### అనుబంధ, భాగస్వామ్య సంస్థలకూ ప్రోత్సాహకాలు

డేటా సెంటర్, అనుబంధ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు నోటిఫై చేసిన భాగస్వామ్య సంస్థలకూ అందుబాటులో ఉండేలా ప్రోత్సాహకాలు సులభతరం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. భాగస్వామ్య సంస్థలకు సంబంధించి ముందుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. అవి ప్రోత్సాహకాలు పొందేందుకు తప్పనిసరిగా పెట్టుబడి పెట్టాలని నిర్దేశించింది.

### ప్రాజెక్టు పరిమితులు

- ◆ 2025 ఆగస్టు 22న సమర్పించిన డీపీఆర్‌కు అనుగుణంగా ప్రాజెక్టు ఉంటుంది. రైడెన్, గూగుల్, గూగుల్ క్లౌడ్ సహా దాని అనుబంధ సంస్థలు దీని అభివృద్ధికి కట్టుబడి ఉంటాయని రైడెన్ పేర్కొంది.
- ◆ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణాలు గూగుల్ మౌలిక సదుపాయాలకు అనుగుణంగా.. ప్రపంచ డేటా సెంటర్ ప్రమాణాల మేరకే ఉంటాయి.
- ◆ సెర్చ్, యూట్యూబ్, వర్క్‌స్పేస్ వంటి గూగుల్ సేవలకు అనుగుణంగా అదే స్థాయి ప్రమాణాలతో డేటా సెంటర్ నిర్వహిస్తారు.
- ◆ భాగస్వామ్య సంస్థల్లో ఏదైనా కొనసాగకుంటే.. దాని ఉపసంహరణ నోటీసును రైడెన్ ప్రభుత్వానికి పంపుతుంది. ప్రాజెక్టు కొనసాగించేందుకు వీలుగా భూముల బదిలీకి తగిన ఏర్పాట్లను సూచిస్తుంది.

## నేడు తూర్పుగోదావరి జిల్లాలో సీఎం పర్యటన



గోపాలపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. 'రైతన్నా.. మీకోసం' ముగింపు కార్యక్రమంలో భాగంగా గోపాలపురం నియోజకవర్గంలోని నల్లజర్లలో అన్నదాతలతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించనున్నారు. ఉదయం 10.30కి ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి నల్లజర్లకు చేరుకుంటారు. అక్కడ ప్రజావేదిక వద్ద ఏర్పాటుచేసే స్టాళ్లను పరిశీలిస్తారు. అనంతరం రైతులు, వారి కుటుంబాలతో మాట్లాడతారు. మధ్యాహ్నం పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం హెలికాప్టర్‌లో ఉండవల్లికి తిరుగు ప్రయాణమవుతారు.

## డీడీవోలకు సొంత కార్యాలయాలు

చిత్తూరులో ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ శాఖలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి అధికారుల (డీడీవో) కార్యాలయాలు గురువారం ప్రారంభించనున్నారు. చిత్తూరులో నిర్వహించే సభలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొని, అక్కడి నుంచే అన్ని జిల్లాల్లోని కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలన వ్యవహారాల పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. రెవెన్యూ శాఖలో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవో) ఉన్నట్లే.. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోనూ ఉండాలని డీడీవోలను ఇటీవల నియమించారు.

## రాష్ట్రంలో చలి తీవ్రత తక్కువే!

- తెలంగాణ, కర్ణాటక సహా కొన్ని రాష్ట్రాల్లో ఎక్కువ
- భూతాపం కారణంగా మారుతున్న పరిస్థితులు

ఈనాడు, విశాఖపట్నం: దేశంలోని మధ్య, వాయవ్య భారతంతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈ శీతాకాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని అధిక ప్రాంతాల్లోనే ఈ పరిస్థితి ఉంటుంది. ఏపీతోపాటు తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, బిహార్, ఈశాన్య రాష్ట్రాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. దీనికి వాతావరణ మార్పులే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో నవంబరు నుంచే చలి తీవ్రత మొదలయ్యేది. ఈ సీజన్‌లో ఏజెన్సీ ప్రాంతాల్లో మినహా రాష్ట్రంలో చలి తీవ్రత తక్కువగానే ఉంది. డిసెంబరు-ఫిబ్రవరి మధ్యలో రాష్ట్రంలో చలి తక్కువగా ఉంటుందని ఐఎండీ తెలిపింది. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు ఆనుకుని ఉన్న కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కొంతవరకు చలి ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో చలిగాలులు వీచే అవకాశం లేదని చెప్పింది. ఈ నెలలోనూ కర్నూలు, అనంతపురం మినహా రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత తగ్గనుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు కానున్నాయి. తీర ప్రాంత జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి.

### ఏటికేడు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

భూతాపం కారణంగా శీతాకాలంలోనూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏటికేడు సగటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ప్రపంచంలో 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించింది. ఈ ఏడాది కూడా ఉష్ణోగ్రతలు అదే మాదిరిగా పెరిగాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న కర్బన ఉద్గారాలు పెరుగుతున్నాయే తప్ప తగ్గుముఖం పట్టడంలేదు. 'అల్పపీడనాలు, ద్రోణి, వెస్టర్న్ డిస్టర్బెన్స్ వచ్చే సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతుంటాయి. తర్వాత మళ్లీ మామూలుగానే ఉంటుంది. పర్వత ప్రాంతాలు, తూర్పు కనుమలు, ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దేశంలో అత్యధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. భూతాపం కారణంగా నవంబరులో రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి' అని ఐఎండీ పూర్వ డైరెక్టర్ జనరల్ డా. కేజే రమేష్ పేర్కొన్నారు.

# మొక్కజొన్న పంటలో.. పావు వంతైనా ఎమ్మెస్పీ కింద కొనండి

- కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ
- మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ అందజేసిన రామ్మోహన్‌నాయుడు, కృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: మొక్కజొన్న పంట ధరలను స్థిరీకరించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో పండిన పంటలో కనీసం 25% మొత్తాన్ని కనీస మద్దతు ధర కింద కేంద్రమే సేకరించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీని కోరారు. ఈ మేరకు ఆయన రాసిన లేఖను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం ఇక్కడ ప్రహ్లాద్ జోషీని కలిసి అందజేశారు. "రాష్ట్రంలో 2,32,391 హెక్టార్లలో మొక్కజొన్న సాగైంది. హెక్టారుకు సగటున 5,596 కిలోల దిగుబడి లెక్కన 13 లక్షల మెట్రిక్ టన్నులు రానుంది. దీని ఎమ్మెస్పీ ధర క్వింటాలుకు రూ. 2,400 ఉన్నప్పటికీ మార్కెట్ ధర రూ. 700 నుంచి రూ. 2వేల మధ్య మాత్రమే పలుకుతోంది. ధరల స్థిరీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం 3.25 లక్షల టన్నుల పంట (25%)ను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. ఇక్కడి పరిస్థితులను పరిగణలోకి తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ద్వారా ఎమ్మెస్పీ కింద మొక్కజొన్నలు సేకరించడానికి అనుమతివ్వాలి. కేంద్రం అత్యవసర ప్రాతిపదికన జోక్యం చేసుకోకపోతే లక్షల మంది రైతులు నష్టపోతారు' అని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం పొగాకు, ఉల్లి, కోకో, మామిడి ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు కొని, రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.



ప్రహ్లాద్ జోషీతో సమావేశమైన రామ్మోహన్‌నాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయలు

## పుదుచ్చేరి వైపు కదులుతున్న వాయుగుండం

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. చెన్నై సమీపం వరకు ప్రయాణించిన వాయుగుండం మంగళవారం పుదుచ్చేరి వైపు దిశ మార్చుకుంది. ఇది బుధవారం ఉదయంలోగా తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో బుధవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమగోదావరి, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో గంటకు 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని అమరావతి వాతావరణ కేంద్రం వివరించింది. సముద్రం అలజడిగా ఉన్న నేపథ్యంలో బుధవారం మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. కృష్ణపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, వాడరేవు పోర్టులకు మూడో ప్రమాద హెచ్చరికలు, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులకు ఒకటో నంబరు హెచ్చరికలు కొనసాగిస్తున్నారు. మంగళవారం తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. రాత్రి 7 గంటల వరకు అత్యధికంగా తిరుపతి జిల్లాలోని మల్లాంలో 96.5 మిల్లీమీటర్లు, చిట్టమూరులో 95.75 మి.మీ., చిత్తూరు జిల్లా పాలసముద్రంలో 92 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## గ్రామస్థాయి నుంచి ఆవిష్కరణలను గుర్తించాలి

- వాటికి పేటెంట్ హక్కు కల్పించాలి
- ఆవిష్కర్తల ఎదుగుదలకు ప్రోత్సాహమివ్వాలి
- అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి నూతన ఆవిష్కరణలను గుర్తించి వెంటనే వాటికి పేటెంట్ హక్కు కల్పించాలని, వాటి ఆవిష్కర్తల ఎదుగుదలకు ప్రోత్సాహం అందించాలని అధికారులను ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ప్రధాని మోదీ సంకల్పమైన మేడిన్ ఇండియా-మేకిన్ ఇండియాలో భాగస్వామ్యం అయ్యేందుకు కృషిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. 'గ్రామస్థాయిలో సరికొత్త ఆవిష్కరణలకు గుర్తింపు, ప్రోత్సాహం అందించటంపై దృష్టి సారించాలి. విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు నూతన ఆవిష్కరణలే ప్రాథమిక చోదకశక్తి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్త ఆలోచనలను గుర్తించి ప్రోత్సహించాలి. స్టార్టప్‌లతో ముందుకొచ్చే వారికి సహకారం అందించాలి. పారిశ్రామికవేత్తలు, ఐటీ స్టార్టప్‌లు, ఎన్నారైలు, విశ్వవిద్యాలయ స్థాయి పరిశోధకులతో వారిని అనుసంధానించాలి. గుర్తింపు పొందిన ఆవిష్కరణలపై అధ్యయన ప్రక్రియ పూర్తయిన వెంటనే వారికి పేటెంట్ రైట్స్ ఇప్పించాలి. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చేవారిని గుర్తించి విపణికి పరిచయం చేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. అవసరమైతే వీరికి ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్రాధాన్యం ఇచ్చే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తాం. రాజమహేంద్రవరంలోని ప్రాంతీయ సైన్స్ కేంద్రాన్ని సందర్శించినప్పుడు అక్కడి విద్యార్థులు.. వారి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని తగ్గించాలనే ఆలోచనతో రూపొందించిన కొన్ని ఆవిష్కరణలు నన్ను ఆకర్షించాయి. అలాంటి వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో అద్భుతాలు సృష్టిస్తారు. ఆవిష్కరణలకు విద్యార్హత కొలమానం కాదు'' అని పేర్కొన్నారు.

## వానజల్లు.. రైతుల గుండె గుభేల్!



పంట చేతికందే సమయంలో తుపాను హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి. ఇప్పటికే నూర్పిడి చేసిన ధాన్యం తడవకుండా రైతులు తీవ్రంగా కష్టపడుతున్నారు. విక్రయ కేంద్రాలకు తరలించే ముందు రోడ్లు, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఎప్పుడు వర్షం ముంచెత్తుతుందోనని క్షణక్షణం భయంగా కాలం గడుపుతున్నారు. మంగళవారం ఉదయం చిరుజల్లులు మొదలవడంతో రైతులకు గుండెజారినంత పనైంది. దీంతో పరుగున వెళ్లి ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పుతూ కనిపించారు. గన్నవరం మండలం పెద్దఅవుటపల్లి వద్ద కళ్లంలో ఉన్న ధాన్యంపై పరదాలు కప్పుతున్న కూలీలను చిత్రంలో చూడొచ్చు. – ఈనాడు, కృష్ణా

## సుధామాధవి, మురళి దంపతులపై పరువు నష్టం దావా

హైకోర్టు సీనియర్ న్యాయవాది మాగులూరి హరిబాబు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: తన క్లయింట్, ప్రవాస భారతీయుడు సతీష్ వేమనపై ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలకు పాల్పడినవారిపై రూ.10 కోట్లకు పరువునష్టం దావా వేసినట్లు హైకోర్టు న్యాయవాది మాగులూరి హరిబాబు తెలిపారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత శాసనసభ ఎన్నికల్లో రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి జైభీమ్‌రావు పార్టీ తరఫున అభ్యర్థిగా పోటీచేసిన సుధామాధవి, ఆమె భర్త మురళి చేస్తున్న అసత్యప్రచారాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజంపేటకు చెందిన సతీష్.. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా రూ.లక్షలు వెచ్చించి దశాబ్దాలుగా సమాజసేవ చేస్తున్నారని తెలిపారు. దేశ విదేశాల్లో మంచిపేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఆయనపై కొందరు దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నిరాధారమైన ఆరోపణలతో, వ్యక్తిత్వ హననానికి పూనుకున్నవారిపై విజయవాడలోని 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో రూ.10 కోట్లకు పరువునష్టం దావా వేసినట్లు న్యాయవాది వెల్లడించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. సుధామాధవి, మురళి దంపతులకు నోటీసులు జారీచేసిందని తెలిపారు. సతీష్ పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

### గ్రహం అనుగ్రహం

3-12-2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
త్రయోదశి: ఉ. 10-02 తదుపరి చతుర్దశి
భరణి: సా. 4-51 తదుపరి కృత్తిక
వర్జ్యం: తె. 4-01 నుంచి 5-30 వరకు
అమృత ఘడియలు: మ. 12-22 నుంచి 1-51 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-26 నుంచి 12-11 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.18; సూర్యాస్తమయం: సా.5.20
జ్యేష్ఠ కార్తె

### చలి-పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| ఆదిలాబాద్ | 10.2 | 27.3 |
| విజయనగరం | 18.0 | 26.0 |
| రాజమహేంద్రవరం | 18.0 | 30.0 |
| ఒంగోలు | 20.6 | 25.1 |
| విశాఖపట్నం | 21.4 | 27.0 |
| నెల్లూరు | 21.9 | 24.3 |
| కడప | 22.0 | 25.0 |
| శ్రీకాకుళం | 22.0 | 28.0 |
| తిరుపతి | 22.1 | 23.2 |
| కర్నూలు | 22.1 | 32.4 |
| నరసాపురం | 22.3 | 24.2 |
| విజయవాడ | 22.4 | 26.9 |
| గుంటూరు | 23.0 | 25.0 |
| అనంతపురం | 23.0 | 31.6 |
| తాడేపల్లిగూడెం | 24.0 | 28.0 |

# అమరావతి జాతీయ ప్రాధాన్య ప్రాజెక్టు

- కేంద్రప్రభుత్వ సాయం పాక్షికంగానే ఉంది
- పార్లమెంట్ హామీల కమిటీ ఆక్షేపణ
- రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని వేగంగా పూర్తి చేయాలని సిఫార్సు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి అభివృద్ధి అన్నది జాతీయ, ప్రాంతీయ ప్రాధాన్యమున్న అంశమని తమిళనాడు ఎంపీ (ఏఐఏడీఎంకే) ఎం.తంబిదురై నేతృత్వంలోని రాజ్యసభ హామీల కమిటీ పేర్కొంది. దీని నిర్మాణానికి కేంద్రం తొలుత హామీ ఇచ్చినా, పాక్షికంగానే ఆర్థికసాయం చేసిందని ఆక్షేపించింది. ఇప్పటికైనా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని దీని నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని తాజాగా సిఫార్సు చేసింది. అమరావతి నిర్మాణం గురించి 2019 జనవరి 1న భాజపా సభ్యుడు సుజనాచౌదరి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ 'అమరావతిలో ప్రభుత్వ భవనాల సముదాయ నిర్మాణం కోసం రూ.11,602 కోట్లు, అనుబంధ మౌలిక వసతుల కల్పన కోసం రూ.39,937 కోట్లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీతిఆయోగ్‌కు డీపీఆర్ సమర్పించింది. దానిపై నీతిఆయోగ్ కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ అభిప్రాయాలు కోరింది. అవి ఇంకా రావాల్సి ఉంది' అని సమాధానం ఇచ్చారు. అప్పట్లో సభాముఖంగా ఇచ్చిన హామీ అమలు ఎంతవరకు వచ్చిందన్న అంశంపై ఈ హామీల కమిటీ అధ్యయనం చేసి మంగళవారం రాజ్యసభకు నివేదిక సమర్పించింది. అందులో కేంద్రానికి తగిన సిఫార్సులు చేసింది.

### సమన్వయం, స్పష్టత లోపించాయి

'ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి అన్నది జాతీయంగా, ప్రాంతీయంగా చాలా ప్రాధాన్యమున్న అంశం. కేంద్రం దీనికి పాక్షికంగానే ఆర్థికసాయం చేసింది. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు నిదానంగా సాగుతున్నాయి. అనిశ్చితిలో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య సమన్వయం లోపించడం, సవరించిన ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించడంలో జాప్యం, నిధులు, ప్రాజెక్టు అమలు ప్రణాళిక విషయాల్లో స్పష్టత లోపించడం రాజధాని అభివృద్ధికి అటంకాలుగా మారాయి. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా ఇచ్చిన హామీని తప్పనిసరిగా అమలు చేసి, ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయతను నిలబెట్టుకోవాలి. అభివృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజల నిజమైన ఆకాంక్షలను నెరవేర్చాలి. కేంద్ర ఆర్థిక శాఖ వెంటనే రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి సవరించిన డీపీఆర్‌ను తెప్పించుకోవాలి. స్పష్టమైన ఆర్థిక రోడ్ మ్యాప్ రూపొందించాలి. ప్రాజెక్టు వయబిలిటీని మదింపు చేసి, ఇచ్చిన హామీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి' అని కమిటీ కేంద్రానికి సిఫార్సు చేసింది.

### విజయవాడ- గుంటూరు- అమరావతి రైల్వే ప్రాజెక్టును వేగంగా చేపట్టాలి

విజయవాడ- గుంటూరు- అమరావతి రైల్వే ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కూడా ఈ కమిటీ పేర్కొంది. ఈ ప్రాజెక్టు సవరించిన అంచనాలను రూ.2,047 కోట్లతో ఖరారు చేసినా, ఎప్పటిలోపు పూర్తిచేస్తామన్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేదని ఆక్షేపించింది. రైల్వేశాఖ దీనిపై సంబంధిత శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదించి ఖర్చు విషయంలో వాటాల (కాస్ట్ షేరింగ్) సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు తీసుకొని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సిఫార్సు చేసింది.

### సమస్యల్లోనే కేంద్రీయ విశ్వవిద్యాలయం

'అనంతపురంలో తలపెట్టిన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి 519 ఎకరాలు కేటాయించినా, మౌలిక వసతుల పరంగా ఇంకా చాలా సమస్యలున్నాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం, విద్యుత్తు సరఫరా సమస్యలు పరిష్కరించాలి. క్యాంపస్ మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్తు లైన్లు తొలగించాలి' అని కమిటీ పేర్కొంది.

# బెడిసికొట్టిన బార్ వసూళ్లు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐలపై వ్యాపారుల ఫిర్యాదు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి - న్యూస్‌టుడే, ఎలమంచిలి: 'ఎలమంచిలిలో మంజూరైన రెండో బార్ ఏర్పాటుకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. దీంతో జిల్లా ఎక్సైజ్ అధికారులే తమ బినామీలతో దరఖాస్తు చేశారు. అందుకు వైన్‌షాపుల నుంచి తలాకొంత వసూలుచేశారు" అని ఆరోపిస్తూ ముగ్గురు మద్యం వ్యాపారులు విజయవాడలోని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) సుధీర్, సీఐ జ్ఞానేశ్వరి తమపై ఒత్తిడి తెచ్చి, ఒక్కో దుకాణం నుంచి రూ.1.2 లక్షల వరకు వసూలుచేసి కట్టించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వసూళ్లను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు.. ఫిర్యాదుదారులతో పాటు ఈఎస్, సీఐని విజయవాడకు పిలిపించి విచారణ చేపట్టారు.

ఎలమంచిలి మున్సిపాలిటీకి రెండు బార్లు మంజూరు కాగా, గీత కార్మికుల కోటాలో గతంలో ఒక బార్ ఏర్పాటుచేశారు. ఆ బార్‌లో పెద్దగా లాభాలు రాకపోవడంతో బయట మద్యం దుకాణాల్లో తక్కువ ధరకు దొరికే సరకు తెచ్చి అమ్ముతున్నట్లు కొన్నాళ్ల క్రితం ఫిర్యాదులొచ్చాయి. ఇందుకు ఎక్సైజ్ ఇన్‌ఛార్జి సీఐ ప్రోత్సాహం ఉందని వ్యాపారవర్గాలు ఆరోపించాయి. దీంతో బయటి జిల్లాల నుంచి వచ్చిన పలువురు ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేసి, ఆ బార్‌లోని సరకును సీజ్ చేసి, కేసు పెట్టారు. అప్పటికే ఉన్న బార్‌లోనే వ్యాపారం సరిగ్గా లేకపోవడం, కేసుల్లో ఇరుక్కోవడం వల్ల రెండో బార్ ఏర్పాటుకు వ్యాపారులెవరూ ముందుకు రాలేదు. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్.. నియోజకవర్గంలోని 22 మద్యం దుకాణాల యజమానుల నుంచి రూ.26 లక్షల వరకు వసూలు చేసి, ఆ సొమ్ముతో తమ బినామీతో కొత్తగా ఓ బార్ ఏర్పాటు చేయించారని ఆరోపణలు వచ్చాయి. తాజాగా డబ్బులిచ్చిన వైన్ షాపుల యజమానులే ఈఎస్‌పై ఫిర్యాదు చేయడంతో విచారణను ఎదుర్కొంటున్నారు. ఎక్సైజ్ అధికారులపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుసుకున్న సిబ్బంది.. బార్ కోసం డబ్బులిచ్చిన దుకాణదారుల వద్దకు వెళ్లి అధికారులకు అనుకూలంగా రాతపూర్వకంగా రాసివ్వాలని ఒత్తిడి తెస్తున్నారు.

# గోల్డ్ పూతతో మూన్ లైటింగ్!



ఉపాధి కోసం విశాఖపట్నం వలస వచ్చి ఫుట్‌పాత్‌పై దుస్తులు అమ్ముకుంటున్నా ప్రతీక్ ఘోష్‌కు ఆ వచ్చే మొత్తం సరిపోవడం లేదు. దీంతో అదనపు సంపాదన కోసం మూన్ లైటింగ్ (ప్రధానమైన వృత్తి కాకుండా ఖాళీ సమయంలో మరో పని) చేయాలని నిర్ణయించుకున్నాడు. యూట్యూబ్‌లో వెతికితే రద్దీ ప్రదేశాల్లో శిల్పంలా నుంచుని డబ్బులు ఆర్జించే కళాకారుల వీడియోలు కనపడ్డాయి. చిన్నారులను నవ్విస్తూ.. తానూ నవ్వుతూ ఉండే ఈ పని నచ్చడంతో ఒళ్లంతా బంగారం రంగు పూత పూసుకుని 'జనతా గోల్డెన్ బాయ్'గా మారిపోయాడు. మధ్యాహ్నం వరకూ ఫుట్‌పాత్‌లపై దుస్తులు విక్రయించుకుని సాయంకాలం ఆర్‌కే బీచ్ రోడ్డులో గోల్డెన్ బాయ్‌గా నిలబడతాడు. శిల్పంలా నుంచున్న తనతో చిన్నారులు, పెద్దవారు సెల్ఫీలు దిగి ఎంతోకొంత ఇస్తున్నారని ప్రతీక్ సంతోషంగా చెబుతున్నాడు.

-ఈనాడు, విశాఖపట్నం

# విమానం అమ్మి వచ్చిన డబ్బును బాధితులకు చెల్లిస్తాం!

- ఇన్వాయిస్ డిస్కౌంట్ కుంభకోణం కేసులో ఈడీ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: అధిక లాభాల ఆశజూపి జనాల్ని నిలువునా ముంచిన క్యాపిటల్ ప్రొటెక్షన్ గ్రూపునకు చెందిన 'హాకర్ 800ఏ' విమానాన్ని అమ్మేందుకు 9వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వెల్లడించింది. దీన్ని అమ్మడం ద్వారా వచ్చిన డబ్బును బాధితులకు చెల్లిస్తామని తెలిపింది. ఈ మేరకు ఈడీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇన్వాయిస్ డిస్కౌంట్ పథకం పేరుతో ఫాల్కన్ గ్రూపునకు చెందిన క్యాపిటల్ ప్రొటెక్షన్ సంస్థ ప్రజల నుంచి పెద్దఎత్తున డబ్బు వసూలు చేసి మోసం చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసులు నమోదు చేసింది. ఈ సంస్థ మొత్తం రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇందులో నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టింది. జనాల నుంచి కొల్లగొట్టిన డబ్బుతో క్యాపిటల్ ప్రొటెక్షన్ సీఎండీ అమర్‌దీప్ కుమార్ పెద్దఎత్తున ఆస్తులు కూడబెట్టాడు. ఓ విమానం కూడా కొనుగోలు చేసి తనపై కేసులు నమోదు కాగానే ఆ విమానంలో విదేశాలకు పారిపోయాడు. అనంతరం విదేశాల్లో ఆ విమానాన్ని అద్దెకు ఇవ్వగా.. అది శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చినప్పుడు ఈడీ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అమర్‌దీప్ 16 లక్షల డాలర్లు వెచ్చించి 2004లో విమానం కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది. కేసు దర్యాప్తులో భాగంగా అమర్‌దీప్ సోదరుడు సందీప్ కుమార్, చార్టర్డ్ ఎకౌంటెంట్ శరత్ చంద్ర తస్నివాల్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్యన్ సింగ్ ఛాబ్రాలను అరెస్టు చేసింది. సంస్థ పేరుతో ఉన్న(విమానం కాకుండా) రూ.18.63 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

# విద్యుత్ ప్రాజెక్టులకు 60 రోజుల్లో కార్యరూపం



విద్యుత్ శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, అధికారులు

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాలు కుదుర్చుకోవాలి. పంపిణీ సంస్థలు నాన్‌టారిఫ్ ఆదాయంపై దృష్టి పెట్టాలి.

■ థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వచ్చే బూడిదను వివిధ అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలి. థర్మల్ కేంద్రాల కాలుష్య నియంత్రణకు ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేయించాలి.

■ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఇళ్లపై సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటు త్వరితగతిన పూర్తిచేయాలి. వీటితో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను వినియోగదారులు వాడుకోగా మిగిలింది గ్రిడ్‌కు అందించాలి.

■ వ్యవసాయానికి సౌర విద్యుత్ అందించేందుకు నిర్దేశించిన పీఎం కుసుమ్ కింద రెండోదశలో 4,792 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయాలి. పీఎం కుసుమ్ కింద దేవాదాయ, జలవనరుల శాఖల భూముల్లో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించాలి. వినియోగదారులను విద్యుత్ ఉత్పత్తిదారులుగా మార్చాలి.

■ 483 ప్రభుత్వ భవనాలపై సౌరఫలకాలు ఏర్పాటు చేసి 150 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కార్యాచరణ చేపట్టాలి.

### కొనుగోలు వ్యయం యూనిట్‌కు 20 పైసలు తగ్గించాం: సీఎస్

విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని గత ఏడాదితో పోలిస్తే. . ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో యూనిట్‌కు 20 పైసల చొప్పున తగ్గించినట్లు సీఎస్ విజయానంద్ తెలిపారు. ఈపీఎంఎస్ విధానంలో నిరంతర పర్యవేక్షణ ద్వారా రూ.500 కోట్ల వరకు ఆదా చేసినట్లు వివరించారు.

# సంచార్ సాథీపై దుమారం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. దీంతో దుమారం రేగింది.

### గొంతునొక్కే చర్య



నియంతృత్వంలో భాగంగా ప్రజల గొంతు నులిమే మరో చర్యకు భాజపా ప్రభుత్వం పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. 'బంధువులు, స్నేహితులతో ప్రజలు ఏం మాట్లాడుకుంటున్నారో వినాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏముంది.. అసలు భాగస్వాముల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఈ యాప్‌ను తేవడమేంటి.. ఇప్పటికే ఆదాయ పన్ను చట్టాల ద్వారా మన డిజిటల్ జీవితాలను 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు. మన ప్రతి చాట్, చెల్లింపులపై నిఘా వేశారు. పెగాసస్‌తో 100 మందికిపైగా రాజకీయ నాయకులు, జడ్జీలు, జర్నలిస్టులు, కేంద్ర మంత్రుల ఫోన్లను హ్యాక్ చేశారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. డిస్టోపియన్ యుగం వర్ధిల్లుతోంది' అని మంగళవారం ఎక్స్‌లో ఖర్గే విమర్శించారు.

■ 'సంచార్ సాథీ యాప్.. స్నూపింగ్ యాప్. అది స్పష్టమైన పరిహాసచర్య. ప్రతి పౌరుడికీ వ్యక్తిగత గోప్యత హక్కు ఉంది. ప్రతి ఒక్కరూ తమ బంధువులకు, స్నేహితులకు సందేశాలు పంపుకొంటే వాటిని అనుమతి లేకుండా ప్రభుత్వం చూస్తుంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ అభిప్రాయపడ్డారు. ఈ యాప్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు.

■ సంచార్ సాథీ యాప్‌పై చర్చించాలని పట్టుబడుతూ కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి మంగళవారం రాజ్యసభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. సభలో ముందుగా నిర్ణయించిన కార్యకలాపాలను ఆపేసి దీనిపై చర్చించాలని కోరారు.

■ ప్రజాస్వామ్యంలో ఏ అంశాన్నైనా తప్పనిసరి చేయడం ఇబ్బందులకు గురి చేస్తుందని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యాఖ్యానించారు. ఆదేశాలు ఇచ్చేముందు ప్రతి విషయాన్నీ ప్రజలకు ప్రభుత్వం వివరించాల్సిందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి యాప్‌లు స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకునేలా ఉంటేనే బాగుంటుందని స్పష్టం చేశారు.

### వెనక్కి తీసుకోవాలి

సంచార్ సాథీ యాప్‌పై నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ డిమాండు చేశారు. ఇది వ్యక్తిగత గోప్యతపై దాడేనని స్పష్టం చేశారు. ఇటువంటి నియంతృత్వ ధోరణులను తమ పార్టీ ఖండిస్తుందని పేర్కొన్నారు.

■ సంచార్ సాథీ యాప్ తప్పనిసరి చేయడం వ్యక్తిగత గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని సీపీఎం విమర్శించింది. ఇదో సామూహిక పర్యవేక్షణ అని ఆ పార్టీ ఎంపీ వి.సదాశివన్ వ్యాఖ్యానించారు.

### వినియోగదారులదే నిర్ణయం

సంచార్ సాథీ యాప్‌ను తొలగించే స్వేచ్ఛ వినియోగదారులకే ఉంటుందని టెలికంశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎవరైనా రిజిస్టరు అయితేనే అది పని చేస్తుందని, అప్పటిదాకా నిద్రాణంగా ఉంటుందని తెలిపారు. ఈ యాప్‌పై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో మంగళవారం ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఆరోపించినట్లు ఈ యాప్ ద్వారా స్నూపింగ్‌గానీ, కాల్స్ పర్యవేక్షణగానీ జరగబోదని తేల్చి చెప్పారు. 'ఈ యాప్‌ను ప్రతి ఒక్కరికీ చేర్చడం మా బాధ్యత. మీరు డిలీట్ చేయాలనుకుంటే చేసుకోవచ్చు. మీరు వాడకూడదనుకుంటే రిజిస్టరు కావొద్దు. రిజిస్టర్ చేసుకోకపోతే యాక్టివ్‌గా ఉండదు' అని సింధియా వివరించారు.

'ఇది ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే చర్య. దీనిని ప్రజలు వ్యతిరేకించకూడదు. వారు స్వాగతించాలి. మీరు సెల్ ఫోన్ కొంటే అందులోని ఐఎంఈఐ నంబరు అసలుదా, నకిలీదా అని తెలుసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా లభిస్తుంది. ఇప్పటికే 1.5 కోట్ల మంది సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటివరకూ 2.75 కోట్ల మోసపూరిత మొబైల్ కనెక్షన్లను తొలగించాం. చోరీకి గురైన 20 లక్షల ఫోన్ల లొకేషన్‌ను గుర్తించాం. అందులో 7.5 లక్షల ఫోన్లను పోగొట్టుకున్న వారికి అందజేశాం' అని తెలిపారు.

### వినియోగదారుల సమాచారం తీసుకోదు



ఈనాడు, దిల్లీ: సంచార్ సాథీ యాప్ ప్రధాన ఉద్దేశం సైబర్ నేరాల నియంత్రణ మాత్రమేనని, దీని ద్వారా వ్యక్తిగత వివరాలను సేకరించడమన్న పరిస్థితే ఉత్పన్నం కాదని టెలికంశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. యాప్ విషయంలో ఎవరికీ అపోహలు అవసరం లేదని తెలిపారు. 'ఏడాదిన్నరగా నేను వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని యాప్ రూపకల్పనలో పాలుపంచుకున్నా. దేశంలో ఏటా సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. బాధితుల్లో అత్యధికులు వృద్ధులు, పెద్దగా చదువులేనివారే ఉంటున్నారు. వారి భద్రతను దృష్టిలో ఉంచుకునే ఈ యాప్ తీసుకొచ్చాం. ఈ యాప్‌లో మోసపూరిత నంబర్ల గురించి ఎవరైనా రిపోర్టు చేస్తే మిగతా వినియోగదారులకు రక్షణ లభించేలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఇందులో వినియోగదారులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా ఫైనాన్షియల్ ఫ్రాడ్ ఇండికేటర్ తయారుచేసి యూపీఐ ద్వారా డబ్బులు పంపేటప్పుడు ఆ నంబరుతో పొంచి ఉన్న రిస్క్ గురించి వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నాం. ఇది అందరికీ ఉపయోగపడే యాప్' అని మంత్రి వివరించారు.

■ సంచార్ సాథీ యాప్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని భాజపా ఎంపీ సంబిత్ పాత్ర స్పష్టం చేశారు. ప్రజలను సైబర్ మోసాల నుంచి రక్షించడానికి దీనిని తీసుకొచ్చామని, స్నూప్ చేయడానికి కాదని తెలిపారు. ఇష్టం లేనివారు దానిని డిలీట్ చేసుకోవచ్చని సూచించారు. రూ.5,000 కోట్ల మోసానికి పాల్పడి బెయిలుపై బయట ఉన్నవారు దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పరోక్షంగా ఆయన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఉన్న నేషనల్ హెరాల్డ్ కేసులను ప్రస్తావించారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర మంత్రి లోకేశ్. చిత్రంలో ఎంపీలు సానా సతీష్, కేశినేని శివనాథ్, రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ హరీష్‌మాథుర్

# మొంథాతో నష్టపోయిన రైతులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక సౌకర్యాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు అమిత్‌షాకు వివరించారు. ' 'తుపాను వల్ల 24 జిల్లాల్లోని 3,109 గ్రామాలు ప్రభావితం అయ్యాయి. 9.53 లక్షల మంది నష్టపోయారు. రాష్ట్రప్రభుత్వం 1.92 లక్షలమందిని 2,471 పునరావాస కేంద్రాలకు తరలించింది. ప్రతి తుపాను ప్రభావిత కుటుంబానికి రూ.3,000 చొప్పున సాయం అందించాం. కూలిన చెట్ల తొలగింపు, తాత్కాలిక నివాస సౌకర్యాల కల్పన, నీటి సరఫరా పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టింది. ఎన్‌డీఆర్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం తక్షణ ఉపశమనం, తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ.902 కోట్లు కావాలి. నవంబరు 12న మేం సమర్పించిన నివేదికపై కేంద్రమంత్రుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది'' అని కేంద్ర హోంమంత్రికి వివరించారు.

### వ్యవసాయరంగంపై అధిక ప్రభావం

మొంథా తుపాను కారణంగా వ్యవసాయ రంగానికి భారీ నష్టం వాటిల్లినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వివరించారు. '1.61 లక్షల హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, కంది, సిరి ధాన్యాలు దెబ్బతిన్నాయి. 3.27 లక్షలమంది రైతులు ప్రభావితమయ్యారు. 4.36 లక్షల టన్నుల మేర ఉత్పత్తి దెబ్బతింది. చెరువులు, కాలువలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 6,250 హెక్టార్లలో అరటి, బొప్పాయి, కొబ్బరి, పసుపు, మిరప, కూరగాయలు, పూల వంటి ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈ విపత్తు కారణంగా తోటల పెంపకం కోసం చేపట్టిన అనుబంధ నిర్మాణాలన్నీ దెబ్బతిన్నాయి. ముఖ్యంగా నర్సరీలు, షేడ్‌నెట్‌లు, నిల్వ గదులు, చిన్న నీటివనరులు తీవ్రనష్టాన్ని చవిచూశాయి' అని తెలిపారు. బాధితులకు పరిహారం చెల్లించడంతోపాటు, దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ కోసం కేంద్రం సాయం చేయాలని మంత్రులు లోకేశ్, అనితలు కోరారు.

### 6 నుంచి అమెరికా, కెనడా పర్యటనకు లోకేశ్

**ఐటీ సంస్థల ప్రతినిధులతో భేటీలు**

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఈ నెల 6 నుంచి పదో తేదీ వరకు అమెరికా, కెనడాల్లో పర్యటించనున్నారు. ఈ నెల 5న రాత్రి ఆయన హైదరాబాద్ నుంచి బయల్దేరుతారు. 6న డాలస్‌లోని తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. 8, 9 తేదీల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలో గూగుల్ సహా పలు ఐటీ సంస్థల ప్రతినిధులతో భేటీ అవుతారు. 10న కెనడాలోని టొరంటోలో ఐటీ సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. అదేరోజు రాత్రి కెనడా నుంచి బయల్దేరి హైదరాబాద్ చేరుకుంటారు. 11న ఉదయం హైదరాబాద్ నుంచి విశాఖ వెళ్లి సీఎం చంద్రబాబుతో కలిసి కాగ్నిజెంట్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారు. లోకేశ్ వెంట అమెరికా, కెనడాలకు కార్తికేయ మిశ్రా, అభిషిక్త్ కిశోర్ తదితర అధికారుల బృందం వెళ్తోంది.

# 12న విశాఖలో కాగ్నిజెంట్‌కు భూమిపూజ

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖకు ఐటీ దిగ్గజ సంస్థలు బారులు తీరగా.. అందులో కొన్ని కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న 'కాగ్నిజెంట్' కాపులుప్పాడలో తమకు కేటాయించిన భూముల్లో శాశ్వత భవనాలకు ఈ నెల 12న భూమిపూజ చేయనుంది. రుషికొండ హిల్-2లో మహతి భవనంలో సంస్థ తాత్కాలిక కార్యకలాపాలనూ అదేరోజు ప్రారంభించనుంది. ఈ కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

**తొలుత 800 మంది ఉద్యోగులతో..** రాష్ట్ర ప్రభుత్వం కాగ్నిజెంట్‌కు కాపులుప్పాడలో ఎకరా 99 పైసల చొప్పున 22.19 ఎకరాలను కేటాయించింది. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ)కి చెందిన ఆరు సర్వే నంబర్లలో ఉన్న భూమిని ఏపీఐఐసీ తీసుకుని, కాగ్నిజెంట్‌కు కేటాయించింది. ఈ సంస్థ శాశ్వత క్యాంపస్‌ను 2029 నాటికి పూర్తిచేయాలని లక్ష్యం విధించారు. ఇది పూర్తయితే నాలుగేళ్లలో రూ.1,583 కోట్ల పెట్టుబడితో 8వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ప్రస్తుతం హిల్-2లోని మహతి భవనంలో 800 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించనుంది. కాగ్నిజెంట్‌కు దేశంలో హైదరాబాద్, బెంగళూరు, కొచ్చి, కోల్‌కతా, చెన్నై, పుణె నగరాల్లో క్యాంపస్‌లున్నాయి.



కాపులుప్పాడలో కాగ్నిజెంట్‌కు కేటాయించిన స్థలంలో భూమి పూజకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

### కార్యకలాపాలకు సిద్ధంగా టీసీఎస్

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కూడా విశాఖలో కార్యకలాపాలకు సిద్ధమవుతోంది. ఈ సంస్థకు శాశ్వత క్యాంపస్ కోసం ప్రభుత్వం హిల్-3లో 21.76 ఎకరాలు కేటాయించింది. తాత్కాలిక కార్యకలాపాలకు మిలీనియం టవర్స్‌లో రెండు బ్లాక్‌లను లీజు ప్రాతిపదికన ఇచ్చింది. ఈ మేరకు టీసీఎస్ జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకుని, బోర్డులు సైతం ఏర్పాటుచేసింది. భవనంలో ఇంటీరియర్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇక్కడ 1500 మంది నుంచి 2 వేల మంది ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ దిగ్గజ సంస్థ సైతం భూమి పూజ, తాత్కాలిక కార్యకలాపాల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రుషికొండ ఐటీ హిల్స్‌పై ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థల రాకతో రాష్ట్ర ఐటీ ముఖచిత్రం మారనుంది.

### జీఎంఆర్ అధికారులతో మంత్రి లోకేశ్ భేటీ

**విశాఖలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధిపై చర్చ**

ఈనాడు, దిల్లీ: విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణలో పేరుపొందిన జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో ఏపీ మంత్రి నారా లోకేశ్ మంగళవారం ఇక్కడ పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడితో కలిసి సమావేశమయ్యారు. విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై చర్చించి దాని అభివృద్ధి ప్రణాళికను ఖరారు చేశారు. ఈ ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల విశాఖ ప్రాంతం విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల విద్య, శిక్షణల కేంద్రంగా మారుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నట్లు తెలిపింది. ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడడంతో పాటు రాష్ట్రంలో ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేస్తుందని ప్రకటించింది. ఈ సమావేశంలో జీఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులు ఎస్జీకే కిషోర్, సి.ప్రసన్న, పీయూష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దిల్లీలో జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్. చిత్రంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

# రోజుకు ₹50 వేల జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుంది. తర్వాత పునరుద్ధరించుకోవాలి. 30 రోజులకు తాత్కాలిక లైసెన్సులు కూడా జారీచేస్తారు. ■ హోర్డింగుపై అనుమతి నంబరు, ప్రింటర్ వివరాలు, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు విధిగా ముద్రించాలి. అవసరమైతే జీఎస్టీ నంబరు కూడా ఇవ్వాలి.

**45 రోజుల్లో అందుబాటులోకి పోర్టల్:** హోర్డింగుల ఏర్పాటుకు అనుమతులిచ్చేందుకు 45 రోజుల్లో పోర్టల్ ప్రారంభించనున్నారు. లైసెన్సుకు దరఖాస్తు, లైసెన్సుల పునరుద్ధరణ, ఫీజుల చెల్లింపులు పోర్టల్ ద్వారా చేయొచ్చు.

**హోర్డింగులు ఇక్కడ నిషేధం:** దేవాలయాలు, మసీదులు, చర్చిలు, విగ్రహాల సమీపంలో ■ పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వం కార్యాలయాలు ■ ట్రాఫిక్ కూడళ్లు, వాహనాల రాకపోకలకు అడ్డంగా ■ వారసత్వ భవనాలు, పురావస్తు ప్రాంతాల్లో ■ రహదారుల మధ్యలో (మీడియన్లు), వంతెనలు, రైల్ క్రాసింగ్‌లు

**వీటికి అనుమతిలేదు:** అసభ్యత ■ పొగాకు, మద్యం, మత్తు పదార్థాలు ■ విద్వేషపూరితమైనవి, కుల మతాలను అవమానించేవి.

# ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

మే 7 వరకు 5 నెలలపాటు విధుల్లో ఉంటారు. సబ్జెక్టు టీచర్‌కు నెలకు రూ.12,500, ఎస్జీటీకి రూ.10 వేల చొప్పున గౌరవవేతనం చెల్లిస్తారు. ఈ నెల 7లోపు నియామక ప్రక్రియను పూర్తి చేస్తారు. జనవరిలో డీఎస్సీ ప్రకటన ఇచ్చినా వీరు విధుల్లోకి చేరేటప్పటికి జూన్ వచ్చేస్తుంది. అప్పటి వరకు బోధనకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది. ఇప్పటి జిల్లాల వారీగా సేకరించిన ఖాళీల ప్రకారం అనుమతులు ఇచ్చింది.

**నియామకాలు ఇలా..** మండల విద్యాధికారులు ఖాళీలను ప్రకటిస్తారు. పాఠశాల, మాధ్యమం వారీగా పోస్టులు విడుదల చేస్తారు

■ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 5లోపు దరఖాస్తులు సమర్పించాలి ■ ఎంఈఓ స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ డీఈఓకు పంపిస్తారు. ■ డీఈఓలు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. అకడమిక్‌కు 75%, ప్రొఫెషనల్ అర్హతలకు 25% చొప్పున వెయిటేజీ ఇస్తారు.

■ సొంత గ్రామం, మండలంలో ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ■ ఎంపికైన అభ్యర్థుల జాబితాను సంబంధిత ఎంఈఓ ద్వారా పాఠశాల యాజమాన్య కమిటీలకు అందిస్తారు. ■ ఏడో తేదీలోపు ప్రక్రియ పూర్తవుతుంది. వేతనాలను బ్యాంకు ఖాతాలోనే జమచేస్తారు.

# క్వాంటమ్ టెస్టింగ్‌కు గ్లోబల్ సెంటర్‌గా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

వాటన్నింటినీ అమరావతిలోనే తయారుచేస్తామని.. అందులో మెజార్టీ సిస్టమ్స్ అమరావతి క్వాంటమ్ వ్యాలీలోనే ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీతో కలసి పనిచేసేందుకు విశాఖ పెట్టుబడిదారుల సదస్సులో రాష్ట్ర ప్రభుత్వంతో తమ కంపెనీ ఒప్పందం చేసుకున్న సందర్భంగా ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖ్యాంశాలు..

### అమరావతి విజన్ ఆకర్షించింది

అమరావతి క్వాంటమ్ వ్యాలీ విజన్, స్ట్రక్చర్, ప్రణాళిక అమలుకు సంబంధించిన సామర్థ్యాలు మమ్మల్ని ఆకర్షించాయి. క్వాంటమ్ కాంపొనెంట్స్‌ని తయారు చేయగల బలమైన 'టాలెంట్ పూల్' భారత్‌లో ఉందని గుర్తించాం. అందుకే ఇక్కడికి వచ్చాం.

### ఆక్స్‌ఫర్డ్‌లో ప్రారంభించి ఫిన్లాండ్‌కు మార్చాం

మా కంపెనీని మొదట ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసి, తర్వాత ఫిన్లాండ్‌కు మార్చాం. మా కంపెనీ ప్రధానంగా పరిశోధన, అభివృద్ధిపై పనిచేస్తుంది. క్వాంటమ్ హార్డ్‌వేర్ ఆర్‌అండ్‌డీ, క్వాంటమ్ కంప్యూటర్లకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తుంది. భారత ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ, డీఎస్టీ, సీడాక్ వంటి విభాగాలతో ఇప్పటికే కలిసి పనిచేస్తున్నాం. అమెరికా, తైవాన్‌తో పాటు యూరోపియన్ దేశాల్లోనూ మాకు వినియోగదారులున్నారు.



విశాల్ చత్రథ్

### ఆవిష్కరణల్లో పెరిగిన వేగం

ఒక పూర్తిస్థాయి క్వాంటమ్ సెటప్ ఏర్పాటుకు 2వేల కాంపొనెంట్స్ పర్ఫెక్ట్‌గా పనిచేయాలి. ఆ కాంపొనెంట్స్ తయారీలో రకరకాల సైకిల్స్ తర్వాత పర్ఫెక్షన్ వస్తుంది. ఇదివరకు సంవత్సరానికి 8-9 సైకిల్స్ మాత్రమే చేయగలిగేవారు. అడ్వాన్స్‌డ్ ఆటోమేటెడ్ సిస్టమ్స్ అందుబాటులోకి రావడంతో మేం సంవత్సరంలో 300 సైకిల్స్ చేయగలుగుతున్నాం. దీనివల్ల ఆవిష్కరణల్లో వేగం పెరిగింది.

### పరిశోధకులకు మంచి అవకాశం

మా సిస్టమ్స్ ఎక్కడున్నా పరస్పరం అనుసంధానమై ఉంటాయి. భారత్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన పరిశోధకులు వాటిలోకి లాగిన్ అయి డేటా పొందొచ్చు. ప్రయోగాలు చేసుకోవచ్చు. ఒక్కో టెస్ట్ అండ్ మెజర్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటుకు కనీసం రూ.20 కోట్లు ఖర్చవుతుంది. ఇతర భాగస్వాములు, పెట్టుబడిదారులతో కలసి మేం ఈ ప్రాజెక్టు చేపడతాం. ఈ టెస్టింగ్ ప్లాట్‌ఫాంలకు సంబంధించి రాబోయే రోజుల్లో భారత్ గ్లోబల్ సప్లయర్‌గా మారుతుంది.

### 'గోల్డెన్ స్టాండర్డ్స్' ఏర్పాటు చేస్తాం

భౌగోళిక రాజకీయ అస్థిరతల వంటి కారణాలతో క్వాంటమ్ సప్లై చైన్‌కు విఘాతం కలిగినపుడు ఇబ్బంది పడకుండా ఉండాలంటే, క్వాంటమ్ హార్డ్‌వేర్‌లో స్వయం సమృద్ధి సాధించడం భారత్‌కు చాలా అవసరం. ఇక్కడ అలాంటి కాంపొనెంట్స్ తయారుచేయాలంటే ప్రామాణీకృత టెస్టింగ్, బెంచ్ మార్కింగ్ సదుపాయాలుండాలి. ఉదాహరణకు ఒక కంపెనీ ఒక కారు తయారుచేస్తుంటే దాని విడిభాగాలు సరిగా ఉన్నాయో లేదో 'గోల్డెన్ స్టాండర్డ్స్'తో సరిపోల్చి చూస్తారు. క్వాంటమ్ హార్డ్‌వేర్‌కు సంబంధించి ఆ గోల్డెన్ సిస్టమ్‌ను మా కంపెనీ అభివృద్ధి చేస్తుంది.

### తొలిదశలో 12వేల మందికి శిక్షణ

టెస్టింగ్, బెంచ్ మార్కింగ్ సదుపాయాల ఏర్పాటుతో పాటు లక్షమంది క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వడం మా కంపెనీ లక్ష్యం. దీనికి కోర్సు మాడ్యూల్స్‌ను అమెరికాలోని ఐవీ లీగ్, కాలిఫోర్నియా యూనివర్సిటీలతో కలసి రూపొందిస్తున్నాం. డిసెంబరులో విడుదల చేస్తాం. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. కాలేజీలు, యూనివర్సిటీలతో ఒప్పందం చేసుకుని అక్కడి ఫ్యాకల్టీకి శిక్షణ ఇస్తాం. వారు బోధిస్తారు. తొలి దశలో 12 వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందాలు చేసుకున్నాం.


# ఈనాడు

## ప్రజాప్రయోజనాలు పట్టవా?

ప్రగతి బాటలో భారతావని స్థిరంగా పురోగమించాలన్న జాతీయ సంకల్పానికి ప్రతీక పార్లమెంటు. అందులో ఆసీనులయ్యేవారు తమ ఆశలూ ఆకాంక్షలను అర్థంచేసుకుంటారని, నిత్యజీవిత సమస్యల్లోంచి తమను గట్టెక్కిస్తారని ప్రజలు విశ్వసిస్తారు. ప్రజాప్రతినిధులపై జనంలో ఆ నమ్మకం సన్నగిల్లితే- మన ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులే కదిలిపోతాయి. జాతి ఐక్యత, సమగ్రతలు పెళుసుబారుతాయి. ఆ పరిస్థితి తలెత్తకూడదంటే- 'దృక్కోణాలూ విధానాల్లో ఎంత తేడా ఉన్నప్పటికీ జనభారత ప్రతినిధులుగా మనమందరం ఒక ఉమ్మడి లక్ష్యంతో ఇక్కడ సమావేశమయ్యామని గుర్తుంచుకోవాలి. ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కల్పించాలనే ఆశయ సాధనకు కట్టుబడాలి' అన్న తొలి లోక్‌సభాపతి జి.వి.మవులాంకర్ హితవచనాన్ని ఎంపీలు ఆలకించాలి. పరస్పరం గౌరవించుకుంటూ, సహకరించుకుంటూ, సహనం వహిస్తూ, భిన్నాభిప్రాయాలను ఆహ్వానిస్తూ చట్టసభల్లో బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తేనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని అధికార ప్రతిపక్షాలు సదా స్మరణలో ఉంచుకోవాలి. ఆ రాజనీతిజ్ఞత కొరవడిన పార్టీల పుణ్యమా అని సమకాలీన భారతంలో పార్లమెంటు సమావేశాలు అనవసర ఆందోళనలూ వాయిదాల పర్వాలతో వృథాగా పోతున్నాయి!

మొన్న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు యథామామూలుగా నినాదాలూ నిరవధిక నిరసనలకు పరిమితమవుతున్నాయి. జాతీయ ప్రయోజనాలు, ప్రజల అగచాట్లను విస్మరిస్తున్న భిన్న పక్షాలు తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనే ధోరణిలో తెగే వరకూ లాగుతున్నాయి. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంటలకు సరైన ధరలు లభించక రైతాంగం అల్లాడుతోంది. జీవితంలో స్థిరపడటానికి తగిన ఉపాధి మార్గాలు లభించక యువత నీరసించిపోతోంది. దేశీయంగా శాంతిభద్రతల సమస్యలు ఒకవైపు... యుద్ధాలూ అమెరికా ఏకపక్ష ధోరణులతో అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొంటున్న అనిశ్చితి మరోవైపు కలవరపరుస్తున్నాయి. జనజీవితాలను బాగా ప్రభావితం చేసే ఇలాంటి వాటిపై నిశిత చర్చలు సాగాల్సిన పార్లమెంటు భేటీలు ఒకటి రెండు అంశాల చుట్టూనే పరిభ్రమిస్తుండటం దురదృష్టకరం. కేవలం ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకోసమైతే, చట్టసభలకు ఆవల అనేక వేదికలుంటాయి. ప్రతిపక్షాలు వాటిని ఉపయోగించుకోకుండా ప్రభుత్వాన్ని ప్రజలకు జవాబుదారీ చేసే పార్లమెంటు సమావేశాలకెందుకు అడ్డుపడటం? అలాగని అధికారపక్షమూ పట్టువిడుపులు ప్రదర్శించకుండా ఉంటే- హరించుకుపోయే సభాసమయంతోపాటు కీలకాంశాలూ చర్చకు రాకుండా కొట్టుకుపోతాయి. సభ్యుల సమగ్ర పరిశీలనకు నోచుకోకుండానే బిల్లులు చట్టాలవుతాయి. అంతిమంగా అవి ప్రజాప్రయోజనాలకు పాతరేస్తాయి!

కాలం గడుస్తున్న కొద్దీ పరిణితి చెందుతూ రాజ్యాంగ స్వప్నాల సాకారంలో సఫలం కావాల్సిన భారత ప్రజాస్వామ్యం అందుకు విరుద్ధంగా కళావిహీనమవుతోంది. పార్లమెంటు సమావేశాల తీరే ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. నిరుడు శీతాకాల భేటీల్లో లోక్‌సభ, రాజ్యసభ ఉత్పాదకతలు మరీ తక్కువగా 59, 39శాతాల చొప్పున నమోదయ్యాయి. ఈ ఏడాది వర్షాకాల సమావేశాల్లోనైతే అవి వరసగా 29, 34శాతాలకు తెగ్గోసుకుపోయాయి. ముఖ్యంగా ప్రశ్నోత్తరాల సమయంలో లోక్‌సభ 23శాతం, రాజ్యసభ 6శాతం వంతునే పనిచేశాయి. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనూ అవే దృశ్యాలు పునరావృతమవుతుండటం విచారకరం. ఫలితాలను రాబట్టే నిర్మాణాత్మక చర్చలకు మాత్రమే పార్లమెంటు వేదిక కావాలన్న ప్రధాని మోదీ తాజా వ్యాఖ్య అనుసరణీయమైనది. దేశ హితం, ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అధికార ప్రతిపక్షాలు ఏకతాటిపై నడిస్తేనే పార్లమెంటు ప్రతిష్ఠ నిలబడుతుంది!



ఒక దేశానికైనా ప్రజలకైనా.. 'చాలా సాధించేశాం ఇక కొన్నాళ్లు విశ్రాంతి తీసుకుందాం' అనే పరిస్థితి ఉండదు. కార్యశీలతను ఎన్నడూ వదిలిపెట్టకూడదు. మార్పు, అభివృద్ధి దిశగా కృషి అనేవి ప్రయాణాలే కానీ గమ్యాలు కావు.

– డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

## జీవన ఆనందం

ఆనందం అనేది ఎవరికి వారు అనుభవించే అద్భుతమైన మానసిక అనుభూతి! మనిషి పుట్టింది మొదలు చివరివరకు ఆనందం కోసం అనేక విధాలుగా ఆరాట పడుతూ ఉంటాడు. అది తనలోనే ఉందన్న అసలు రహస్యం తెలియక ఎక్కడెక్కడో వెతుకుతూ.. ఏవేవో కర్మలు ఆచరిస్తూ ఉంటాడు! ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే ఈ ఆనందం, సాధారణ సంతోషానికి ఒక మెట్టు పైనే ఉంటుంది.

సంతోషం పడి లేచే తరంగం లాంటిది. అది క్షణికం. చాలావరకు బాహ్య ప్రపంచపు ఆకర్షణల మీద ఆధారపడి ఉంటుంది. కానీ ఆనందం.. ఒక అపూర్వ మానసిక స్థితి. మనకు మనం అనుభవించే అలౌకిక భావన. అదో ప్రశాంతమైన సరస్సులాగా నిశ్చలంగా ఉంటుంది. ఆనందం వల్లనే పరమ సుఖం దక్కుతుందంటారు దైవజ్ఞులు. ధ్యానం వల్ల, సాధన వల్ల మాత్రమే ఈ సచ్చిదానందం సిద్ధిస్తుంది. ఎవరైతే పనిని దైవంగా భావించి కార్యోన్ముఖులవుతారో.. వారిని మాత్రమే ఆనందం వెన్నంటి ఉంటుంది. ఏదైనా మంచి జరిగినప్పుడు మనలో కలిగే ఆనందం వేరు. అది ఎదుటివారితో పంచుకోతగ్గది. అప్పుడది రెట్టింపు అవుతుంది కూడా! ఆనందంగా ఉండే వారి దగ్గరికి ఉత్సాహం, శక్తి, ఆసక్తి, పట్టుదల.. మొదలైన గుణాలన్నీ వచ్చి చేరతాయి.



## అంతర్యామి

మనం ఇతరులకు ఏదైనా ఇవ్వడంలో ప్రత్యేకమైన ఆనందాన్ని అనుభవిస్తాం. అది దానం కావచ్చు.. సాయం కావచ్చు. అందుకే గురువు శుక్రాచార్యుడు హెచ్చరించినా, వారించినా బలిచక్రవర్తి లెక్క చేయలేదు. ఎదురుగా చేయి చాచి అడిగినవాడు త్రివిక్రముడు. ముల్లోకాలు ఆక్రమించిన వామనుడు. దాన గుణశీలమైన ఆనందంతో, భక్తితో ఆ మహావిష్ణువు ముందు మోకరిల్లి, మూడో పాదానికి బలి తన శిరస్సునే చూపించాడు! శిబి చక్రవర్తి ఒక పావురాన్ని రక్షించడానికి, మరో డేగ ఆకలి తీర్చడానికి తన మాంసాన్ని ఖండించి ఇచ్చాడు. అది సరితూగకపోతే తానే స్వయంగా త్రాసులో కూర్చున్నాడు. దానగుణంలోంచి ఉత్పన్నమయ్యే ఆనందం ఉదాత్తమైంది. ధనమే కాదు, జ్ఞానం, శ్రమ, సమయం.. ఏదైనా ఇతరుల కోసం వెచ్చించవచ్చు. ఇవ్వగలిగే శక్తి గొప్పది. స్వార్థరహితమైన ఆనందాన్ని సృష్టించుకోవడానికి; మాటల్లో, చేతల్లో, కరుణ చూపించడానికి.. కొత్త అవకాశాలను మనమే వెతుక్కోవాలి. ఇతరుల ఆనందంతో తాదాత్మ్యం చెందడం- మనసుకు నిజమైన ఆనందాన్ని కలుగచేస్తుందని బుద్ధ భగవానుడు బోధించేవారు.

ఆనందం.. అనిర్వచనీయ అనుభూతి. దీన్ని తెలుసుకోలేని మనిషి తన ఆనందాన్ని సదా పక్కనే ఉన్న ఏదో ఒక దుఃఖంతో కప్పి వేస్తూ ఉంటాడు. అసలు ఆనందం అనేది భౌతికమైంది కాదనే సత్యాన్ని అందరూ తెలుసుకోవాలి. మంచి పనులు చేస్తూ పరోపకారిగా ఇతరులకు అండగా ఉండటంలోనే జీవన ఆనందం ఉందని గ్రహించాలి. అది గ్రహించిన నాడు మనిషి 'ఆనందోబ్రహ్మ'గా జీవిస్తాడు!

– శ్రీకంఠస్ఫూర్తి

## ముసుగు తీస్తే నిరంకుశత్వమే!



**వాషింగ్టన్ డీసీలో గతవారం 'ఆఫ్ఘన్ పార్ట్‌నర్ ఫోర్స్' మాజీ సభ్యుడు ఒకరు ఇద్దరు నేషనల్ గార్డ్ పోలీసులపై కాల్పులకు తెగబడ్డాడు. వారిలో ఒకరు చనిపోగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అమెరికా నిఘా వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనంగా చెబుతున్న ఈ ఘటనపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెంటనే స్పందించారు. దీనంతటికీ బైడెన్ సర్కారే కారణమంటూ యథాప్రకారం ఆరోపణలు గుప్పించారు. ఆ క్రమంలోనే 'మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తున్నా'మంటూ ప్రకటన చేశారు. అసలు ఆయన లక్ష్యమేమిటి? అన్నంత పనీ చేస్తారా? చేయగలరా?**

వాషింగ్టన్ డీసీలో నేషనల్ గార్డ్ సభ్యులపై జరిగిన దాడి తీవ్ర చర్చకు దారితీసింది. 'కాల్పులకు తెగబడిన రహ్మానుల్లా లకన్వాల్‌కు మీ యంత్రాంగమే కదా మొన్న ఏప్రిల్‌లో ఆశ్రయం కల్పించింది' అని ఓ విలేకరి ప్రశ్నించగా, ట్రంప్ ఆగ్రహం వెళ్లగక్కారు. ఆ క్రమంలోనే కాల్పులు జరిగిన మర్నాడు థ్యాంక్స్ గివింగ్ రోజున, 'అన్ని మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తున్నాం' అంటూ ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అమెరికాలో ఉంటున్న 5.3 కోట్ల మంది విదేశీయుల్లో ఎక్కువమంది విఫల దేశాల నుంచి... జైళ్లు, మానసిక చికిత్సాలయాలు, డ్రగ్ కార్టెల్స్ నుంచి వచ్చినవారేనని; వారంతా సంక్షేమ పథకాలపై ఆధారపడుతున్నారని ఆయన ఆరోపించారు. అమెరికాలో నేరాల పెరుగుదలకు, నగరాల పతనానికి, ఇళ్ల కొరత వంటి సామాజిక సమస్యలకు వలసదారులే కారణమంటూ నోరు పారేసుకున్నారు. మిన్నెసొటాలోని సోమాలి శరణార్థులను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ- అక్కడి గవర్నర్ టిమ్ వాల్జ్‌ను, చట్టసభ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్‌ను అవమానించారు. మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తామని, బైడెన్ హయాంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు. తమ దేశంలో ప్రశాంతతను దెబ్బతీసే వారి పౌరసత్వాన్ని రద్దు చేయడంతో పాటు పౌరులు కాని వారికి ఫెడరల్ ప్రయోజనాలను నిలిపేస్తామని, రివర్స్ మైగ్రేషన్ వంటి చర్యలు తప్పవని ట్రంప్ ప్రతిజ్ఞ చేశారు. అదే రోజున డ్రగ్స్ ఉన్నట్లుగా అనుమానమున్న ఒక పడవలోని వ్యక్తులందరినీ హతమార్చాలని సీల్ టీమ్-6ను రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆదేశించినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రచురించింది. ఈ రెండు సంఘటనలను కలిపి చూస్తే- వలస విధానం ముసుగులో దేశంలో జరుగుతున్న జాతివివక్ష ప్రక్షాళన ఒక వైపు, నేరస్థులను అదుపుచేయడం పేరిట సాగుతున్న చట్టవిరుద్ధ హత్యలు మరోవైపు కనిపిస్తాయి. అమెరికాలో చట్టబద్ధమైన పాలన పతనమవ్వడానికి నిదర్శనాలివి! కార్యనిర్వాహక విభాగం నిరంకుశాధికారాన్ని చలాయిస్తూ, ఎవరు బతకాలి, ఎవరు చావాలి, ఈ దేశానికి చెందిన వారు ఎవరన్న విషయాలను జాతి ఆధారంగా నిర్ణయించే నియంతృత్వ పోకడ దిశగా ఇప్పుడు అడుగులు పడుతున్నట్లు ఈ పరిణామాలు చాటుతున్నాయి.




### విషాదాన్ని సాకుగా చూపి...

ఒక వర్గాన్ని గంపగుత్తగా శిక్షించడానికి, ఆ శిక్షను సమర్థించుకోవడానికి ఒకరిద్దరి వ్యక్తిగత నేరాలను సాకుగా చూపించడం నిరంకుశ రాజ్యాల చరిత్రలో కనిపించేదే. కాల్పులకు పాల్పడిన రహ్మానుల్లా లకన్వాల్ అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) మద్దతు కలిగిన వ్యక్తి. అతడు చేసిన పనికి ట్రంప్ అభివృద్ధి చెందుతున్న దేశాలను దోషులుగా పేర్కొనడం, వలసదారులను పక్కా అబద్ధాలతో కించపరచడం దురహంకారంగా వ్యాఖ్యానించారు. ఆ క్రమంలోనే ఆయన ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి పరిభాషలో 'మూడో ప్రపంచ దేశాలు' అంటూ సంబోధించారు. ట్రంప్ కుడిభుజంగా భావించే స్టీఫెన్ మిల్లర్ వంటి వారు వలసదారులను 'అనాగరిక జనాభా'గా పేర్కొనడం జాతి వివక్ష కాక మరేమిటి? ట్రంప్ తన ప్రకటనలో 'రివర్స్ మైగ్రేషన్', 'అమెరికాకు నెట్ అసెట్ కానివారిని తొలగిస్తాం' అని అన్నారు. ఈ భాష మనుషుల విలువను ఒక కార్పొరేట్ ఆస్తి-అప్పుల పట్టికలోని అంశాలుగా మార్చడమే కాకుండా, విలువ లేనివారిని వదిలించుకునేందుకు అర్హుల్ని సృష్టిస్తోంది. డ్రగ్స్ ఉన్నట్లుగా భావిస్తున్న పడవలోని వారందరినీ చంపేయాలని హెగ్సెత్ ఆదేశించారని, ఆ ఆదేశాల మేరకు జరిగిన దాడిలో... నీటిలో కొందరు బతికి ఉన్నవారు కనిపించారు. వారిపై రెండో క్షిపణి ప్రయోగించాలని సీల్ టీమ్-6ను మంత్రి ఆదేశించినట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనం వివరించింది. క్షిపణి ప్రయోగించడానికి ఇదేమీ యుద్ధం కాదే! ఈ పరిణామాన్ని చూస్తే- ఒకవైపు భయోత్పాదన ద్వారా, మరోవైపు దాడుల ద్వారా వలసల కట్టడికి ట్రంప్ సర్కారు పూనుకున్నట్లు కనిపిస్తుంది. ఇక ట్రంప్ చెబుతున్న 'థర్డ్ వరల్డ్‌పై నిషేధం' తాలిబన్, ఐసిస్‌లపై పోరాటంలో అమెరికా దళాలతో కలిసి పనిచేసిన వేలాది మంది ఆఫ్ఘన్ మిత్రులకూ వర్తిస్తుంది. వీరిని డీసీ షూటర్‌తో సమానంగా చూడటం ద్వారా ట్రంప్ నమ్మకద్రోహానికి పాల్పడుతున్నారు. అదే సమయంలో సముద్రాలపై చట్టవిరుద్ధ హత్యలకు పాల్పడటం ద్వారా అమెరికా సైన్యం జెనీవా ఒప్పందాలు, యుద్ధ నియమాలకు కట్టుబడి ఉండదని, కేవలం కార్యనిర్వాహక ఉత్తర్వుల అమలు విభాగంగానే పనిచేస్తుందని సంకేతం ఇస్తున్నారు.

### అదేనా అసలు లక్ష్యం?

ట్రంప్ ప్రకటనలు చేస్తున్నా, తన ఆజెండాను అమలు చేయడం సులభసాధ్యమేమీ కాకపోవచ్చు. ఆయన నిరంకుశ ధోరణులపై సొంత రిపబ్లికన్ పార్టీ నుంచే వ్యతిరేకత వస్తున్నట్లు ఇటీవలి పరిణామాలను బట్టి అర్థమవుతోంది. ఇండియానా రాష్ట్ర సెనేటర్ ట్రంప్ వ్యాఖ్యలను బహిరంగంగా విమర్శించడమే కాకుండా, ఆయన తెచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఘోర పరాజయాలతో అవమానపడిన రిపబ్లికన్ చట్టసభ సభ్యులు- ట్రంప్ పట్ల అసహనాన్ని ప్రదర్శిస్తున్నారు. ట్రంప్ అభ్యంతరాలను పక్కనపెట్టి 'ఎప్‌స్టీన్ ఫైల్స్' విడుదలకు వారంతా ఏకగ్రీవంగా ఓటు వేశారు. ఈ విషయంలో తలెత్తిన విభేదాలు ట్రంప్ మద్దతుదారు మార్జోరీ టేలర్ గ్రీన్ రాజీనామాకు దారితీశాయి. మరోవైపు, రక్షణ మంత్రి హెగ్సెత్ చట్టవిరుద్ధ ఆదేశాలు ఇచ్చారన్న వివాదం మీద కాంగ్రెస్ ఉభయ సభల్లోని అధికార, విపక్ష నాయకులు దర్యాప్తు చేస్తున్నట్లు తాజాగా ప్రకటించారు. ఈ పరిణామాలన్నీ జవాబుదారీ ప్రజాస్వామ్య వ్యవస్థకు సంకేతాలే అయినప్పటికీ వాషింగ్టన్ కాల్పుల తదనంతర ప్రకటనల వెనక ట్రంప్ అసలు ప్రణాళిక- దేశానికి భారంగా మారారని తాను భావిస్తున్న వారిని ఏరేయడం! ఆయన అసలు లక్ష్యం సరిహద్దుల్లో గోడ కట్టడం కాదు- నిరంకుశ పాలన నుంచి అమెరికన్ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని వేరుచేసే చట్టబద్ధమైన, నైతికపరమైన రక్షణ గోడలను కూల్చేయడం!!



ప్రొఫెసర్ వెనిగళ్ళ మోహన మురళీధర్
జార్జ్ మేసన్ యూనివర్సిటీ,
వర్జీనియా, అమెరికా

కెనడాలోని అంటారియోలో థండర్ బే దగ్గర ఓ యువకుడి విగ్రహం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. అది రన్నింగ్ పోజులో ఉన్న దివ్యాంగుడి ప్రతిమ. ఆ విగ్రహం కుడికాలి తొడ భాగం వరకు స్ప్రింగ్‌తో కూడిన ఆర్టిఫీషియల్ సపోర్ట్ కనిపిస్తుంది. అది టెర్రీ ఫాక్స్ ప్రతిరూపం. 23 ఏళ్లకే ఈ లోకాన్ని వీడిన యూత్ ఐకాన్ అతడు. అథ్లెటిక్స్ కుటుంబంలో పుట్టిన టెర్రీ మారథాన్ విజేత. బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు కూడా. పందొమ్మిదో ఏట ఆస్టియోసర్కోమా అనే క్యాన్సర్ సోకి కుడి కాలు కోల్పోయాడు. అయినాసరే బాస్కెట్‌బాల్ ప్రాక్టీసు మానలేదు. వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచాడు. అక్కడితో చాలు అనుకోకుండా తనలాంటి విధివంచితులకు సాయపడాలనుకున్నాడు.

## మనోబలమంటే ఇదీ!



కృత్రిమ కాలును అమర్చుకున్న టెర్రీ 1980, ఏప్రిల్ 22న 'మారథాన్ ఆఫ్ హోప్' పేరిట దేశవ్యాప్త పరుగుకు సంకల్పించాడు. క్యాన్సర్ నివారణకు అవసరమైన నిధుల సేకరణకని ఆ పర్యటన చేపట్టాడు. ప్రతి ఒక్కరూ ఒక డాలర్ విరాళంగా ఇవ్వాలని పిలుపిచ్చాడు. మారథాన్ లక్ష్యం ఎనిమిది వేల కిలోమీటర్లు. ఒక్కరోజైనా విరామం తీసుకోకుండా 143 రోజుల్లో 5,373 కిలోమీటర్లు పరుగెత్తాడు టెర్రీ. పరుగుకు ముందే కెనడియన్ క్యాన్సర్ సొసైటీకి ఇలా లేఖ రాశాడు- "నా అపరోధాలను అధిగమించి తీరతాను. పరుగు తీస్తాను. దేశంలో క్యాన్సర్ నివారణకు అవసరమైన నిధులను సేకరించడానికి నా తుదిశ్వాస వరకూ ప్రయత్నిస్తాను. నాలా క్యాన్సర్‌తో బాధపడుతూ బతుకుమీద ఆశలు కోల్పోయినవారి చూపులు నన్నెంతో మనోవేదనకు గురిచేశాయి. ఏదో ఒకనాటికి అద్భుతం జరుగుతుంది. నేను కన్నుమూసినా, నా సంకల్పం మాత్రం నెరవేరి తీరుతుంది" అని ధీమా వ్యక్తం చేశాడా ధీరుడు.

'మారథాన్ ఆఫ్ హోప్'కి ప్రతి పట్టణంలోనూ అనూహ్య ఆదరణ లభించింది. వేలాదిగా జనం బారులుతీరి వెల్‌కమ్ చెప్పేవారు టెర్రీకి. ఆయన పేరున్న టీ షర్టులు, టోపీలు క్రేజీగా అమ్ముడుపోయేవి. అలుపెరుగని పరుగులో ఆ యువకిశోరం ఓ రోజు ముందుకు సాగలేక కుప్పకూలిపోయాడు. ఈసారి ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకిందని డాక్టర్లు చెప్పారు. తుది వరకు మృత్యువుతో పోరాడిన టెర్రీ, 1981 జూన్ 8న తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. కానీ, తాను కోరుకున్నట్లుగా చివరి రోజుల్లో 24.2 మిలియన్ డాలర్లతో 'టెర్రీ ఫాక్స్ క్యాన్సర్ ఫౌండేషన్' స్థాపించాడు. దీనికి ఆయన తల్లి బెట్టీ ఫాక్స్ తొలి అధ్యక్షురాలు. టెర్రీ జీవితం ఆధారంగా ఒకటి కాదు, నాలుగు సినిమాలు వచ్చాయి. 1980, 1981లో కెనడా 'న్యూస్‌మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డులు అతణ్నే వరించాయి. అక్కడి ప్రభుత్వం 2005లో టెర్రీ చిత్రంతో డాలర్ నాణేన్ని విడుదల చేసింది. 2008లో నేషనల్ హిస్టారిక్ పర్సన్‌గానూ ఆయన్ను ప్రకటించింది. టెర్రీ స్ఫూర్తితో నేటికీ క్యాన్సర్ పరిశోధనలు జరుగుతున్నాయి. ఏటా అరవై దేశాల్లో 'టెర్రీ ఫాక్స్ మారథాన్' నిర్వహిస్తున్నారు. కుంగుబాటులో కూరుకుపోయిన ప్రతి ఒక్కరికీ టెర్రీ ఒక నిలువెత్తు స్ఫూర్తి శిఖరం. అన్నట్టు నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం!

– చైతన్య

## బాధ్యతాయుత ఏఐ కోసం...

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం మార్మోగుతున్న మాట కృత్రిమ మేధ (ఏఐ). విధుల్లో సమర్థతను, ఉత్పాదకతను ఏఐ పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు కృత్రిమ మేధ సాయంతో వ్యక్తులూ సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసే పెడపోకడలూ యథేచ్ఛగా సాగుతున్నాయి. అందువల్ల ఏఐను బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం ఎలాగన్న దానిపై ప్రధానంగా చర్చలు సాగుతున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో పలు దేశాలు ప్రత్యేక చట్టాలు చేస్తున్నాయి.

2016-24 మధ్య ఆయా దేశాల్లో ఏఐ ప్రస్తావనతో కూడిన ఎన్ని బిల్లులు శాసనాలుగా మారాయంటే..

| అమెరికా | రష్యా, పోర్చుగల్ | స్పెయిన్ | యూకే | ఫ్రాన్స్ | జపాన్, చైనా | కెనడా, ఆస్ట్రేలియా |
|---|---|---|---|---|---|---|
| 27 | 20 | 11 | 10 | 09 | 04 | 01 |

(ఆధారం: ఏఐ ఇండెక్స్ రిపోర్ట్-25)

## కాస్త పట్టుపడితే లాభాలే!

పట్టు పురుగుల పెంపకంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు ముందంజలో ఉన్నాయి. మిగతా రాష్ట్రాలు కొంతవరకు మల్బరీ సాగు చేస్తున్నా, ఆశించిన స్థాయిలో ఉత్పత్తి సాధించడం లేదు. దేశంలో 52,360 గ్రామాలకు చెందిన 97.6లక్షల కుటుంబాలు పట్టు పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. వాటి సంఖ్యను మరింత పెంచాలనే లక్ష్యంతో కేంద్ర సిల్క్ బోర్డు పలు రాయితీలు అమలు చేస్తోంది. రెండు ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఒక్కో యూనిట్ ఏర్పాటుకు రూ.7.50 లక్షలు ఖర్చవుతుందని కేంద్రం లెక్కేసింది. మల్బరీ తోట పెంపకం, నీటి పారుదల, పట్టుపురుగులు పెంచేందుకు షెడ్డు నిర్మాణం, పరికరాల కొనుగోలు, నిర్వహణ మొదలైన వాటికి ఆ నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. ఇందులో కేంద్రం తన వాటాగా 50 శాతం రాయితీ ఇస్తుండగా, ఆయా రాష్ట్రాలు నిధుల లభ్యతను బట్టి 25 శాతందాకా సబ్సిడీ అందిస్తున్నాయి. మిగతా పెట్టుబడి సొమ్మును రైతులే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు మరింత రాయితీ లభిస్తోంది.

### సాయం చాలక... ముందుకు సాగక...

ఒక ఎకరం ఉన్న రైతు కూడా పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఒక్కో పంట 32 నుంచి 45 రోజుల్లో పూర్తవుతుంది. ఎకరం భూమిలో మల్బరీ పెంపకంతో అయిదుగురికి ఉపాధి లభిస్తుందని, జాగ్రత్తగా చేసుకుంటే ఏటా సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల ఆదాయం పొందవచ్చని పట్టుపరిశ్రమ అధికారులు చెబుతున్నారు. మార్కెట్లో కిలో పట్టు గూళ్లకు ప్రస్తుతం రూ.450 నుంచి రూ.600 వరకు ధర పలుకుతోందని, ఏటా 8 నుంచి 10 పంటలు పండించవచ్చని సూచిస్తున్నారు. ఎంతలేదన్నా 40-60 కిలోల దిగుబడి వస్తుంది. వంద పట్టు గూళ్ల నుంచి 80-100 కిలోల దిగుబడి సాధిస్తున్న వారు కూడా ఉన్నారు. ఇన్ని లాభాలున్నా రైతులు ముందుకు రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలు సరిపోవడం లేదని, షెడ్డు నిర్మాణం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయని రైతులు చెబుతున్నారు. ప్రారంభ పెట్టుబడి ఎక్కువగా ఉండటంతో పట్టుపురుగుల పెంపకంపై మక్కువ ఉన్నా ధైర్యం చేయలేక పోతున్నారు. రాయితీ మొత్తాన్ని పెంచి, పట్టుగూళ్లకు మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. ఏ పంటలో అయినా రైతులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే అందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నిపుణుల సలహాలు, సూచనలు అవసరం. కానీ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పట్టు పరిశ్రమ శాఖలో ఉద్యోగుల ఖాళీలు అధికంగా ఉన్నాయి. ఏపీలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, తెలంగాణలో సమస్య తీవ్రంగా ఉంది. గడిచిన మూడు దశాబ్దాలుగా ఆ శాఖలో ఉద్యోగుల నియామకం లేకపోవడంతో కొన్నిచోట్ల రెండు జిల్లాలకు ఒక అధికారి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరమైన పథకాలు ఉన్నా, వాటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లేవారు కరవయ్యారు.



మన దేశంలో పట్టు వస్త్రాలకు ఆదరణ అధికం. కానీ దేశీయ అవసరాలకు తగినంత పట్టుదారం స్థానికంగా ఉత్పత్తి కావడం లేదు. చైనా, వియత్నాం వంటి దేశాలపై ఆధారపడక తప్పడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర సిల్కు బోర్డు పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టే రైతులను అనేక రాయితీలతో ప్రోత్సహిస్తోంది. కానీ, ఈ అవకాశాన్ని కొంతమందే సద్వినియోగం చేసుకుంటున్నారు. సన్నకారు రైతులూ దీన్ని అందిపుచ్చుకోవాలి.


### చిన్న, సన్నకారు రైతులకు మేలు

సంప్రదాయ పంటలతో సాగు గిట్టుబాటు కావడం లేదని ఆందోళన చెందుతున్న సన్న, చిన్నకారు రైతులకు పట్టుపురుగుల పెంపకం వరంలాంటిదే. తక్కువ సాగుభూమి ఉండి, నీటి వనరుల కొరత ఉన్నవారు పట్టు పురుగుల పెంపకం చేపడితే స్వల్ప సమయంలోనే మంచి ఆదాయం దక్కుతుంది. కుటుంబ సభ్యులందరికీ ఉపాధి లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్ర స్థాయిలో నెలకొన్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటే ఇంకా మెరుగైన ఫలితాలు వస్తాయి. పట్టు గూళ్లను అమ్ముకునేందుకు అవసరమైన సేకరణ కేంద్రాలను పెంచాలి. క్షేత్ర స్థాయిలో రైతాంగంలో నెలకొన్న అపోహలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలి. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను తీసుకుంటే సాగు పెరిగే అవకాశం ఉంది.

– రాజు గాగిల్లాపురం

## ఓ మంత్రి.. కొడుకులు!

పీఠాపురం రాజ్యానికి వీరవర్మ రాజు.. భానుడు మంత్రి. ఒకరోజు సభ సమయం అయిపోతున్నా మంత్రి కోటకు రాలేదు. దాంతో వీరవర్మ చాలా కోపంగా ఉన్నాడు. చివరికి సభ ముగిశాక చాలాసేపటికి వచ్చాడు మంత్రి. 'ఎందుకు ఇంత ఆలస్యంగా వచ్చావు? చేసే పని మీద ఆమాత్రం గౌరవం లేదా?' అని అడిగాడు రాజు. 'అదేం కాదు మహారాజా! ఇంట్లో మా అబ్బాయిలతో చిన్న పని పడింది. అందుకే!' బదులిచ్చాడు మంత్రి. 'ఏంటా పని? వివరంగా చెప్పు' అన్నాడు రాజు. 'నా పెద్ద కొడుకు ఒక రెండంకెల సంఖ్య రాశాడు. దానికి పైవైపు పెద్దవాడు.. కిందివైపు చిన్నవాడు కూర్చున్నారు. ముందుగా పెద్దవాడు నన్ను పిలిచి.. ఈ సంఖ్య ఎంతని అడిగాడు. సమాధానం చెప్పాను. తరవాత చిన్నవాడు తనవైపు పిలిచి అడిగాడు. అప్పుడూ జవాబు చెప్పాను. 'అదేంటి నాన్నా.. ఒకే సంఖ్యను రెండు విధాలుగా చెప్పారేంటని అడిగారు ఇద్దరూ. అప్పుడు వాళ్లకు ఏం చెప్పాలో నాకు అర్థంకాలేదు' అన్నాడు మంత్రి. అదంతా విన్న వీరవర్మ.. 'ఒకే సంఖ్యను రెండు రకాలుగా చెప్పేది ఏమై ఉంటుందా?' అని ఆలోచనలో పడ్డాడు. 'ఆ సంఖ్య ఏంటో మీకూ తెలుసుకోవాలని ఉంది కదా మహారాజా! కాస్త కష్టంగానే ఉంటుంది. కానీ నేను ఒక సలహా ఇస్తాను. దాని ఆధారంగా సమాధానం చెప్పగలరేమో ఆలోచించండి.. వాళ్లిద్దరికీ చెప్పిన సంఖ్యల మధ్య భేదం.. పెద్దవాడికి చెప్పిన సంఖ్యలో మూడోవంతు ఉంటుంది. చిన్నవాడికి చెప్పిన సంఖ్యలో సగం ఉంటుంది' అని చెప్పాడు మంత్రి. కాసేపటికి.. 'ఆ సంఖ్య ఏంటో నాకు అర్థమైంది' అని నవ్వుతూ జవాబిచ్చాడు రాజు. ఇంతకీ పెద్దబ్బాయి రాసిన సంఖ్య ఏంటంటే.. 99. చిన్నబ్బాయికి రాజు చెప్పిన సమాధానం 66. నేస్తాలూ.. ఈ కథని మీ స్నేహితులతో చెప్పి.. సరదాగా ఈ సంఖ్యల ఆట ఆడుకోండి సరేనా!



హాయ్! బుజ్జీ!!

– బి.వి. పట్నాయక్

### రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.

| | | | |
|---|---|---|---|
| జల | వడ్డీ | కొబ్బరి | పట్టాలు |
| రాజు | పురుగు | తెర | గట్టు |
| ఆలు | పువ్వు | కొండ | చక్ర |
| కాయ | మృగ | కలువ | పాతం |
| రైలు | గడ్డ | అడ్డు | పట్టు |

# దారిచూపు దేవుళ్లు..


రఘుశేఖర్‌సుదర్శి


నారాయణ

అప్పటి వరకు చీకటి నిండిన వారి బతుకుల్లో వెలుగులు నింపుతూ తమ వంతు సామాజిక బాధ్యత నిర్వహిస్తున్నారు. నేత్ర దానంపై విస్తృత ప్రచారం చేస్తూ.. చనిపోయిన వారు మళ్లీ ఈ లోకాన్ని ఎలా చూస్తారో అవగాహన కల్పిస్తున్నారు.. నాగాయలంకలోని సుదర్శి మానవత సేవా సంస్థ నిర్వాహకులు. సామాజిక కార్యకర్తలు తలశిల రఘుశేఖర్, కనగంటి నారాయణలు.. 2008లో సుదర్శి మానవత సేవా సంస్థను ప్రారంభించారు. నాటి నుంచి నేత్రా దానంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ.. మృతుల బంధువులను ఒప్పించి.. చనిపోయిన వారి నేత్రాల నుంచి కార్నియాలు సేకరిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రుల సహకారంతో నేత్ర దానం కార్యక్రమాన్ని ప్రజల్లో తీసుకెళుతున్నారు. వారి కృషితో నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు తదితర మండలాలకు చెందిన ప్రజలు స్ఫూర్తి పొంది.. స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. ఇప్పటి వరకు 252 జతల కార్నియాలను సేకరించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించి వెలుగులు నింపుతున్నారు. దాతల సహకారం, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 5వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 7200 మందికి శుక్లాల శస్త్రచికిత్సలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.


సేకరించిన కార్నియా (పాతచిత్రం)

- నాగాయలంక, న్యూస్‌టుడే

## పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్ల తాత్కాలిక ప్రాధాన్య క్రమం వెల్లడి

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం:** రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ (డిగ్రీ/డిప్లొమా) యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న 2170 మంది అభ్యర్థుల తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం వెల్లడించింది. అభ్యంతరాలుంటే 5న ఉదయం 11 గంటల్లోగా తెలియజేయాలని, వివరాలకు 90007-80707లో సంప్రదించాలని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

# దందా హద్దు మీరుతోంది!

## రీసర్వేలో సర్వేయర్ల వసూళ్లు

ఈనాడు, అమరావతి

▶ కూచిపూడి పరిధిలోని ఓ సచివాలయ సర్వేయర్ వైకాపా పాలనలో రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటి తప్పులు సరిచేసేందుకు దాదాపు 20 మంది రైతుల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేశారు. రేపు మాపంటూ మాయ చేసి గుట్టుచప్పుడు కాకుండా పామర్రు మండలంలోని మరో సచివాలయానికి బదిలీ చేయించుకుని జారుకున్నారు. దీంతో డబ్బులిచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు.

▶ గన్నవరం మండలంలోని ఓ సచివాలయ సర్వేయర్ ఓ రైతుకు పక్క రైతుకు చెందిన 10 సెంట్లు భూమి వచ్చేలా హద్దులు నిర్ణయించారు. ప్రతిఫలంగా రూ.10వేలు తీసుకున్నారు. సాధారణంగా ఏ సర్వే చేయాలన్నా ఆ ఉద్యోగికి ముడుపులు ఇవ్వాల్సిందే.

ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల అమ్యామ్యాల దందా హద్దు మీరుతోంది. వైకాపా పాలనలో జరిగిన రీసర్వేలో భారీగా మాయ చేసిన అనుభవాలతో తాజా రీసర్వేలోనూ రెచ్చిపోతున్నారు. రైతుల మధ్య వారే హద్దుల వివాదాలు సృష్టించి ముడుపులు తీసుకుని పరిష్కరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, రైతుల అవగాహనా రాహిత్యం వీరికి కాసులు పండిస్తోంది.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఓ మండలం, కొందరు సచివాలయ సర్వేయర్లు కుమ్మక్కై వసూళ్లు చేస్తున్నారు. ఎల్పీఎం నంబర్ సబ్‌డివిజన్ చేయాలంటే రూ.8వేలు, రూ.5వేల వరకు ముట్టజెప్పాలి. వివాదాలుంటే ముడుపులు మోతాదు పెరుగుతుంది. గంపలగూడెం మండలంలో ఇద్దరు సచివాలయ సర్వేయర్లు ఇదే తరహా దందా చేస్తున్నారు. రీసర్వేలో వచ్చిన వివాదాలకు ఒక్కో రైతు నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారు

### రాచమర్యాదలు చేయాల్సిందే..

సచివాలయం, మండల సర్వేయర్లదే దాదాపు దందా చేస్తున్నారు. ఓ వైపు రీసర్వే లోపాలు..మరోవైపు సాధారణ సర్వేలోనూ వసూలు చేస్తున్నారు. కొందరు మండల సర్వేయర్లు సచివాలయ సర్వేయర్లను అడ్డం పెట్టుకుని రైతుల సొమ్ము స్వాహా చేస్తున్నారు. సాధారణంగా సర్వే దరఖాస్తు చేసే సమయంలో సర్వేయర్ రావడం దాదాపు అసాధ్యమైంది. ముందుగా బేరం తెగ్గొట్టేశాకే అయ్యవారు అడుగుపెడతారు. హద్దులు తెగ్గొడతారు. ఏదైనా సర్వే చేయాలంటే దాదాపు మంది సర్వేయర్లకు రూ.5వేలు ఇచ్చి రాచమర్యాదలు చేసి పంపాల్సిన పరిస్థితి. దీనిపై ఎన్టీఆర్, కృష్ణా ఏడీ సర్వే మోహన్‌రావు, జోషీలా మాట్లాడుతూ..ఈ అంశంపై పరిశీలించి వసూళ్లకు పాల్పడిన సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బీచ్.. అభివృద్ధికి అడుగులు

## 20 ఎకరాల్లో రిసార్టులకు భూకేటాయింపు
## తీరంలో రూ.157 కోట్ల పెట్టుబడి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. భూమి కేటాయించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.157.33 కోట్ల అంచనా వ్యయంతో మంగినపూడి తీరం వద్ద లార్జ్ అమ్యూజ్‌మెంట్ పార్కు కమ్ రిసార్టులు నిర్మించేందుకు మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థకు 20 ఎకరాల భూమి కేటాయించినట్లు పర్యాటక శాఖ తెలిపింది. రిసార్టుల ప్రాజెక్టులో 30వేల చదరపు అడుగుల్లో అమ్యూజ్‌మెంట్ పార్కు, 25వేల చ.అ. వాటర్ పార్కు, రైడ్స్, 150 గదులు, ఐదు రెస్టారెంట్లు, బార్.. 16వేల చ.అ. కన్వెన్షన్ సెంటర్, వెల్‌నెస్ స్పాలు, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం అతిత్వర వినోద కేంద్రానికి నెలవుగా మారనుందన్న ఆశాభావం అధికారుల్లో వ్యక్తం అవుతోంది.



**83 ఎకరాలకు ప్రతిపాదనలు..** మంగినపూడి తీరంలో పర్యాటకాభివృద్ధికి 83 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఇందులో రోడ్లు పోను మిగిలిన 64 ఎకరాల్లో రిసార్టులు, రెస్టారెంట్లు, స్పాలు, గదులు, పలు భవనాలు, హోటళ్లు తదితర ప్రైవేటు, ప్రభుత్వ సౌకర్యాల కల్పన కోసం భూమి కేటాయించేందుకు అనుమతించాలని కోరారు. ఈ ఏడాది మసులా బీచ్ ఫెస్టివల్‌కు మంచి గుర్తింపు రావడంతో మంత్రి కొల్లు ప్రత్యేక దృష్టి తీసుకెళ్లారు.

'బీచ్ పర్యాటకానికి మంగినపూడి అనుకూలమైంది. పలు నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు భూమి కేటాయింపు అనుమతులపై ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాం. త్వరలో తీరంలో సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయి' అని కలెక్టర్ బాలాజీ తెలిపారు.

### రాజధానికి ఇదే దగ్గర..

రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాలకు అతి దగ్గర సముద్ర తీరం. బీచ్ ఫెస్టివల్, కార్తీక స్నానాల సమయంలో లక్షల్లో వచ్చే పర్యాటకులతో బీచ్ కిటకిటలాడుతుంది. వారాంతాల్లోనూ పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేస్తారు. సరైన వసతులు లేకపోవడంతో కొద్దిసేపు ఉండి వెళ్లిపోతున్నారు. త్వరలో స్నానపు గదులు, విశ్రాంతి భవనాలు, హోటళ్లు వంటి వసతులు సమకూరనుంది.

# 5న తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల సమావేశాలు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఈ నెల 5న విద్యా సంస్థల్లో మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రగతి నివేదికలపై ముఖాముఖీగా చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడంపై దృష్టి సారించనున్నారు. పిల్లలు పరీక్షలు ఎలా రాశారు, వారు సాధించిన పురోగతి, పొందిన ఫలితాలు ఇవన్నీ ప్రోగ్రెస్ కార్డులో ఉంటాయి. మార్కులే కాకుండా విద్యాభివృద్ధి, శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు సైన్స్ ప్రయోగ సామర్థ్యాలు వంటివి నమోదు చేస్తారు. ఇందులో ఎగ్జిబిషన్లు, తరగతి గదుల సందర్శన, కెరీర్ గైడెన్స్‌తో పాటు మనో వికాసానికి సంబంధించి వీడియోల ప్రదర్శన తదితరాలు ఉంటాయి.'మెగా పీటీఎంకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని, తల్లిదండ్రులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని' కలెక్టర్ లక్ష్మీశ కోరారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆయన అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యాధికారి ప్రభాకర్, డీఈవో సుబ్బారావు, సమగ్రశిక్షా ఏపీసీ ఎం.రజనీకుమారి పాల్గొన్నారు.

# పల్లె సిగలో.. కొత్త పంచాయతీలు

## పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటుకు కసరత్తు

ఈనాడు, అమరావతి

పల్లె ప్రగతికి పట్టుకొమ్మలైన పంచాయతీ వ్యవస్థలో కీలక మార్పునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉండి..పాలనా సౌలభ్యం లేని ప్రాంతాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు సమీప పంచాయతీల్లో విలీనం చేయనున్నారు. దీని వల్ల ప్రజలకు పాలనా సౌలభ్యంతో పాటు నిధుల కేటాయింపు, పర్యవేక్షణలో ప్రాధాన్యం ఉంటుంది.

✦ అవనిగడ్డ పంచాయతీలోని వసుమట్ల 2 కి.మీ దూరంలో పులిగడ్డలో కలిసి ఉంటుంది. దీన్ని పులిగడ్డలో కలిపితే పాలనా సౌలభ్యం ఉంటుంది. నాగాయలంక మండలం పక్కపట్లవారిపాలెం పంచాయతీలో దళితవాడ 2 కి.మీ దూరంలో ఉంటుంది. అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెంలో కలిసి ఉంటుంది. ఆ పంచాయతీలో విలీనం చేస్తే మేలన్న వాదనలు ఉన్నాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లి పంచాయతీలో కుమ్మరిరేవు గ్రామం ఉంది. పంచాయతీకి వెళ్లాలంటే పడవలో రేవు దాటి వెళ్లాలి. మోపిదేవిలో కలిసి ఉండే ఈ గ్రామాన్ని ఆ పంచాయతీలో కలిపేస్తే వెసులుబాటు ఉంటుంది.

✦ జగ్గయ్యపేట మండలం అన్నవరం పంచాయతీలోని త్రిపురవరం 6 కి.మీ దూరంలో ఉంది. దీంతో పర్యవేక్షణ కొరవడుతోందని గ్రామస్థుల నుంచి అసంతృప్తి ఉంది. వెయ్యికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి. జయంతిపురం పంచాయతీలోని రావిరాల ఏడు కి.మీ దూరంలో ఉంది. వెయ్యికి పైగా జనాభా ఉంది. పంచాయతీకి దూరంగా ఉండడం పెద్ద సమస్యగా మారింది. బండిపాలెం పంచాయతీ పరిధిలోని గుండబోయినపాలెంలో వెయ్యి మంది జనాభా ఉన్నారు. 4 కి.మీ దూరంలో ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నందిగామ మండలం పెద్దవరం పంచాయతీలోని చెరుకుంపాలెంలో 5వేల జనాభా ఉంది. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చందర్లపాడులో కునాయపాలెం పంచాయతీలోని బెల్లంకొండవారిపాలెం, వేలూరు పంచాయతీలోని రామచంద్రాపురం, గుడిమెట్ల పంచాయతీలోని రాయన్నపాలెం, వీరులపాడు మండలం కొణతాలపల్లిలోని పల్లంపల్లి, చెన్నారావుపాలెం పరిధిలోని తిమ్మాపురం, జుజ్జూరులోని రంగాపురం గ్రామాలను సైతం పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు పెడుతున్నారు.

కొత్తగా పంచాయతీల ఏర్పాటు, విలీనంపై ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేయాలంటే అక్కడి

### ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయ్..

ఆదాయం, విస్తీర్ణం, జనాభా నమోదు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15-20 వరకు కొత్త పంచాయతీల ఏర్పాటు, 40 వరకు విలీనం చేయాలన్న అభ్యర్థనలు ఉన్నాయి.



## ఆలోచన బాగు.. ప్రమాదాలను ఆపు..

జాతీయ రహదారిపై మరమ్మతులు, ఇతరత్రా పనులు చేసే సమయంలో పనివారు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఆ సమయంలో వాహనదారులను పక్కగా వెళ్లమని సూచించడం కోసం ఒకరిని ప్రత్యేకంగా పెడతారు. కొన్నిసార్లు అలా విధుల్లో ఉన్న వారూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వీటిని నివారించేందుకు జూపూడి వద్ద ఇలా ఓ మనిషిని పోలిన బొమ్మకు దుస్తులు, హెల్మెట్, షూ వేసి నిలబెట్టారు. బాగుంది కదూ ఆలోచన. -ఈనాడు, అమరావతి

# నిఘా నేత్రం.. ఆగితే అప్రమత్తం

✧ విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో కొత్త ప్రయోగం
✧ త్వరలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి

విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాలను బిగించారు. మొరాయిస్తున్న నిఘా నేత్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయడం సమస్యగా మారింది. దీనికి విజయవాడ పోలీసులు సాంకేతికతతో చెక్ పెట్టబోతున్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్యాష్ బోర్డు రూపొందించారు. దీనికి అన్ని నిఘా నేత్రాలను అనుసంధానం చేశారు. పరీక్షలు సత్ఫలితాలు ఇవ్వడంతో పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చే ఆలోచనలో సీపీ రాజశేఖరబాబు ఉన్నారు. త్వరలో దీనిని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు.

### ఆర్టీఎంపీ ద్వారా..

ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఇటీవలి కాలంలో కమిషనరేట్‌లో దాదాపు 10వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాలు, విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలు, కాలనీల్లో ఇవి ఏర్పాటయ్యాయి. విద్యుత్తు సరఫరా సమస్యతో ఆగిపోయేవి కొన్ని అయితే.. ఇంటర్నెట్ కనెక్షన్ సరిగా లేక మొరాయించేవి మరికొన్ని ఉంటున్నాయి. కేసుల దర్యాప్తులో సీసీ కెమెరా దృశ్యాల కోసం వెళ్తే అసలు విషయం వెలుగుచూస్తోంది. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జబ్బిక్స్ అనే సాఫ్ట్‌వేర్‌లో డీహెచ్‌ఎంఎస్ (డివైజ్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టం) పేరుతో డ్యాష్ బోర్డు రూపొందించారు. ప్రతి కెమెరాకు ఉండే నంబరు, అక్షాంశ, రేఖాంశాలను అందులో నమోదు చేస్తున్నారు. ఆర్టీఎంపీ (రియల్ టైమ్ మెసేజ్ ప్రొటోకాల్) ద్వారా నిర్దేశిత సమయం ప్రకారం దానంతట అదే ప్రతి సీసీ కెమెరా పనితీరును సాఫ్ట్‌వేర్ విశ్లేషిస్తుంది. వాటి ఫలితాలను పోలీసు అధికారులకు అందిస్తుంది. ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినవైతే వారికే అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. సాంకేతిక ఇబ్బందులను సరిచేసేందుకు ప్రతి సబ్‌డివిజన్‌కు టెక్నీషియన్‌ను నియమించనున్నారు.


డీహెచ్‌ఎంఎస్ డ్యాష్ బోర్డ్

### 6వేల సిమ్‌ల వినియోగం

విజయవాడ నగరంలో ఓ ప్రైవేటు సంస్థకు చెందిన ఫైబర్ నెట్ ద్వారా సీసీ కెమెరాలను అనుసంధానించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధానత కోసం ప్రతి సీసీ కెమెరాలో సిమ్‌లు వేశారు. ఇందుకోసం దాదాపు 6వేల కొత్త సిమ్‌లు తీసుకుని యాక్టివేట్ చేశారు. ప్రతి కెమెరాలో రికార్డింగ్ కోసం మెమొరీ కార్డు వేయనున్నారు. పెట్రోలింగ్‌లో వాడే ట్యాబ్‌లు, డ్రోన్లనూ డ్యాష్ బోర్డుకు అనుసంధానించారు. వీటి నిర్వహణకు ప్రతి నెలా రూ.10లక్షలు ఖర్చవుతుందని అంచనా. ప్రత్యేక నిధులకు ప్రయత్నించడం, లేదంటే స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించాలని యోచిస్తున్నారు.

# 4న బోటు విహారం

**భవానీపురం, న్యూస్‌టుడే:** కృష్ణానదిపై బోటులో ప్రయాణం చేస్తూ కవులు, రచయితలు వారి అభిప్రాయాలను తెలియజేసే కార్యక్రమాన్ని ఈనెల 4న నిర్వహించనున్నారు. భవానీపురంలోని హరిత బోటింగ్ పాయింట్ వద్ద నుంచి బోటు గురువారం సాయంత్రం ప్రారంభం కానుంది. విజయవాడ కనకదుర్గమ్మ చారిత్రక నేపథ్యాన్ని రచయిత్రి పద్మ వివరించనున్నారు. విశ్రాంత ఐఏఎస్ వాడ్రేవు చినవీరభద్రుడు రాష్ట్రంలోని గ్రామ దేవతల మూలాలపై విశ్లేషణ చేయనున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

# సృజన.. నవ్య ఆవిష్కరణ

## యాప్‌లు రూపొందించిన నగర విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

సమాజానికి ఉపయోగపడే అనేక ఆవిష్కరణలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నగర విద్యార్థులు. వీరు ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా యాప్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.


యాప్‌లు ప్రదర్శిస్తున్న షెహనాజ్, రిషిక్, కృష్ణ ప్రియాంక, పావని, తనూజ సాయి

### దళారుల మోసాలకు అడ్డుకట్ట

ఆరుగాలం కష్టనష్టాలు ఓర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. నకిలీ విత్తనాలు కొని వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఆన్‌లైన్ వేదికగా అమ్ముకోవడానికి ఓ సరికొత్త యాప్ రూపొందించింది కృష్ణ ప్రియాంక. దీంతో పాటు సాగుకు భూసార పరీక్షల నుంచి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు ఒకే వేదికలో అందేలా అగ్రి కనెక్ట్ యాప్ తయారు చేసింది.

### చేపల అమ్మకం.. కొనుగోలుకు..

మత్స్యకారులతో పాటు తాజా చేపలు కావాలనుకునే వారికి ఉపయోగపడేలా అక్వా కనెక్ట్ పేరుతో యాప్ రూపొందించింది షెహనాజ్. ఇందులో మత్స్యకారులు వారి ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. దీంతో పాటు తాజా చేపలు కొనుగోలుదారులకు అందించే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అన్ని తరగతుల ప్రజలకు ఉపయోగపడుతుంది. వ్యాపారులు, కొనుగోలుదారులకు శ్రమ తగ్గిస్తుంది.

### ఇంటి నుంచే ఆదాయం వచ్చేలా ...

నైపుణ్య మార్పిడి మహిళా సాధికారత యాప్ ద్వారా మహిళలు వారి నైపుణ్యాలను పెంపొందించుకునేలా తనూజ సాయి యాప్ రూపొందించింది. మహిళలు వారిలోని ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ యాప్ దోహదపడుతుంది. నైపుణ్యాభివృద్ధికి ఉచితంగా ఈ యాప్ దోహదం చేస్తుంది. ముఖ్యంగా గృహిణులకు ఎంతో ఉపయోగం.

### పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే..

ఏదైనా సమస్య మీద పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే గంటల తరబడి పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాలి. ఈ తరుణంలో నిమిషాల వ్యవధిలో ఫిర్యాదు పోలీసులకు అందించేలా రిషిక్ యాప్ అభివృద్ధి చేశాడు. క్షణాల వ్యవధిలో మనం ఉన్న చోట నుంచి పోలీసులకు ఫిర్యాదు ఆన్‌లైన్‌లో అందించ వచ్చుంటున్నాడు. ఫిర్యాదు వారికి అందగానే బదులు వచ్చేలా యాప్ రూపొందించాడు.

### వేడుకల నిర్వహణకు ఆందోళన వద్దు

ఏదైనా వేడుక చేయాలనుకుంటే ఎన్నో పనులు... ఒత్తిడి ఉంటుంది. ఆ ఇబ్బంది లేకుండా ఒకే యాప్ ద్వారా వేడుక పనులు చేసుకునేలా ఈవెంట్ హబ్ యాప్ రూపొందించింది పావని. పెళ్లిరోజు, పుట్టినరోజు, వివిధ సభలు, సమావేశాలు, ఇతర వేడుకలు నిర్వహించేందుకు ఈ యాప్ ఉపయోగ పడుతుంది. వేడుక నిర్వహణకు సరకులు, వస్తువులు, కూలీలు, నైపుణ్యం కలిగిన కార్మికులు ఒకే చోట లభిస్తారు. ఈ యాప్ ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో ఉంటున్న ప్రజలకు ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తుంది.

# 124 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ

## 16.32 లక్షల సంచులు సిద్ధం

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 149 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలోని 124 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైనట్టు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి.సతీష్ తెలిపారు. 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలన్నది లక్ష్యంగా ఉంది. దీనికి 18,75,000 గోనె సంచులు అవసరం. ప్రస్తుతం జిల్లాలో 16,32,950 గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని మంగళవారం తెలిపారు. తుపాను నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యం తడవకుండా 2,200 టార్పాలిన్లను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. జేసీ ఇలక్కియా నేతృత్వంలో అక్టోబరు 17 నుంచి ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రస్తుత సీజనులో ఇప్పటి వరకు 38,637.000 మెట్రిక్ టన్నుల సేకరించినట్టు వెల్లడించారు. 5,098 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రూ.77.96 కోట్లను 24 గంటల్లోగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు. గత సీజనులో నవంబరు నెల వరకు 19,947.120 మెట్రిక్ టన్నుల సేకరణ జరిగింది. ధాన్యం రవాణా నిమిత్తం 1,550 వాహనాలను సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు.

**గోనె సంచులు..**

| | |
|---|---|
| తిరువూరు | 9,44,900 |
| విజయవాడ | 4,42,250 |
| నందిగామ | 2,45,800 |

**వాహనాలు..**

| | |
|---|---|
| తిరువూరు | 787 |
| విజయవాడ | 345 |
| నందిగామ | 418 |

**కేంద్రాలు..**

| | |
|---|---|
| తిరువూరు | 53 |
| నందిగామ | 41 |
| విజయవాడ | 30 |



## రైతన్నకు క్షణమొక యుగం

ఈ చిత్రంలో ఆరబెట్టిన ధాన్యంపై ఆదమరిచి పడుకున్న కౌలు రైతు పేరు జంపన చంటి. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఈ రైతు 17 ఎకరాలు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశారు. మంచి దిగుబడితో పంట చేతికొచ్చిన సమయంలో తుపాను హెచ్చరికతో నాలుగు రోజులుగా రాత్రీపగలు పంటకు కాపు కాస్తున్నారు. -ఈనాడు, అమరావతి

# అపురూప కట్టడం.. అరుదైన రాజగోపురం!



దివిసీమ ప్రాంతం అవనిగడ్డలో చోళరాజుల కాలం నాటి లక్ష్మీనారాయణస్వామి ఆలయం నేటికీ చెక్కు చెదరక అపురూప కట్టడంగా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 106 అడుగుల పునాదితో నిర్మితమైన ఏడు అంతస్తుల రాజగోపురం(గాలిగోపురం) ఉన్న ఆలయంగా ఖ్యాతికెక్కింది. అప్పట్లో రవాణా సౌకర్యం లేనందున ఆలయ నిర్మాణానికి అవసరమైన కొండరాయిని విజయవాడ ప్రాంతం నుంచి కృష్ణానది ద్వారా పడవల్లో ఈ ప్రాంతానికి చేర్చినట్లు తెలుస్తోంది. వాటితో పలు శిల్పాలు చెక్కి రాజగోపురానికి అమర్చారు. గోపురం నుంచి ఆలయ ధ్వజస్తంభం వరకు తొమ్మిది పర్యాయాలు ప్రదక్షిణలు చేస్తే అనుకున్నవి నెరవేరతాయని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకుంటే సమస్త పాపాలు పోతాయని దివి వాసులు నమ్ముతారు. దేవాదాయ శాఖ అధ్వర్యంలో నడిచే ఆరాధన మాసపత్రికలో ఒక దశాబ్దం పాటు ముఖచిత్రంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయ రాజగోపురాన్ని ప్రచురించారు. మాస పత్రికకు అవనిగడ్డకు చెందిన ఆగమ పండితులు దీవి నరసింహాచార్యులు సంపాదకత్వం వహించడంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది.

- అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

# బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

**విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే :** బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ ఆటోడ్రైవర్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ విజయవాడలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బాలిక (15) ఒక కిరాణా దుకాణంలో పనిచేస్తోంది. 2021, జులై 21న తెల్లవారుజామున కంగారుగా ఇంటికి రాగా.. తల్లి ఏమైందని అడిగారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన వల్లెపు వసంతకుమార్ అనే ఆటోడ్రైవర్ తనను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని వెళ్లి ఎక్సెల్ ప్లాంట్ సమీపంలో అత్యాచారం చేశాడని చెప్పింది. తల్లి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ వి.వి.ఎస్.లక్ష్మీనారాయణ ఆటో డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గద్దం రాజేశ్వరరావు వాదించారు. మొత్తం అయిదుగురు సాక్ష్యులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ.. న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు చెప్పారు. సదరు జరిమానా నుంచి బాధిత బాలికకు రూ.5వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

# స్క్రబ్ టైఫస్‌తో ఆందోళన వద్దు

**విజయవాడ పాతాసుపత్రి:** స్క్రబ్ టైఫస్‌తో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని మంగళవారం తెలిపారు. ఎలీసా పరీక్షలతో సహా మందులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

# విజ్ఞానం.. నూతన ఆవిష్కరణలకు దోహదం

- అందుబాటులోకి ఆధునిక ప్రయోగశాల
- సందర్శిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ప్రయోగశాలల సందర్శన విద్యార్థుల్లో ప్రయోగాత్మక విద్యపై ఆసక్తిని పెంచుతుంది. బట్టీ చదువుకు దూరంగా వాస్తవ అంశాలపై ఆలోచన రేకెత్తిస్తుంది. కళ్లెదుట ప్రత్యక్షంగా చూసింది మెదడులో నిక్షిప్తమై అది పరీక్షల్లో గుర్తు తెచ్చుకుని స్పష్టంగా రాసేందుకు ఉపకరిస్తుంది. పాఠ్యాంశాల్లో చదివింది నేరుగా ప్రయోగశాలలో చూస్తే గుర్తుండిపోతుంది. అందుకే ల్యాబ్‌ల్లో అధిక సమయం ఉండేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతారు. కానీ జిల్లాలో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు లేవు. పుస్తకాల్లో తరచూ వినిపించే పరికరాల పేర్లు వల్లె వేయడం తప్పిస్తే వాటిని నేరుగా చూసిన అనుభవం కూడా చాలా మందికి లేదు. ఈ లోటును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో తీరుస్తున్నారు.

* పాఠ్యాంశాలపై ఆసక్తి.. పదో తరగతి పరీక్షలకు సమయం సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు శాస్త్రవిజ్ఞానం పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు వీలుగా ఎన్టీఆర్ జిల్లా పరిధిలో హ్యాండ్స్ ఇన్ సైన్స్ పేరిట సైన్సుల్యాబ్ సందర్శన నిర్వహిస్తున్నారు. భౌతిక, రసాయన, జీవశాస్త్రాల్లోని అనేక అంశాలపై అత్యాధునికమైన సాంకేతికతతో కూడిన వందకు పైగా కంప్యూటర్లతో ప్రత్యేక ల్యాబ్‌ను విజయవాడ కేబీఎన్ కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ ల్యాబ్‌లోని సౌకర్యాలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు కూడా వినియోగించుకునేందుకు కళాశాల యాజమాన్యం అంగీకరిస్తూ పాఠశాల విద్యాశాఖకు ఓ లేఖ రాసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతగా తమ సమ్మతిని తెలియజేయడంతో ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారులు సైన్సు ల్యాబ్‌లు లేని 54 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులను కేబీఎన్ కళాశాలకు పంపుతున్నారు. సుమారు మూడు గంటలు వివిధ అంశాలపై ప్రయోగాత్మక విద్యను నేర్చుకునేలా అవకాశం కల్పించారు. దీంతో రోజుకు మూడు, నాలుగు పాఠశాలల నుంచి విద్యార్థులు ల్యాబ్‌ను సందర్శిస్తున్నారు. ఇక్కడి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పదో తరగతి సిలబస్‌లోని భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రాల్లోని ప్రయోగాలు, వివిధ ఆసక్తికరమైన అంశాలను ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా చూపించి.. ఆయా పరికరాలు, ఫలితాలను చూపించి వివరిస్తున్నారు.


వివరిస్తున్న కేబీఎన్ కళాశాల విద్యార్థిని

### విజ్ఞానాన్ని పెంచుకోవడానికి..


పాఠ్య పుస్తకాల్లో చదివిన విషయాలను ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా చూస్తే విద్యార్థులకు స్పష్టంగా అర్థమవుతాయి. తద్వారా విజ్ఞానం పెంపొందుతుంది. పదో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెరగడానికి ఉపయోగపడుతుంది. కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు.

-యు.వి.సుబ్బారావు, డీఈవో

### పలు అంశాలపై అవగాహన..


భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అందులోని అంశాలు ఎలా ఉంటాయో తెలియదు. ల్యాబ్‌లో వాటిని చూశాం. కంప్యూటర్లు ఎలా ఓపెన్ చేయాలి.. అవి పనిచేసే విధానం తెలుసుకున్నాం. -కీర్తి, పదో తరగతి విద్యార్థిని

# నీటి డిమాండ్.. సరఫరాల మధ్య అంతరాన్ని తగ్గిద్దాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాగునీటి డిమాండ్, సరఫరాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, భూ ఉపరితలంలో లభించే నీరు, భూగర్భ జలాల సమన్వయ వినియోగం ద్వారా సమాన, సమర్థవంతమైన పంపిణీకి కృషి చేయాలని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ (ఎన్.ఎస్.పి. పీసీ) ఉపాధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సూచించారు. పంట క్యాలెండర్లు, వారా బందీ అమలులో సహకరించడం, జల వివాదాల పరిష్కారం, నేల, నీటి నాణ్యతను అంచనా వేయడం అంశాలు ముఖ్యమని వివరించారు. ఉమ్మడి కృష్ణా ఎన్.ఎస్.పి. పీసీ పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు బాధ్యతలను పెంపొందించడంపై, నగరంలోని జలవనరుల శాఖ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్ర భవనంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విస్సన్నపేట సర్కిల్ ఎస్ఈ ఎం.ఆర్.మొహిద్దీన్ అధ్యక్షత వహించారు. ఎన్.ఎస్.పి. పీసీ ఛైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ.. పీసీ పరిధిలో ఆయకట్టు పెంపుదలపై దృష్టిపెట్టాలని సూచించారు. నీటి సంఘాల అధ్యక్షులకు, డీసీ ఛైర్మన్లకు అప్పగించిన పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ, వేదికపై కోట వీరబాబు, మొహిద్దీన్, నాగమల్లేశ్వరరావు తదితరులు

### లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు

ఎస్ఈ మొహిద్దీన్ మాట్లాడుతూ.. నీటి నిర్వహణను మెరుగు పరచడానికి తొమ్మిది సబ్ డివిజన్ల పరిధిలో పొరుగు సేవల కింద 90 మంది లస్కర్లను (కళాసులను) నియమించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. వాగులపై చెక్ డ్యాంలను నిర్మించడం, సాగునీటి చెరువులు, కాల్వల్లో పూడిక తీత తదితర నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈఈలు కె.రామదాసు, కె.కిశోర్, డీఈఈలు, ఏఈఈలు, డీసీ ఛైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఎం.ఎస్.ఎం.ఈ యూనిట్లకు సహకారం అందించండి

పటమట, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట ఎం.ఎస్.ఎం.ఈ భూ కేటాయింపులో సహకారం అందించాలని.. ఎన్టీఆర్ జిల్లాను పరిశ్రమల ప్రధాన హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. మంగళవారం దిల్లీ పర్యటనలో భాగంగా పార్లమెంట్‌లోని తెదేపా పార్లమెంటరీ కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేటలో ప్రతిపాదించిన ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ప్రాజెక్టుకు సంబంధించి పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎం.ఎస్.ఎం.ఈ పార్కులో సుమారు 826 ఎకరాల్లో పలు విభాగాల్లో 198 యూనిట్ల స్థాపనకు రూ.2,872 కోట్ల పెట్టుబడితో 57 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ముందుకొచ్చిందని వివరించారు. ప్రాజెక్టుకు అనుకూలమైన 826 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. అసోసియేషన్, జిల్లా అధికారుల సహకారంతో ప్రాజెక్టు ప్రారంభ దశలు పూర్తి చేసుకుని కీలకదశకు చేరుకుందని వెల్లడించారు. ప్రాధాన్యం గుర్తించి సహకారం అందించాలని మంత్రిని కోరారు. మంత్రి వివరాలు తెలుసుకుని సహకారం అందిస్తానని భరోసా ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు.


మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శివనాథ్

# భవానీ భక్తులకు ఇబ్బందులు కలగనీయొద్దు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో నాణ్యతా లోపాన్ని సహించమని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు లక్షల మంది భవానీ దీక్షాధారులు అమ్మవారి సన్నిధిలో ఇరుముడి సమర్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హోమగుండాల ఏర్పాటు, ప్రసాదాల పోటు, ఘాట్ల వద్ద క్లోక్ రూమ్స్, తాత్కాలిక కేశఖండన శాల, క్యూలైను ఏర్పాటు పనులను దీక్షల విరమణకు ముందస్తు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, డీఈలు అశోక్, రవీంద్ర పాల్గొన్నారు.


క్యూలైన్ పనులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఈఈ రాంబాబు

# నేను రాస్తేనే ఫైనల్ అనుకోవద్దు

## క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టర్ సూచన

మైలవరం, న్యూస్‌టుడే: ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని, నేను రాస్తేనే ఫైనల్ అనే మనస్తత్వం వద్దని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ క్షేత్రస్థాయి అధికారులను సూచించారు. కొంతమంది నేను చెబితేనే అవుతుందన్న ధోరణిలో ఉంటున్నారని, అది సరికాదని సుతిమెత్తగా హెచ్చరించారు. నియోజకవర్గ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను మంగళవారం స్థానిక ఎస్వీఎస్ కల్యాణమండపంలో నిర్వహించారు. అన్ని మండలాల నుంచి వందలాది మంది ప్రజలు పోటెత్తగా, సాయంత్రం వరకు సుమారు 600 వరకు వినతులు అందాయి. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ కార్యక్రమంలో దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలు, రీసర్వేలో భూముల, భూ వివాదాలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయని వివరించారు. న్యాయ అర్జీలన్నవి మినహా..ఇతర అర్జీలను వారం నుంచి 2 నెలల వ్యవధిలోనే పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులను ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అయినా పరిష్కారమవకపోతే తనకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. తమకొచ్చే ఫిర్యాదులపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సైతం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇక మీదట వారానికో నియోజకవర్గంలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు అర్హత ప్రకారం అందరికీ అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సరైన విధంగా పరిష్కారం చూపాలన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోగానే, అర్హులైన దరఖాస్తుదారులకు దక్కుతాయన్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో ఒకరోజు చొప్పున ప్రజాదర్బారు నిర్వహించామన్నారు. అంతకుముందు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లు పని విధానం బాగాలేదని కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. పదేపదే చెప్పినా పని చేయడం లేదని చెప్పగా, తాను పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు.


కొండపల్లి ప్రధాన రహదారి విస్తరణపై కలెక్టర్, ఎమ్మెల్యేకి వివరిస్తున్న అఖిలపక్ష నాయకులు

# తెలుగు మహాసభల విజయవంతానికి చేయూత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 27, 28 తేదీల్లో ఆర్ట్ ఫౌండేషన్ నేతృత్వంలో విజయవాడలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభల విజయవంతానికి చేయూతనివ్వాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పొట్లూరి హరికృష్ణ, జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మహా సభల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 1,500 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు వారు తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంతో పాటు 5 వేదికలపై సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహాసభల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక, సాంస్కృతిక శాఖ సహకారం ఉంటుందన్నారు. కవులు, రచయితలు తమ కలం నైపుణ్యంతో అక్షర సౌందర్యాన్ని దేశ ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళా సంపదను వన్నె తగ్గకుండా భావితరాలకు అందించేందుకు ప్రయత్నిస్తున్న ప్రతి ఒక్కరికీ, ప్రతి సంస్థకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

# స్వర్ణాంధ్ర ప్రయాణంలో ఉద్యోగులు అడుగులు కలపండి

కానూరు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు చేస్తున్న ప్రయాణంలో ఉద్యోగులు అడుగులు కలపాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ నేతృత్వంలో పలువురు అసోసియేషన్ నాయకులు తాడిగడప క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ అభివృద్ధిలో గాడితప్పిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో, దార్శనికతతో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు కీలకమైన పారిశ్రామిక రంగంలో విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయ్యాక రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి ఉద్యోగులందరూ ఐక్యంగా ఆయనకు మద్దతు పలికారన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, డీఎస్ఎన్‌రెడ్డి, పీవీ ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పార్థసారథికి పూలమొక్క అందిస్తున్న విద్యాసాగర్ తదితరులు

# 4న రాష్ట్ర సీనియర్ త్రోబాల్ జట్ల ఎంపిక

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : రాష్ట్ర త్రోబాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రాష్ట్ర సీనియర్ (స్త్రీ, పురుష) త్రోబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.సురేంద్ర తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డుతో అదే రోజు ఉదయం 9 గంటల్లోపు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు 28 నుంచి 31 వరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో జరిగే జాతీయ సీనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 98484 39137 నంబరులో సంప్రదించాలని కోరారు.

# 13న మెగా లోక్ అదాలత్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఈ నెల 13న న్యాయస్థానాల ప్రాంగణంలో జరిగే మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ పేర్కొన్నారు. మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్ అదాలత్ ఆవశ్యకతను వివరించారు. న్యాయస్థానాల్లో రోజు రోజుకు కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని తెలిపారు. న్యాయవాదులు సహకరించి కక్షిదారులతో మాట్లాడి వారి మధ్య సయోధ్య కుదర్చాలని కోరారు. తద్వారా కేసులను పొడిగించకుండా మెగా లోక్ అదాలత్‌లో రాజీ చేయాలని కోరారు. కేసుల రాజీతో మానవ సంబంధాలు మెరుగుపడి.. నవ సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి, 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి సత్యానంద్. చిత్రంలో భూపాల్‌రెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు

# దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

భవానీపురం, న్యూస్‌టుడే: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. మంగళవారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందా బాజ్జీ అనుచరులతో కలిసి భాజపాలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదరికం లేని సమాజం కోసం అన్ని వర్గాల వారికి మోదీ చేయూత అందిస్తున్నారని తెలిపారు. మన సనాతన ధర్మాన్ని ఇతర దేశాల ప్రజలు పాటిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలు చట్టసభలకు వెళ్లేందుకు యాభై శాతం.. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఏపీలో భాజపా బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్రా శివన్నారాయణ మాట్లాడుతూ.. చేతి వృత్తుల వారిని, కళాకారులను గౌరవించిన వ్యక్తి మోదీ అని తెలిపారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు భాజపా అండగా ఉంటుందని తెలిపారు. కూటమి పాలనలో అన్ని విధాలుగా ఏపీ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నాయకులు గోపిశ్రీనివాస్, రాధాదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

# రైతుబజార్‌లో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

పటమట, న్యూస్‌టుడే : ప్రజలకు నాణ్యమైన, తక్కువ ధరలతో ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం విజయవాడ పటమట రైతుబజార్‌లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేసి కూరగాయల ధరలను పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి రైతు బజార్‌లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతపురం నుంచి సాధారణంగా వస్తున్న గింజ రకం చిక్కుడు కాయలు, గోరుచిక్కుడు, టమాటా అందుబాటులో లేవని వినియోగదారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బియ్యం, ఇతర ధాన్యాలు నాణ్యతతో విక్రయించాలన్నారు. రైతుబజార్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని సూచించారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఎం.రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వినియోగదారుతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్




# నేటి నుంచి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షలు

గాంధీనగర్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా.. బాధితులకు న్యాయం జరగకపోవడం విచారకరమని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.వి.నాయుడు అన్నారు. మంగళవారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి ధర్నా చౌక్‌లో ఆవేదన దీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా ధర్నాచౌక్‌కు చేరుకొని దీక్షలు చేపడతామన్నారు. సీఐడీ అటాచ్ చేసిన కంపెనీ ఆస్తులు విక్రయిస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. యాజమాన్యం వద్ద ఇంకా రూ.వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. దీక్షలకు గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.

# శతాధిక వృద్ధురాలి మృతి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడపకు చెందిన శతాధిక వృద్ధురాలు శెట్టిపల్లి చిట్టెమ్మ(105) సోమవారం రాత్రి మృతి చెందారు. 10 రోజుల క్రితం వరకు ఈమె తన పనులు తాను చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురై తుది శ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం జరిగాయి. చిట్టెమ్మ భర్త రత్తయ్య 20 ఏళ్ల క్రితం చనిపోయారు.


చిట్టెమ్మ (పాత చిత్రం)


బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.



# మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: పెనమలూరు ఠాణా పరిధిలో అరెస్టు అయిన 26 మంది మావోయిస్టులకు ఈ 15 వరకు కోర్టు రిమాండ్ పొడిగించింది. మంగళవారం వీరిని వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. విచారించిన కోర్టు రిమాండ్ పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే స్టేషన్ పరిధిలో అరెస్టు అయిన ఇద్దరు మైనర్లను ఈ నెల 5న కోర్టులో హాజరు పరచనున్నారు. వీరిలో ఓ బాలిక విశాఖపట్నం జువైనల్ హోంలో.. మరో బాలుడు విజయవాడ జువైనల్ హోంలో ఉన్నారు. కానూరులోని కొత్త ఆటోనగర్‌లో 28 మంది మావోయిస్టులు పట్టుపడటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే.

# విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ వాయిదా

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో కూటమి నేతలు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకర పోస్టులతో రెచ్చిపోయిన మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో వారిపై దాడి చేసిన కేసులో నిందితుడికి బెయిల్ ఇవ్వాలని దాఖలైన పిటిషన్ బుధవారానికి వాయిదా పడింది. బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు చేయగా దీనిపై విచారణ జరగనుంది. అసభ్యకర పోస్టుల కేసులో నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరవగా పోలీసులపై దాడి కేసులో నెల్లూరు జైల్లో విజయ్‌భాస్కర్‌రెడ్డి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండడంతో బయటకు వచ్చే అవకాశం లేదు.

# సత్యవర్ధన్ అపహరణ కేసులో నిందితుల కస్టడీకి పిటిషన్

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో లొంగిపోయి, రిమాండ్‌లో ఉన్న నిందితులు తేలప్రోలు రాము, వజ్రకుమార్‌లను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు గురించి మరింత లోతుగా విచారించాల్సి ఉందని.. ఈ నేపథ్యంలో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని అందులో కోరారు. నిందితులు మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. నోటీసుల నిమిత్తం కేసును ఈనెల 4వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. పటమట స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని కోర్టు ముందు ఉంచాలని కోరుతూ వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్‌కు నోటీసులు జారీ చేసేందుకు, తదుపరి విచారణ నిమిత్తం 4వ తేదీకి వాయిదా పడింది.

# నకిలీ మద్యం కేసులో రెండో విడత కస్టడీకి..

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులకు రెండో విడత కస్టడీ కోసం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు రవి (ఏ4), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) నుంచి కుట్రకు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై మంగళవారం ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తీర్పు నిమిత్తం ఈ నెల 8వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

నందిగామ
•నందిగామ •జగ్గయ్యపేట

## ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల సత్తా



విజేతలతో పాఠశాల డైరెక్టర్ అమరకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ రజని

**నందిగామ గ్రామీణం:** మండలంలోని చందాపురం రమ్యశ్రీ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎం.స్నేహ, కె.రుత్విరెడ్డి, వి.బాలశ్రీ వెన్నెల వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను పాఠశాల డైరెక్టర్ శాఖమూరి అమరకృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ రజని అందజేశారు.

## గృహాల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారుకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర తదితరులు

**జగ్గయ్యపేట:** పట్టణంలో పీఎంఏవై 2.0 కింద పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రమపత్రాలు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రూ. 2.5 లక్షలతో నిర్మించుకునే ఇంటికి నేరుగా లబ్ధిదారు ఖాతాల్లోకి ప్రభుత్వం నిధులు జమ అవుతాయని, వివిధ వర్గాల ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రి కూడా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జి, నాయకులు రామకృష్ణ, జోజి తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ పగిలి తాగునీరు వృథా



**మం**డలంలోని చందాపురం గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. నందిగామ మునేటి ఒడ్డున తాగునీటి పథకం నుంచి ఈ గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. చిన్న వంతెనపై పైపులైన్ పగిలి మంగళవారం తాగునీరు వృథాగా పోయింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి హాలీం మహ్మద్‌ను అడుగగా పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. **- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

# ప్రాణం పోతున్నా పట్టించుకోరే?

**శిరస్త్రాణం ధరించక మృత్యువాత ● అవగాహన కల్పిస్తున్నా మారని వాహనదారులు**

● గత ఏడాది అక్టోబరు 30న లారీడ్రైవర్‌గా పని చేస్తున్న కంచికచర్ల అంబేడ్కర్ కాలనీకి చెందిన బజ్జి హరీష్ మూలపాడు నుంచి కంచికచర్ల వచ్చే క్రమంలో పరిటాల సమీపంలోని అండర్ పాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్ర గాయాలవడంతో మృతి చెందాడు.

● గత ఏడాది అక్టోబరు 4న వీరులపాడు మండలం వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి దివ్వంత్ వెంకట్, అచ్చి పణికుమార్ ద్విచక్ర వాహనంపై కంచికచర్ల మండలం పరిటాలలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా రహదారిపై ఉన్న ట్రాక్టరును వారి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో, ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

**కంచికచర్ల, న్యూస్‌టుడే**

● ఈ ఘటనల్లో వారంతా తలకు శిరస్త్రాణం ధరించక మృతి చెందారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం విధిగా ధరించాలి నిబంధనలు ఉన్నా వాహనదారులు నిర్లక్ష్యం వహిస్తుండటం ప్రమాదాలకు కారణమవుతోంది. అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆచరణలో పెట్టడం లేదు. మన ప్రాణాలను కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని.. ప్రతి ఒక్కరూ గుర్తించి శిరస్త్రాణం ధరిస్తే రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే వారి సంఖ్యను తగ్గించగలమన్న సంగతి వాహనదారులు గుర్తించాలని అధికారులు కోరుతున్నారు.



శిరస్త్రాణం వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

### ప్రజల్లో చైతన్యం తెచ్చేలా..

ఏటా పెరుగుతున్న రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాల్లో మృతి చెందినవారు అత్యధికంగా ద్విచక్ర వాహనం నడిపే సమయంలో శిరస్త్రాణం ధరించక పోవడమే మృతికి ప్రధాన కారణం. సబ్ డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. డ్రైవ్ నిర్వహించాక దీని వినియోగం పెరిగింది. మొదటిసారి కౌన్సెలింగ్ నిర్వహించి వదిలి పెడుతున్నాం. తర్వాత శిరస్త్రాణం ధరించని వారిని రహదారి పైకి అనుమతించం.

**- బాల గంగాధర్ తిలక్, ఏసీపీ, నందిగామ**

# ఉద్దేశం ఘనం... నిర్మాణం నిరుపయోగం

**నిధులున్నా వినియోగంలోకి రాని భవనం**

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే**



జగ్గయ్యపేట ముక్త్యాల రోడ్డులో నిర్మించిన భవనం

**జ**గ్గయ్యపేట పట్టణంలోని మానవ వ్యర్థాల పునరుత్పాదక ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) భవనం నిర్మాణం పూర్తి చేసుకొని రెండేళ్లు అవుతున్నా ఇంకా వినియోగంలోకి రావడం లేదు. ముక్త్యాల రోడ్డులో ఆనకట్ట డంపింగ్ యార్డ్ పక్కనే రూ.2 కోట్ల స్వచ్ఛాంధ్ర నిధులతో చేపట్టిన నిర్మాణంలో ప్రధాన భవనం పూర్తైనా ఏర్పాటు చేయాల్సిన యంత్రాలు, నిర్మించాల్సిన ట్రాన్స్‌ఫార్మర్, భవనానికి అవసరమైన విద్యుత్తు సరఫరా ఇంకా సమకూర్చలేదు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యాచరణలో భాగంగా ఈ భవనాన్ని నిర్మించారు. పురపాలక సంఘానికి సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను తరలించే రెండు వాహనాలను కూడా ఇచ్చారు. ప్రస్తుతానికి ఇవి ఉపయోగంలోకి రాలేదు.

➤ సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను తరలించే ప్రైవేటు వాహనాలు ఇష్టారాజ్యంగా గ్రామాల బయట ఖాళీ ప్రదేశాల్లో, కాల్వల పక్కన, చెరువుల పక్కన వదిలేస్తున్నారు. వాయుకాలుష్యం, నీటి కాలుష్యం వీటిని నియంత్రించేందుకు రూపొందించిన భవనాన్ని వినియోగంలోకి తేవడంలో పురపాలక సంఘం విఫలమైంది.

➤ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించే పనిని జలీల్ ఎమ్మెల్యే చొరవతో ప్రారంభించిన పురపాలక సంఘం ఒక అడుగు ముందుకు వేయగలిగారు. ఈ ఎఫ్ఎస్‌టీపీ విషయంలో కూడా చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

➤ సెప్టిక్ ట్యాంకుల నుంచి తరలించిన వ్యర్థాలను ఇక్కడ ఎనరోబిక్ విధానంలో శుద్ధి చేసి జలాన్ని, ఘనాన్ని వేరు చేస్తారు. ఆ ఘనాన్ని మట్టిగా మార్చి రసాయన పరీక్షల అనంతరం ఎరువుగా రైతులకు విక్రయిస్తారు. దీంతో పురపాలిక సంఘానికి ఆదాయం కూడా లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అప్రమత్తతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మీనారాయణ, పక్కన ఏసీపీ తిలక్

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** సైబర్ నేరాలపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని డీసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని నవాబుపేటలో మంగళవారం రాత్రి సైబర్ నేరాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు..డిజిటల్ అరెస్టులు ఉండవని చెప్పారు. ఫోన్లు చేసి బెదిరిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచితులు అడిగే ఓటీపీలు చెప్పకూడదని.. వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ బాలగంగాధర్ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అర్జున్, ఎంపీపీ సామినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే:** నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్లోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుల జిల్లా బయలాజికల్ సైన్స్ ఫోరం తరఫున విజయవాడ హ్యాపీలైఫ్ ఫౌండేషన్ ముద్రించిన పదో తరగతి బయలాజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను 75 ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. సైన్స్ ఫోరం సభ్యులు యు.సత్యనారాయణ, మెర్లో, ఎన్ఆర్‌పీఎస్ రెడ్డి, ముక్కా సత్యనారాయణ, తాజ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, శిక్షణ తరగతుల కోర్సు డైరెక్టర్ పొదిలి విజయలక్ష్మి, కో-ఆర్డినేటర్ ఆర్.రాంబాబునాయక్ పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవోకు అభినందనలు

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** జగ్గయ్యపేట మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధుల్లో చేరిన షేక్ ఇమామ్‌ను జగ్గయ్యపేట బీసీ సంక్షేమ సంఘ సభ్యులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో టి.కృష్ణ, పెంటి శ్రీనివాసరావు, ఉద్దంటి వాసు, తంగెళ్ల శ్రీనివాసరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ధాన్యం ఆరబోతకు అష్టకష్టాలు

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**



కల్లంలో ఆరబోసిన ధాన్యం

**క**ల్లాల్లో ధాన్యం ఆరబోతకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దిత్వా తుపానుతో యంత్రాలతో నూర్పిడి చేయించిన ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతుసేవా కేంద్రాల వద్ద ప్లాట్‌ఫారాలు లేవు. పంట పొలాల్లో పట్టాలపై ఆరబోస్తున్నారు. వర్షం కురిస్తే తడవకుండా పట్టాలు కొంటున్నారు. సొసైటీల్లో పౌర సరఫరాల శాఖ పట్టాలు ఇచ్చినా కొద్ది మంది రైతుల అవసరాలకే అవి సరిపోతున్నాయి. నందిగామ నియోజకవర్గంలో 58 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోతకు ప్లాట్‌ఫారాలు, డ్రయ్యర్ వంటి యంత్రాలు అందుబాటులో లేవు. తుపాను భయంతో రైతులు హడావుడిగా ధాన్యం నూర్పిడి చేయించి పంట పొలాల్లో ఆరబోస్తున్నారు. ఒక్కసారిగా ఎక్కువ మంది రైతులు పంట నూర్పిడులు చేయిస్తుండటంతో ధాన్యం తరలించడానికి ట్రాక్టర్లు అందుబాటులో లేవు. డిమాండుకు తగ్గట్టుగా పలుచోట్ల గోనెసంచులు అందుబాటులో లేవని రైతులు వాపోతున్నారు.

## కాలుష్యం నియంత్రించాలి

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** జగ్గయ్యపేట ప్రాంతంలో కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త లంకపల్లి రవిప్రసాద్ కమిషనర్ రామకృష్ణకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ★ పట్టణంలోని ఏడో వార్డులో మౌలిక వసతులు కల్పించాలని వార్డు ప్రతినిధి గడ్డం రాంబాబు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వినతిపత్రం అందజేశారు. వేపల వాగు వరద వల్ల రహదారులు ధ్వంసం అవుతున్నాయని మరమ్మతులు చేయాలని కోరారు.

# విశాఖ మహాసభ జయప్రదానికి పిలుపు



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

**కంచికచర్ల, న్యూస్‌టుడే :** కార్మికుల హక్కులకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా శాఖ కార్యదర్శి కోట కల్యాణ్ ఆరోపించారు. ఈ నెల 30 నుంచి జనవరి 4 వరకు విశాఖలో నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కంచికచర్ల, పెండ్యాలలో మంగళవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలపై మహాసభల ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. సీఐటీయూ జిల్లాశాఖ కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ.. లక్ష మందితో జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల శాఖ కన్వీనర్ బి.భూషణం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్‌జీవో నియోజకవర్గ అధ్యక్షుడిగా కుమార్



కుమార్‌ను సత్కరిస్తున్న స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** నియోజకవర్గ ఏపీ ఎన్‌జీవో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆరేపల్లి కుమార్‌ను మంగళవారం స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్ఎస్‌పీ కార్యాలయంలో కలిసి సత్కరించి అభినందించారు. గోపాలకృష్ణ సొసైటీ ఛైర్‌పర్సన్ అశ్వినిప్రసాద్, కె.శ్రీనివాసరావు ధూళిపాళ లక్ష్మణరావు, చావా ప్రేమ్‌చంద్, పక్కంతుల వాసు, అట్టూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ శ్రీను, ఎన్‌జీవో సంఘం కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రాకపోకలకు కష్టం.. ఎమ్మెల్యే ఆపన్నహస్తం



వాగు వద్ద రోడ్డు పనులు

**చెన్నారావుపాలెం (వీరులపాడు), న్యూస్‌టుడే :** ప్రభుత్వ విప్, నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య సౌజన్యంతో ఏనుగుగడ్డ వాగుపై రాకపోకల సమస్యకు చెన్నారావుపాలెం గ్రామస్థులకు సాంత్వన కలిగింది. వాగుపై వంతెన దెబ్బతిని దశాబ్ద కాలంగా చెన్నారావుపాలెం రైతులు, పశు పోషకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ సంవత్సరం కురిసిన అధిక వర్షాలకు వంతెన పూర్తిగా కోతకు గురై బండరాళ్లు బయట పడ్డాయి. తెదేపా నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆమె కృషితో వాగుపై వంతెన నిర్మాణానికి మట్టి పరీక్షలు నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఈ నేపథ్యంలో ధ్వంసమైన వంతెన తొలగించి, రాకపోకలకు తాత్కాలికంగా రోడ్డు నిర్మించడానికి ఎమ్మెల్యే సొంత నిధులు రూ.80 వేలు కేటాయించగా సోమవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి.

## అడ్డంకులు ఇలా.. వాగు పారేదెలా?



వ్యర్థాలు, కంపచెట్లతో నల్లవాగు

**మం**డలంలోని అడవి రావులపాడు వద్ద నల్లవాగు వ్యర్థాలతో ఉంది. వాగుపై పాత చప్టా తొలగించి కొత్తది నిర్మించారు. పాత చప్టా పగులగొట్టి వ్యర్థాలను నల్లవాగులో పడేశారు. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వర్షాకాలం నల్లవాగుకు వరదనీరు పోటెత్తి పంట పొలాలను ముంచుతుంది. వ్యర్థాల వల్ల నీరు పారక ఎక్కువ నష్టం కలుగుతుంది. వాగుకు రెండుపక్కలా కంపచెట్లు పెరిగి వాగు మూసుకుపోతోంది. జల వనరుల శాఖ అధికారులు స్పందించి వాగులో వ్యర్థాలు తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. **- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

## మున్సిపల్ అధికారులపై చర్యలకు ఆదేశాలు

**నందిగామ, న్యూస్‌టుడే :** గత వైకాపా ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలకు బాధ్యులైన అప్పటి మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గవర్నర్ ఆదేశాల ప్రకారం మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఆర్.టి నం: 1375 ప్రకారం జీవో జారీ చేశారు. పురపాలక సంఘ పరిధిలో గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తుల భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. దీనికి విరుద్ధంగా ఐదారు అంతస్తుల్లో అక్రమంగా అపార్టుమెంట్లు నిర్మించారు. అదనంగా నిర్మించే ప్రతి అంతస్తుకు రూ.మూడు లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై నందిగామకు చెందిన సామాజిక కార్యకర్త కురగంటి హనుమంతురావు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకున్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ సింపని జయరాం, పట్టణ ప్రణాళిక అధికారిని కె.ఝాన్సీలక్ష్మి, టీపీవో బి.సీహెచ్.వెంకయ్య, సూపర్‌వైజర్ కె.ఆశ, పట్టణ ప్రణాళిక బిల్డింగ్ ఓవర్‌సీర్ షేక్ నాగుల్‌మీరాతో పాటు ఉద్యోగులు అభినేష్, బాణాల భవ్య, జి.వంశీకృష్ణను బాధ్యులుగా గుర్తించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

## 5 నుంచి యోగ శిక్షణ తరగతులు

**నందిగామ, న్యూస్‌టుడే :** మండలంలో 5 నుంచి మహిళలకు యోగ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగ గురువు కిలారు ప్రసాదు తెలిపారు. మాజీ ఎంపీపీ కోవేలమూడి వెంకటనారాయణ సౌజన్యంతో స్థానిక సాయి అయ్యప్ప దేవాలయానికి ఎదురుగా ఉన్న కొంగర సదన్‌లో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఇవి నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు ఫోన్ నం: 9989448383లో సంప్రదించాలని కోరారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ కొండూరులో ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం మీకు తోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి రవి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన కార్మికులను పంపి దీపాలకు మరమ్మతులు చేయించారు. ★ మాగల్లులో పంచాయతీ తాగునీటి పథకం విద్యుత్తు మోటారు చెడిపోయి తాగునీరు రావడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి రవి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మోటారుకు మరమ్మతులు చేయించి నీటిని విడుదల చేశారు. ★ కమ్మవారిపాలెంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి ఆకుల హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన దీపాలకు మరమ్మతులు చేయించారు. **- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

## కౌన్సిలర్ చొరవతో సమస్యకు పరిష్కారం

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని వైవై కాలనీలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం వద్ద రోడ్డుపై కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో కౌన్సిలర్ వట్టెం మనోహర్ చొరవ చూపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. మంగళవారం ఏఈ ప్రవీణ్ సాయంతో జేసీబీ ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించారు. దీనిపై స్థానికులు ఆయన్ను అభినందించారు.

## మాలధారులకు అన్నదానం

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో వన్‌పులి వాహన సేవాసమితి ఆధ్వర్యంలో నిత్యం 500 మంది స్వాములకు కొనసాగుతున్న అన్నసమారాధన కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పాల్గొన్నారు. అనంతరం స్వాములకు భోజనం వడ్డించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించి ప్రోత్సహించాలని సూచించారు.



### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**చందర్లపాడు :** కోనాయపాలెంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఉలవలపూడి వెంకటరత్నం, నతానేలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**నరసింహారావుపాలెం (వీరులపాడు) :** మృతుడి కుటుంబ సభ్యులకు జుజ్జూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ (పీఏసీఎస్) సిబ్బంది మంగళవారం ఆర్థిక సాయం చేశారు. నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన గుర్రాల కోటిరెడ్డి నవంబర్ 28న మృతి చెందాడు. అతను సొసైటీలో సభ్యుడు. రుణం కలిగి ఉన్నందున అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా, కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ మాజీ అధ్యక్షుడు బొమ్మిశెట్టి భాస్కరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

**కంచికచర్ల, న్యూస్‌టుడే :** ఉపాధ్యాయ మండల స్థాయి క్రీడా పోటీలను కంచికచర్ల సమీపంలోని మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) గురునాథం, బాలాజీ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రికెట్, త్రోబాల్ జట్లు ఈ నెల 13, 14న నిర్వహించే నందిగామ డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

### కంచల మేజర్ ఆయకట్టు చివరకు సాగునీరు

**నందిగామ, న్యూస్‌టుడే :** ఎన్నెస్పీ కంచల మేజర్ కాలువ దిగువ వరకు సాగునీరు సరఫరా అవుతోంది. కొన్నేళ్లుగా సాగునీరు ఆయకట్టు చివర వరకు అందక అన్నదాతలు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నెస్పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, నీటి సంఘాల అధ్యక్షులు కాలువపై పర్యవేక్షణ చేస్తుండటంతో మంగళవారం నాటికి చివరి వరకు సాగునీరు సరఫరా అవుతోంది. నీటి సంఘాల అధ్యక్షులు మన్నెం శ్రీనివాసరావు, రామిరెడ్డి శ్రీనివాసరావు, రైతులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి దత్త జయంతి కార్యక్రమాలు

**జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే :** మండల పరిధి జుజ్జూరులోని యజ్ఞ దత్త దేవాలయంలో దత్త జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మద్దూరి యజ్ఞనారాయణ మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి మూడు రోజులు ప్రతిరోజు విశేష పూజలు నిర్వహిస్తారని, 0న తైలాభిషేకం, పల్లకి సేవ, 04న దత్త హోమం, స్వామి కల్యాణం, గరుడోత్సవం, 05న స్నపన తిరుమంజనం, పల్లకిసేవ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఎఫ్ఎల్ఎన్ సర్వే పరిశీలన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డైట్ అధ్యాపకుడు మోహనరావు

**నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే :** మండలంలోని గోళ్లమూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ సర్వేను జిల్లా డైట్ అధ్యాపకుడు, జిల్లా విద్యా పరిశీలకుడు డాక్టర్ కొచ్చర్ల మోహనరావు పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, బోధనా తీరు, విద్యార్థుల ప్రగతి నివేదికలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఆరేపల్లి భిక్షాలు, ఉపాధ్యాయులు షేక్ నవాబ్‌జాని, ఎం.రజని, మేకల సుధాకర్ పాల్గొన్నారు.

### అనిగండ్లపాడు మాజీ సర్పంచి మృతి

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** మండలంలోని అనిగండ్లపాడు మాజీ సర్పంచి నెల్లూరు రామనాథం(96) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

### ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాల ఏర్పాటు పర్యవేక్షిస్తున్న సీఐ నాయుడు

**నందిగామ:** పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు, రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విజయవాడ హైవే రోడ్డులో అనాసాగరం పై వంతెన వద్ద మంగళవారం సీసీ కెమెరాలు అమర్చారు. సీఐ వైవీవీఎల్ నాయుడు వాటి పనితీరు పరిశీలించారు. అపార్టుమెంట్ల నిర్వాహకులు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

**పెనుగంచిప్రోలు:** పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మంగళవారం కొణకంచిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు వాణి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో ఆశావర్కర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురాతన భారతీయ ఆయుర్వేద వైద్యంతో ఇంటి వద్దనే అనేక రోగాలకు చికిత్స చేసుకోవచ్చని చెప్పారు. మందులు వినియోగం వల్ల ప్రయోజనాలు కంటే నష్టమే ఎక్కువ అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# 17 నెలల్లోనే సూపర్-6 హామీల అమలు

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్-6 పథకాలను 17 నెలల్లోనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. మంగళవారం కార్యాలయంలో 87 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.54.11 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మైనేని రాధ, యానాల గోపి, కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జి, కానూరి కిశోర్, మీసాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## కానుకల లెక్కింపు నేడు

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే:** స్థానిక తిరుపతమ్మ అమ్మ వారి ఆలయంలో భక్తుల సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు.

## పాఠశాల బస్సుల తనిఖీ

**జగ్గయ్యపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను జగ్గయ్యపేట ఎంవీఐలు నారాయణరాజు, జయచంద్ర మంగళవారం తనిఖీలు చేశారు. పట్టణంలోని ఎస్ఎస్ కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో పాఠశాలల బస్సుల్లో గుర్తించిన లోపాలను యాజమాన్యాలకు చెప్పి వాటిని సరి చేయాలని సూచించారు.

## జిలేబీలు వేసిన న్యూజిలాండ్ ప్రధాని



ఇంటర్నెట్ డెస్క్: న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ జిలేబీలు వేస్తూ సందడి చేశారు. ఆక్లాండ్‌లోని టకానినిలో సిక్కు వర్గీయులు నిర్వహించిన క్రీడలకు స్థానిక ఎంపీ రిమా నఖ్లేతో కలిసి న్యూజిలాండ్ ప్రధాని హాజరయ్యారు. అందరితో ముచ్చటించిన అనంతరం జిలేబీలు వండుతున్న చోటుకు వెళ్లి.. సరదాగా కాసేపు జిలేబీలు వేశారు. అక్కడున్న వారికి స్వయంగా తానే జిలేబీలు అందించారు. ఈ వీడియోను క్రిస్టఫర్ సోషల్ మీడియాలో షేర్‌చేయడంతో వైరల్‌గా మారింది.

### ఈఎన్‌టీ వైద్యుడి అంబులెన్స్ కారు

## పేదలకు అండగా సేవలు



మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి చెందిన చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వ్యాధుల వైద్యుడు జె.ఎస్. గంభీర్ వృద్ధులు, పేదల సహాయార్థం టెలిమెడిసిన్ సేవలు ప్రారంభించి.. సొంత కారును అంబులెన్సుగా మార్చారు. చాలామంది పేద రోగుల ఇబ్బందులు చూసి వారి కోసం ఏదైనా చేయాలనే ఆలోచనతో తన కారు అంబులెన్సును పూర్తి టెలిమెడిసిన్ క్లినిక్‌గా మార్చినట్లు గంభీర్ తెలిపారు. "నేను, నా సహోద్యోగి డాక్టర్ సోనమ్ కలిసి ఈ అంబులెన్సులో రోగుల ఇళ్లకు వెళతాం. కారులో ఉన్న పరికరాలతో వారిని పరీక్షిస్తాం. ఇండోర్‌లో ఉన్న మా క్లినిక్ నుంచి వీడియోకాల్స్, ఫోన్‌కాల్స్ ద్వారా టెలిమెడిసిన్ సేవలను అందిస్తాం" అని వివరించారు. ఈ సేవలకు అదనపు రుసుం లేనందున డాక్టర్ గంభీర్ కారు అంబులెన్స్ ఇండోర్‌లో బాగా ప్రాచుర్యం పొందింది.

### షాజహాన్‌కు ఓటేయాలని

## సోషల్ మీడియాలో ప్రజల ప్రచారం



కేరళలోని నిలంబూర్ మున్సిపాలిటీ 11వ డివిజను కార్పొరేటరుగా టీఎంసీ మద్దతుతో పోటీ చేస్తున్న షాజహాన్ గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. బరిలో ఇతర ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నా.. షాజహాన్ చర్చనీయాంశంగా మారారు. సామాజికసేవలో ముందుండే ఈయన గతంలో అంబులెన్స్ డ్రైవరుగా పనిచేశారు. గతేడాది వరద ప్రాంతాల సహాయక చర్యల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. అయినా నిలంబూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో షాజహాన్ ఇవేవీ చెప్పుకోవడం లేదు. ఆయన సేవాగుణం గురించి స్వయంగా ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొట్టాయంకు చెందిన ఓ కుటుంబం పెట్టిన వీడియో వైరల్ అవుతోంది. ఐదేళ్ల కిందట.. ఈ కుటుంబంలో అందరికంటే చిన్నదైన ఐశ్వర్యకు ఉచితంగా కిడ్నీ ఇచ్చి షాజహాన్ ప్రాణదానం చేశారు.

## హిట్లర్ కాలం నాటి 5 కిలోల ఫోను!



ఈటీవీ భారత్: అరచేతిలో ఇమిడే స్మార్ట్ ఫోన్లు వాడుతున్న నేటి తరానికి 5 కిలోల బరువైన ఫోను అంటే వింతగానే ఉంటుంది. జర్మన్ నియంత హిట్లర్ కాలం నాటి ఈ ఫోన్‌ను చూడాలంటే చండీగఢ్‌లో జరుగుతున్న హస్తకళల ప్రదర్శనకు వెళ్లాలి. రాజస్థాన్‌కు చెందిన వినయ్‌శర్మ పోలండ్ నుంచి దీన్ని కొన్నారు. "గతకాలపు పిలుపు" పేరుతో ఈయన ఏర్పాటుచేసిన స్టాల్‌లో పాతకాలపు కెమెరాలు, ఫోన్లు, గడియారాలు, రేడియోలు ఆకట్టుకొంటున్నాయి. గత కాలపు ప్రాధాన్యం, మన పెద్దల కృషిని ఈ తరం గుర్తించాలన్నది తన అభిమతమని ఆయన చెబుతారు.

## గొప్ప జీవక్రియతో శ్రమలేని ఆరోగ్యం



మన జీవక్రియల పనితీరు బాగుంటే శ్రమలేకుండానే ఆరోగ్యం సొంతమైనట్లు. అవి ఉత్తమంగా ఉన్నాయనడానికి నిదర్శనం ఇవి..

✦ గాఢమైన నిద్ర. ✦ రోజంతా స్థిరమైన శక్తిని కలిగిఉండటం. ✦ చక్కటి జీర్ణశక్తి. ✦ శరీరంలో కొవ్వు సులువుగా కరుగుతుండటం.. ఆకలిపై నియంత్రణ.

– సుమిత్ శర్మ, డాక్టర్

# సర్‌పై రుసరుస

- పట్టువీడని విపక్షాలు
- పార్లమెంటులో ప్రతిష్టంభన
- ప్రతిపక్ష నేతల్ని చర్చకు ఆహ్వానించిన ప్రభుత్వం

దిల్లీ: ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) అంశంపై విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీయడంతో మంగళవారం పార్లమెంటు ఉభయసభలు స్తంభించిపోయాయి. వివిధ అంశాలను చర్చకు చేపట్టాలని ప్రభుత్వం తరపున ప్రయత్నం జరిగినా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రతిపక్ష నేతల్ని ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. అంశాన్ని చర్చించడానికి సిద్ధమేనని, నిర్దిష్ట సమయ పరిమితి మాత్రం విధించలేమని తెలిపింది. లోక్‌సభ ఉదయం సమావేశమయ్యాక రెండుసార్లు వాయిదాపడింది. భోజన విరామానంతరం మళ్లీ సమావేశమైనప్పుడు విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న సర్‌పై చర్చకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, సభను కొనసాగనివ్వాలని సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా కోరారు. ఓటమి చెందిన ఆగ్రహాన్ని సభలో చూపించరాదని, మాజీ ప్రధాని వాజ్‌పేయీకీ ఓటమి తప్పలేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. శూన్యగంట పది నిమిషాల్లో ముగిసింది. స్థాయీసంఘాలు నివేదికల్ని సమర్పించాయి.

### 9న చర్చించడానికి అంగీకారం

వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తికావడంపై ప్రత్యేక చర్చను ఈ నెల 8న, ఎన్నికల సంస్కరణలపై 9న లోక్‌సభ చర్చించనుంది. సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశానికి ముందు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి రిజిజు 'ఎక్స్'లో తెలిపారు. ఒక్కో చర్చకు ఒక్కో సభకు 10 గంటలు చొప్పున సమయం కేటాయించారు. అంతకుముందు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆప్, ఎస్పీ, సీపీఎం తదితర పార్టీల సభాపక్ష నేతలతో జరిగిన సమావేశంలో రిజిజు మాట్లాడుతూ ప్రభుత్వానికి విపక్షాలు నిర్దేశాలు ఇవ్వజాలవని స్పష్టంచేశారు.



ఆందోళనలో పాల్గొన్న రాహుల్, కేసీ వేణుగోపాల్, సోనియా, ఖర్గే, ప్రియాంక తదితరులు

### మకరద్వారం వద్ద నిరసన

విపక్షాలకు చెందిన ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీ, కనిమొళి, టి.ఆర్.బాలు, జాన్ బ్రిట్టాస్ సహా పలువురు నేతలు పార్లమెంటు మకరద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమైన చర్చల నుంచి ప్రధాని మోదీ నిరంతరం తప్పించుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ఓటుహక్కుకు మించిన పెద్ద అంశం ఇంకేం ఉంటుందని ప్రశ్నించారు.

### తిరస్కరణకు కారణమైనా చెప్పండి

ఇదే అంశంపై రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 267 నిబంధన కింద చర్చకు అనేక పార్టీలు పట్టుపడుతున్నప్పుడు చర్చ చేపట్టాల్సిందేనని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే చెప్పారు. వాయిదా తీర్మానానికి ఇచ్చిన 21 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ ప్రకటించారు. ఏ ప్రాతిపదికన ఎవరి నోటీసులను తిరస్కరించారనేదైనా చెప్పాలని ఖర్గే ప్రశ్నించారు. వందేమాతరంపై కంటే సర్‌పై చర్చకు తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం తిరస్కరించడంతో విపక్షఎంపీలు వాకౌట్ చేశారు.

### నేడు విపక్ష నేతల భేటీ

సమావేశాల్లో ఉమ్మడిగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి విపక్ష నేతలు బుధవారం ఉదయం ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నారు.

## రేపే భారత్‌కు పుతిన్

### మన దేశంతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు ఆమోదం

మాస్కో: భారత్‌తో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు దిగువ సభ డ్యూమా ఆమోదం తెలిపింది. రవాణాలో పరస్పర మార్పిడి సహకారానికి (రెలోస్) గత ఫిబ్రవరిలో కుదుర్చుకున్న ఈ ఒప్పందానికి సై అంది. గురు, శుక్రవారాల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ఒప్పందానికి సభ ఆమోదం తెలపడం విశేషం. పుతిన్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. వాణిజ్యం, రక్షణ రంగాల్లో పలు ఒప్పందాలకు వారు శ్రీకారం చుట్టనున్నారు. అమెరికాతో సంబంధాలు దెబ్బతిన్న ఈ తరుణంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా, చైనా, భారత్ బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పుతిన్ తెలిపారు. 'గత మూడేళ్లలో ఈ దేశాల మధ్య వాణిజ్య బంధం మరింత విస్తరించింది. ఇంధనం, పారిశ్రామికం, అంతరిక్షం, ఇతర రంగాల్లో ఇప్పటికే ఎన్నో సంయుక్త భాగస్వామ్యాలున్నాయి. నా భారత్ పర్యటనలో ఆర్థిక అంశాలపైనా చర్చిస్తాం' అని పుతిన్ తెలిపారు.



### రెలోస్ ఎంతో కీలకం

రెలోస్ ఒప్పందంలో భాగంగా రెండు దేశాల మధ్య సైనిక నిర్మాణాలు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల పరస్పర మార్పిడి ఉంటుంది. బలగాల పంపిణీలోనే కాకుండా పరికరాలు, రవాణానూ రెలోస్ నియంత్రిస్తుంది. ఈ ఏర్పాటును సంయుక్త విన్యాసాలు, శిక్షణ, మానవతా సాయం, విపత్తుల సమయంలో వినియోగిస్తారు. డ్యూమా వెబ్‌సైట్‌లో నోట్ ప్రకారం.. రష్యా పార్లమెంటు ఆమోదించిన పత్రాల్లో.. రెండు దేశాల గగనతలాన్ని, పోర్టులను రష్యా, భారత్ యుద్ధ నౌకలు వినియోగించుకుంటాయి.

## రెండు దశల్లో జన గణన

- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు నిర్వహిస్తాం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి



దిల్లీ: దేశంలో జన గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026 ఏప్రిల్-సెప్టెంబరు మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ సంబంధిత వివరాలను పేర్కొన్నారు. అదే సమయంలో కుల గణనను కూడా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

■ **తొలి దశలో...** గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు) ■ **రెండో దశలో...** జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)

■ లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ప్రతికూల వాతావరణ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబరు- అక్టోబరు 1. ■ ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగానే కుల గణన కూడా జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

### 30 ప్రశ్నలతో వివరాల సేకరణ

వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా 30కి పైగా ప్రశ్నలతో జన గణన పత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందన్నారు.

■ సర్వేలో.. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు నిర్మాణం తీరు, నివాసితుల సంఖ్య, గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

### డిజిటల్ విధానంలో ..

ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

■ మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.


## ఐరోపా కోరుకుంటే యుద్ధానికి సై: పుతిన్

మాస్కో: ఐరోపా ఖండం యుద్ధం కోరుకుంటే తాము అందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో వివాదంపై ఒక అంగీకారం కుదరకుండా ఐరోపా నేతలు అడ్డు తగులుతున్నారని ఆయన ఆరోపించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అంతానికి చర్చలు జరిపేందుకు అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మాస్కోకు వచ్చి తనతో సమావేశమైన తరుణంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "యూరప్‌తో యుద్ధం చేయాలని మేం అనుకోవడం లేదు. యూరప్ తానుగా యుద్ధం కోరుకుంటుంటే, యుద్ధాన్ని ప్రారంభిస్తే మేం అందుకు సిద్ధంగా ఉన్నాం" అని పుతిన్ విలేకరులకు చెప్పారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలో సవరణలపై జెలెన్‌స్కీ సానుకూలంగా స్పందించారు. మార్పుల అనంతరం ప్రణాళిక మెరుగ్గా ఉందన్నారు.

## చొరబాటుదారులకు రెడ్‌కార్పెట్ పరవాలా?

- రోహింగ్యాల కేసులో ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: మన దేశంలో రోహింగ్యాలు నివసించటానికి ఉన్న చట్టబద్ధత ఏమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అక్రమ చొరబాటుదారులకు రెడ్‌కార్పెట్ పరచి దేశంలోకి ఆహ్వానించాలా అని పిటిషనర్‌ను నిలదీసింది. దిల్లీలో రోహింగ్యాల అదృశ్యంపై హక్కుల కార్యకర్త రీటా మన్‌చందన్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది. 'ఉత్తర భారత్‌లో మనకు సమస్యాత్మకమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే.. వారికి అన్నీ సమకూర్చి ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా' అని పేర్కొంది. రోహింగ్యాలు శరణార్థులా, అక్రమ చొరబాటుదారులా అనే అంశాన్ని తొలుత తేల్చాలని అభిప్రాయపడింది. విచారణ 16వ తేదీకి వాయిదాపడింది.



### ప్రాసిక్యూటర్ న్యాయం కోసం పనిచేయాలి

న్యాయ పరిరక్షణ కోసమే ప్రాసిక్యూటర్లు కోర్టు విధులను నిర్వర్తించాలని, నిందితులను శిక్షించాలన్నదే ఏకైక లక్ష్యం కారాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రాసిక్యూటర్ కూడా కోర్టు అధికారేనని, విచారణ న్యాయబద్ధంగా జరిగేలా చూడాలని తెలిపింది. హత్య కేసులో ముగ్గురు వ్యక్తులకు విధించిన శిక్షను రద్దు చేస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు నిందితులకు న్యాయస్థానం పలు అవకాశాలు ఇస్తుందని గుర్తు చేసింది. పట్నా హైకోర్టు తమకు శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ ముగ్గురు నిందితులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈ తీర్పు వెలువడింది.

## గ్యాంగ్‌స్టర్ బిష్ణోయ్ సన్నిహితుడిని కాల్చి చంపిన దుండగులు

చండీగఢ్: గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సన్నిహితుడైన ఓ వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. ఈ ఘటన చండీగఢ్ సెక్టార్-26లోని టింబర్ మార్కెట్ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మృతుడిని ఇందర్‌ప్రీత్ సింగ్ అలియాస్ ప్యారీ(35)గా గుర్తించారు. అతడిపై 10 సార్లు కాల్పులు జరిపారు. ఈ హత్యకు బాధ్యత వహిస్తున్నట్లు ఫేస్‌బుక్‌లో ఓ గుర్తుతెలియని ఖాతా నుంచి పోస్టు వెలువడింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## త్రిపురలో చొరబాట్లకు బదులు బహిష్కరణ జరుగుతోంది

### సీఎం మాణిక్ సాహా

అగర్తల: మూడు వైపులా బంగ్లాదేశ్‌తో సరిహద్దును పంచుకుంటోన్న త్రిపురలో ఇప్పుడు చొరబాట్లకు బదులుగా.. బహిష్కరణ జరుగుతోందని.. రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్ సాహా తెలిపారు. 2024 నుంచి వివిధ ఆపరేషన్లలో 57 మంది అక్రమ రోహింగ్యా వలసదారులను, 628 మంది బంగ్లాదేశ్ జాతీయులను, 280 మంది భారతీయులను సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) అరెస్టు చేసిందని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

### పార్లమెంటు ప్రాంగణంలోకి కుక్క..

## రేణుక, రాహుల్ వ్యాఖ్యలపై భాజపా మండిపాటు

దిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి పార్లమెంటు సముదాయంలోకి కుక్కను తేవడంపై తీవ్ర అభ్యంతరం తెలిపిన భాజపా అందుకు సంబంధించి ఆమె, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. కాంగ్రెస్ నేతలు పార్లమెంటు గౌరవానికి భంగం కలిగించడంతోపాటు పార్లమెంటు సభ్యులను, భద్రతా సిబ్బందిని, అధికారులను అవమానించినట్టేనని భాజపా పేర్కొంది. తాను కాపాడిన ఒక వీధికుక్కను పార్లమెంటు ప్రాంగణంలోకి తెచ్చిన రేణుక ఆ విషయంపై కొందరు ఎంపీలు లేవనెత్తిన అభ్యంతరానికి సమాధానమిస్తూ "లోపల కూర్చున్నవారు కరుస్తారు, కుక్కలు కరవవు" అని వ్యాఖ్యానించడం దుమారం రేపింది. ఈ అంశంపై మాట్లాడిన రాహుల్‌గాంధీ "పెంపుడు జంతువులకు బయట అనుమతి లేదు కానీ లోపల ఉంది" అని పార్లమెంటు భవనం కేసి చూపుతూ అన్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన భాజపా ఎంపీ, ఆ పార్టీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర "రాహుల్‌గాంధీ, రేణుకా చౌదరిల ప్రకటనలు పార్లమెంటు గౌరవానికి భంగం కలిగించాయి. ఈ ఇద్దరి పేర్లూ ఆర్ అనే అక్షరంతో మొదలవుతాయి. వారికి ఆర్ అక్షరంతో మొదలయ్యే మరో మాటను గురించి తెలియాలి. అదే రెస్పాన్సిబిలిటీ (బాధ్యత)" అని పాత్ర అన్నారు. నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్న కాంగ్రెస్ పార్టీ తన సొంత ఎంపీలను, మిత్రులను అవమానించడానికి వెనుకాడ లేనంతగా దిగజారిందని ఆయన విమర్శించారు.



సంబిత్ పాత్ర

## ప్రతీకార రాజకీయాలను న్యాయస్థానం గమనిస్తుంది

### నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్ నమోదుపై ఖర్గే

దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్ఐఆర్ నమోదు కావడంపై కాంగ్రెస్ మరోసారి విమర్శలు గుప్పించింది. ప్రతీకార రాజకీయాలతో మూర్ఖంగా వెంటాడుతున్నారని మోదీ సర్కారుపై విరుచుకుపడింది. 12 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అకస్మాత్తుగా గాంధీ కుటుంబంపై ఎఫ్ఐఆర్ నమోదుచేశారని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. "మోదీ సర్కారు, ఈడీ వద్ద కొత్త ఆరోపణలు చేయడానికి ఏమీ లేవు. వాస్తవాలు సన్నగిల్లినపుడు... ఎంపికచేసిన వారిపై కేసులు, పదేపదే ఆరోపణలు, ప్రత్యర్థులను కేసుల్లో ఉంచడానికి ప్రయత్నాలు వంటి నాటకీయ పరిణామాలు మొదలవుతాయి. ఈ రాజకీయ ప్రతీకార చర్యలను, వ్యక్తులను వెంటాడేందుకు చేసే బుద్ధిహీన ప్రయత్నాలను న్యాయస్థానం గమనిస్తుందని మేం భావిస్తున్నాం" అని ఖర్గే వ్యాఖ్యానించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులపై ఆదివారం దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే.

## కేరళలో ఎస్ఐఆర్ గడువు పెంపును పరిశీలించండి

### ఎన్నికల సంఘానికి సూచించిన సుప్రీంకోర్టు

దిల్లీ: కేరళలో ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)కు గణన పత్రాలను సమర్పించడానికి మరో వారం గడువు పెంచాల్సిందిగా సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. ఈ నెల 9 నుంచి 11 వరకు స్థానిక ఎన్నికలు, 13న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ విజ్ఞప్తి చేసింది. గడువు పెంచితే స్థానిక ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్న 1.76 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా గణన పత్రాలను సమర్పించేందుకు వీలుగా ఉంటుందని తెలిపింది. సానుభూతి, నిష్పాక్షికతలతో పిటిషనర్ల విజ్ఞప్తిని పరిశీలించి, రెండు రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాలని కోరింది. గణన పత్రాలను సమర్పించడానికి తొలుత ఈ నెల 4 వరకు ఉన్న గడువును ఇంతకుముందే 11 వరకు పెంచారని, ఎస్ఐఆర్ పనులను చూస్తున్న సిబ్బందిలో ఎవరూ ఎన్నికల విధుల్లో లేరని ఈసీ తరఫు న్యాయవాదులు తెలిపారు.

# ఏమిటీ సంచార్ సాథీ!

ఈటీవీ భారత్: సైబర్ మోసాలపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్ సంచలనం సృష్టిస్తోంది. ఇది తప్పనిసరని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొనడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఇంతకీ ఈ యాప్ ఏమిటి.. అసలు ఇది ఎలా పని చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

### ఫోన్ పోయినా బ్లాక్ చేసుకునే అవకాశం

మొబైల్ వినియోగదారుల భద్రత, సైబర్ మోసాలను అరికట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్‌లో అనేక అధునాతన ఫీచర్లున్నాయి. ఈ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిన తర్వాత ఫోన్ నంబరు కేంద్రీకృత డేటాబేస్‌ దీంతో అనుసంధానం అవుతుంది. చట్టబద్ధంగా తీసుకున్న ప్రతి మొబైల్ వివరాలు రికార్డయి ఉంటాయి. ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా ఈ యాప్ ద్వారా బ్లాక్ చేసేలా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఆ తర్వాత సంబంధిత మొబైల్ ఎక్కడా పని చేయకుండా అన్ని నెట్‌వర్క్‌లను అలర్ట్ చేస్తుంది. దాంతో సిమ్ మార్చినా ఫోన్‌తో ఉపయోగం లేకుండాపోతోంది.

### మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు

మరోవైపు అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు కాల్‌లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు. అంతేకాదు మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ పేరు మీద అనధికారికంగా ఏవైనా నంబర్లు ఉంటే ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. మొబైల్ చోరీకి గురైనా, పొరపాటున పారేసుకున్నా బ్లాక్ చేసే సదుపాయం ఇందులో ఉంది. మొబైల్ ఫోన్ ప్రామాణికతను సంచార్ సాథీ యాప్ సాయంతో గుర్తించొచ్చు. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. ఈ ఏడాది జనవరిలో సంచార్ సాథీ యాప్‌ను కేంద్రం విడుదల చేసింది. ఇది ఆండ్రాయిడ్, ఐవోఎస్ ప్లాట్‌ఫాంలలో అందుబాటులో ఉంది. హిందీతోపాటు 21 ప్రాంతీయ భాషల్లో ఉంది. ఇది దేశవ్యాప్తంగా దాదాపు అన్ని మొబైల్ కంపెనీల కస్టమర్లకు అందుబాటులో ఉంది.

## భారత్ వాణిజ్య లోటు ఆందోళనలను తీరుస్తాం: రష్యా

మాస్కో: అమెరికా లాంటి దేశాల నుంచి వస్తున్న వాణిజ్య ఒత్తిడుల నుంచి భారత్‌కు రక్షణ కల్పించేందుకు వీలుగా నిర్మాణాత్మక బంధాన్ని మరింతగా పటిష్ఠపరిచేందుకు రష్యా ప్రయత్నిస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనను ఇందుకోసం వినియోగించుకోవాలని చూస్తోంది. అయితే పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించిందని రష్యా పేర్కొంది. అయితే సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మంగళవారం వీడియో మాధ్యమం ద్వారా మీడియాతో మాట్లాడారు. 'వాణిజ్య లోటు, చిన్నతరహా మాడ్యులర్ అణు రియాక్టర్లలో సహకారం, రక్షణ, ఇంధన రంగంలో బంధాల వంటివి అధ్యక్షుడి పర్యటనలో ప్రధానాంశాలు' అని ఆయన తెలిపారు. భారత్‌పై అమెరికా, పశ్చిమ దేశాల ఆంక్షలు అక్రమమని వ్యాఖ్యానించారు. మోదీ, పుతిన్‌ల భేటీలో స్థానిక కరెన్సీలో వాణిజ్యం జరిపే అంశంపై చర్చ జరగనుందని పెస్కోవ్ వెల్లడించారు. అయితే ఈ విషయంలో భారత్‌పై ఒత్తిడిని తాము అర్థం చేసుకున్నామని చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్యంలో తీవ్ర అంతరం ఉందనే విషయం తమకు తెలుసని, తాము అధికంగా ఎగుమతులు చేస్తున్నామని, దిగుమతులు తక్కువగా చేసుకుంటున్నామని తెలిపారు. భారత్ నుంచి దిగుమతులను పెంచే అంశంపై ఆలోచిస్తున్నామని వెల్లడించారు.

## ఏకాంత కారాగారవాసంలో ఇమ్రాన్‌ఖాన్

- సోదరి ఉజ్మాఖాన్ ప్రకటన

లాహోర్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను ఆయన సోదరి డాక్టర్ ఉజ్మాఖాన్ మంగళవారం జైలులో సందర్శించారు. ఇమ్రాన్ సజీవంగా ఉన్నారని, ఏకాంత కారాగారవాసంలో మానసిక హింసకు గురవుతున్నారని ఆమె ప్రకటించారు. అయితే ఇమ్రాన్ ఆరోగ్యంగానే కనిపించారని చెప్పారు. రావల్పిండిలోని అడియాలా జైలులో బందీగా ఇమ్రాన్‌ఖాన్ ఉన్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం క్షీణించిందంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో జైలు సందర్శనకు ఉజ్మాఖాన్‌ను ప్రభుత్వం అనుమతించింది. 2023 ఆగస్టు నుంచి జైల్లో ఉన్న ఇమ్రాన్‌ను సందర్శకులు కలవడంపై గత నెలరోజులుగా అప్రకటిత నిషేధం అమలులో ఉంది. ఆయన ప్రాణాలతో ఉన్నారా అనే అనుమానాలు మొదలయ్యాయి. మంగళవారం భారీ ర్యాలీకి ఆయన అనుచరులు రంగం సిద్ధంచేశారు. వారిని అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో 144 సెక్షన్ విధించింది. బుధవారం వరకు బహిరంగ సభలు, ర్యాలీలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## బలోచిస్థాన్‌లో మహిళ ఆత్మాహుతి దాడి

### ఆరుగురు తీవ్రవాదుల మృతి

కరాచీ: పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉన్న పారామిలిటరీ దళం ప్రధాన కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద నిషేధిత బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ)కి చెందిన ఓ మహిళ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న తీవ్రవాదులు కార్యాలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా.. భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. దీంతో ఆరుగురు తీవ్రవాదులు మృతిచెందారు. చగాయీ జిల్లా నోకుండీ పట్టణంలో ఫ్రాంటియర్ కార్ప్స్(ఎఫ్‌సీ) ప్రధాన కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఆత్మాహుతికి పాల్పడిన మహిళను జినాటా రఫీక్‌గా గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## దేశంలో ప్రతి 811 మందికి ఒక డాక్టరు

దిల్లీ: దేశంలో ప్రతి 811 మంది ప్రజలకు ఒక అర్హత కలిగిన వైద్యుడు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంటుకు తెలిపింది. అల్లోపతి పద్ధతిలో చికిత్స చేసే వైద్యులు దేశంలో 13,88,185 మంది ఉండగా, ఆయుష్ వైద్య విధానంలో రిజిస్టర్ అయినవారు 7,51,768 మంది ఉన్నారని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. 'రిజిస్టర్ అయిన అల్లోపతి, ఆయుష్ వైద్యుల్లో 80 శాతం మంది అందుబాటులో ఉన్నారని భావించినా దేశంలో డాక్టర్లు 1:811 నిష్పత్తిలో ఉన్నారు' అని ఆయన వెల్లడించారు. అదే విధంగా దేశంలో యూజీ, పీజీ వైద్య కళాశాలల సంఖ్య గణనీయంగా పెరిగిందని నడ్డా తెలిపారు. వైద్య కళాశాలల సంఖ్య 2014 నుంచి ఇప్పటి వరకూ 387 నుంచి 818కి పెరిగిందని, అలాగే యూజీ మెడికల్ సీట్ల సంఖ్య 51,148 నుంచి 1,28,875కు పెరిగిందని వివరించారు. పీజీ వైద్య సీట్ల సంఖ్య 31,185 నుంచి 82,059కి పెరిగిందని వెల్లడించారు. వైద్యసేవలు అందుబాటులో లేని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో డాక్టర్ల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జిల్లా, రిఫరల్ ఆసుపత్రులకు అనుబంధంగా 157 వైద్య కళాశాలలకు అనుమతి ఇవ్వగా వాటిలో 137 పని చేస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రజానీకానికి సరైన వైద్య సేవ అందించడానికి ఎంబీబీఎస్ పాఠ్య ప్రణాళికలో ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగ్రాం పొందుపరిచామని మంత్రి వివరించారు.

# వసుంధర

vasundhara@eenadu.in

## ఒత్తిడి తగ్గించే... మెరిసే బంతి!



చిన్న పనికే కోపమా... ఎవరైనా ఒక్కమాట అంటే ఉక్రోషంతో కళ్ల నీళ్లు వస్తున్నాయా? బాధ్యతలు భారంగా, పనులు పూర్తి చేయడం కష్టంగా... మనసు ఆందోళనగా ఉంటోందా? అయితే, ఇది ఒత్తిడి కావొచ్చు. మారిన జీవనశైలి... చిన్నా, పెద్దా అందరినీ ఒత్తిడి బారిన పడేలా చేస్తోంది. ఈ వరుసలో మహిళలే ముందుంటున్నారని చెబుతున్నాయి అధ్యయనాలు కూడా. అందుకే,



దీన్ని అదుపులో ఉంచడానికి జెన్‌జీలు జపనీస్ ఆర్ట్ థెరపీ డొరోడాంగోను ఎంచుకుంటున్నారట. జపాన్‌లో పిల్లలు ఆడుకునే ఈ ఆటే మా స్ట్రెస్ థెరపీ అని చెబుతున్నారు. ఇంతకీ ఇదేంటనేగా మీ సందేహం. మెత్తగా జల్లించిన మట్టి, సన్నటి ఇసుక, కాసిని నీళ్లు కలగలిపి దీన్ని చేస్తారు. ఎక్కువ సేపు ఏకాగ్రతతో చేసే పని ఇది. గుండ్రంగా ఒత్తుతూ, మట్టిని పొరలు పొరలుగా అద్దుతూ మెరిసే గాజు బంతిలా దీన్ని తయారు చేస్తారు. ఒత్తిడి తగ్గించే ఈ నేచర్ థెరపీ మెదడుని ప్రశాంతంగా ఉంచుతుంది. ఓపికనూ, ఏకాగ్రతనూ మెరుగుపరుస్తుంది. చేతులు, వేళ్ల కండరాలు బలోపేతం అవుతాయి. ఆర్థరైటిస్ నొప్పులున్న మహిళలకు మంచి థెరపీగానూ పనిచేస్తుంది. సృజనాత్మకమైన ఈ పని ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. మరి మీరూ ప్రయత్నిస్తారా!

## నిద్ర రాదేం?



**ఉదయం నిద్ర లేచినప్పట్నుంచే మగత. ఆఫీసులో ఒకటే ఆవలింతలు. పనులన్నీ ముగించుకుని, పిల్లల్ని నిద్రపుచ్చి పడుకుందామంటే నిద్ర రాదే? మెనోపాజ్ కాదు, పీరియడ్ దగ్గర్లోనూ లేదు. పగలంతా విసిగించి... రాత్రికి మాత్రం కునుకు పట్టదు. ఎందుకిలా అంటే...**

పనులన్నీ ముగించుకున్నాం అని పైకి మాత్రమే అనుకుంటారట ఆడవాళ్లు. మనసులో మాత్రం ఆరోజుకు సంబంధించిన సంఘటనలు, రేపు చేయాల్సిన పనులు... ఇలాంటివి ఆలోచిస్తుంటారట. వీటన్నింటితో బుర్రని నింపేస్తే ఇక నిద్రెలా వస్తుంది?

**ఏం చేయాలి?:** పని అవ్వగానే ఓ పది నిమిషాలు కూర్చోండి. ఆరోజు జరిగినవి ఏమైనా ఉంటే ఆలోచించుకోండి. గుర్తుంచుకోవాల్సినవి, మరుసటి రోజు మర్చిపోతాం అనుకున్నవి ఓ పుస్తకం పెట్టుకుని రాయండి. అప్పుడు బుర్ర ఖాళీ అవుతుంది. నిద్రా పడుతుంది.

### ఎండ పొడే తాకదా?



ట్యాన్ పడుతుంది, ముడతలు, వృద్ధాప్య ఛాయలకు కారణమవుతుందని ఎండలోకే వెళ్లరా? జాగ్రత్త మంచిదే. కానీ నిద్రమీద సూర్యుడి వెలుగూ ప్రభావం చూపుతుంది. ఇది మెలటోనిన్ విడుదలకు కారణమవుతుంది. పగటివేళ అలర్ట్‌గా ఉంచి, రాత్రివేళ నిద్రకు కారణమయ్యే హార్మోను ఇది. ఎంతసేపూ ఇంట్లోనే కర్టెన్లన్నీ మూసుకుని కూర్చుంటే కునుకు రాకపోగా అలసట.

**ఓ పావుగంట:** ఉదయాన్నే 15-30 నిమిషాలు ఎండలో గడపండి. ఇది మెదడుకి పగలన్న సంకేతాలను పంపుతుంది. రాత్రివేళ చక్కని నిద్రకు కారణమవుతుంది.

### వ్యాయామం మాటేంటి..



పగలు చురుకుగా ఉండేలా చేయడం, రాత్రి చక్కని నిద్ర వచ్చేలా చేయడం... వ్యాయామం ప్రత్యేకత. శారీరక శ్రమ లేకపోయినా బద్ధకంగా, అలసిపోయినట్లుగా అనిపిస్తుంది.

**తప్పనిసరి:** రోజూ కొద్దిసేపు నచ్చిన వ్యాయామం చేయండి. సరదాగా పాటలు పెట్టుకుని కాలు కదిపినా సరే! కానీ ఏదో ఒకటి చేయడం మాత్రం తప్పనిసరి. అయితే... పగలే చేయాలి. నిద్రకు ముందు చేస్తే శరీరం ఉత్తేజితమై కునుకు రాదు.

### అది సరిగా లేదేమో!



మంచం మీద మడత వేయాల్సిన దుస్తులు, పక్కనే ల్యాప్‌టాప్, బొమ్మలు... ఇవీ నిద్రకు భంగం కలిగించేవే. ఆటలు, పని గుర్తుచేసే ఏ వస్తువైనా మెదడుని విశ్రాంతి తీసుకోనివ్వవు.

**తీసేయండి:** మంచం మీద వేటినీ ఉంచొద్దు. పని, ఆటలకు సంబంధించిన వాటికి పడక గదిలో చోటివ్వొద్దు. గజిబిజి మంచమూ నిద్రకు శత్రువే. దాన్నీ ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోండి. డిమ్ లైట్, సువాసనలతో కూడిన డిఫ్యూజర్ ఇంకా సేదతీరేంత చల్లగా గది... ఇలా ఉండేలా చూసుకోండి. ఎప్పుడు కలల ప్రపంచంలోకి అడుగుపెట్టారో కూడా తెలియదు.

### వేళలు పాటిస్తారా?



పని అవ్వడం మాత్రమే ప్రామాణికం కాకూడదు. ముఖ్యంగా రోజుకో సమయానికి పడుకుంటే జీవగడియారం దెబ్బతింటుంది. ఒకవేళ అప్పటికి నిద్రపట్టినా మెలకువ వస్తే మళ్లీ రమ్మన్నా రాదు.

**పరిష్కారం:** నిద్ర వేళలు పాటించండి. ఒకే వేళకి పడుకోవడం, లేవడం అలవాటు చేసుకోండి. వారాంతాల్లోనూ దీనికి కట్టుబడి ఉండాల్సిందే. అప్పుడు చూడండి... కచ్చితంగా నిద్ర సమస్య ఉండదు.

### ఒత్తిడి ఉందేమో!



'ఉద్యోగినులకు అయితే ఉంటుంది. ఇంట్లో మాకేం ఒత్తిడి?'... చాలామంది గృహిణుల ఆలోచన ఇదే. కానీ దీనికి ఎవరూ అతీతులు కాదు. భుజాలు బిగుసుకున్నట్లుగా అనిపించడం, ఏవేవో ఆలోచనలు చుట్టుముట్టడం, అస్తమానూ అసౌకర్యంగా ఉండటం... ఇవన్నీ దీనికి సంకేతాలే. శరీరంలో కార్టిసాల్ విడుదలకు చిహ్నాలే. ఇక నిద్రకు తావేది?

**ఇలా చేయండి:** ఏమవుతుందోనన్న కంగారొద్దు. అలాగే పడుకునీ ఉండొద్దు. దీర్ఘశ్వాసలు తీసుకుని వదలడం, ధ్యానం, కొద్దిసేపు నడక, స్ట్రెచింగ్, యోగా వంటివి ప్రయత్నించండి. ఇవన్నీ శరీరాన్నీ మనసునీ నెమ్మదింపచేస్తాయి. సుఖనిద్రకు కారణమవుతాయి.

శరీరానికి తిండితోపాటు నిద్ర కూడా చాలా అవసరం. దాన్నే ఎక్కువగా త్యాగం చేస్తుంటారు మహిళలు. కానీ ఈ తీరు అనారోగ్యాల పాలు చేయగలదు. కాబట్టి, దీనికీ ప్రాధాన్యం ఇవ్వండి. చక్కని నిద్ర... దాంతోపాటు ఆరోగ్యాన్నీ సొంతం చేసుకోండి.

## ఆఫీసుకు ఆలస్యంగా వస్తోంది!

**ఒక మధ్యస్థాయి టెక్ కంపెనీలో బృందానికి నాయకత్వం వహిస్తున్నా. ఒక ఉద్యోగి తరచూ ఆలస్యంగా ఆఫీసుకి వస్తుంటుంది. ఒక మహిళగా తనకుండే కుటుంబ బాధ్యతల్ని అర్థం చేసుకోగలను. దాంతో కొంతమేర వెసులుబాటు కల్పిస్తున్నా. అంతటితో ఆగకుండా సహోద్యోగుల దగ్గరకు వెళ్లి 20-25 నిమిషాలు మాట్లాడుతుంటుంది. సమావేశాలకూ ఆలస్యంగా వస్తుంటుంది. బృంద సభ్యుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. పనిష్మెంట్ ఇవ్వకుండానే ఈమెను గాడిలో పెట్టేదెలా? – ఎస్.మేఘన, హైదరాబాద్**

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

చిన్నదిగా కనిపిస్తున్నా, ఆఫీసులో ఇతరులపైనా ప్రభావం చూపే సమస్య ఇది. ఇలాంటి చిన్న చిన్న కారణాలు పని వాతావరణాన్ని పాడుచేస్తాయి. కానీ ఆమె ఆలస్యం వెనక కారణాన్ని గ్రహించండి. పిల్లలు, ప్రయాణం, అనారోగ్యం... ఇవేమైనా ఉన్నాయా? లేక పనిపైన శ్రద్ధ లేకపోవడమా? అన్న కోణంలో ఆలోచించండి. ఆమె చరిత్ర అంతా తెలుసుకోకపోయినా, ఆలస్యమవుతోన్న విషయాన్ని ఆమె దగ్గర ప్రస్తావించండి. 'నీకు ఈమధ్య బాగా ఆలస్యం అవుతున్నట్లుంది. ఏమైనా ఇబ్బందా?' అని అడిగితే... ప్రశ్న సూటిగా ఉంటూ నిందారోపణలానూ అనిపించదు. ఇది టైమ్ గురించే కాదు, నమ్మకానికి సంబంధించిన అంశం. సమయపాలన పాటించేవాళ్లకి 'నిబంధనలు అందరికీ ఒకేలా ఉండవా' అనిపిస్తుంది. ఆమె చెప్పింది జాగ్రత్తగా వినండి, ఆ మాటల్లో నిజాయతీని బేరీజు వేయండి. అక్కడితో సమస్య పరిష్కారమైతే పరవాలేదు. లేదంటే ఉన్నతాధికారిగా మాట్లాడండి. టైమ్ విషయంలో కంపెనీ పాలసీని చెప్పండి. వాటిని అధిగమిస్తే ఉండే పరిణామాల్ని వివరించండి. బెదిరింపులా కాకుండా, ఆలస్యంవల్ల మొత్తం టీమ్‌కి ఎలాంటి ఇబ్బంది ఉంటుందో చెప్పండి. అప్పటికీ మార్పు రాకుంటే చర్యలు తీసుకోవాల్సిందే.

సహోద్యోగులపైన సహానుభూతి చూపాల్సిందే. కానీ పనిలో బాధ్యతా ముఖ్యమనే విషయాన్ని స్పష్టం చేయండి. అప్పుడే సమస్యని ఎదుగుదలకు అవకాశంగా మలిచినట్లు అవుతుంది.



**భారత్‌లో మహిళల హక్కుల గురించి దశాబ్దాలుగా ఉద్యమిస్తూ, ఎన్నో మార్పులు తెచ్చాం. కానీ ఎంత చేస్తున్నప్పటికీ, ఇంకా కొంత మిగిలే ఉన్నట్లుగా అనిపిస్తోంది. గృహహింస చట్టం తీసుకుంటే... చాలా కఠినమైన సెక్షన్లు రూపొందించారు. కానీ, కోర్టులు ఈ కేసుల్లో విచారణ తేదీల్ని రెండు మూడు నెలలకుగానీ కేటాయించవు. మహిళలు కోర్టుల్ని ఆశ్రయించినా ఆలస్యం కారణంగా ఇబ్బందులు కొనసాగుతూనే ఉంటాయి.**

**- ఫ్లవియా ఆగ్నెస్, మహిళా హక్కుల ఉద్యమకర్త**

## ఆంగ్ల ఉపాధ్యాయురాలు... తెలుగుపై ప్రేమ!



**పదవీ విరమణ చేశానని విశ్రాంతికే పరిమితం కాలేదు. అమ్మ భాషకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించి ఆవేదన చెందారు. దానికి అడ్డుకట్ట వేయాలని... 'తె.లి.కా.' పేరుతో అక్షరసేద్యం చేస్తున్నారు... మారేపల్లి సూర్యకుమారి.**

నేటి తరం పిల్లలు ఒక్క వాక్యం మాట్లాడితే దానిలో సగానికి పైగా ఆంగ్ల పదాలే. టీవీ కార్యక్రమాలు, స్కూళ్లలోనూ ఆంగ్ల జపమే. ఇలాగైతే తెలుగు బతికేదెలా? అన్న ఆలోచన వచ్చింది సూర్యకుమారికి. దీనికితోడు చెన్నపురి తెలుగు ట్రస్టు వ్యవస్థాపకులు తూమాటి సంజీవరావు రాసిన 'చతికిలబడ్డ తెలుగు' పుస్తకం చదివాక ఆమె మరింత ఆవేదన చెందారు. అందుకే తెలుగును కాపాడటానికి తనవంతుగా ఏదైనా చేయాలనుకున్నారు. ఏడాదిపాటు పరిశోధన చేసి తెలుగు లిపి కాపాడుకుందాం (తె.లి.కా.) ప్రారంభించారు. ఈమెది ఒంగోలు. ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేసిన ఈమె... 2005లో ప్రధానోపాధ్యాయురాలిగా పదవీ విరమణ చేశారు.

సూర్యకుమారి కొన్ని స్కూళ్లను ఎంపిక చేసుకుని వారానికి మూడు రోజులు చొప్పున తెలుగు బోధన చేస్తున్నారు. ఇందుకోసం కొందరు వలంటీర్లను ఎంచుకున్నారు. వారికి సొంతంగా గౌరవ వేతనాన్నీ అందిస్తున్నారు. నాగులుప్పలపాడు, కొత్తపట్నం, ఒంగోలు, సంతనూతలపాడు తదితర మండలాలకు తన సేవలను విస్తరించారు. వారానికో పాఠశాలను ఎంచుకుని అక్షరమాల దగ్గర్నుంచి శతక పద్యాల వరకు అన్నీ నేర్పిస్తారు. చిన్న వాక్యాలు, సామెతలు, వాటి అర్థాలు తెలుసుకోవడం వంటివాటిపై అభ్యాసాలు ఇస్తారు. పోటీలను పెట్టి, గెలిచినవారికి బహుమతులూ ఇస్తున్నారు. 'నా తోటి సహాధ్యాయులు, స్నేహితులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహకారంతో 'తె.లి.కా.'ని ముందుకు తీసుకెళుతున్నా. దీనికయ్యే ఖర్చుకి నా పింఛన్ డబ్బునే ఉపయోగిస్తున్నా. తాజాగా కొందరు సాయానికి ముందుకొచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులనీ కొంత సమయం కేటాయించమని కోరుతున్నా. భాషను బతికించుకోవడానికి నావంతు ప్రయత్నమిది. ప్రభుత్వం కూడా తెలుగును తప్పనిసరి చేయాలి. అప్పుడే తెలుగు భాష ఉజ్వలంగా వెలుగుతుంది' అంటారు సూర్యకుమారి.



– టి.ప్రభాకర్, గుంటూరు

## శీతకాలంలో గ్లిజరిన్ సోయగం!



చలికాలంలో చర్మం పొడిబారడం, పెదాలు, పాదాల పగుళ్లు... లాంటి సమస్యలు సాధారణం. సులువుగా దొరికే గ్లిజరిన్‌తో ఇంట్లోనే మీకు కావలసిన పరిష్కారాల్ని పొందొచ్చు.

- **లిప్‌బామ్:** సమాన నిష్పత్తిలో తేనె, గ్లిజరిన్ కలిపి రాత్రిపూట పెదాలకు రాయండి. ఇలా కొన్ని రోజులు చేస్తే అవి గులాబీ రంగులోకి మారడంతోపాటు పగలడమూ తగ్గుతుంది.
- **ఫుట్ క్రీమ్:** రెండు చెంచాల చొప్పున గ్లిజరిన్, రోజ్‌వాటర్ తీసుకుని దానికి చెంచా నిమ్మరసం కలిపి రోజూ రాత్రిపూట పాదాలకు రాయండి. ఇలా వారంలో మూడు నాలుగు సార్లైనా చేస్తే సరి. పగుళ్ల తగ్గి మడమలు మృదువుగా మారతాయి.
- **హ్యాండ్ క్రీమ్:** రెండు టీ స్పూన్ల గ్లిజరిన్‌కి చెంచా ఆలివ్ ఆయిల్, ఒక విటమిన్ ఈ క్యాప్సూల్ కలిపి చిన్నబాటిల్లో పెట్టండి. దీన్ని రోజూ చేతులు కడుక్కున్న తర్వాత రాసుకోండి. ఎంత కోమలంగా ఉంటాయో!
- **హెయిర్ మాస్క్:** ఈ కాలంలో జుట్టు నిర్జీవంగా మారకుండా ఒక టేబుల్ స్పూన్ గ్లిజరిన్, ఒక గుడ్డు తెల్ల సొన, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి జుట్టుకు రాయండి. ఆపైన ఓ అరగంట ఉంచి తల స్నానం చేస్తే సరి. జుట్టు మెత్తగా మారుతుంది.

## కళలకు జీవం పోస్తున్నారు!

**ఆమె చదువుకున్నది పదో తరగతి వరకే! అయితేనేం హస్తకళలకు జీవం పోస్తున్నారు. తాటి ఆకులపైన ఒకప్పుడు తన పూర్వికులు ప్రదర్శించిన కళకు తిరిగి ప్రాణం పోస్తున్నారు. ఆత్మగౌరవంతోపాటూ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పిస్తూ మహిళల జీవితాల్లో కొత్త రంగులు నింపుతున్నారు... 32ఏళ్ల సుచిత్ర జెనా.**



సుచిత్ర

ప్రకృతి మనకు ప్రసాదించే ప్రతి వనరులోనూ ఓ కళ దాగుంటుందని నమ్ముతారు సుచిత్ర. అందుకే ఎండిన తాటిఆకుల్ని కూడా అందమైన కళాఖండాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఒడిశాలోని కేంద్రపాడ జిల్లా, నారన్‌పుర్ అనే చిన్న గ్రామం తనది. చిన్నప్పటి నుంచి ప్రకృతి ఒడిలోనే పెరిగారీమె. అమ్మానాన్నలు వ్యవసాయం చేయడంతో చిన్నప్పుడు వారితో కలిసి పొలం వెళ్లేది. అక్కడ ఎటుచూసినా చుట్టూ ఎత్తైన తాటిచెట్లు కనిపించేవి. తనకు తెలియకుండానే వాటితో అవినాభావ సంబంధం ఏర్పరుచుకున్నారామె. దాంతో అంతరించిపోతున్న తమ పూర్వికుల కళలకు జీవం పోయాలనుకున్నారు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి ఉండటంతో సుచిత్ర పదో తరగతి పూర్తయ్యాక భువనేశ్వర్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఐడీఏసీ)లో చేరి తాటాకులపై బొమ్మలు వేయడంలో శిక్షణ తీసుకున్నారు. కళపై ఉన్న మక్కువతో అనతికాలంలోనే దానిలోని మెలకువలన్నీ నేర్చుకున్నారీమె. 'ఒడిశాలోని పూరీ జగన్నాథుని ఆలయం... శ్రీకృష్ణుడు, జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర మూర్తుల చిత్రాలను ఈ ఆకులపై చెక్కుతాం. ఈ ప్రక్రియ మొత్తం ఏడుదశల్లో జరుగుతుంది. ముందు లేత తాటాకుల్ని సేకరించి, పురుగు పట్టకుండా పసుపు నీటిలో నానబెడతాం. తర్వాత ఆరనిచ్చి కత్తిరిస్తాం. ఆపై డిజైన్లు గీసి రంగులు వేస్తాం. ఒక లాకెట్ తయారు చేయడానికి 5-6 రోజులు పడుతుంది. ఒక్కోటి మార్కెట్‌లో దాదాపు రూ.7-8వేల ధర పలుకుతుంది. అయితే ఇది దానిపై ఉండే కళాఖండంపై ఆధారపడి ఉంటుంది. వీటిని వివాహాలు, పుట్టినరోజులకు బహుమతులుగా ఇస్తుంటారు. దాంతో మేం చేసే ఈ వస్తువులకి డిమాండ్ పెరిగింది. పిల్లల్నీ, కుటుంబాన్నీ చూసుకుంటూ ఇంటి దగ్గరే ఈ పని చేస్తున్నా. తల్లిగా, భార్యగా, కళాకారిణిగా నా పాత్రను సమతుల్యం చేసుకుంటున్నా. ఇప్పుడు ఐదుగురు వర్కర్లతో ఉత్పత్తుల్ని తయారుచేయిస్తూ ఏడాదికి రూ.5-6 లక్షలు సంపాదిస్తున్నా. అందుకే ఈ కళను గ్రామంలో మహిళలకీ నేర్పించాలనుకున్నా. అప్పుడు వాళ్లూ ఇంట్లో ఉండి కూడా ఆర్థికంగా స్థిరపడొచ్చు' అంటున్నారు సుచిత్ర.



ఒడిశా సాంస్కృతిక చరిత్రలో తాటి ఆకులకి ప్రత్యేక చరిత్ర ఉంది. ఒకప్పుడు పిల్లలు పుట్టిన వెంటనే వారి జాతకం రాయడానికీ పురాతన దేవరహస్యాలనూ, ఆయుర్వేద, వైద్య పద్ధతుల్నీ తాళపత్ర గ్రంథాల రూపంలోనే భద్రపరిచేవారు. నేటి డిజిటల్ యుగంలో వాటి వాడకం తగ్గినప్పటికీ వాటి ప్రాముఖ్యత తగ్గలేదు. ప్రభుత్వం కూడా ఈ కళకు జీవం పోయాలనుకుంది. హస్తకళల శాఖ సుచిత్రతో అక్కడి మహిళలకు శిక్షణ ఇప్పిస్తోంది.



## బంగారం - వెండి

2న ముగింపు

| | బంగారం (24క్యా) | ఆర్నమెంట్ (22క్యా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,32,750 | 1,19,750 | 1,83,541 |
| విజయవాడ | 1,28,410 | 1,19,350 | 1,80,100 |
| ప్రొద్దుటూరు | 1,27,900 | 1,17,670 | 1,75,000 |
| రాజమహేంద్రవరం | 1,30,200 | 1,19,350 | 1,96,000 |
| విశాఖపట్నం | 1,29,730 | 1,19,350 | 1,80,000 |
| తమిళనాడు | ----- | 1,20,400 | 1,96,000 |

## ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

## పడవ మీద... టీ అక్క!



**సాయంత్రం 4 అవుతోందంటే చాలు... అక్కడి వాళ్ల చూపులన్నీ నీళ్లకేసి వెతుకుతుంటాయి. ఆమె కనిపించడం ఆలస్యం వెంటనే గట్టు దగ్గరికి వెళ్లిపోతారు. ముఖమ్మీద చిరునవ్వు... వేడివేడిగా ఆమె ఇచ్చే ఓ మసాలా టీ కోసమే ఆ ఎదురు చూపులన్నీ!**

దేశంలో అందమైన ప్రదేశాల జాబితాలో కేరళ తప్పక ఉంటుంది. అక్కడి కుమారకోమ్‌లోని కోకోనట్ లాగూన్‌కి పర్యటకులు ఎక్కువగా వస్తుంటారు. అయితే ప్రకృతి అందాలకోసమే కాదు... 'ఛాయా చేచి' కోసం కూడా. అసలు పేరు శాంతకుమారి. మొదట్లో ఓ టీ దుకాణం నడిపేవారామె. తరవాత ఓ పడవను సమకూర్చుకుని అందులో చిన్నపాటి పొయ్యి ఏర్పాటుచేసుకుని టీ అందివ్వడం మొదలుపెట్టారు. రోజూ సాయంకాలం ఆమె అలా పడవను నడుపుతూ రావడం... వేడివేడిగా టీ, తన చేత్తో చేసిన స్నాక్స్‌ను అందివ్వడం... స్థానిక అందాలు, సంప్రదాయాల గురించి కథలుగా చెప్పడం వంటివి పర్యటకులను బాగా ఆకర్షించాయి. దీంతో ఆమెకోసం ప్రత్యేకంగా వస్తున్న వాళ్లూ ఉన్నారట. కేవలం వ్యాపారం మీదే దృష్టిపెట్టరామె. అలసిపోయిన స్థానిక పడవల వాళ్లు, పేదవారికి ఉచితంగా టీ, స్నాక్స్ అందించి మాట కలుపుతుంటారట. అదీ అందరి మనసూ గెలుచుకుంది. వర్షకాలం, మంచుకురిసే వేళల్లో ఆమె ప్రయాణం కష్టమే. అయినా వాటికీ సిద్ధమై పదకొండేళ్లుగా తన ప్రయాణం కొనసాగిస్తున్నారు. నిజానికి అక్కడ ఆమె అసలు పేరు ఎవరికీ తెలియదు. ఛాయా చేచి అంటే టీ అక్కగానే అందరికీ పరిచయం. ఆప్యాయతతో కూడిన చిరునవ్వు... వేడివేడి మసాలా టీ రుచి చూసినవాళ్లంతా ఆమె గురించి సోషల్‌మీడియాలో పంచుకోవడం మొదలుపెట్టారు. అలా కూడా నెట్టింట పేరు తెచ్చుకున్నారీ ఛాయా చేచి. ఇది గమనించే స్థానిక అధికారులూ ఆమెను ప్రచారకర్తగానూ వినియోగించుకుంటున్నారు. ఒక సామాన్య మహిళ... స్వయంకృషితో తన కాళ్ల మీద తను నిలబడటమే కాదు... తన ప్రాంతానికి గుర్తింపు తేవడం గొప్పే కదా!

## ఆకట్టుకుంటున్న పోర్సిలిన్ అందాలు..!



మన వంటింట్లో ఇప్పుడు ఎటు చూసినా... ప్లాస్టిక్ వస్తువులే. బాక్సులు మొదలుకొని, తినే కంచాల వరకూ ప్రతిదీ ప్లాస్టిక్ లేదా స్టీల్. కానీ ఒకప్పుడు అలా కాదు. వెండి, రాగి, ఇత్తడికి చోటు ఎక్కువ. ముఖ్యంగా పోర్సిలిన్‌తో చేసిన వస్తువుల్ని ఎక్కువగా వాడేవారట. చైనాలో వీటిని తయారుచేసేవారు. మధ్యయుగంలో తయారీదారులు తెల్లటి ఫెల్డ్‌స్పాతిక్ అనే రాయిని తొలిచి పొడిగా చేశారట. దానిలో కయోలిన్ అనే చైనా క్లేను కలిపి... 1450 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడి చేస్తే పోర్సిలిన్ మిశ్రమం తయారు అయ్యిందట. దాంతో పాత్రలు, డిన్నర్‌సెట్లు, స్పూన్లు, పచ్చడి జార్‌లు... లాంటి వంటింటి సామాన్లన్నీ తీసుకువచ్చారు. ధర ఎక్కువ, నిర్వహణా లోపం, లభ్యత వంటి రకరకాల కారణాలతో, కాలం గడుస్తున్న కొద్దీ పోర్సిలిన్ ఉనికిని కోల్పోయింది. ఆ చోటును గాజు పాత్రలు భర్తీచేశాయి. అతిథులు వచ్చినప్పుడో... పండుగలకో, పబ్బాలకో వీటిని వాడటం మొదలుపెట్టారు. కానీ ఇప్పుడు మళ్లీ పోర్సిలిన్ వస్తువుల కోసం వెతుకుతున్నారట గృహిణులు. అందుకే ఈతరం అభిరుచికి తగినట్లు రకరకాల చిత్రాలు, పువ్వులు, స్టోన్స్‌ను అతికిస్తూ వినూత్నంగా తీసుకువస్తున్నారు తయారీదారులు. కొన్ని డబుల్ కలర్స్‌లోనూ మురిపిస్తూ చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. మీకూ నచ్చాయా! ఆన్‌లైన్ వేదికల్లో దొరుకుతున్నాయి తెచ్చేసుకోండి మరి!



# ఛాంపియన్


రోహిత్

ప్రత్యర్థి ముందు 350 లక్ష్యాన్ని నిలిపినా.. ఆఖర్లో ఉత్కంఠ తప్పలేదు. తొలి వన్డేలో విజయం కోసం భారత్ చాలా కష్టపడాల్సి వచ్చింది. తేలిగ్గా గెలవాల్సిన మ్యాచ్‌ను పీకల మీదికి తెచ్చుకున్న భారత్.. సిరీస్ గెలవాలంటే మెరుగైన ప్రదర్శన చేయాల్సిందే. తొలి వన్డేలో సత్తా చాటిన సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలపై భారీ అంచనాలే ఉండగా.. రాంచీలో కంగారు పెట్టిన బౌలర్లు రాయ్‌పుర్‌లో అయినా నిలకడగా రాణిస్తారేమో చూడాలి.

మధ్యాహ్నం 1.30 నుంచి

దక్షిణాఫ్రికాతో భారత్ రెండో వన్డే నేడు

# సిరీస్ అందుతుందా?


కోహ్లి

రాయ్‌పుర్

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను విజయంతో ఆరంభించిన టీమ్‌ఇండియా.. ఇప్పుడిక సిరీస్ విజయంపై కన్నేసింది. రాయ్‌పుర్‌లో బుధవారం జరిగే రెండో వన్డేలోనూ నెగ్గి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భారత్ చూస్తోంది. రాంచిలో బ్యాటర్లు అంచనాలకు మించి రాణించారు. ఆ వేదికలో రికార్డు స్కోరు (349) సాధించి పెట్టారు. అయినా బౌలర్ల వైఫల్యంతో చివరి వరకు ఉత్కంఠ తప్పలేదు. బుమ్రా, సిరాజ్ లేక అనుభవం తగ్గిన పేస్ దళం.. బౌలింగ్‌కు అనుకూలించే రాయ్‌పుర్‌లో అయినా కట్టుదిట్టంగా బంతులేస్తుందేమో చూడాలి.

**పంత్‌కు ఛాన్సుందా?:** తొలి వన్డేలో కోహ్లి సూపర్ సెంచరీ సాధించడం.. మరో సీనియర్ స్టార్ బ్యాటర్ రోహిత్‌తో పాటు కెప్టెన్ రాహుల్ అర్ధశతకాలు చేయడంతో భారత్ భారీ స్కోరు సాధించి గట్టెక్కింది. రెండో మ్యాచ్‌లోనూ ఈ ముగ్గురి మీద భారీ అంచనాలున్నాయి. మరోసారి రో-కో మెరుపులు చూడాలని అభిమానులు ఆశిస్తున్నారు. గతంలో రాయ్‌పుర్‌లో జరిగిన ఏకైక వన్డేలో రోహిత్ అర్ధశతకం సాధించాడు. ఆ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను భారత్ 108 పరుగులకే కుప్పకూల్చింది. అప్పుడు పేసర్లు, స్పిన్నర్లు సమష్టిగా సత్తా చాటారు. ఇక్కడి పిచ్ బౌలర్లకు అనుకూలం కాబట్టి బ్యాటర్లు ఆచి తూచి ఆడాల్సిందే. తొలి వన్డేలో మాదిరి భారీ స్కోర్లు ఆశించలేం. వన్డేల్లో నిలదొక్కుకోవాలని చూస్తున్న యశస్వి జైస్వాల్.. ఈ మ్యాచ్‌లో అయినా పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడేమో చూడాలి. నాలుగో స్థానంలో విఫలమైన రుతురాజ్ స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను ఆడించే అవకాశాన్ని భారత్ పరిశీలిస్తోంది. అయితే ఒక్క మ్యాచ్‌కే పక్కనపెడితే రుతురాజ్ పట్ల కఠినంగా వ్యవహరించినట్లు అవుతుంది. మరి జట్టు యాజమాన్యం ఏం చేస్తుందో? తుది జట్టులో ఈ ఒక్క మార్పే ఉండొచ్చు. తొలి వన్డేలో జట్టుకు మంచి ఆరంభం దక్కినా.. తర్వాత బౌలర్లు ధారాళంగా పరుగులు ఇచ్చేయడం భారత్‌ను కలవరపాటుకు గురి చేసింది. అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలతో కూడిన పేస్ త్రయం ఈ మ్యాచ్‌లో ఎలా బౌలింగ్ చేస్తుందో చూడాలి. 4 వికెట్లతో ఆకట్టుకున్న స్పిన్నర్ కుల్‌దీప్‌పై మంచి అంచనాలున్నాయి. వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్ పాత్రకు ఈ మ్యాచ్‌లో అయినా న్యాయం చేస్తాడని జట్టు చూస్తోంది. మిడిలార్డర్లో జడేజాతో కలిసి అతను బ్యాటుతో సత్తా చాటాల్సి ఉంది.

**రెండు మార్పులతో దక్షిణాఫ్రికా!:** రెండో వన్డేకు దక్షిణాఫ్రికా తుది జట్టులో రెండు మార్పులు చేయబోతోంది. తొలి వన్డేకు విశ్రాంతి తీసుకున్న కెప్టెన్ బవుమా, స్పిన్నర్ కేశవ్ మహరాజ్.. ఈ మ్యాచ్‌లో ఆడబోతున్నారు. బవుమా కోసం వికెట్ కీపర్ బ్యాటర్లు ర్యాన్ రికిల్‌టన్, క్వింటన్ డికాక్‌లలో ఒకరు తమ స్థానాన్ని త్యాగం చేయాల్సి ఉంటుంది. ఈ ఇద్దరూ తొలి వన్డేలో డకౌటయ్యారు. మరి ఎవరిపై వేటు పడుతుందో? తొలి వన్డేలో భారత బ్యాటర్ల ధాటికి కుదేలైన సుబ్రయెన్ స్థానంలోకి కేశవ్ మహరాజ్ వస్తాడు. రాంచిలో ఓడినప్పటికీ.. దక్షిణాఫ్రికా పోరాటం ఆకట్టుకుంది. 350 పరుగుల ఛేదనలో 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినా.. ఒక దశలో 130/5తో నిలిచినా.. ఆ జట్టు ఆశలు కోల్పోలేదు. బ్రీజ్కే, యాన్సెన్, బోష్‌ల అసాధారణ పోరాటంతో విజయానికి చేరువగా వచ్చింది. బ్రెవిస్, జోర్జి కూడా కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆ స్ఫూర్తితో రెండో వన్డేలో గెలిచి సిరీస్ ఫలితాన్ని మూడో మ్యాచ్‌కు తీసుకెళ్లాలని సఫారీ జట్టు చూస్తోంది. ఈ మ్యాచ్‌లో టాప్‌ఆర్డర్ గాడిన పడాలని ఆ జట్టు కోరుకుంటోంది. బౌలింగ్‌లో యాన్సెన్, బర్గర్, కేశవ్‌లపై దక్షిణాఫ్రికా ఆశలు పెట్టుకుంది.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** రోహిత్, యశస్వి, కోహ్లి, రుతురాజ్/పంత్, రాహుల్, సుందర్, జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్.

**దక్షిణాఫ్రికా:** మార్‌క్రమ్, రికిల్‌టన్/డికాక్, బవుమా, బ్రీజ్కే, జోర్జి, బ్రెవిస్, యాన్సెన్, బోష్, కేశవ్, బర్గర్, బార్ట్‌మన్.


బవుమా

"కోహ్లి, రోహిత్‌ల రాకతో భారత జట్టు బలం పుంజుకుంది. వారి అనుభవం జట్టుకు ఉపకరిస్తుందని సిరీస్ ఆరంభంలోనే చెప్పాం. అది మాకు తెలియని విషయమేమీ కాదు. రోహిత్ 2007 టీ20 ప్రపంచకప్ ఆడుతున్నపుడు నేను స్కూల్లో ఉన్నా. ఇప్పటికీ అతను భారత జట్టులో ఉన్నాడు. రోహిత్, కోహ్లి ప్రపంచ స్థాయి ఆటగాళ్లు. వారి వల్ల మేం చాలాసార్లు ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కొన్నిసార్లు వారిపై విజయవంతమయ్యాం. ఆ ఇద్దరూ ఉండడం ఉత్సాహాన్ని పెంచుతుంది"

– బవుమా, దక్షిణాఫ్రికా కెప్టెన్

**1** రాయ్‌పుర్‌లో ఇప్పటిదాకా ఒక్క వన్డే మాత్రమే జరిగింది. 2023లో న్యూజిలాండ్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.

# విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లి!

దిల్లీ: అంతర్జాతీయ మ్యాచ్‌లు లేనపుడు ఫిట్‌నెస్, ఫామ్ కాపాడుకునేందుకు దేశవాళీ టోర్నీల్లో ఆడాలన్న బీసీసీఐ షరతుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి సరే అన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 24 నుంచి జరిగే దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీకి తాను అందుబాటులో ఉంటానని తన రాష్ట్ర జట్టు దిల్లీకి అతను సమాచారం ఇచ్చాడు. ఈ విషయాన్ని దిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ ధ్రువీకరించాడు. "విజయ్ హజారే టోర్నీకి తాను అందుబాటులో ఉంటానని కోహ్లి చెప్పాడు. అతను ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడన్నదానిపై స్పష్టత లేదు. కోహ్లి ఉంటే దిల్లీ జట్టుకు అది గొప్ప ఉత్సాహాన్నిస్తుంది'' అని రోహన్ తెలిపాడు. టీ20లు, టెస్టుల నుంచి రిటైరైన కోహ్లి.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. అతను ప్రస్తుతం కుటుంబంతో లండన్‌లో నివాసముంటున్న సంగతి తెలిసిందే. ఈ నెల 6న దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిసిన అనంతరం లండన్‌కు వెళ్లనున్న కోహ్లి.. విజయ్ హజారే కోసం కొన్ని వారాల తర్వాత తిరిగి భారత్‌కు రానున్నాడు. ఆ టోర్నీ ఆడాక.. మళ్లీ కోహ్లిని చూసే అవకాశమున్నది ఐపీఎల్‌లోనే.

# క్వార్టర్స్‌లో భారత్

జూనియర్ హాకీ ప్రపంచకప్



మదురై: జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరెట్ భారత్ అదరగొడుతోంది. మరో ఘన విజయంతో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం పూల్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-0తో స్విట్జర్లాండ్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచి భారత్‌దే జోరు. మన్‌మీత్ (2వ, 11వ), శ్రద్ధానంద్ (13వ) సత్తా చాటడంతో తొలి క్వార్టర్‌లోనే రోహిత్ బృందం 3-0తో నిలిచింది. 28వ నిమిషంలో అర్ష్‌దీప్, 54వ నిమిషంలో శ్రద్ధానంద్ గోల్స్ చేశారు. ఆడిన 3 మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ (9 పాయింట్లు) గ్రూప్‌లో అగ్రస్థానం సాధించి ముందంజ వేసింది. గురువారం క్వార్టర్స్‌లో బెల్జియంతో భారత్ తలపడుతుంది. స్పెయిన్‌తో న్యూజిలాండ్, నెదర్లాండ్స్‌తో అర్జెంటీనా, ఫ్రాన్స్‌తో జర్మనీ క్వార్టర్స్ ఆడతాయి.

**గెలిచినా.. ఆస్ట్రేలియా ఔట్:** జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా కథ ముగిసింది. పూల్-ఎఫ్ చివరి మ్యాచ్‌లో 3-1తో కొరియాపై ఆస్ట్రేలియా గెలిచింది. కానీ మూడు మ్యాచ్‌ల్లో రెండే విజయాలు సాధించిన ఆస్ట్రేలియా క్వార్టర్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానం దక్కించుకున్న జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తాయి. రెండో స్థానంలో నిలిచిన జట్లలో ఉత్తమంగా ఉన్న రెండు టీమ్‌లు కూడా ముందంజ వేస్తాయి. ఈ గ్రూప్ నుంచి ఫ్రాన్స్ ముందంజ వేసింది.

# అదరగొట్టిన హార్దిక్

పంజాబ్‌పై బరోడా విజయం

ఈనాడు, హైదరాబాద్: టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్య పునరాగమనం అదిరింది. గాయం నుంచి కోలుకుని వచ్చిన ఈ ఆల్‌రౌండర్.. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో మెరుపు ఇన్నింగ్స్‌తో సత్తాచాటాడు. హార్దిక్ (77 నాటౌట్; 42 బంతుల్లో 7×4, 4×6) చెలరేగడంతో మంగళవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన గ్రూపు-సి మ్యాచ్‌లో బరోడా 7 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 8 వికెట్లకు 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ అభిషేక్ శర్మ (50; 19 బంతుల్లో 5×4, 4×6), అన్మోల్‌ప్రీత్ సింగ్ (69; 32 బంతుల్లో 7×4, 4×6), నమన్ ధీర్ (39; 28 బంతుల్లో 2×4, 2×6) చెలరేగారు. బరోడా 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్, విష్ణు సోలంకి (43; 21 బంతుల్లో 5×4, 2×6), శశ్వంత్ రావత్ (31; 18 బంతుల్లో 4×4, 1×6), శివాలిక్ శర్మ (47; 31 బంతుల్లో 4×4, 1×6)లు పంజాబ్ బౌలర్ల పనిబట్టారు. ఫామ్ చాటుకున్న హార్దిక్ దక్షిణాఫ్రికాతో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఎంపిక కావడం లాంఛనమే.


హార్దిక్


**వైభవ్ చెలరేగినా..:** యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (108 నాటౌట్; 61 బంతుల్లో 7×4, 7×6) అజేయ సెంచరీతో చెలరేగినా బిహార్‌కు పరాజయం తప్పలేదు. మంగళవారం మహారాష్ట్ర 3 వికెట్ల తేడాతో బిహార్‌పై విజయం సాధించింది. వైభవ్ సత్తాచాటడంతో మొదట బిహార్ 3 వికెట్లకు 176 పరుగులు రాబట్టింది. బదులుగా మహారాష్ట్ర 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ పృథ్వీ షా (66; 30 బంతుల్లో 11×4, 1×6) రాణించాడు. ముస్తాక్ అలీలో అత్యంత పిన్న వయసులో సెంచరీ చేసిన బ్యాటర్‌గా వైభవ్ రికార్డు నెలకొల్పాడు.

**ఆంధ్ర గెలుపు:** ఆంధ్ర మళ్లీ గెలుపు బాట పట్టింది. ముస్తాక్ అలీలో మూడో విజయంతో సత్తాచాటింది. మంగళవారం గ్రూపు-ఎ పోరులో ఆంధ్ర 5 వికెట్ల తేడాతో రైల్వేస్‌ను చిత్తుచేసింది. ఉపేంద్ర యాదవ్ (55; 44 బంతుల్లో 8×4, 1×6), రవి సింగ్ (49; 23 బంతుల్లో 3×4, 5×6) రాణించడంతో తొలుత రైల్వేస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు సాధించింది. సత్యనారాయణ రాజు (3/30), శశికాంత్ (2/33) మెరిశారు. ఆంధ్ర 19.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అశ్విన్ హెబ్బర్ (78; 45 బంతుల్లో 4×4, 5×6), ప్రసాద్ (39 నాటౌట్; 23 బంతుల్లో 3×4, 2×6) సత్తాచాటారు.

**హైదరాబాద్‌కు మరో విజయం:** ముస్తాక్ అలీలో హైదరాబాద్ జోరు కొనసాగుతోంది. టోర్నీలో ఆ జట్టు మూడో విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం హైదరాబాద్ 3 వికెట్ల తేడాతో ఉత్తర్‌ప్రదేశ్‌పై గెలిచింది. మొత్తం 12 పాయింట్లతో గ్రూపు-బి పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తర్‌ప్రదేశ్ 19.2 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' తనయ్ త్యాగరాజన్ (3/29), రక్షణ్‌రెడ్డి (3/31), సి.వి.మిలింద్ (2/25), మహ్మద్ సిరాజ్ (1/15) సమష్టిగా సత్తాచాటి ఉత్తర్‌ప్రదేశ్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. హైదరాబాద్ 17.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. తన్మయ్ అగర్వాల్ (43; 26 బంతుల్లో 4×4, 3×6) మెరిశాడు.

**మెరిసిన అర్జున్:** అర్జున్ తెందుల్కర్ సత్తా చాటాడు. ముస్తాక్ అలీలో గోవాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ముంబయి ఆటగాడు.. మధ్యప్రదేశ్‌పై బంతితో విజృంభించాడు. 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్.. ప్రత్యర్థి కట్టడిలో కీలకపాత్ర పోషించాడు. మొదట మధ్యప్రదేశ్ 6 వికెట్లకు 170 పరుగులు చేసింది. హర్‌ప్రీత్ సింగ్ (80 నాటౌట్) సత్తా చాటాడు. గోవా బౌలర్లలో హేరంబ్ పరబ్ (2/27) కూడా రాణించాడు. బదులుగా గోవా 18.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సుయాశ్ ప్రభుదేశాయ్ (75 నాటౌట్), అభినవ్ (55) జట్టును గెలిపించారు. ఓపెనర్‌గా వచ్చిన అర్జున్ 10 బంతుల్లో 16 పరుగులు చేశాడు.

# ఐపీఎల్ నుంచి వైదొలగిన మ్యాక్స్‌వెల్


మ్యాక్స్‌వెల్

సిడ్నీ: ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ వచ్చే ఐపీఎల్ వేలం నుంచి వైదొలిగాడు. 37 ఏళ్ల మ్యాక్స్‌వెల్ 2019లో తప్ప 2012 నుంచి ప్రతి ఐపీఎల్‌లోనూ ఆడాడు. పేరుకు స్టార్ బ్యాటరే అయినా అతడు పెద్దగా రాణించలేకపోయాడు. మ్యాక్స్‌వెల్ 141 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 24 లోపు సగటు, 155 స్ట్రైక్ రేట్‌తో 2819 పరుగులు మాత్రమే చేశాడు. 41 వికెట్లు పడగొట్టాడు. "ఎన్నో మరిచిపోలేని సీజన్ల అనంతరం ఈ ఏడాది ఐపీఎల్ వేలంలో నా పేరును ఉంచకూడదని నిర్ణయించుకున్నా. ఇది చాలా పెద్ద నిర్ణయం. ఐపీఎల్ నాకెంతో ఇచ్చింది. క్రికెటర్‌గా, వ్యక్తిగా ఎదగడానికి ఉపయోగపడింది. మేటి ఆటగాళ్లతో కలిసి ఆడడం, గొప్ప ఫ్రాంఛైజీలకు ప్రాతినిధ్యం వహించడం నా అదృష్టం" అని తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో మ్యాక్స్‌వెల్ పేర్కొన్నాడు. తన నిర్ణయానికి మ్యాక్స్‌వెల్ కారణాలు చెప్పలేదు. కానీ తన వైఫల్యాల నేపథ్యంలో తనపై ఐపీఎల్ ఫ్రాంఛైజీలు ఆసక్తిగా లేవని గ్రహించే మ్యాక్స్‌వెల్ ఈ నిర్ణయం తీసుకున్నాడని భావిస్తున్నారు. 13 ఐపీఎల్ సీజన్లు ఆడిన మ్యాక్స్‌వెల్.. ఒక్కసారి (2021) మాత్రమే 500 పరుగులు దాటాడు. గత రెండు (2024, 2025) సీజన్లలో కలిపి 17 మ్యాచ్‌ల్లో 100 (52, 48) పరుగులు మాత్రమే చేశాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు డుప్లెసిస్, ఇంగ్లాండ్ క్రికెటర్ మొయిన్ అలీ కూడా ఐపీఎల్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

**వేలంలో అతడే ఆకర్షణ:** ఈ నెల 16న అబుదాబిలో జరిగే ఐపీఎల్ 2026 మినీ వేలంలో 1355 మంది ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆటగాళ్ల జాబితాను బీసీసీఐ.. సోమవారం ఫ్రాంఛైజీలతో అధికారికంగా పంచుకోనుంది. వేలం ద్వారా గరిష్ఠంగా 77 మంది ఆటగాళ్లను ఫ్రాంఛైజీలు కొనడానికి వీలుంది. ఈసారి వేలంలో భారత్ నుంచి స్టార్ ఆటగాళ్లు పెద్దగా లేరు. వేలంలో ప్రధాన ఆకర్షణ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీనే. చేతిలో అత్యధిక డబ్బున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ (రూ.64.3 కోట్లు), చెన్నై సూపర్‌కింగ్స్ (రూ.43.4 కోట్లు) అతడి కోసం గట్టిగా పోటీపడతాయని అంచనా వేస్తున్నారు. పతిరన, లివింగ్‌స్టన్‌లకు కూడా మంచి ధర పలికే అవకాశముంది. భారత్ నుంచి వెంకటేశ్ అయ్యర్, రవి బిష్ణోయ్ మాత్రమే కనీస ధర రూ.2 కోట్లుగా ఉన్న ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. కిందటి వేలంలో రూ.23.75 కోట్లు పొందిన వెంకటేశ్ ఈసారి ఎంత పలుకుతాడన్నది ఆసక్తికరం.

# విమర్శల గురించి ఆలోచిస్తే..


హర్షిత్ రాణా

రాయ్‌పుర్: విమర్శలపై దృష్టిపెడితే తాను స్వేచ్ఛగా ఆడలేనని టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ హర్షిత్ రాణా అన్నాడు. కోచ్ గంభీర్‌కు అనుకూలుడు కావడం వల్లే తనకు అవకాశాలు లభిస్తున్నాయన్న విమర్శల నేపథ్యంలో మంగళవారం హర్షిత్ ఇలా వ్యాఖ్యానించాడు. "ఇవన్నీ విని, వాటి గురించి ఆలోచిస్తూ మైదానంలోకి దిగితే నేను క్రికెట్ ఆడలేను. ఈ విమర్శలు వినకుండా ఉండడానికి వీలైనంతగా ప్రయత్నిస్తా. మైదానంలో నేను చేయాల్సిన దానిపైనే దృష్టిపెడతా. బయట ఎవరు ఏమనుకున్నా లెక్క చేయను" అని చెప్పాడు.

# యాన్సెన్ నాణ్యమైన ఆల్‌రౌండర్


కలిస్


బెంగళూరు: మార్కో యాన్సెన్ నాణ్యమైన ఆల్‌రౌండర్‌గా ఎదిగాడని దక్షిణాఫ్రికా దిగ్గజ ఆటగాడు జాక్వెస్ కలిస్ అన్నాడు. ఈనెల 26న ఎస్‌ఏ20 టోర్నీ ఆరంభం కానున్న నేపథ్యంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కలిస్ ఇలా వ్యాఖ్యానించాడు. "మార్కో యాన్సెన్‌కు ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. బంతితో అతడు ఎప్పుడూ సత్తా చాటుతున్నాడు. కానీ కాస్త ఆలస్యంగా బ్యాట్‌తోనూ చెలరేగుతున్నాడు. ప్రస్తుతం యాన్సెన్ నాణ్యమైన ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. ఎస్‌ఏ20 టోర్నీలో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు అతడి నుంచి ప్రయోజనం పొందబోతోంది. కార్బిన్ బోష్ సైతం మంచి ఆల్‌రౌండర్‌గా ఎదిగే అవకాశం ఉంది. 140 కి.మీ వేగంతో బంతులు వేస్తున్న బోష్‌కు ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగల సత్తా ఉంది'' అని కలిస్ అన్నాడు. భారత్‌తో టెస్టు సిరీస్‌లో రెండు టెస్టుల్లో 12 వికెట్లు తీసిన యాన్సెన్.. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగులు చేశాడు. టీమ్‌ఇండియాతో తొలి వన్డేలోనూ అర్ధసెంచరీతో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో బోష్ కూడా అర్ధసెంచరీ చేశాడు.

# ఇంగ్లాండ్ జట్టులో జాక్స్

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్ రెండో టెస్టుకు ఇంగ్లాండ్ జట్టులో ఒక మార్పు జరిగింది. గాయపడ్డ ఫాస్ట్‌బౌలర్ మార్క్ వుడ్ స్థానంలో ఆల్‌రౌండర్ విల్ జాక్స్‌ను తీసుకున్నారు. జాక్స్ మూడేళ్ల కింద రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. ఆ తర్వాత నుంచి ఇంగ్లాండ్ అతణ్ని పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకే పరిమితం చేసింది. ఆస్ట్రేలియా ఓపెనర్ ఖవాజా గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమయ్యాడు. ఈ డేనైట్ మ్యాచ్ గురువారం ఆరంభమవుతుంది.

# మెరిసిన తంజిద్

బంగ్లాదే టీ20 సిరీస్


తంజిద్

చట్‌గావ్: ఐర్లాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఆతిథ్య బంగ్లాదేశ్ 2-1తో కైవసం చేసుకుంది. మంగళవారం మూడో టీ20లో 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. మొదట ఐర్లాండ్ 19.5 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (38; 27 బంతుల్లో 5×4, 1×6) టాప్ స్కోరర్. ముస్తాఫిజుర్ రెహ్మాన్ (3/11), రిషాద్ హుస్సేన్ (3/21), షోరిఫుల్ ఇస్లామ్ (2/21) ప్రత్యర్థి పతనంలో కీలకపాత్ర పోషించారు. ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో తంజిద్ హసన్ అయిదు క్యాచ్‌లు అందుకున్నాడు. టీ20ల్లో ఒకే మ్యాచ్‌లో అయిదు క్యాచ్‌లు అందుకున్న తొలి ఫీల్డర్‌గా అతడు రికార్డు సృష్టించాడు. ఐర్లాండ్ చివరి అయిదుగురు బ్యాటర్లు తంజిద్ క్యాచ్‌ల ద్వారానే ఔటయ్యారు. తంజిద్ (55 నాటౌట్; 36 బంతుల్లో 4×4, 3×6) బ్యాట్‌తోనూ సత్తా చాటి బంగ్లాకు ఘన విజయాన్ని అందించాడు. బంగ్లా 13.4 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. పర్వేజ్ (33 నాటౌట్) కూడా రాణించాడు.



రోచ్

# న్యూజిలాండ్ 231/9

వెస్టిండీస్‌తో తొలి టెస్టు

క్రైస్ట్‌చర్చ్: వెస్టిండీస్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు ఆసక్తికరంగా మొదలైంది. పేస్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను వెస్టిండీస్ ఫాస్ట్‌బౌలర్లు హడలెత్తించారు. అయితే కేన్ విలియమ్సన్ (52), బ్రాస్‌వెల్ (47) రాణించడంతో తొలి రోజు, మంగళవారం ఆట ముగిసే సమయానికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. ఓ దశలో ఆ జట్టు 148/6తో నిలవగా బ్రాస్‌వెల్, నాథన్ స్మిత్ (23) ఆరో వికెట్‌కు 52 పరుగులు జోడించారు. ఫౌల్క్స్ (4), డఫీ (4) క్రీజులో ఉన్నారు. కీమర్ రోచ్, షీల్డ్స్, గ్రీవ్స్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. వర్షం, వెలుతురులేమి కారణంగా తొలి రోజు 70 ఓవర్ల ఆటే సాధ్యమైంది. పచ్చిక పిచ్‌పై వెస్టిండీస్‌కు కూడా బ్యాటింగ్ పెద్ద సవాలే కావొచ్చు.

# ఇంగ్లాండ్ క్రికెటర్ రాబిన్ స్మిత్ కన్నుమూత


రాబిన్ స్మిత్

లండన్: ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ రాబిన్ స్మిత్ కన్నుమూశాడు. ఆయన వయసు 62 ఏళ్లు. చాలా కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న స్మిత్.. మంగళవారం పెర్త్‌లో తుది శ్వాస విడిచాడు. 1988-1996 మధ్య కాలంలో ఇంగ్లాండ్‌కు 62 టెస్టులు ఆడిన ఈ కుడిచేతివాటం బ్యాటర్.. 43.67 సగటుతో 4236 పరుగులు సాధించాడు. ఇందులో 9 సెంచరీలున్నాయి. 71 వన్డేల్లో 4 శతకాలతో సహా 2419 పరుగులు చేశాడు. భీకర వెస్టిండీస్ బౌలింగ్‌ను ఎదుర్కొని నిలిచిన ఇంగ్లాండ్ బ్యాటర్లలో స్మిత్ ఒకడు. కళ్లుచెదిరే స్క్వేర్‌కట్‌కు పేరుగాంచిన స్మిత్.. ఇంగ్లాండ్ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 1993లో ఎడ్జ్‌బాస్టన్‌లో ఆస్ట్రేలియాపై 163 బంతుల్లో 167 పరుగులు చేసి వన్డేల్లోనూ తన ముద్ర వేశారు. స్మిత్ పుట్టింది దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో అయినా.. పెరిగింది ఇంగ్లాండ్‌లో. తర్వాత ఆస్ట్రేలియాలో స్థిరపడ్డాడు.

# ఇంకా కుప్పలు తెప్పలుగానే!

- వ్యర్థాలను వేరుచేస్తున్నా యార్డులకే పరిమితం
- పట్టణాలు, నగరాల్లో డంపింగ్ యార్డు రహిత కార్యక్రమానికి అవరోధం
- ఇలాగైతే నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవడం అనుమానమే

మచిలీపట్నంలోని 4.2 ఎకరాల డంపింగ్ యార్డు ఇది. సీఎం చంద్రబాబు 2024 అక్టోబరు 2న యార్డును పరిశీలించారు. పేరుకుపోయిన 42 వేల టన్నుల వ్యర్థాలను ఏడాదిలో తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో వేరు చేస్తున్నా... అవి యార్డుకే పరిమితమవుతున్నాయి. సీఎం విధించిన గడువు ముగిసినా గుట్టలుగా పడిఉన్నాయి. మచిలీపట్నంలోనే కాదు.. శ్రీకాకుళం నుంచి అనంతపురం దాకా అన్ని నగరాలు, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. వ్యర్థాలను విభజిస్తున్నంత వేగంగా తరలింపు జరగడంలేదు. ప్లాస్టిక్, కాగితాలు, రబ్బరు, భవన నిర్మాణ సామగ్రి అక్కడే ఉండిపోతున్నాయి.



రాష్ట్రంలోని 84 డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన 85.43 లక్షల టన్నుల వ్యర్థాల్ని శాస్త్రీయవిధానంలో వేరుచేసి, తరలించేందుకు ప్రభుత్వం తొలిదశగా రూ.683 కోట్లు ఖర్చుచేస్తోంది.

రెండోదశలో మరో 16 లక్షల టన్నుల వ్యర్థాల్ని వేరు చేసేందుకు రూ.150 కోట్లు వెచ్చించనుంది. టెండర్ల ప్రక్రియ పూర్తయి వచ్చే జనవరిలో పనులు ప్రారంభం కానున్నాయి.

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే బృందం

వచ్చే ఏడాది జనవరి నుంచి... డంపింగ్ యార్డుల రహితంగా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యంపై అనుమానాలు ముసురుకుంటున్నాయి. ఈ నెలాఖరుకు యార్డుల్లోని లక్షల టన్నుల వ్యర్థాల్ని వేరుచేసి ఇతర అవసరాలకు తరలించాలన్న ఉద్దేశానికి అవరోధాలు ఎదురవుతున్నాయి. శాస్త్రీయపద్ధతిలో పలుచోట్ల వేరుచేస్తున్నా యార్డుల నుంచి తరలించడం సవాలుగా మారింది. వీటిని ఆర్‌డీఎఫ్ కోసం తీసుకునేందుకు సిమెంట్ ఫ్యాక్టరీలు ఆసక్తి చూపడంలేదు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల్ని పునర్వినియోగించే కేంద్రాల్లేవు. వ్యర్థాల నుంచి విద్యుత్తు ఉత్పత్తిచేసే ప్లాంట్లు పరిమితంగా ఉన్నాయి. ఫలితంగా యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. కొన్ని యార్డుల్లో వ్యర్థాల విభజనే మొదలుకాలేదు. రాష్ట్రంలోని పలు డంపింగ్ యార్డుల్ని 'ఈనాడు' పరిశీలించగా ఈ విషయాలు వెలుగుచూశాయి.



నెల్లూరు డంపింగ్ యార్డులో గుట్టలుగా.. వేరు చేసిన వ్యర్థాలు



సాలూరు డంపింగ్ యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

### ఇవిగో సవాళ్లు

- ఘన వ్యర్థాల నుంచి వేరుచేసే ప్లాస్టిక్, కాగితాలు, వస్త్రాలు, రబ్బరు మొదలైన వాటి నుంచి తయారుచేసే రెఫ్యూజ్ డిరైవ్డ్ ఫ్యూయల్(ఆర్‌డీఎఫ్)ను వినియోగించేందుకు సిమెంట్ ఫ్యాక్టరీలు ఆసక్తి చూపడంలేదు. సిమెంట్ తయారీకి వాడే ముడిసరకుల్లో 20% ఆర్‌డీఎఫ్‌ను వాడాలన్న నిబంధనలను పలు కంపెనీలు పట్టించుకోవడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా 22 సిమెంట్ ఫ్యాక్టరీలు ఉంటే.. ఒకటి రెండు ఫ్యాక్టరీల వారే ఆర్‌డీఎఫ్ కోసం వ్యర్థాల్ని తీసుకుంటున్నారు.
- ప్లాస్టిక్, కాగితాలు, రబ్బరు వ్యర్థాల్ని విద్యుత్తు ఉత్పత్తిచేసే ప్లాంట్లలోనూ వినియోగించవచ్చు. విశాఖపట్నం, గుంటూరుల్లో రెండు ప్లాంట్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటిలో రోజూ 3 వేల టన్నుల వ్యర్థాల్ని ప్రాసెస్ చేస్తున్నారు. నెల్లూరు, రాజమహేంద్రవరం, కర్నూలు, కడప, విజయవాడ, తిరుపతిల్లో మరో ఆరు ప్లాంట్లు ప్రైవేట్ యాజమాన్యంలో ఏర్పాటు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు.
- భవన నిర్మాణ సమయంలో, పాత నిర్మాణాలు పగలగొట్టేటప్పుడు వెలువడే వ్యర్థాల నుంచి కాంక్రీట్, ఇటుక ముక్కలు, ఇనుము, కలప, ప్లాస్టిక్ పైపులు తదితరాల పునర్వినియోగానికి ప్రత్యేక కేంద్రాల్ని ఏర్పాటు చేయాలి. వీటి కొరత కారణంగా భూమిలో కలిపేందుకు(ల్యాండ్ ఫిల్) యత్నిస్తున్నారు.
- పది పురపాలక సంఘాల్లో వ్యర్థాల్ని విభజించడం మొదలుకాలేదు. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఇదిగో.. అదిగో అంటున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లోనూ ఇదే పరిస్థితి. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కమిషనర్ ఒకరు సాలూరు డంపింగ్ యార్డును శుభ్రంచేసి అందులో తన ఇద్దరు పిల్లలకూ వివాహాలు చేయించారు. అలాంటి డంపింగ్ యార్డు ప్రస్తుతం చెత్తకుప్పలతో దుర్గంధంగా మారింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని రెండు యార్డుల్లో ఒకచోట తరలింపు మొదలు కాలేదు.

### స్వచ్ఛాంధ్ర సంస్థ ఏం చేస్తోంది?

డంపింగ్ యార్డు రహితంగా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దడంలో స్వచ్ఛాంధ్ర సంస్థది కీలక పాత్ర. పనులు వేగవంతం చేసి సీఎం నిర్దేశించిన గడువులోగా యార్డుల్లో వ్యర్థాల్ని తొలగించేలా ఆ సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రస్తుతం ఎదురవుతున్న అవరోధాల్ని అధిగమించేలా చర్యలు తీసుకోవాలి. సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలి. పురపాలక శాఖ, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం మరింత చొరవ తీసుకోవాలి.



సత్తెనపల్లి యార్డులో పరిస్థితి

### వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కొండంత

ప్రజల నుంచి చెత్తపన్ను వసూలు చేసిన వైకాపా ప్రభుత్వం లక్షల టన్నుల వ్యర్థాలతో డంపింగ్ యార్డులను నింపేసింది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే వీటిని తొలగించకపోగా... ఈ పేరుతో రూ.కోట్లు దుర్వినియోగం చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికి 85 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు యార్డుల్లో పేరుకుపోయాయి.

## స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కల్పించండి

### తీవ్రత పెరగకముందే చికిత్స అందించాలని సీఎం ఆదేశం



స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, తీవ్రత పెరగకముందే చికిత్స అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఈ కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌తో మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో ఈ వ్యాధి బారిన పడి రాజేశ్వరి అనే మహిళ మృతిచెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. కీటకాలు కుట్టడం వల్ల చనిపోయే పరిస్థితి రాకుండా చూడాలని.. ప్రమాదాన్ని ఎలా కట్టడి చేయాలో ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. రాజేశ్వరిని చిగ్గర్‌మైట్ అనే కీటకం కుట్టిందని, ర్యాపిడ్ పరీక్షలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా తేలిందని.. సీఎంకు సౌరభ్‌గౌర్ వివరించారు. ఇది అంటువ్యాధి కాదని, ఈ కీటకం కుడితే శరీరంపై దద్దుర్లు, పుండ్లు ఏర్పడతాయని, అధిక జ్వరం, చలి, తీవ్ర తలనొప్పి, కండరాల నొప్పులు కనిపిస్తాయని తెలిపారు. సకాలంలో చికిత్స అందిస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదని వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని.. కీటకాలు కుట్టిన వెంటనే వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## తెలంగాణపై పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు ఖండన

- బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- ఆ రాష్ట్ర మంత్రులు వెంకట్‌రెడ్డి, శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్

హైదరాబాద్, హుస్నాబాద్, న్యూస్‌టుడే: కోనసీమ విషయంలో తెలంగాణను ఉద్దేశించి సినీ నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఆయన తక్షణమే బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణలు చెప్పకపోతే తెలంగాణలో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. మంగళవారం పీసీసీ కార్యవర్గ సమావేశంలో పాల్గొనడానికి గాంధీభవన్‌కు వచ్చిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి ముదిరాజ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లు పవన్ వ్యాఖ్యలపై మీడియా ముందు స్పందించారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ..'పవన్ కల్యాణ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారు, మంచి చేయాలనే ఉద్దేశంతో వచ్చి ఉంటారు కానీ, ఇలాంటి వ్యాఖ్యలు సరికాదు. చిరంజీవి మంచి వ్యక్తి. ఆయన ఎప్పుడూ ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చెయ్యరు. పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్తే నైజాంలో రెండు రోజులైనా ఆయన సినిమాలు ఆడతాయి. లేదంటే సినిమా నడవదని సినిమాటోగ్రఫీ మంత్రిగా చెప్తున్నా' అని కోమటిరెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా, ఏపీ ప్రజలపై మాకు కోపం లేదు. ప్రాంతాలుగా విడిపోయినా కుటుంబ సభ్యులుగా కలిసి ఉందాం. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదు' అని అన్నారు.

## పవన్‌కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దు

### జనసేన పార్టీ విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దు' అని జనసేన పార్టీ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ అన్న మాటలను వక్రీకరిస్తున్నారని పేర్కొంది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉన్న క్రమంలో ఆ మాటలను వక్రీకరించవద్దని ఆ ప్రకటనలో కోరింది.

## 21 నోటిఫికేషన్లకు ఏపీపీఎస్సీ పరీక్షల తేదీల ప్రకటన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 21 ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన పరీక్ష తేదీలను ఏపీపీఎస్సీ ప్రకటించింది. రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేసింది. జనవరి 27 నుంచి 31 వరకు, ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 18 ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన పరీక్షలను విశాఖపట్నం, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం కేంద్రాలలో నిర్వహిస్తారు. మిగతా పరీక్షలు ఉమ్మడి 13 జిల్లాల్లో ఉంటాయి. పూర్తి వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. 21 నోటిఫికేషన్లకు కలిపి మొత్తం 890 పోస్టులు ఉన్నాయి.

## నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు రిమాండ్

### నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలింపు



విచారణ అనంతరం కోర్టు నుంచి బయటకు వస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేసులో వైకాపా మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాములను ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. నకిలీ మద్యం తయారీలో కీలకంగా వ్యవహరించిన జనార్దన్‌రావు (ఏ1) వాంగ్మూలం ఆధారంగా జోగి రమేష్, రాములను కేసులో చేర్చారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టులో పీటీ వారంట్ దాఖలుచేశారు. కోర్టు అనుమతితో నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి తీసుకొచ్చి జడ్జి ఉమర్‌ఫరూక్ ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య తిరిగి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. జోగి సోదరులను కలిసేందుకు తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, వైకాపా మదనపల్లె నియోజకవర్గ బాధ్యుడు నిస్సార్ అహ్మద్, పలువురు నేతలు రాగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

## రక్షణరంగ సంస్థల శంకుస్థాపనకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌కు ఆహ్వానం

### దిల్లీలో ఆయన్ను కలిసిన మంత్రి టీజీ భరత్



కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో మంత్రి టీజీ భరత్

ఈనాడు, అమరావతి: రక్షణరంగ అధునాతన పరికరాల తయారీ కేంద్రంగా ఏపీ మారనుందని మంత్రి టీజీ భరత్ అన్నారు. రాష్ట్రంలో నిర్మించే రక్షణ పరికరాల తయారీ ప్రాజెక్టుల శంకుస్థాపనకు రావాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఆయన దిల్లీలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ.. 'శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్, దొనకొండ దగ్గర హెచ్‌ఎఫ్‌సీఎల్, అనకాపల్లిలో బీడీఎల్ యూనిట్లకు శంకుస్థాపన నిర్వహించనున్నాం. ఈ ప్రాజెక్టులకు రాష్ట్రప్రభుత్వం పూర్తిగా సహకరించింది. వాటికి అవసరమైన అన్ని అనుమతులనూ వేగంగా ఇచ్చాం' అని పేర్కొన్నారు.

✦ ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు-బస్సు భద్రతా చట్టాన్ని తీసుకురావాలని మంత్రి టీజీ భరత్ కోరారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీనీ దిల్లీలో కలిసి ఈ మేరకు ప్రతిపాదించారు.

## వైకాపా పెద్దల కనుసన్నల్లోనే పరకామణిలో చోరీ: ఆనందసూర్య

ఈనాడు, అమరావతి: పరకామణిలో దొంగతనం వైకాపా ప్రభుత్వ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ దోపిడీ అని తెదేపా నేత, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "దొంగతనం బయటపడకుండా దొంగతోనే రాజీ కుదిర్చిన వైకాపా దుర్మార్గం చూసి భక్తులు నివ్వెరపోతున్నారు. సాక్ష్యాలను తారుమారు చేయడం కోసమే సతీష్‌కుమార్‌ను దారుణంగా హత్యచేశారు. పోలీసుల విచారణ పూర్తికాకముందే భూమన కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి ఆత్మహత్య అని ఎలా ప్రకటించారు" అని ప్రశ్నించారు.

# మద్యం స్కాంలో.. మరో ఇద్దరు నిందితులు

- ముంబయికి చెందిన సోదరులు చేతన్, రోణక్‌ల పేర్లు
- అనిల్ చోఖ్రాతో కలిసి లంచాల సొమ్మును నగలు, నగదుగా మార్చింది వీరే
- సిట్ అదుపులో రోణక్.. విచారణకు గైర్హాజరైన చేతన్

చేతన్‌కుమార్ రోణక్‌కుమార్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో సిట్.. మరో ఇద్దరిని నిందితులుగా చేర్చింది. వైకాపా ముఠా తరఫున మద్యం ముడుపుల సొమ్ము రూటింగ్‌లో కీలకపాత్ర పోషించిన ముంబయికి చెందిన నగల వ్యాపారులు, సోదరులు చేతన్‌కుమార్ పల్గోట (ఏ-50), రోణక్‌కుమార్ పల్గోట (ఏ-51)లను నిందితులుగా చేరుస్తూ విజయవాడలోని ఏసీబీ కోర్టులో మెమో దాఖలుచేసింది. రోణక్‌కుమార్‌ను మంగళవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయంలో సిట్ అరెస్టు చేసింది. చేతన్‌కుమార్ కోసం గాలిస్తోంది. 'వైకాపా హయాంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న డిస్టిలరీలు.. నాటి ప్రభుత్వ పెద్దలకు లంచాలుగా చెల్లించాల్సిన సొమ్మును తొలుత వివిధ వస్తువుల కొనుగోలు పేరిట పలు డొల్ల కంపెనీల ఖాతాల్లో జమచేసేవి. ఆ డొల్ల కంపెనీల నిర్వాహకులు వారి కమీషన్‌ను మినహాయించుకుని మిగతా సొత్తును విత్‌డ్రా చేసి బంగారం, నగదు రూపంలో నాటి ప్రభుత్వ పెద్దలు, వైకాపా మద్యం ముఠా సభ్యులకు చేర్చేవారు. మనీ లాండరింగ్‌లో సిద్ధహస్తుడైన ముంబయివాసి అనిల్ చోఖ్రాను (ఏ-49) ముందుపెట్టి చేతన్‌కుమార్, రోణక్‌కుమార్ ఈ కథంతా నడిపించారు' అని సిట్ దర్యాప్తులో గుర్తించింది.

### ముంబయికి పారిపోతుండగా పట్టివేత

అనిల్ చోఖ్రాను కస్టడీకి తీసుకుని రెండు రోజులుగా విచారిస్తున్న సిట్ అధికారులు.. అతనితో కలిపి చేతన్‌కుమార్, రోణక్‌కుమార్‌లను ప్రశ్నించాలనే ఉద్దేశంతో వారిద్దరికీ నోటీసులిచ్చారు. చోఖ్రాతో కలిపి ప్రశ్నిస్తే తన గుట్టు బయట పడుతుందని, అరెస్టు ఖాయమని భావించిన చేతన్.. తాను అనారోగ్యంతో ఉన్నానని విచారణకు గైర్హాజరయ్యాడు. అతని సోదరుడు రోణక్‌ను విచారణకు పంపించాడు. సోమవారం విజయవాడకు వచ్చిన రోణక్‌ను మంగళవారం సిట్ అధికారులు ప్రశ్నించారు. బుధవారం మరోసారి విచారణకు రావాలని నోటీసులిచ్చి, పంపించారు. మరోసారి విచారణకు వెళ్తే తనను అరెస్టు చేస్తారని భావించాడేమో.. రోణక్‌కుమార్ మంగళవారం సాయంత్రం సిట్ అధికారులకు సమాచారమివ్వకుండా ముంబయికి పారిపోయేందుకు సిద్ధమయ్యాడు. సమాచారం తెలుసుకున్న సిట్.. అతన్ని గన్నవరం విమానాశ్రయంలో అరెస్టు చేసింది. బుధవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరచనుంది.

### బంగారం వ్యాపారం ముసుగులో..

చేతన్, రోణక్ సోదరులు ముంబయి కేంద్రంగా చాముండ బులియన్ మహాలక్ష్మీ జ్యూయలరీ, రుచిత జ్యూయలరీ తదితర పేర్లతో నగల వ్యాపారం నిర్వహిస్తుంటారు. ఈ ముసుగులో పలువురిని అడ్డం పెట్టుకుని నకిలీ ఇన్వాయిస్‌లు, నకిలీ వే బిల్లులు సృష్టించి వైట్‌ను బ్లాక్‌మనీగా.. మళ్లీ బ్లాక్‌ను వైట్‌మనీగా మారుస్తుంటారు. ఈ అన్నదమ్ములిద్దరిపై పలు కేసులున్నాయి. వీరి తండ్రి జస్‌రాజ్ పల్గోట అలియాస్ పూనంబాయ్‌కు దుబాయ్‌లోని పలువురితో ఆర్థిక సంబంధాలున్నాయని సిట్ దర్యాప్తులో గుర్తించింది. ఈ నేపథ్యంలోనే పల్గోట సోదరులను తొలుత ఎవరు సంప్రదించారో తేల్చే పనిలో పడింది. వీరు మనీ రూటింగ్‌కు అనిల్ చోఖ్రాతో పాటు ఇంకా ఎవరెవరిని వినియోగించారో ఆరా తీస్తోంది.

# టూరిస్ట్ పర్మిట్‌తో ప్రయాణికుల రవాణా

- ఏఐటీపీకి వక్రభాష్యం చెబుతున్న ప్రైవేటు ట్రావెల్స్
- ఇటువంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలి
- స్టేజ్ క్యారియర్‌గా అనుమతించొద్దు
- మోర్త్‌కు ఏపీ రవాణాశాఖ సిఫార్సు

ఈనాడు, అమరావతి: పర్యాటకులను దేశంలోని ఏ రాష్ట్రానికైనా బస్సుల్లో తీసుకెళ్లేందుకు వీలుగా కేంద్రం వన్ నేషన్.. వన్ పర్మిట్ విధానం తీసుకొచ్చి, ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) జారీ అమలుచేస్తుంటే.. ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు దీనికి వక్రభాష్యం చెబుతున్నాయి. అనేక స్టాపుల్లో ప్రయాణికులను ఎక్కించుకొని, వివిధ నగరాల మధ్య దర్జాగా బస్సులను నడిపేస్తున్నాయి. ప్రయాణికులను తీసుకెళ్లేందుకు అనుమతి లేకపోయినాసరే ఆన్‌లైన్‌లో బుకింగ్స్ సైతం నిర్వహిస్తూ వ్యాపారం చేస్తున్నాయి. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు ఏపీ రవాణా శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. టూరిస్టు పర్మిట్లతో ప్రయాణికులను తీసుకెళ్లేందుకు అనుమతించొద్దంటూ రవాణా కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా.. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్)ను కోరారు. ఈ మేరకు ఏఐటీపీలో మార్పులు, చేర్పులకు సూచనలు, అభ్యంతరాలు తెలపాలని ఇటీవల మోర్త్ అన్ని రాష్ట్రాల రవాణా శాఖలను కోరింది. దీనికి స్పందనగా ఏపీ రవాణా కమిషనర్ పలు సిఫార్సులు చేశారు.

### కర్నూలు బస్సు ప్రమాదంతో మేల్కొని..

కర్నూలు సమీపంలో అక్టోబరు 24న వి-కావేరీ ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు దగ్ధమై 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఏఐటీపీ తీసుకొని ఆ బస్సు నడుపుతున్నట్లు తర్వాత గుర్తించారు. దాదాపు అన్ని ట్రావెల్స్ సంస్థల బస్సులు ఈ తరహా పర్మిట్‌తో ఉన్నట్లు తేలింది. 2021లో కేంద్రం తీసుకొచ్చిన నిబంధన ప్రకారం ఏదైనా బస్సు ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయిందో అక్కడి (హోమ్ స్టేట్‌లో) రవాణా శాఖకు పన్ను చెల్లించాలి. ఇతర రాష్ట్రాల్లో కూడా తిరగాలి అనుకుంటే ఆలిండియా టూరిస్ట్ పర్మిట్ కింద త్రైమాసికానికి రూ.90,000 లేదా ఏడాదికి రూ.3 లక్షలు చెల్లించాలి. పర్యాటకులను తీసుకెళ్లేందుకే ఈ పర్మిట్ పనిచేస్తుంది.

### సొంత రాష్ట్రానికి తప్పనిసరిగా వెళ్లాల్సిందే

ఏఐటీపీ తీసుకున్న బస్సులు తరచూ సొంత రాష్ట్రానికి (హోమ్ స్టేట్) వెళ్లే నిబంధన అమలు చేయాలని ఏపీ రవాణా కమిషనర్ మోర్త్‌ను కోరారు. గతంలో ఓ బస్సు బయలుదేరే స్థానం లేదా గమ్యస్థానం గానీ హోమ్‌స్టేట్‌లో ఉండాలనే నిబంధన ఉండేది. తర్వాత దానిని తొలగించారు. దీంతో ట్రావెల్స్ బస్సులు వేరే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని, అక్కడికి వెళ్లకుండా తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతున్నాయి. ముఖ్యంగా అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న బస్సులు.. పూర్తిగా తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ హోమ్‌స్టేట్‌కు అసలు వెళ్లడంలేదు. తాజాగా 45 రోజుల్లో ఒకసారైనా ఏఐటీపీ బస్సులు సొంత రాష్ట్రానికి వెళ్లాల్సి ఉంటుందంటూ మోర్త్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధనకు మద్దతుగా ఏపీ రవాణా శాఖ సిఫార్సు చేసింది.





### ఏసీ స్లీపర్ బస్సులు భద్రమేనా?

ఏసీ స్లీపర్ బస్సులు ఎంత వరకు భద్రం? వాటి డిజైన్‌లో లోపాలు ఉంటున్నాయా? ఆల్టరేషన్ వల్ల ప్రమాదాలు జరిగితే.. ప్రయాణికులు బయటకు రాలేకపోతున్నారా? వంటి అంశాలపై రవాణాశాఖ అధ్యయనం చేయించనుంది. ఇందుకోసం ఇప్పటికే ఐఐటీ మద్రాస్‌ను సంప్రదించారు. ఆ సంస్థతో గానీ, మరే ఇతర నిపుణులతో గానీ ఏసీ స్లీపర్ బస్సులపై అధ్యయనం చేయించి, ఓ సమగ్ర నివేదిక రూపొందించనున్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మోర్త్‌కు పంపాలని భావిస్తున్నారు.

## జగన్ పెట్టించినవి అక్రమ కేసులు కాబట్టే వీగిపోతున్నాయ్

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఈనాడు, అమరావతి: 'ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడూ తప్పు చేయలేదు. జగన్ ప్రభుత్వంలో ఆయనపై అనేక తప్పుడు కేసులు బనాయించారు. కాబట్టే అవి వీగిపోతున్నాయి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జగన్ తప్పులు చేయకపోతే సీబీఐ కేసుల్లో కోర్టుకు వెళ్లకుండా సాకులు చెబుతూ 12 ఏళ్లుగా ఎందుకు తప్పించుకుని తిరుగుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుపై పెట్టిన ఫైబర్‌నెట్ కేసు అన్యాయమైందని కోర్టులో రుజువైందన్నారు. 2014-19 మధ్య మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా అమలైతే అన్యాయంగా చంద్రబాబుపై కేసు పెట్టారని అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలో 2.30 లక్షల మంది శిక్షణ పొందితే.. అక్రమాలు జరిగాయని కేసు పెడతారా అని ప్రశ్నించారు. రాజశేఖరరెడ్డి నుంచి చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయిస్తున్నా ఒక్క కేసునూ నిరూపించలేకపోయారని గుర్తుచేశారు. వైకాపా హయాంలో జగన్ బ్యాచ్ చెప్పిన మద్యమే తాగాలి.. నగదు మాత్రమే కట్టాలనే విధానం తెచ్చారని, మద్యంలోనే రూ.3,500 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు.



### మంచి ఆరోగ్యం కోసం ప్రత్యామ్నాయాలు..

ఆరోగ్యంగా ఉండటం అనుకున్నంత కష్టమేం కాదు.. ముందుగా చిన్న చర్యలతో ప్రారంభిస్తే సరి..

✦ మీరు జిమ్‌కు వెళ్లలేకపోతుంటే ప్రతిరోజూ నడవడం ప్రారంభించండి. ✦ మీకు ఇంటి వద్ద వ్యాయామ శిక్షణ పొందడం కుదరకపోతే మెట్లు ఎక్కడం, దిగడం మొదలుపెట్టండి. ✦ మీరు ఇంటిభోజనం చేయలేని పరిస్థితిలో బయటి మీల్స్ తినడానికి ముందు సలాడ్లను తినండి.

✦ పాలవిరుగుడు(వే) ప్రోటీన్‌ను తీసుకోలేకపోతే మీల్‌మేకర్‌ను గోధుమపిండిలో కలుపుకొని వినియోగించండి.

– చిరాగ్ బర్‌జాత్యా, ఆంత్రప్రెన్యూర్



## పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

## గుంటూరు జిల్లాలో రూ.94 కోట్లతో యోగా కేంద్రం

### పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి వెల్లడి

ఈనాడు, దిల్లీ: గుంటూరు జిల్లాలో సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి (సీఆర్‌ఐవైఎన్) ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య మంగళవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. 'రూ.93.82 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు పరిపాలన, వ్యయపరమైన అనుమతులు మంజూరయ్యాయి. ఈ పరిశోధన కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఉంటుంది. దీనికయ్యే వ్యయాన్ని పూర్తిగా కేంద్రమే భరిస్తుంది. ఈ ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం గుంటూరు జిల్లా నడింపాలెంలో 15 ఎకరాల భూమి కేటాయించింది' అని మంత్రి వివరించారు.

### మొక్కజొన్న ఉత్పాదకతలో ఆంధ్రాదే అగ్రస్థానం

పంటల ఉత్పాదకత పరంగా ఆంధ్రప్రదేశ్ మొక్కజొన్నలో దేశంలో తొలి స్థానంలో, వరి, మినుము పంటల్లో రెండో స్థానంలో నిలిచింది. 2024-25 లెక్కల ప్రకారం కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ మంగళవారం లోక్‌సభలో ఈ విషయం వెల్లడించారు. కంది ఉత్పాదకతలో దేశంలో ఏపీ అట్టడుగున ఉంది. శనగలో 12, పెసలులో 6, వేరుశనగలో 13, సోయాబీన్‌లో 7, చెరకులో 4, పత్తిలో 9వ స్థానంలో నిలిచింది.

**వివిధ పంటల్లో ఏపీ ఉత్పాదకత ఇలా (హెక్టారుకు దిగుబడి కిలోల్లో)**

| పంట | ఏపీ | జాతీయ సగటు | దేశంలో టాప్ రాష్ట్రం |
|---|---|---|---|
| వరి | 3,928 | 2,929 | 4,428 - పంజాబ్ |
| మొక్కజొన్న | 6,510 | 3,590 | 6,510 - ఏపీ |
| కంది | 475 | 836 | 1,800 - పశ్చిమబెంగాల్ |
| మినుము | 1,225 | 710 | 1,462 - తెలంగాణ |
| శనగ | 1,063 | 1,218 | 1,841 - గుజరాత్ |
| పెసలు | 907 | 719 | 1,189 - మధ్యప్రదేశ్ |
| చెరకు | 90,242 | 83,416 | 1,02,000 - తమిళనాడు |
| పత్తి | 476 | 440 | 1,495 - కేరళ |

### రూ.30 కోట్లతో 15 మత్స్యకార గ్రామాల అభివృద్ధి

వాతావరణ మార్పులను తట్టుకొని నిలిచేలా దేశవ్యాప్తంగా 100 మత్స్యకార గ్రామాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఏపీ నుంచి 15 గ్రామాలున్నాయని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఈ కార్యక్రమం కింద ఏపీలో రూ.30 కోట్లు ఖర్చు చేయడానికి ఆమోదం తెలిపామని, ఇప్పటికే రూ.7.5 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసినట్లు చెప్పారు.

## శ్రీవారి సేవకులే హిందూధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు

### తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సేవకులే హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి పేర్కొన్నారు. స్థానిక సేవాసదన్-2లో గ్రూప్ సూపర్‌వైజర్ల (మాస్టర్ ట్రైనర్ల)కు 'ట్రెయిన్ ద ట్రైనీస్' మొదటివిడత శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ.. "శ్రీవారి సేవను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సేవకుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. శ్రీవారి సేవకులకు గ్రూప్ సూపర్‌వైజర్లు శిక్షణ ఇచ్చేందుకు ఏపీ ప్లానింగ్ విభాగం, ఐఐఎం-అహ్మదాబాద్ నిపుణులు శిక్షణ మాడ్యూళ్లను రూపొందించారు. ఇక్కడ శిక్షణ పొందిన గ్రూప్ సూపర్‌వైజర్లు తమ ప్రాంతాల్లో శ్రీవారి సేవకు నమోదుచేసుకున్న సేవకులకు ముందుగానే శిక్షణ అందించి భక్తులకు ఉన్నతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దుతారు" అని పేర్కొన్నారు.

## అఖండ-2 టికెట్ ధరల పెంపు

ఈనాడు, అమరావతి: బాలకృష్ణ నటించిన 'అఖండ-2' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ప్రస్తుతమున్న టికెట్ ధరలపై సింగిల్ స్క్రీన్‌లలో రూ.75 చొప్పున, మల్టీప్లెక్స్‌లలో రూ.100 చొప్పున పెంచుకునేందుకు వీలు కల్పించింది. రోజుకు 5 షోలు ప్రదర్శించేందుకు అనుమతిచ్చింది. ఈ నెల 5న సినిమా విడుదల కానుండగా, అప్పటి నుంచి 10 రోజుల పాటు ఈ ధరల పెంపు అమల్లో ఉంటుంది. 4వ తేదీ రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య బెనిఫిట్ షో ప్రదర్శనకూ అనుమతిచ్చింది. బెనిఫిట్ షో టికెట్ ధర రూ.600గా నిర్ణయించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీచేశారు.

## పీఎన్‌ఎల్‌పీపై వారంలో జవాబు ఇవ్వండి!

### పోలవరం-నల్లమలసాగర్‌పై ఏపీకి గోదావరి బోర్డు లేఖ

ఈనాడు, హైదరాబాద్: ప్రతిపాదిత పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు అందజేయాలంటూ ఆంధ్రప్రదేశ్‌ను గోదావరి బోర్డు కోరింది. ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జీఆర్ఎంబీ, కేంద్ర జల సంఘానికి తెలంగాణ సోమవారం లేఖలు రాసింది. వాటిపై జీఆర్ఎంబీ ఏపీ జలవనరుల శాఖకు మంగళవారం లేఖ రాసింది. వారంలోగా జవాబు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది.

## చెన్నైలో సొరంగంలో నిలిచిపోయిన మెట్రో రైలు



సొరంగంలో నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: చెన్నైలో ఓ మెట్రోరైలు సొరంగమార్గంలో ప్రయాణిస్తుండగా హఠాత్తుగా నిలిచిపోవడంతో ప్రయాణికులు హడలిపోయారు. మంగళవారం తెల్లవారుజామున హైకోర్టు - పురట్చీ తలైవర్ డాక్టర్ ఎంజీ రామచంద్రన్ సెంట్రల్ మెట్రో స్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగింది. బ్యాటరీ సంబంధిత లోపంతో సొరంగమార్గంలో రైలు ఆగిపోయిందని మెట్రో అధికారులు తెలిపారు. లోపాన్ని సరిచేసి రైలును నడిపించాలని ప్రయత్నించినా ఫలితం కనిపించలేదని, దీంతో రైలులో ఉన్న 20 మంది ప్రయాణికులను చీకట్లోనే కాలినడకన హైకోర్టు వరకు దాదాపు 300 మీటర్ల దూరం సిబ్బంది తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆ రైలును పరీక్షల కోసం సిక్ లైన్ మీదకు తరలించి, ట్రాక్‌పై సేవలు పునరుద్ధరించామని వివరించారు.

## పరకామణిలో చోరీ కేసు రాజీపై హైకోర్టుకు సీఐడీ, ఏసీబీ నివేదికలు

- విచారణ శుక్రవారానికి వాయిదా

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసు రాజీ వ్యవహారంపై దర్యాప్తు జరిపి హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద సీల్డ్‌కవర్లో నివేదికలు దాఖలుచేశామని సీఐడీ డీజీ, ఏసీబీ డీజీ తరఫు న్యాయవాదులు పాణిని సోమయాజి, శీతిరాజు శ్యాంసుందర్ హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్.. తమ పరిశీలన కోసం ఆ నివేదికలను కోర్టు అధికారికి అందజేయాలని రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను ఆదేశించారు. విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

★ వైకాపా హయాంలో తితిదే పరకామణిలో చోటుచేసుకున్న చోరీ కేసును ఫిర్యాదుదారుడు వై.సతీష్ కుమార్, నిందితుడు సీవీ.రవికుమార్ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారాన్ని సీఐడీతో దర్యాప్తు చేయించాలంటూ పాత్రికేయుడు ఎం.శ్రీనివాసులు వేసిన వ్యాజ్యంపై ఈ ఏడాది అక్టోబర్ 27న హైకోర్టు విచారణ జరిపింది. కేసు రాజీ విషయంలో తితిదే బోర్డు, తితిదే అధికారులు, దర్యాప్తు అధికారి(ఐవో), ఫిర్యాదుదారుడు/ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) వై.సతీష్‌కుమార్ పాత్రపై దర్యాప్తు చేయాలని న్యాయస్థానం సీఐడీ డీజీని ఆదేశించింది. మరోవైపు చోరీకి పాల్పడిన సీవీ.రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులతోపాటు బ్యాంక్ ఖాతాలపై దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీని కోరింది. రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు విక్రయించిన, ఇతరులకు కేటాయించిన ఆస్తులపై దర్యాప్తు చేయాలని, ఆదాయానికి తగ్గట్టే వారి ఆస్తులు ఉన్నాయా లేదా అనే కోణంలో దర్యాప్తు ఉండాలని.. నివేదికలు సీల్డ్‌కవర్లో ఇవ్వాలని ఆదేశించింది

### రవికుమార్ న్యాయవాది అభ్యర్థన తిరస్కరణ

ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. సీఐడీ, ఏసీబీ డీజీల న్యాయవాదులు హైకోర్టు రిజిస్ట్రార్‌కు నివేదికలు ఇచ్చామని చెప్పారు. దీంతో చోరీ కేసులో నిందితుడు రవికుమార్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు స్పందిస్తూ.. సీఐడీ 156 పేజీలతో హైకోర్టుకు నివేదిక ఇచ్చినట్లు, 40 మంది సాక్షులను విచారించినట్లు తితిదే ఛైర్మన్‌కు చెందిన టీవీ ఛానల్ వార్తలను ప్రసారం చేసిందన్నారు. ఆ నివేదికను తమకు అందజేయాలని, వాటిని పరిశీలించి స్పందిస్తామన్నారు. ఆ అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

### అవసరమైనప్పుడు మీ సహకారం తీసుకుంటాం

ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ ఈ వ్యాజ్యంలో తమ వాదనలు వినిపించేందుకు ఇంప్లీడ్ పిటిషన్ వేశామని, అది పెండింగ్‌లో ఉందన్నారు. ఆ పిటిషన్‌ను అనుమతించాలని కోరారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ.. అవసరమైనప్పుడు సహకారం తీసుకుంటామన్నారు. విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

## ఫిట్‌నెస్ పరీక్ష, ధ్రువీకరణ ఫీజులు తగ్గించాలి

### లారీ యజమానుల సంఘం విజ్ఞప్తి

ఈనాడు, అమరావతి: ఫిట్‌నెస్ పరీక్షలు, ధ్రువీకరణ ఫీజులు పెంచుతూ కేంద్రం జారీచేసిన నోటిఫికేషన్‌తో పాత వాహనాల యజమానులపై తీవ్ర భారం పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని సవరించి ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ లారీ యజమానులు సంఘం కోరింది. రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాలతో.. లారీ యజమానుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి నాదెండ్ల కృష్ణ తదితరులు మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా లారీ యజమానుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రైల్వేయార్డులు, షిప్‌యార్డుల నుంచి సరకులను స్థానిక గోదాములు, రేషన్ గోదాములకు రవాణా చేసేందుకు పాత వాహనాలు వినియోగిస్తారని, ఇప్పుడు వాటి ఫిట్‌నెస్ ఫీజు గరిష్ఠంగా రూ.33వేలకు పెంచితే ఆ యజమానులంతా ఉపాధి కోల్పోయే పరిస్థితి ఉందని తెలియజేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కౌంటర్ సిగ్నేచర్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.







'ఉద్భవ్ 2025'లో పాల్గొనేందుకు వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు
★ సిద్ధమైన సభా వేదిక ★ ఉత్సవాల మస్కట్ క్రిష్

## గిరిజన బిడ్డల సాంస్కృతిక సంబరాలు

- తొలిసారిగా జాతీయ ఉత్సవాలు నిర్వహిస్తున్న ఏపీ
- నేటి నుంచి 3 రోజులపాటు
- నిర్వహణకు కేఎల్‌యూలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం

ఈనాడు, అమరావతి: జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. 22 రాష్ట్రాల నుంచి వచ్చే గిరిజన బిడ్డల ఆటపాటలు, సాంస్కృతిక సంబరాలకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలవనుంది. బుధవారం నుంచి మూడు రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి. ఉద్భవ్-2025 పేరుతో నిర్వహించే ఈ ఉత్సవాలకు రాష్ట్రం తొలిసారిగా ఆతిథ్యమిస్తోంది. రాజధాని అమరావతిలోని కేఎల్ విశ్వవిద్యాలయం(కేఎల్‌యూ)లో వీటి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయెల్ ఓరం ముఖ్యఅతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించనున్నారు. రాష్ట్రం నుంచి గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పలువురు మంత్రులు హాజరుకానున్నారు.

### 35 విభాగాలు.. 12 వేదికలు..

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు సంబంధించి 35 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నాటకాలు, గాత్ర సంగీతం, వాయిద్యం, జానపద సంగీతం, భక్తి, దేశభక్తి, నృత్యం, లలిత సంగీతం, క్విజ్, గిరిజన నృత్యం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయి. 22 రాష్ట్రాల నుంచి దాదాపుగా 1800 మంది గిరిజన విద్యార్థులు పోటీపడనున్నారు. రాష్ట్రం నుంచి 110 మంది ఈఎంఆర్ఎస్ విద్యార్థులు పాల్గొంటారు. పోటీల నిర్వహణకు 12 వేదికలను సిద్ధం చేశారు. విద్యార్థులకు వసతి, భోజనం ఇబ్బందిలేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

### సాంస్కృతిక ఉత్సవాల మస్కట్‌గా 'క్రిష్'

గిరిజన సంస్కృతిని చాటేలా రాష్ట్ర జంతువు కృష్ణ జింకను మస్కట్‌గా ఎంపిక చేశారు. దీనికి 'క్రిష్'గా నామకరణం చేశారు. చివరిరోజు శుక్రవారం ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వారికి ప్రతిభా పురస్కారాలు అందిస్తారు.

## డీకే నివాసంలో సీఎం అల్పాహార సమావేశం



అల్పాహార భేటీలో డీకే శివకుమార్, సిద్ధరామయ్య

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో అల్పాహార రాజకీయాలు కొనసాగుతున్నాయి. అధికార పంపిణీ వ్యవహారం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో అధిష్ఠానం సూచనతో గత వారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అల్పాహారానికి వెళ్లి సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సమావేశం తర్వాత తామిద్దరం ఒక్కటేనని, అధిష్ఠానం చెప్పినట్లే నడుచుకుంటామని వారు ఉమ్మడి ప్రకటన చేశారు. తాజాగా మంగళవారం డీకే.. ముఖ్యమంత్రిని తన నివాసానికి అల్పాహారానికి ఆహ్వానించి మరోసారి సమావేశమయ్యారు. అనంతరం తామిద్దరం అన్నదమ్ముల్లా కలిసే ఉంటామని, 2028 ఎన్నికల వరకు ఇదే ఐక్యత కొనసాగిస్తామని ప్రకటించారు. మరోవైపు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాష్ట్రానికి రానున్నారు. ఆయనతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## నకిలీ మద్యం కేసులో మరో ఇద్దరు నిందితులు

- ఏ24గా జినేష్, ఏ25గా శిబులను చేర్చిన ఎక్సైజ్ పోలీసులు
- బాలాజీ, సుదర్శన్‌లపై పీటీ వారెంట్లకు కోర్టు అనుమతి

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసులు మరో ఇద్దరు నిందితులను చేర్చారు. ఏ24గా జినేష్, ఏ25గా శిబును చేరుస్తూ మంగళవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో మెమో దాఖలుచేశారు. వీరిని గత నెలలో అన్నమయ్య జిల్లా ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేశారు. ప్రస్తుతం వీరు జ్యుడీషియల్ రిమాండ్ ఉన్నారు. వీరిని భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులోనూ నిందితులుగా చేర్చారు. దీంతో నిందితుల సంఖ్య 25కు చేరింది. ఇదే కేసులో అరెస్టై, మదనపల్లె జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బాలాజీ, అతని కుమారుడు సుదర్శన్‌లపై భవానీపురం ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను ఎక్సైజ్ కోర్టు అనుమతించింది. ఈ నెల 15 లోగా ఆ ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

### గోవా నుంచి స్పిరిట్, లేబుళ్ల సరఫరా

గోవాలోని డిస్టిలరీల నుంచి జినేష్ స్పిరిట్‌ను సేకరించి.. శిబుతో కలిసి బెంగళూరుకు చెందిన బాలాజీకి సరఫరా చేసేవాడని పోలీసులు తేల్చారు. దాన్ని బాలాజీ, అతని కుమారుడు సుదర్శన్‌లు ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు తీసుకొచ్చి ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావుకు అందజేసేవారు. రెక్టిఫైడ్ స్పిరిట్‌తో పాటు లేబుళ్లనూ శిబు పంపించేవాడు. కొన్ని లేబుళ్లను జనార్దనరావు.. శిబుకు ఆర్డర్ ఇచ్చి డిజైన్ చేయించాడు. వీటిని అక్కడే ముద్రించి అద్దేపల్లి సోదరులకు సరఫరా చేసేవాడని తేలింది.



EENADU Vol: 52, Issue: 113 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

# ఈనాడు బిజినెస్

## డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ సమన్వయం: నిర్మలా సీతారామన్

**దిల్లీ:** ఆర్థిక వ్యవస్థ డిజిటలైజేషన్, క్రిప్టో కరెన్సీ, స్టేబుల్‌కాయిన్స్ వంటి కొత్త ఆర్థిక ఉత్పత్తుల నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. పన్ను సమాచార మార్పిడిలో కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతికతలను ఉపయోగించుకోవాలని సూచించారు. మంగళవారం దిల్లీలో 18వ గ్లోబల్ 'ఫోరమ్ ఆన్ ట్రాన్స్‌పరెన్సీ అండ్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఫర్ ట్యాక్స్ పర్పసెస్' సదస్సును ప్రారంభిస్తూ ఆమె మాట్లాడారు. 'డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, కొత్త ఆర్థిక ఉత్పత్తులు, ఆస్తుల యాజమాన్య మార్పులు.. ఇవన్నీ కలిసి కొత్త సవాళ్లను తెస్తున్నాయి. ఒక్కో దేశం వీటిని ఒంటరిగా ఎదుర్కోలేదు. సమన్వయం, పరస్పర విశ్వాసం, సకాలంలో సమాచార మార్పిడి అవసరం' అని మంత్రి పేర్కొన్నారు.

## డాలరు @ రూ.90!



డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ మంగళవారం ఇంట్రాడేలో రూ.90 స్థాయిని తాకింది. ఉదయం ట్రేడింగ్‌లో రూ.89.70 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత 47 పైసలు దిగివచ్చి రూ.90 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 43 పైసలు తగ్గి రూ.89.96 వద్ద ముగిసింది. ఇది తాజా జీవనకాల కనిష్ఠం కావడం గమనార్హం. డాలరుకు దిగుమతిదార్ల నుంచి అధిక గిరాకీ, షార్ట్‌కవరింగ్ కొనసాగడం లాంటివి రూపాయి క్షీణతకు కారణమయ్యాయి.

## నాట్కో ఫార్మాకు కొత్త సీఎఫ్ఓ

### ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టనున్న అమిత్ పరేఖ్

**ఈనాడు, హైదరాబాద్:** నాట్కో ఫార్మాకు కొత్త చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) రానున్నారు. ప్రస్తుత సీఎఫ్ఓ ఎస్.వి.వి.ఎన్.అప్పారావు స్థానంలో అమిత్ పరేఖ్ నియమితులయ్యారు. ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సీఎఫ్ఓ బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం అమిత్ పరేఖ్ నాట్కో ఫార్మాలో ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) గా నియమితులయ్యారు. ఇటీవల వరకూ ఆయన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఫైనాన్స్ హెడ్ (ఏపీఐ, ఫార్మాసూటికల్ సర్వీసెస్) గా పనిచేశారు. ఆయనకు హెల్త్‌కేర్, ఫార్మా, మైనింగ్, కెమికల్స్, ఇంజినీరింగ్, టెలీకమ్యూనికేషన్ల రంగాల్లో రెండు దశాబ్దాలు పాటు పనిచేసిన అనుభవం ఉన్నట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది.

### యూకే కంపెనీతో మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ ఒప్పందం

**ఈనాడు, హైదరాబాద్:** ప్యాకేజింగ్ ఉత్పత్తుల సంస్థ అయిన మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్, యూకేలోని వైబ్ జనరేషన్ హోల్డింగ్స్ అనే కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అధిక విలువ కల సీసాలు, డబ్బాలకు మూతలు డిజైన్ చేయటం, మార్కెటింగ్ విభాగాల్లో వైబ్ జనరేషన్‌కు విశేష అనుభవం ఉంది. ఈ కంపెనీతో కలిసి అధునాతన ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌కు అందించనున్నట్లు మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ వివరించింది. దీనికోసం ఇప్పటికే కొన్ని ఉత్పత్తులను గుర్తించినట్లు వెల్లడించింది. వచ్చే అయిదేళ్లలో ఈ భాగస్వామ్యం ద్వారా దాదాపు రూ.250 కోట్ల ఆదాయాలు ఆర్జించే అవకాశం ఉందని పేర్కొంది.


**కోడి గుడ్లు**

3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 645 |
| వరంగల్ | 647 |
| విజయవాడ | 670 |
| తూ/ప గోదావరి | 645 |
| విశాఖపట్నం | 640 |
| చిత్తూరు | 663 |

# విమాన విడిభాగాల తయారీ విస్తరణ ఎలా?

ఈనాడు – హైదరాబాద్




ఉత్పత్తి రంగంలో సత్వర వృద్ధి సాధించటానికి కేంద్ర ప్రభుత్వం గత కొంతకాలంగా వివిధ రంగాలకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకాన్ని అమలు చేస్తోంది. ఎలక్ట్రానిక్స్, ఫార్మాసూటికల్స్, వాహన, జౌళి.. తదితర 14 పారిశ్రామిక రంగాలకు ఈ పథకం అమల్లో ఉంది. డ్రోన్స్, డ్రోన్ విడిభాగాల రంగానికి సైతం పీఎల్ఐ పథకాన్ని వర్తింపజేశారు. కానీ విమాన విడిభాగాల (ఏరోస్పేస్ కాంపొనెంట్స్) పరిశ్రమకు ఈ పథకం లేదు.

### అవకాశాలూ.. అవరోధాలూ ఉన్నాయ్

ఇటీవల కాలంలో మనదేశంలో విమానయాన రంగం విస్తరిస్తోంది. విడిభాగాల తయారీ కూడా పెరుగుతోంది. ఈ విభాగంలో దేశీయ సంస్థలతో పలు విదేశీ కంపెనీలు భాగస్వామ్యాలు కుదుర్చుకొని ఎన్నో రకాలైన విడిభాగాలను మన దేశంలోనే ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ పరిశ్రమ అనూహ్యంగా విస్తరించే అవకాశం ఉన్నప్పటికీ అధిక వ్యయాలు, ఇతర అవరోధాలు అడ్డుగా నిలుస్తున్నాయి. దీనికి విరుగుడుగా కేంద్ర ప్రభుత్వం విమాన విడిభాగాల తయారీ పరిశ్రమకు పీఎల్ఐ పథకాన్ని అమలు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. ఎయిర్‌బస్, బోయింగ్, ప్రాట్ అండ్ విట్నీ వంటి విదేశీ సంస్థలు పీఎల్ఐ పథకం కోసం ఎదురుచూస్తున్నాయి. తగిన ప్రోత్సాహం లభిస్తే మనదేశంలో విడిభాగాల తయారీని విస్తరించవచ్చని, చివరికి అసెంబ్లీ లైన్స్ కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని ఆయా కంపెనీలకు చెందిన అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### ఇప్పుడు మనం ఎక్కడ...?

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో మనదేశం 6.9 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.61,410 కోట్లు) విలువైన విమాన విడిభాగాలను ఎగుమతి చేసింది.
- ఈ పరిశ్రమ 2030 నాటికి 22 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.95 లక్షల కోట్లు)కు చేరుకుంటుందని అంచనా.
- ఎయిర్‌బస్ మనదేశం నుంచి ఏటా 1.5 బిలియన్ డాలర్ల విలువైన విడిభాగాలను కొనుగోలు చేస్తోంది. 2030 నాటికి దీన్ని 2 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలనేది ఎయిర్‌బస్ ప్రణాళిక.
- ఫ్రాన్స్ దిగ్గజ సంస్థ అయిన శాఫ్రన్ దాదాపు రూ.1300 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో తన తొలి ఇంజిన్ నిర్వహణ, రిపేర్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్ఓ) సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. మనదేశ విమానయాన సంస్థలు దాదాపు 1500 శాఫ్రన్ ఇంజిన్ల కోసం ఆర్డర్లు ఇచ్చిన విషయం గమనార్హం.
- విమాన విడిభాగాల దేశీయ ఉత్పత్తికి ముడిపదార్థాల కొరత కూడా సమస్యగా ఉంది. విడిభాగాల్లో అధికంగా వినియోగించే టైటానియమ్ అల్లాయ్, ఏరోస్పేస్ గ్రేడ్ అల్యూమినియమ్ లభ్యత తగినంతగా లేదు.
- అధిక పెట్టుబడి, లాభాల్లోకి (బ్రేక్-ఈవెన్) రావటానికి ఎంతో సమయం పట్టటం కూడా ఈ విభాగంలోని సంస్థలకు ఉన్న ప్రధానమైన సమస్య. డిజైన్, డెవలప్‌మెంట్‌పై ఎంతో అధిక పెట్టుబడి అవసరం అవుతుంది.
- టాటా గ్రూపు, మహీంద్రా అండ్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ డిఫెన్స్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, భారత్ ఫోర్జ్, డైనమ్యాటిక్స్ టెక్నాలజీస్, గోద్రేజ్, ప్రభుత్వ రంగ సంస్థలైన బీఈఎల్, హెచ్ఏఎల్... తదితర సంస్థలు ఈ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

### ఈ దేశాలతో పోటీ..

విమాన విడిభాగాల పరిశ్రమలో యూఎస్, ఫ్రాన్స్ దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. జర్మనీ, చైనా, యూకే దేశాల్లోనూ ఈ పరిశ్రమ ఎంతగానో విస్తరించింది. ఇటీవల కాలంలో విమాన విడిభాగాల పరిశ్రమలను ఆకర్షించటానికి మొరాకో, జపాన్, తుర్కియే దేశాలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ దేశాల్లో కొత్తగా యూనిట్లు ఏర్పాటు చేయదలచిన కంపెనీలకు 'రెడ్ కార్పెట్' పరుస్తున్నాయి. భారీగా పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. మొరాకోలో ఇటీవల కాలంలో పెద్దఎత్తున ఈ రంగానికి చెందిన సంస్థలను ఆకర్షిస్తోంది. ఇప్పటికే ఆ దేశంలో 150కి పైగా కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఈ కంపెనీలు ఫ్యూస్‌లేజ్ నుంచి వైరింగ్, స్ట్రక్చరల్ విడిభాగాలు, ఇంజిన్లు అసెంబుల్ చేస్తున్నాయి. మొరాకో గత ఏడాదిలో 2.9 బిలియన్ డాలర్ల విమాన విడిభాగాలను ఎగుమతి చేసింది. ఈ దేశాలతో ఎదురవుతున్న పోటీని తట్టుకొని విమాన విడిభాగాల పరిశ్రమను మనదేశంలో విస్తరించాలంటే ప్రభుత్వ పరంగా ఎంతో మద్దతు అవసరమని నిపుణులు వివరిస్తున్నారు.

### హైదరాబాద్‌లో విస్తరణ...

గత కొంతకాలంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విమాన విడిభాగాల తయారీ పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. టాటా ఏరోస్పేస్ వంటి అగ్రశ్రేణి సంస్థలు బోయింగ్, ఎయిర్‌బస్... తదితర సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకొని ఫ్యూస్‌లేజ్ నుంచి విమానాల తోకలు, ఇతర విడిభాగాలు ఉత్పత్తి చేస్తున్నాయి. విమానాల ఇంజిన్లలో వినియోగించే విడిభాగాలను ఆజాద్ ఇంజినీరింగ్ ఉత్పత్తి చేసి రోల్స్ రాయిస్, ప్రాట్ అండ్ విట్నీలకు సరఫరా చేస్తోంది. ఇంకా షైన్ ఏరో, న్యూకాన్ ఏరోస్పేస్, రఘువంశీ మెషీన్ టూల్స్, డీఎస్‌కే ఏరోస్పేస్ విమానాల విడిభాగాలను అందిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కాలంలో ఏరోస్పేస్, రక్షణ రంగ ఉత్పత్తి కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా నూతన విధానాలను ఆవిష్కరిస్తోంది.

## రూ.11,000 కోట్ల పెట్టుబడులు పెడతాం

- ఉత్పత్తి సామర్థ్యాన్ని 60 మి. టన్నులకు చేరుస్తాం
- జేఎస్‌డబ్ల్యూ ఎండీ పార్థ్ జిందాల్

**ఈనాడు, హైదరాబాద్:** దేశీయ సిమెంట్ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ తన ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకోనుంది. సమీప భవిష్యత్తులో 60 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. సంస్థ ఎండీ పార్థ్ జిందాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సంస్థకు ప్రస్తుతం దాదాపు 22 మిలియన్ టన్నుల వార్షిక సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 25 మి. టన్నులకు చేరుతుందని అంచనా. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి 41 మి. టన్నుల సామర్థ్యాన్ని సాధించటానికి వీలుగా విస్తరణ కార్యక్రమాలను అమలు చేయనుంది. ఆ తర్వాత 60 మి. టన్నులకు చేరుకుంటామని పార్థ్ జిందాల్ వివరించారు. ఈ మొత్తం విస్త



రణకు రూ.11,000 కోట్ల పెట్టుబడి అవసరమని తెలిపారు. ఈ పెట్టుబడిని దశలవారీగా సమకూర్చుకోనున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌కు కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో గ్రైండింగ్ యూనిట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలలో 4.2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం కల సమీకృత సిమెంటు కర్మాగారాన్ని ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఇదే కాకుండా హైదరాబాద్‌తో పాటు వివిధ నగరాల్లో ఆర్ఎంసీ (రెడీ మిక్స్ కాంక్రీట్) యూనిట్లు దీనికి ఉన్నాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవటంలో భాగంగా ఇప్పటికే ఉన్న యూనిట్లను విస్తరించటంతో పాటు కొత్త యూనిట్లు నెలకొల్పే ఆలోచన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్‌కు ఉన్నట్లు తెలిసింది. రాజస్థాన్‌లో చేపట్టిన కొత్త యూనిట్ నిర్మాణం త్వరలో పూర్తికానుందని సమాచారం. పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ వచ్చే ఏడాదిలో కొత్త యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మధ్యప్రదేశ్‌లో సున్నపురాయి గనులను కంపెనీ గుర్తించింది. కర్ణాటక విజయనగర్‌లో ఉన్న యూనిట్ సామర్థ్యాన్నీ విస్తరించే యోచన ఉంది.

## ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పెంపు ఆలోచన లేదు

**కేంద్రం వెల్లడి**




**దిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రస్తుతం ఉన్న 20 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) పరిమితిని 49 శాతానికి పెంచే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి స్పష్టం చేశారు. మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆయన ఈ విషయాన్ని చెప్పారు. ప్రభుత్వ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితి ప్రస్తుతం 20 శాతం, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో 74% వరకూ ఉంది. ప్రైవేటు బ్యాంకుల్లో 49 శాతం వరకూ ఆటోమేటిక్‌గా, ఆపైన ప్రభుత్వ అనుమతితోనే విదేశీ పెట్టుబడులు సాధ్యమనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. 2020 నుంచి 12 ప్రభుత్వ బ్యాంకుల్లో కేంద్రం షేర్ల సంఖ్య తగ్గలేదని, కొత్త షేర్లు జారీ చేయడం వల్ల ప్రభుత్వ వాటాల శాతం కొంత మేరకు తగ్గిందని పేర్కొన్నారు. వ్యాపార వృద్ధి, నియంత్రణ అవసరాల కోసం బ్యాంకులు మూలధనం సేకరిస్తున్నాయన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందని, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్ బలోపేతం అవుతుందని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి నివాసప్రాంతంలో 5 కిలోమీటర్ల పరిధిలో బ్యాంకు శాఖ, బ్యాంకు ప్రతినిధి, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## దేశవ్యాప్తంగా ఓలా 'నాన్- ఏసీ' ప్రయాణ సేవలు




**దిల్లీ:** దేశవ్యాప్తంగా నాన్- ఏసీ ప్రయాణ సదుపాయ విభాగాన్ని ప్రారంభించినట్లు ఓలా కన్జ్యూమర్ తెలిపింది. దేశంలో ఈ తరహా అవకాశాన్ని కల్పిస్తున్న ఏకైక సంస్థ తమదేనని వెల్లడించింది. ప్రయాణాల కోసం వినియోగదార్లకు మరిన్ని ఎంపికలను అందుబాటులో ఉంచడంలో భాగంగానే ఈ సేవలను ప్రారంభించినట్లు పేర్కొంది. 'నాన్-ఏసీ విభాగం ద్వారా దేశంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రయాణాలను మరింత చౌకగా, సౌకర్యవంతంగా మార్చాలన్నది మా లక్ష్యం. ప్రతి రోజు ప్రయాణాలపై ఆధారపడే వాళ్లు.. తక్కువ ఖర్చు ప్రయాణానికి ప్రాధాన్యమిస్తారు. నాన్-ఏసీ రైడ్ సేవలు వారి అవసరాలను తీరుస్తాయని అనుకుంటున్నామ'ని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అలాగే తక్కువ ఖర్చుతో ప్రయాణాలకు ప్రాధాన్యమిచ్చే వినియోగదార్ల నుంచి గిరాకీ పెరుగుతుండటంతో డ్రైవర్లకు కూడా ఈ కొత్త విభాగం మరిన్ని అవకాశాలను సృష్టిస్తుందని తెలిపారు. 'ఏసీ వినియోగం తగ్గుతుండటంతో ఇంధనమూ ఆదా అవుతుంది. తద్వారా డ్రైవర్లకు ఆదాయ మిగులు పెరుగుతుంద'ని ఓలా వెల్లడించింది.

## ఆర్‌బీఐ వడ్డీ రేట్లలో పావు శాతం కోత!

**కోల్‌కతా:** రాబోయే పరపతి విధాన సమావేశం(డిసెంబరు 3-5)లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గిస్తుందని అంచనా. ద్రవ్యోల్బణం కిందకు దిగిరావడం, బలమైన వృద్ధి ధోరణులు ఇందుకు ఉపకరిస్తాయని రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ తన నివేదికలో పేర్కొంది. అక్టోబరులో ద్రవ్యోల్బణం దశాబ్ద కనిష్ఠ స్థాయి అయిన 0.3 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతం కంటే చాలా తక్కువ కాబట్టి రేట్ల కోతకు మంచి అవకాశం ఉంటుందని ఆ నివేదిక అంటోంది. 'బ్రెంట్ చమురు ధరలు స్థిరంగా ఉండడం, రిజర్వాయర్లలో జలకళ వల్ల రబీపై అంచనాలు తదితరాలు ద్రవ్యోల్బణం ఉన్నట్లుండి ఏమీ పెరగదన్న ధీమాను అందిస్తున్నాయ'ని తెలిపింది. 2025-26 రెండో త్రైమాసికంలో జీడీపీ 8.2 శాతానికి చేరగా.. ద్వితీయార్ధంలో 7 శాతం మేర నమోదు కావొచ్చని కేర్‌ఎడ్జ్ అంచనా కడుతోంది. పూర్తి ఏడాదికి 7.5 శాతం వృద్ధి కనబరచవచ్చని అంటోంది. ఆర్‌బీఐ తన 2025-26 ద్రవ్యోల్బణ అంచనాలను 2.1 శాతంగా, వృద్ధి అంచనాలను 7.5 శాతంగా ప్రకటించవచ్చని కేర్‌ఎడ్జ్ అంచనా వేస్తోంది.

## సంచార్‌సాథీ యాప్ ఆదేశాలపై ప్రభుత్వంతో చర్చించనున్న యాపిల్



**దిల్లీ:** కొత్త మొబైల్‌ఫోన్లలో తయారీ సమయంలో, ఇప్పటికే వాడుతున్న లేదా తయారైన ఫోన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా సంచార్‌సాథీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలపై ప్రభుత్వంతో యాపిల్, శామ్‌సంగ్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. 'ఆ ఆదేశాల్లోని నిబంధనలను యథాతథంగా యాపిల్ పాటించకపోవచ్చు. అందుకే దీనిపై ఒక మధ్యేమార్గాన్ని కనుగొనేందుకు ప్రభుత్వంతో చర్చించనుంద'ని పీటీఐ వార్తా సంస్థకు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈ ఆదేశాలు వెలువడిన తేదీ నుంచి 90 రోజుల తర్వాత భారత్‌లో తయారయ్యే లేదా దిగుమతి అయ్యే మొబైల్ ఫోన్లన్నింటిలో సంచార్‌సాథీ యాప్ ఇన్‌స్టాలై ఉండాలి. మరోవైపు శామ్‌సంగ్ ప్రస్తుతం ఈ ఆదేశాలపై సమీక్ష జరుపుతోందని.. నిబంధలను పాటించడానికి ముందు ప్రభుత్వంతో చర్చలు జరిపే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ పరిణామాలపై వివరణ కోసం శామ్‌సంగ్, యాపిల్‌ను ఇ-మెయిల్ ద్వారా సంప్రదించగా.. ఇప్పటివరకైతే ఎలాంటి సమాధానం రాలేదని పీటీఐ వార్తా సంస్థ కథనం తెలిపింది. సంచార్ సాథీ యాప్‌ను ప్రి-ఇన్‌స్టాల్ చేయడాన్ని తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేనని బీఎస్ఎన్ఎల్ మాజీ సీఎండీ, లావా ఇంటర్నేషనల్ స్వతంత్ర డైరెక్టరు అనుపమ్ శ్రీవాస్తవ్ అభిప్రాయపడ్డారు. దేశ టెలికాం రంగ సైబర్‌భద్రతకు ఇది దోహదం చేస్తుందని, మొబైల్ ఫోన్ల మోసాల నివారణకు ఉపయోగపడుతుందని తెలిపారు.

## టారిఫ్‌లున్నా.. ప్రపంచం రాణిస్తుంది

### ఈ ఏడాది వృద్ధి అంచనాను పెంచిన ఓఈసీడీ




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధాలను ప్రారంభించడంతో అనిశ్చితులు ఏర్పడ్డా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆశ్చర్యకరరీతిలో రాణించనుంది. ఆ మేరకు ఈ ఏడాదికి అంతర్జాతీయ, అమెరికా ఆర్థిక వృద్ధిని 38 దేశాలతో కూడిన ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) అంచనాలను పెంచింది. ఈ ఏడాది ప్రపంచ ఆర్థిక వృద్ధి 3.2 శాతం నమోదవుతుందని తాజాగా పేర్కొంది. 2024లోని 3.3 శాతంతో పోలిస్తే తగ్గినప్పటికీ.. 2025 ఏడాదికిగాను జూన్‌లో అంచనా వేసిన 2.9 శాతం కంటే అధికం కావడం విశేషం. అయితే వచ్చే ఏడాది(2026) మాత్రం 2.9 శాతానికి వృద్ధి తగ్గొచ్చని ఓఈసీడీ అంటోంది.

✦ ఇక అమెరికా వృద్ధి అంచనాలను సైతం జూన్ నాటి 1.6 శాతంతో పోలిస్తే 2 శాతానికి సవరించింది. వృద్ధి అంచనాను పెంచినా 2024లో ఆ అగ్రరాజ్యం కనబరచిన 2.8 శాతం కంటే ఇది తక్కువే.

✦ చైనా ఈ ఏడాది కూడా 2024లోని 5 శాతం వృద్ధినే కొనసాగిస్తుందని ఓఈసీడీ తెలిపింది.

✦ భారత్ ఈ ఏడాది 6.7 శాతం వృద్ధిని నమోదు చేసి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని పేర్కొంది.

## దిల్లీలో 'భారత్ ట్యాక్సీ' ప్రయోగాత్మక సేవలు ప్రారంభం




**దిల్లీ:** భారత్ ట్యాక్సీ ప్రయోగాత్మక సేవలు మంగళవారం దిల్లీలో ప్రారంభమయ్యాయి. ఓలా, ఉబర్, ర్యాపిడో మాదిరి కార్లు, ఆటోలు, బైక్‌ల ద్వారా ప్రయాణాల కోసం బుక్ చేసుకునే వీలును ఇది కల్పిస్తుంది. భారత్ ట్యాక్సీ యాప్‌లో ఇప్పటివరకు 51,000 మంది డ్రైవర్లు నమోదయ్యారు. భారత్ ట్యాక్సీ డిజిటల్ యాప్‌ను సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ నిర్వహించనుంది. సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్‌లో గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (అమూల్), ఇఫ్కో, క్రిబ్కో, నాఫెడ్, ఎన్‌డీడీబీ, ఎన్‌సీఈఎల్, ఎన్‌సీడీసీ, నాబార్డ్‌లు ప్రమోటర్లుగా ఉన్నాయి. ఈ సంస్థ బోర్డులో ఇద్దరు డ్రైవర్లకు ప్రాతినిధ్యం ఉంటుంది. గుజరాత్‌లోనూ డ్రైవర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందని సహకార్ ట్యాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్ ఛైర్మన్ జయేన్ మెహతా తెలిపారు. యాప్‌ను సులువుగా వాడే వీలు, రుసుముల్లో పారదర్శకత, వాహన ట్రాకింగ్, బహుళ బాషల్లో వివరాల లభ్యత, నిరంతర వినియోగదారు సేవలు, భద్రతకు ప్రాధాన్యం లాంటి ప్రత్యేకతలు భారత్ ట్యాక్సీ యాప్‌లో ఉన్నాయి. సున్నా కమీషన్ విధానం ద్వారా డ్రైవర్లు ప్రతి ఒక్క రైడ్‌పై పూర్తి ఛార్జీని ఆదాయంగా పొందుతారు. సహకార సంఘానికి వచ్చే లాభాలను కూడా డ్రైవర్లకు నేరుగా పంచుతారు.

### వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ ధరల శ్రేణి రూ.185-195

గృహ ఫర్నీషింగ్ సంస్థ వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) డిసెంబరు 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిగా రూ.185-195 నిర్ణయించారు. యాంకర్ మదుపర్లకు డిసెంబరు 5న షేర్లు కేటాయిస్తారు. ఇష్యూలో భాగంగా రూ.377.18 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.912 కోట్ల విలువైన 4,67,54,405 షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. దీంతో మొత్తం ఇష్యూ పరిమాణం రూ.1,289 కోట్లుగా ఉంది. ఐపీఓలో సంస్థ విలువను దాదాపు రూ.6,400 కోట్లుగా లెక్కకట్టారు. ఐపీఓ అనంతరం డిసెంబరు 15న కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యే అవకాశం ఉంది.


### బీఓఎంలో వాటా విక్రయానికి పూర్తి స్పందన

ఆఫర్ ఫర్ సేల్ ద్వారా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ప్రభుత్వ వాటా విక్రయానికి మొదటి రోజు మదుపర్ల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో గ్రీన్ షూ ఆప్షన్‌ను వినియోగించి, మొత్తం 6 శాతం వాటా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం ప్రారంభమైన ఈ వాటా విక్రయానికి ఒక్కో షేరుకు కనీస ధరగా రూ.54 నిర్ణయించారు. కనీస ధర ప్రకారం.. ప్రభుత్వం రూ.2,492 కోట్లు సమీకరించనుంది. నాన్ రిటెయిల్ మదుపర్లకు 38,45,77,748 షేర్లు కేటాయించగా, 400 శాతం స్పందన లభించిందని దీపం కార్యదర్శి అరుణీష్ చావ్లా పేర్కొన్నారు. బుధవారం (నేడు) రిటెయిల్ మదుపర్లు బిడ్లు దాఖలు చేసుకోవచ్చు.

### 6,385 అంకుర సంస్థలు మూతపడ్డాయ్

ఈ ఏడాది అక్టోబరు 31 నాటికి 6,385 గుర్తింపు పొందిన అంకుర సంస్థలు మూతపడినట్లు పార్లమెంటుకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ తెలిపింది. డీపీఐఐటీ ప్రారంభించిన స్టార్టప్ ఇండియా కింద అందుబాటులో ఉన్న ప్రభుత్వ సమాచారం ద్వారా ఈ వివరాలను గుర్తించినట్లు పేర్కొంది. అక్టోబరు నాటికి దేశంలో 1,97,692 సంస్థలు అంకురాలుగా గుర్తింపు పొందాయి. మూతపడ్డ అంకుర సంస్థల్లో మహారాష్ట్ర (1200), కర్ణాటక (845), దిల్లీ (737), ఉత్తర్ ప్రదేశ్ (598), తెలంగాణ (368), తమిళనాడు (338) ఉన్నాయి.

# మూడో రోజూ మార్కెట్లకు నష్టాలే



**సెన్సెక్స్** ▼504 **85138**

**నిఫ్టీ** ▼144 **26032**

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.3642 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు: రూ.4646 కోట్లు**

వరుసగా మూడో రోజూ దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లు డీలాపడటం, విదేశీ మదుపర్ల అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. బ్యారెల్ ముడిచమురు 0.33% నష్టంతో 62.96 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో షాంఘై నష్టపోగా, మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.2.06 లక్షల కోట్లు తగ్గి రూ.472.46 లక్షల కోట్లు (5.26 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 316 పాయింట్ల (క్రితం ముగింపు 85,641.90) నష్టంతో 85,325.51 వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 85,053 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 503.63 పాయింట్ల నష్టంతో 85,138.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 143.55 పాయింట్లు కోల్పోయి 26,032.20 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,997.85-26,154.60 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 21 డీలాపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్ 1.29%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.25%, రిలయన్స్ 1.25%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.24%, బీఈఎల్ 1.01%, ఎల్ అండ్ టీ 0.99% నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్ 3.11%, మారుతీ 0.78%, భారతీ ఎయిర్‌టెల్ 0.59% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. సేవలు 1.03%, ఆర్థిక సేవలు 0.78%, బ్యాంకింగ్ 0.75%, పరిశ్రమలు 0.49% పడ్డాయి. టెలికాం, మన్నికైన వినిమయ వస్తువులు, టెక్, వాహన మెరిశాయి. బీఎస్ఈలో 2677 షేర్లు నష్టపోయగా, 1482 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 168 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ ఎల్ఐసీ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా రామ కృష్ణన్ చందర్ పదోన్నతి పొందారు. డిసెంబరు 1న ఆయన ఎండీగా బాధ్యతలు స్వీకరించారు.

✦ దేశంలో పైకప్పు సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు 650 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,780 కోట్లు) రుణాలకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) అనుమతి ఇచ్చింది.

✦ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.1000 కోట్లు సమీకరించేందుకు హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (హెచ్‌సీసీ) బోర్డు ఆమోదం తెలిపింది. రైట్స్ ఇష్యూలో కంపెనీ 79.99 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఇందుకు రికార్డు తేదీగా డిసెంబరు 5ను నిర్ణయించింది.

✦ అమెరికా, భారత్‌లో కార్యకలాపాలు కలిగిన ఏఐ ఎంటర్‌ప్రైజ్ సాస్ ప్లాట్‌ఫామ్ కంపెనీ కమోషన్ ఇంక్‌లో 51 శాతం వాటాను రూ.227 కోట్లకు టాటా కమ్యూనికేషన్స్ కొనుగోలు చేసింది.

✦ జాతీయ రహదారులపై టెలికాం ఆధారిత భద్రతా హెచ్చరికల వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ జియోతో ఎన్‌హెచ్ఏఐ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది.

✦ వేదాంతా రిసోర్సెస్ భవిష్యత్ రేటింగ్‌ను 'స్థిరత్వం' నుంచి 'సానుకూలం' చేసినట్లు ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది.

✦ ఐరోపా వాహన విడిభాగాల తయారీ సంస్థ ఐఏసీ స్వీడన్ కొనుగోలును పూర్తి చేసినట్లు టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ ప్రకటించింది. ఈ కంపెనీని ఆర్టిఫెక్స్ సిస్టమ్స్ ఏబీగా రీబ్రాండింగ్ చేయనుంది.

✦ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ **నుమాలీగఢ్ రిఫైనరీ లిమిటెడ్(ఎన్ఆర్ఎల్)**కు నవరత్న హోదాను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంజూరు చేశారు.

✦ విద్యుత్ వాహన విభాగంలో అగ్రస్థానంపై **మారుతీ సుజుకీ** దృష్టి పెట్టింది. ఇందుకోసం పలు కొత్త మోడళ్లను తీసుకురావడంతో పాటు లక్ష ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది.

✦ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో 2 శాతం వాటాను రూ.1588 కోట్లకు ప్రమోటర్ సంస్థ **బజాజ్ ఫైనాన్స్** విక్రయించింది.

✦ ఐపీఓకు ముందు ఇకామర్స్ సంస్థ **మీషో** యాంకర్ మదుపర్ల నుంచి రూ.2,439 కోట్లను సమీకరించింది.

# ఈనాడు సినిమా

## రవితేజ రంగంలోకి



కథానాయకుడు రవితేజ సినిమాల విషయంలో జోరు చూపిస్తున్నారు. ఇటీవలే 'మాస్ జాతర'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఆయన.. సంక్రాంతి బరిలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో సందడి చేయనున్నారు. ఈలోగానే మరో కొత్త సినిమాని పట్టాలెక్కించేశారు. శివ నిర్వాణ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో చకచకా కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రధాన తారాగణంపై టాకీ సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ఇక ఈ చిత్రంలో ఆరుగురు కథానాయికలు కనిపించనున్నట్లు నెట్టింట ప్రచారం సాగుతుండగా.. అవన్నీ అవాస్తవాలేనని చిత్ర వర్గాలు స్పష్టత ఇచ్చాయి. అందర్నీ థ్రిల్ చేసే వినూత్న కథాంశంతో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## అలా వేడుకున్నానో లేదో... ఆ వెంటనే!

"ఎంతో నమ్మకాన్నిచ్చిన కథలతోనే ప్రయాణం చేస్తున్నా. నా నమ్మకానికి తగ్గట్టుగా ఆ కథలు ప్రేక్షకులకూ నచ్చితేనే ఓ నటిగా నాకు తృప్తి. అందుకే విడుదల తర్వాత ప్రేక్షకుల స్పందన ఏమిటనే విషయాన్నే కీలకంగా పరిగణిస్తుంటా'' అంటున్నారు సంయుక్త. విజయాలకు పెట్టింది పేరైన కథానాయిక ఈమె. ఇటీవల బాలకృష్ణతో కలిసి 'అఖండ 2: తాండవం'లో నటించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో... 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సంయుక్త మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

**'అఖండ 2'లో మీ పాత్ర గురించి చాలా గోప్యత పాటిస్తున్నారు. కారణమేమిటి?**

ఎవరడిగినా చెప్పొద్దన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను (నవ్వుతూ). అంత కీలకమైన పాత్ర అది. చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఎక్కువగా సూట్ ధరించే కనిపిస్తాను. సినిమాలో నా పాత్ర చుట్టూ ఒక బలమైన మలుపు ఉంటుంది. ప్రస్తుతానికి ఇంతకంటే ఎక్కువ చెప్పలేను.

**అసలు ఇందులో నటించే అవకాశం ఎలా వచ్చింది?**

దర్శకుడు బోయపాటి శ్రీను నుంచే కాల్ వచ్చింది. ఆయన ఫోన్ అనగానే 'అఖండ 2' సినిమా గురించే అని అర్థమైంది. అయితే అప్పటికి నా చేతినిండా సినిమాలున్నాయి. డేట్స్ ఏమాత్రం ఖాళీగా లేవు. అయినా సరే, ఈ సినిమా చేయాల్సిందే అని మా బృందానికి చెప్పా. ఆ తర్వాత దర్శకుడిని కలిసి పూర్తి స్థాయి స్క్రిప్ట్ విన్నా. సినిమాలో పూర్తిస్థాయి పాత్ర కావాలి, లేదంటే కీలకమైన ఓ పాత్ర కావాలి... అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలనుకుంటా. ఆయన కథ చెప్పాక నేను ఈ సినిమా ఎలా ఉంటుందో ఊహించా. కానీ విజువల్ ఎఫెక్ట్స్‌తో బోయపాటి శ్రీను ఈ సినిమాని మరోస్థాయి విజన్‌తో తెరపైకి తీసుకొస్తున్నారు. ఆ సన్నివేశాల్ని చూశాక నాకే షాకింగ్‌గా అనిపించింది.

**తెలిసింది ఈ సినిమా కోసం ఓ మాస్ పాట చేసినట్టున్నారు కదా...**

ఇందులో ఒక మాస్ పాట ఉందమ్మా, చేస్తావా అని అడిగారు దర్శకుడు. చేస్తానని చెప్పా. ఆ తర్వాత 500 మంది డ్యాన్సర్లతో ఇలా ఓ మాస్ పాట అని చెప్పారు. అప్పుడు నాకు చెమటలు పట్టాయి, గుండె వేగం పెరిగింది (నవ్వుతూ). ఎందుకంటే ఇప్పటిదాకా అలాంటి పాట చేసిన అనుభవం నాకు లేదు. అందుకే ఆ భయం. కానీ ఓ నటిగా సినిమాని మరింత లోతుగా చూడాలనే తపన నాలో ఎప్పుడూ ఉంటుంది. అందుకే ఏదైనా భయాలున్నా సరే, ఇది నేను చేయగలనని ధైర్యంగా అడుగేస్తుంటా. రెండు రోజులు రిహార్సల్స్ చేసి 'జాజికాయ...' పాట కోసం సిద్ధమయ్యా.

**'బింబిసార', 'విరూపాక్ష', 'స్వయంభూ' ఇప్పుడు... 'అఖండ 2'... ఇలా మీరు చేస్తున్న సినిమాలు చాలావరకు పురాణాలతో ముడిపడి ఉంటున్నాయి...**

అలాంటి కథలు నా దగ్గరకు వచ్చాయి తప్ప, నేను ఎంచుకుని చేసిన సినిమాలేమీ ఎంత మాత్రం కాదు. ఈమధ్య మా అమ్మ కూడా ఇదే విషయాన్ని గుర్తు చేసింది. వ్యక్తిగతంగా నాలో ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కెరీర్ ఆరంభంలో కథలు ఎంపిక ఎలా చేసుకోవాలో తెలియక సతమతమయ్యేదాన్ని. ఒక రోజు... 'ఈ విషయంలో నువ్వే దారి చూపాలి' అంటూ దేవుడిని వేడుకున్నా. అలా వేడుకున్నానో లేదో, మరుసటి రోజే శివుడి పేరున్న ఓ పాత్రతో వచ్చే అవకాశం వచ్చింది.

**కెరీర్ ఆరంభం నుంచీ మీ చేతి నిండా సినిమాలే. ఈ ప్రయాణంపై సంతృప్తిగా ఉన్నారా?**

కెరీర్ విషయంలో నాకు ఎన్నెన్నో ప్రణాళికలతో ప్రయాణం మొదలు పెడుతుంటా. కానీ పరిణామాలు అందుకు పూర్తి విరుద్ధంగా సాగుతుంటాయి. 'బింబిసార', 'విరూపాక్ష', 'సార్', 'భీమ్లానాయక్'... ఇలా నాలుగు సినిమాలూ ఒకేసారి సంతకం చేశా. అవి నేను అనుకున్న క్రమంలో కాకుండా, విరుద్ధంగా విడుదలయ్యాయి. అదే తరహా పరిణామాలే ఇప్పుడు కూడా. 'స్వయంభూ', 'నారీ నారీ నడుమ మురారి', 'అఖండ 2'తోపాటు, పూరి జగన్నాథ్ చేస్తున్న సినిమాలకి సంతకం చేశా. 'స్వయంభూ', 'నారీ నారీ నడుమ మురారి' కాస్త ఆలస్యమయ్యాయి. వాటికంటే ముందే 'అఖండ 2' వస్తోంది. ఈ ప్రయాణంపై నేను సంతృప్తిగానే ఉన్నా. మన ప్రణాళికల కంటే కూడా, దేవుడి ప్రణాళికతో కెరీర్ సాగడమే మేలని నా అభిప్రాయం.



సంయుక్త

**బాలకృష్ణతో కలిసి పనిచేయడం ఎలాంటి అనుభవాన్నిచ్చింది?**

ఈ సినిమా ప్రయాణం మొత్తం ఎంతో సౌకర్యంగా సాగింది. ఒక్క రోజు కూడా ఇబ్బందిగా అనిపించలేదు. బాలకృష్ణలో నేను గమనించిన విషయం... ఆయన దర్శకుడి హీరో అని. దర్శకుడు మరో షాట్ చేయాలంటే ఇట్టే చేసి ఉండరు. వెళ్లి చేస్తారంతే.

**కొత్త సినిమాల ముచ్చట్లు చెబుతారా?**

'స్వయంభూ'లో తొలిసారి యాక్షన్ సన్నివేశాలు చేశా. అందుకోసం నేను గుర్రపుస్వారీ సహా కొన్ని యుద్ధ విద్యలు నేర్చుకున్నా. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రంలో నటించా.

## పదికి తొమ్మిది మంది మెచ్చుకున్నారు
– రామ్ పోతినేని

"ఓ సినిమా చేస్తున్నప్పుడు హిట్టవుతుందా.. లేదా అని అందరికీ భయం వేస్తుంటుంది. కానీ, 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్ర విషయంలో 'ఇది మంచి సినిమా' అని వెంటనే తెలుసుకుంటారా.. లేక కాస్త ఆలస్యంగా తెలుసుకుంటారా అనేది చూడాలనిపించింది'' అన్నారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన.. భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన ఈ చిత్రాన్ని పి.మహేశ్‌బాబు తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో థాంక్యూ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. "చాలా రోజుల తర్వాత.. మంచి రివ్యూలొచ్చాయి. ఇది చాలా అందమైన సినిమా. పదికి తొమ్మిది మంది దీన్ని మెచ్చుకున్నారు. నాకైతే ఇది చాలా ప్రత్యేకమైన సినిమా. అంతర్లీనంగా ఓ మంచి సందేశమిస్తూ ప్రేక్షకుల్లో స్ఫూర్తిని రగిలించేలా ఉంటుంది. ఇంత మంచి చిత్రాన్ని ఇంకా జనాల్లోకి తీసుకెళ్లండని డిమాండ్ కనిపిస్తోంది. ఈవారం నుంచి ప్రచార కార్యక్రమాల్ని వేగవంతం చేస్తాం'' అన్నారు. "మేమెంతో ప్రేమించి చేసిన చిత్రమిది. ఈ మంచి చిత్రాన్ని అందరికీ చేరువ చేయాలన్న ఉద్దేశంతోనే మేము టికెట్ రేట్లు కూడా పెంచలేదు. దీన్ని ప్రతిఒక్కరూ థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుతున్నా'' అన్నారు నిర్మాత వై.రవిశంకర్. ఈ కార్యక్రమంలో భాగ్యశ్రీ, మహేశ్‌బాబు, వివేక్ - మెర్విన్ తదితరులు పాల్గొన్నారు.



వై.రవిశంకర్, రామ్, భాగ్యశ్రీ బోర్సే, పి.మహేశ్‌బాబు

## సర్దుకుపోతేనే సంసారం

● నేటి కాలం జంటలకు వినోదాత్మక సందేశం



| సినిమా |
|---|
| అన్ పావం పొల్లాతతు (తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, భాషల్లో) |
| జానర్ |
| రొమాంటిక్ కామెడీ |
| ప్లాట్‌ఫామ్ |
| జియోహాట్‌స్టార్ |

ఓ.. ఓటీటీ లుక్కేయొచ్చు!

నాకు భార్యగా వచ్చే అమ్మాయి అణుకువగా, పద్ధతిగా ఉండాలి..
నేను చేసుకోబోయే అబ్బాయి నన్ను పువ్వుల్లో పెట్టుకొని చూసుకోవాలి..
నీతో 100 ఏళ్లు కలిసి సంతోషంగా బతకాలనుకుంటున్నా...

నేటితరం యువత తమ వైవాహిక జీవితాన్ని ఇలానే అద్భుతంగా ఊహించుకుంటున్నారు. కానీ వందేళ్ల గురించి పక్కన పెడితే.. ఈ కాలంలో పెళ్లి తర్వాత కనీసం 100 రోజులు కలిసి ఉంటున్న జంటలెన్నీ? తాళికి విలువనిచ్చి కోర్టు మెట్ల వరకు వెళ్లకుండా ఆగిన బంధాలెన్ని? ఇలా ఒకరినొకరు అర్థం చేసుకోకుండా చిన్న చిన్న విషయాలకే పంతాలకు పోయి విడిపోతున్న నేటి కాలం జంటలకి మంచి సందేశాన్ని ఇస్తుంది 'అన్ పావం పొల్లాతతు' చిత్రం.

**కథాంశం:** శివ(రియో రాజ్), శక్తి(మాళవిక మనోజ్).. వీరిద్దరిదీ పెద్దలు కుదిర్చిన వివాహం. తండ్రి ఆంక్షల మధ్య పెరిగిన శక్తిని.. స్త్రీకి స్వేచ్ఛ అవసరమంటూ తనకి అన్ని విషయాల్లో సపోర్ట్ చేస్తుంటాడు శివ. దీన్ని అలుసుగా తీసుకున్న శక్తి.. భర్తను పట్టించుకోకుండా, ఇంట్లో పనులు కూడా చేయకుండా సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ కాలక్షేపం చేస్తుంటుంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలవుతాయి. మరి చిన్నగా మొదలైన ఈ గొడవలు విడాకుల వరకు ఎందుకు వెళ్లాయి? చివరికి వీరి దాంపత్య బంధం నిలబడిందా? లేదా? అనేదే ఈ సినిమా కథాంశం. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి కలైయరసన్ తంగవేల్ దర్శకత్వం వహించారు.

● వేర్వేరు నేపథ్యాలకు చెందిన అమ్మాయిని, అబ్బాయిని పెళ్లి అనే బంధం ఒక్కటి చేస్తుంది. ఒకరి అభిరుచులను మరొకరు తెలుసుకుంటూ ఆ బంధంలో ఇమిడిపోవడానికి వారికి కొంత సమయం అవసరమని చాటి చెప్పిన చిత్రమిది. దాంపత్య జీవితంలో ఎవరూ ఎక్కువ కాదు.. ఎవరూ తక్కువ కాదు.. అవసరమైనప్పుడు ఇద్దరూ నెగ్గి తగ్గి ఉండాలని తెలియజేసిందీ చిత్రం. హక్కుల గురించి ఆలోచించకుండా భార్యాభర్తలు సర్దుకుపోతూ.. ఒకరినొకరు అర్థం చేసుకుంటేనే పెళ్లి బంధం గట్టిగా నిలబడుతుందని స్పష్టం చేసింది. ఇందులో రియో రాజ్, మాళవిక భార్యాభర్తలుగా వారి నటనతో కట్టిపడేశారు. చాలా మంది అబ్బాయిలు సినిమా చూస్తున్నంత సేపు శివ పాత్రను తమ జీవితానికి దగ్గర ఊహించుకుంటారనే విషయంలో సందేహమే లేదు. ప్రస్తుతం సమాజంలో చట్టం ముందు మహిళలు ఏం చెప్పినా నమ్మేస్తున్నారు. దీంతో మహిళల రక్షణ కోసం ఇచ్చిన బలమైన చట్టాలను వాళ్లు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో అద్భుతమైన సన్నివేశాలతో కళ్లకు కట్టినట్లు చూపించింది. భర్త కుటుంబం కోసం కష్టపడుతున్నా.. కేసులు పెట్టి భరణం తీసుకుంటున్నారని 'మగవాళ్లు ప్రమాదంలో ఉన్నారు జాగ్రత్త' అని హెచ్చరించిన దర్శకుడి ప్రయత్నానికి ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## మనోభావాలు దెబ్బతింటే క్షమించండి



రణ్‌వీర్ సింగ్

ఇటీవల గోవాలో జరిగిన 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫి) ముగింపు వేడుకల్లో రణ్‌వీర్ సింగ్.. రిషబ్ శెట్టి నటించిన 'కాంతార: చాప్టర్ 1' చిత్రంలోని ఓ కీలకమైన సన్నివేశాన్ని అనుకరించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ కావడంతో రణ్‌వీర్ ప్రవర్తనపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా రణ్‌వీర్ ఈ విషయంపై స్పందించారు. ఎవరి మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం కాదని క్షమాపణలు చెప్పారు. ఆ సినిమా పట్ల తనకున్న గౌరవాన్ని తెలుపుతూ.. "ఈ సినిమాలో రిషబ్ అద్భుతమైన నటనను హైలైట్ చేయడమే నా ఉద్దేశం. నటుడిగా ఎంతో ప్రాధాన్యం కలిగిన ఆ ప్రత్యేక సన్నివేశంలో నటించడం ఎంత కష్టమో నాకు తెలుసు. నాకు ఆ సన్నివేశమంటే చాలా అభిమానం. మన దేశంలో ప్రతి సంస్కృతి, సంప్రదాయం, నమ్మకాన్ని నేను ఎల్లప్పుడూ ఎంతో గౌరవిస్తాను. నేను ఎవరి మనోభావాలనైనా గాయపరిచి ఉంటే మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుకుంటున్నా"అని ఇన్‌స్టా స్టోరీలో పేర్కొన్నారు.

## అక్కడ లగ్జరీ కారులో వస్తేనే.. స్టార్



దుల్కర్ సల్మాన్

ఇటీవలే 'కాంత' చిత్రంతో థియేటర్లలో సందడి చేశారు నటుడు దుల్కర్ సల్మాన్. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని హిందీ చిత్రపరిశ్రమలో ఎదురైన కొన్ని ఆసక్తికర సంగతులు పంచుకున్నారు. "నేను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను ఓ స్టార్ అని అందరినీ నమ్మించేందుకు నా టీమ్ ప్రయత్నిస్తూ ఉండేది. లేకపోతే సెట్లో నాకు కనీసం కుర్చీ కూడా దొరికేది కాదు. అందుకే షూట్ చేసిన తర్వాత ఆ సన్నివేశాన్ని ఒకసారి చూద్దామన్నా మానిటర్ వద్ద చాలామంది ఉండడం వల్ల నాకు అవకాశం ఉండేది కాదు. అక్కడ ప్రధానంగా మీరు ఎప్పుడూ చుట్టూ జనాలతో ఉంటేనే గుర్తిస్తారు. ఏదైనా ఒక లగ్జరీ కారులో వస్తేనే స్టార్ అని అనుకుంటారు. అలాంటి భావన చాలా దురదృష్టకరం. ఆ సంఘటన చూశాక నేను అలా కాకూడదని అనుకున్నా. నాకు ఆరు మేకప్ వ్యాన్లు ఉన్న కొంతమంది నటులు తెలుసు. అవి వారికి తప్పనిసరి కావచ్చు. బహుశా పరిశ్రమ పరిమాణం అటువంటి పరిస్థితులను ప్రభావితం చేసే ప్రధాన అంశం అయి ఉండొచ్చు. నేను ఏ పరిశ్రమతోనూ భిన్నంగా ప్రవర్తించకూడదనే అనుకుంటాను. హిందీ పరిశ్రమ చాలా పెద్దదని నేను, రానా చర్చించుకుంటాము. థియేటర్ల సంఖ్య, మార్కెట్లు, రాష్ట్రాల వారీగా ఎంతో మంది ఆ భాష మాట్లాడుతూ చిత్రాలను ఆదరిస్తారు. కానీ మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఎక్కువ ఖర్చు ఉండదు. సెట్‌లో విలాసాలకు ప్రాధాన్యం ఇవ్వము. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాలలో షూటింగ్‌లు చేస్తాం. ఇంటి నుంచే అన్ని తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం''అని తన అభిప్రాయాల్ని పంచుకున్నారు. తొలిసారి 2018లో కార్వాన్‌తో హిందీలోకి అడుగుపెట్టారు దుల్కర్.

## మోగ్లీ ప్రేమ యుద్ధం



సాక్షి, రోషన్

తన ప్రేమ కోసం యుద్ధం చేస్తున్న ప్రతివాడూ హీరోనే అంటున్నాడు మోగ్లీ. అతను ప్రేమించిన అమ్మాయి ఎవరు? ఆమె కోసం ఎవరితో యుద్ధం చేయాల్సి వచ్చిందో తెలియాలంటే 'మోగ్లీ 2025' చూడాల్సిందే. రోషన్ కనకాల కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమిది. సాక్షి మడోల్కర్ కథానాయిక. సందీప్‌రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రముఖ కథానాయిక రష్మిక మంగళవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'ప్రతి ప్రేమ జంట సీతారాములు కాకపోయినా, వాళ్లను గెలిపించడానికి మాత్రం నువ్వే ఉండాలి. ...' అంటూ సాగే సంభాషణ ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచింది. సీతారాముల్లాంటి ప్రేమికులతోపాటు, హనుమంతుడిలాంటి మరో కీలకమైన పాత్రతో ముడిపడిన కథ అని తెలుస్తోంది. అడవి నేపథ్యం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బండి సరోజ్ కుమార్, హర్ష చెముడు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఛాయాగ్రహణం: రామ మారుతి.ఎం, కూర్పు: కోదాటి పవన్‌కల్యాణ్, కళ: కిరణ్ మామిడి, యాక్షన్: నటరాజ్ మాడిగొండ.

## అతి చేసే అనుమాన పక్షి



రాగ్ మయూర్

'డీజే టిల్లు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు దర్శకుడు విమల్ కృష్ణ. ఇప్పుడాయన నుంచి రానున్న కొత్త చిత్రం 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా నటించారు. రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గయ్య, హిరాలాల్ దంపతి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో థియేటర్లలోకి రానున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈమేరకు ఓ ప్రోమో విడుదల చేశారు. అతిగా ఆలోచించడం.. అతి జాగ్రత్తగా వ్యవహరించడం లాంటి చిత్రమైన స్వభావంతో తన చుట్టూ ఉన్న వాళ్లను గందరగోళపరిచే వ్యక్తిగా రాగ్ మయూర్ పాత్రను వినోదాత్మకంగా చూపించారు. త్వరలోనే ప్రచార కార్యక్రమాల్ని వేగవంతం చేయడంతో పాటు విడుదల తేదీపైనా స్పష్టత ఇవ్వనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.

## ఆ బాధ వర్ణనాతీతం



జాన్వీ కపూర్

ప్రముఖులు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది కథానాయిక జాన్వీ కపూర్. ఇటీవలే ముంబయిలో జరిగినా 'వీ ది ఉమెన్ ఆసియా' కార్యక్రమానికి హాజరైన జాన్వీ కపూర్ బాలీవుడ్ దిగ్గజ నటీనటులు శ్రీదేవి, ధర్మేంద్ర మరణాల తర్వాత జరిగిన పరిణామాల గురించి మాట్లాడింది. "నేటి మీడియా సంస్కృతి మానవ నైతిక విలువల్ని పూర్తిగా పతనమయ్యేలా చేస్తుంది. ఈ మధ్య అది మరీ ఎక్కువైంది. నా తల్లిని కోల్పోయినప్పుడు అది మరింత భయంకరంగా ఉండేది. నేను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్నినెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. అమ్మ మరణించినప్పుడు ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురిగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనని భయపడ్డాను. నా తొలి చిత్ర ప్రచారంలోనూ నేను మా అమ్మను గుర్తు చేసుకుంటూ చెప్పిన మాటలపై సామాజిక మాధ్యమాలలో కొందరు మీమ్స్ కూడా చేశారు. ఆ బాధ మాటల్లో వర్ణించలేనిది. తల్లి మరణంపై కూతురు బాధపడితే దాన్ని కూడా హేళన చేస్తారని ఎవరైనా ఊహించగలరా! తాజాగా ధర్మేంద్ర విషయంలోనూ కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదు. అది నిజమైన జర్నలిజం కాదు''ని చెప్పింది.

## ఈ సినిమా నచ్చకపోతే... క్షమాపణలు చెప్తా: నందు

'సైక్ సిద్ధార్థ' చిత్రం హీరోగా తన సినీ ప్రయాణాన్ని మారుస్తుందని అన్నారు నటుడు శ్రీ నందు. ఈ సినిమా నచ్చకపోతే ప్రెస్‌మీట్ పెట్టి అందరికీ క్షమాపణలు చెప్తానన్నారు. ఇది తాను పొగరుగా చెప్పడం లేదని.. చాలా వినయంగా చెప్తున్నానని తెలిపారు. ఇది శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మించిన సినిమా. వరుణ్ రెడ్డి తెరకెక్కించారు. శ్యామ్ సుందర్ రెడ్డి మరో నిర్మాత. యామిని భాస్కర్ కథానాయిక. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా ఈ నెల 12న రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. శ్రీనందు మాట్లాడుతూ.. "ఈసారి విజయం మనదే. ఈ కథ ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఈ ఒక్కసారి నాకొక ఛాన్స్ ఇవ్వండి. అందరూ థియేటర్స్‌కు వచ్చి సినిమా చూడండి'' అని భావోద్వేగంతో కంటతడి పెట్టుకున్నారు.



నందు, యామిని

## ఆనందపురం అమ్మాయి కోసం..



ఎమ్.చంద్రశేఖర్, దివ్యభారతి

తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని... తనను తీసుకెళితే రూ.10 లక్షలు ఇస్తానని ఓ ముఠాతో ఒప్పందం చేసుకుంది ఆనందపురంలోని ఓ అమ్మాయి. పెళ్లి పీటలెక్కిన ఆమెని తీసుకొచ్చేందుకు ఆ ముఠా ఎలాంటి సాహసాలు చేసింది? ఆ తర్వాత జరిగిన పరిణామాలేమిటో తెలియాలంటే 'జి.ఓ.ఏ.టీ' (గోట్) చూడాల్సిందే. సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. ఎమ్ చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా టీజర్ ప్రముఖ నిర్మాత దిల్‌రాజు చేతులమీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కథానాయిక మాట్లాడుతూ "తమిళంలో నాకు 'బ్యాచిలర్' చిత్రం ఎంత పేరు తీసుకొచ్చిందో, తెలుగులో 'జి.ఓ.ఏ.టీ' అలాంటి చిత్రం అవుతుందని నా నమ్మకం'' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "సమాజంలో ఉన్న ఒక సమస్యని స్పృశిస్తూ ఈ చిత్రాన్ని తీశాం. కామెడీ, యాక్షన్ మేళవింపుగా అందరూ ఆస్వాదించేలా తీర్చిదిద్దాం. సుడిగాలి సుధీర్ బాధ్యతాయుతమైన వ్యక్తి అని, కింద నుంచి పైకి వచ్చారని, ఆయన హీరోగా ఎక్కువ బడ్జెట్ పెట్టి ఈ సినిమా చేశాం. భవిష్యత్తులో జరిగే వేడుకలకు ఆయన హాజరవుతారని ఆశిస్తున్నా'' అన్నారు.

# జంతువుల్లో మహా అలారం!



**ప్రకృతికీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఉంది. దీనికి ఉపగ్రహాలు, సీస్మోగ్రాఫ్స్‌తో పనిలేదు. పసిగట్టే సునిశిత జ్ఞానముంటే చాలు. ఇందులో జంతువుల నైపుణ్యం, శక్తి అపారం. ప్రకృతి విపత్తులను ముందుగానే అంచనా వేస్తూ శాస్త్రవేత్తలను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతున్నాయి. తమలో సహజంగా నిక్షిప్తమైన 'అలారం వ్యవస్థ' సాయంతో భూకంపాలు, సునామి, తుపాన్ల వంటి వాటిని ముందే గుర్తించి, అక్కడి నుంచి ఉన్నట్టుండి తరలిపోవటం.. వింత ప్రవర్తనతో మనల్నీ అప్రమత్తం చేయటం విచిత్రం.**

అది అర్ధరాతి.. గాఢ నిద్రలో ఊరు! నిండు నిశ్శబ్దం. చందమామ చిరు వెలుగులు. అంతటా ప్రశాంతం. అంతలోనే.. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ శబ్దాలు! మొదట ఒకటి.. తర్వాత రెండు.. చూస్తుండగానే పది, పదిహేను కుక్కలు ఒక్కసారిగా ఆకాశం వైపు చూస్తూ వింతగా మొరగడం మొదలుపెట్టాయి. అవేమీ సాధారణ అరుపులు కాదు. ఏదో తెలియని భయంతో కూడిన ఆర్తనాదాలు! ఆ గందరగోళం ముగియక ముందే చెట్ల మీద ఉండాల్సిన పక్షులు గుంపులుగా ఆకాశంలో చక్కర్లు కొడుతూ అరుస్తున్నాయి. నేల లోపల ఉండాల్సిన పాములు బయటకు వచ్చి పరుగులు తీస్తున్నాయి. ఇంతలో ఇంట్లో గ్లాసుల్లో నీళ్లు ఊగాయి, ఇళ్ల గోడలు కంపించాయి. భూమి ఒక్కసారిగా దద్దరిల్లింది. భూకంపం సంభవించింది.

ఇది ఏదో ఒక ఊరి కథ కాదు. జపాన్, చైనా, ఇండోనేషియా మొదలుకొని.. మన కచ్, అస్సాం, లాతూర్ వరకూ ప్రతి విపత్తు వెనుకా ఉన్న ఒకే ఒక్క నిజం. ముప్పును జంతువులు ముందే పసిగట్టాయి. మనకు మాత్రం అర్థం కాలేదు. ఎందుకని? కొన్ని జీవులకు ప్రకృతి విపత్తులు ముందుగానే ఎలా తెలుస్తాయి? మనిషికి లేని శక్తి జంతువులకు ఉందా? సినిమాల్లో చూపించే సెవెన్త్ సెన్స్ లాంటి మాయాజాలం ఏదైనా వాటి సొంతమా? శాస్త్రవేత్తల సమాధానం ఒక్కటే. అవి మాయలు కాదు. విజ్ఞాన శాస్త్రం ప్రకారం, జంతువుల ప్రత్యేక శరీర సెన్సార్ వ్యవస్థ మహత్తు!!

చాలా జంతువుల శరీరంలో, ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన మూడు 'సిగ్నల్ రిసీవర్ల'లో ఏదో ఒకటి కచ్చితంగా ఉంటుంది. మన చెవికి వినిపించని అత్యంత స్వల్ప పౌనఃపున్యం గల ఇన్‌ఫ్రాసోనిక్ సౌండ్స్ (పరశ్రావ్యాలు), అత్యధిక పౌనఃపున్యం గల అల్ట్రాసౌండ్ (అతిధ్వనులు) శబ్దాలను.. అలాగే నేలలో తలెత్తే అతి సూక్ష్మ భూప్రకంపనల కదలికలను.. భూ అయస్కాంత క్షేత్ర మార్పులను మనిషి పంచేంద్రియాలు గ్రహించలేవు. కానీ జంతువులు ప్రత్యేక గ్రాహకాలతో, క్షణాల్లో వాటిని పసిగట్టి రానున్న విపత్తును ముందుగానే తెలుసుకుంటాయి. అదెలాగో వివరంగా చూద్దాం.





### జీవుల వినికిడి పరిధులు (హెర్ట్జ్)

| | |
|---|---|
| మనిషి | 20 - 20 వేలు |
| కుక్క | 40 - 60వేలు |
| పిల్లి | 45 - 64 వేలు |
| ఏనుగు | 1 - 20వేలు |
| గుర్రం | 55 - 33వేలు |
| డాల్ఫిన్ | 150 - 150వేలు |
| తిమింగలం | 0.1 - 20వేలు |
| పావురం | 1 - 10 వేలు |
| చిలుక | 100 - 8.5వేలు |
| కాకి | 300 - 8 వేలు |
| పాము | 50-వేయి |
| బల్లి | 50 - 4వేలు |
| తాబేలు | 50 - వేయి |
| షార్క్ | 10 - 800 |
| డాల్ఫిన్ | 15 - 150వేలు |
| దోమ | 300 - 2 వేలు |
| చీమ | 30-150 |
| గొంగళి పురుగు | వేయి - 10 వేలు |

### సముద్ర జీవుల రాడార్

చేపల శరీరంలో నీటి పీడనాన్ని గుర్తించే ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. సునామీ లేదా భూకంపం వచ్చే ముందు నీటి పీడనంలో మార్పు వస్తుంది. దీని సాయంతోనే లోతులో ఉండే చేపలు ఉపరితలానికి, తీరంలో ఉండే పీతలు లోపలికి పారిపోతాయి. డాల్ఫిన్లు అకస్మాత్తుగా దిశను మార్చుకుంటాయి. ఇవన్నీ సముద్ర జీవులు చేసే హెచ్చరికలే!

### చరిత్ర చెప్పిన సత్యాలు:

- జపాన్ (2011) సునామీ: సునామికి ముందు పక్షుల వలసల్లో, పెంపుడు కుక్కల ప్రవర్తనలో భారీ మార్పులు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజీల్లో తేలింది.
- భారత్ (2004): అండమాన్ దీవుల్లోని జరావా తెగ వారు... పక్షులు, జంతువుల అరుపులను గమనించి సునామి రాకముందే ఎత్తయిన ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు.
- చైనా (1975): పాములు మంచులో బయటకు రావడం, జంతువుల వింత ప్రవర్తనను గమనించిన చైనా ప్రభుత్వం, భారీ భూకంపం రాకముందే హైచెంగ్ నగర ప్రజలను ఖాళీ చేయించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే నగరం కుప్పకూలింది. కానీ వేలాది మంది ప్రాణాలు దక్కాయి. జంతువుల విచిత్ర ప్రవర్తన ముందుగా గుర్తించి, ప్రమాదాన్ని తగ్గించిన ఏకైక భూకంపం ఇదే!

### అది వాటికి సైరన్ మోతే

కంపించే వస్తువు నుంచి ధ్వని ఉత్పత్తి అవుతుందనే విషయం తెలిసిందే. అయితే మన చెవికి గల పరిమితి మూలంగా 20 నుంచి 20,000 హెర్ట్జ్ మధ్య ఉండే శబ్దాలను మాత్రమే వినగలం. వీటిని శ్రావ్య ధ్వనులు అంటారు.

- 20 హెర్ట్జ్ కన్నా తక్కువ ఉండే పరశ్రావ్య ధ్వనులు సహజంగా భూకంపం వచ్చే ముందు, సునామీ సముద్ర గర్భంలో పుట్టేటప్పుడు, తుపానులు, ఇసుక తుపానులు ఆరంభమయ్యేటప్పుడు, అగ్నిపర్వతాల్లో పీడనం పెరిగేటప్పుడు వెలువడతాయి. ఈ పరశ్రావ్య ధ్వనులతో పాటు, 20వేల హెర్ట్జ్ కన్నా అధికంగా గల అతి ధ్వనులను కూడా మనం వినలేం. కాబట్టి ఈ కోవకు చెందిన ధ్వనులు మనకు నిశ్శబ్దంతో సమానం. జంతువులకు అవే 'ప్రమాద ఘంటికల సూచనలు'.

### కుక్కల ఆందోళన వెనక

భూకంపానికి కొన్ని గంటల ముందు కుక్కలు కారణం లేకుండా నిరంతరం మొరుగుతాయి, లేదా యజమానిని లాక్కొని బయటకు పారిపోవడానికి చూస్తాయి. మన పెద్దలు చెప్పినట్టు దెయ్యాలు, పిశాచాలు వాటికి కనిపించడం కాదు. భూమి పొరల్లో రాళ్లు పగిలినప్పుడు వచ్చే పరశ్రావ్య ధ్వనులు వాటి చెవికి స్పష్టంగా వినిపిస్తాయి. ఆ వింత శబ్దం వాటిని భయపెడుతుంది. 'ఇక్కడ ఏదో తేడాగా ఉంది, పారిపోదాం పద' అని అవి మనల్ని హెచ్చరిస్తాయి.

- ఇదే మాదిరిగా ఎడారి ఓడ ఒంటె కూడా ఇసుక తుపానుల నుండి ఉత్పత్తి అయిన పరశ్రావ్య ధ్వనులను చాలా ముందుగానే గ్రహించి, తుపానుకు వ్యతిరేక దిశలో పరుగెత్తి ప్రాణాలు కాపాడుకుంటుంది.

### ఏనుగుల లాంగ్ డిస్టెన్స్ కాల్

ఏనుగులు అతి తక్కువ పౌనఃపున్యంతో మాట్లాడుకుంటాయి. సునామి సమయంలో సముద్రం లోపల పుట్టుకొచ్చే శబ్దాలు, ఏనుగులకు దాదాపు 10 కిలోమీటర్ల దూరం నుంచే వినిపిస్తాయి. అందుకే 2004 సునామిలో అలలు రాకముందే ఏనుగులు ఎత్తయిన కొండ ప్రాంతాలకు పరుగులు తీశాయి.

### పక్షుల కంటిలో దిక్సూచి

పక్షుల కంటిలో క్రిప్టోక్రోమ్ అనే ప్రత్యేక ప్రోటీన్ ఉంటుంది. దీనిని ఉపయోగించుకొని, భూ అయస్కాంత క్షేత్రంతో ఒక రూట్ మ్యాప్‌లా దిశా నిర్దేశం చేసుకొని ప్రయాణిస్తాయి. విపత్తుకు ముందు భూ అయస్కాంత క్షేత్రంలో మార్పులు వస్తాయి. దీంతో పక్షులు దిక్కుతోచక గూళ్లు వదిలి, గుంపులుగా ఆకాశంలో చక్కర్లు కొడతాయి.



### నేల రహస్యం పాముకే తెలుసు

పాములకు చెవులుండవు, కానీ వాటి శరీరం మొత్తం ఒక సెన్సార్! అవి నేలకు ఆనుకుని ప్రయాణిస్తాయి కాబట్టి, భూకంపానికి ముందు నేల పొరల్లో వచ్చే అతి చిన్న చీలికలను, కంపనాలను అవి గుర్తిస్తాయి. వీటి ఒత్తిడికి భూమి లోపల వేడి పెరుగుతుంది. ఆ వేడికి, కంపనాలకు తట్టుకోలేక పాములు తమ పుట్టలను వదిలి బయటకు వచ్చేస్తాయి. శీతాకాలంలో కూడా పాములు బయట తిరుగుతున్నాయంటే.. భూకంపం వచ్చే అవకాశం ఉందని చైనా శాస్త్రవేత్తలు బలంగా నమ్ముతారు. ఇదే టెక్నిక్‌ను బొరియలలో నివసించే ఇతర జీవులైన ఎలుకలు, చీమలు వంటివి కూడా పాటిస్తాయి.

### జంతువులే మన శాస్త్రవేత్తలు!

శాస్త్రవేత్తలు ఇప్పుడు ఒక కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. అదే, జంతువుల ప్రవర్తన డేటా + కృత్రిమ మేధ = ముందస్తు హెచ్చరిక. అడవుల్లో, సముద్రాల్లో జంతువుల కదలికలను ట్రాక్ చేసి, ఆ డేటాను కంప్యూటర్ అల్గారిథమ్స్‌తో విశ్లేషిస్తే.. ఉపద్రవాలు పెను ప్రమాదం సృష్టించడానికి చాలా ముందుగానే అధికారిక హెచ్చరిక జారీ చేసే రోజు ఎంతో దూరంలో లేదన్నా అతిశయోక్తి కాదు.

మనిషి ప్రకృతిని అర్థం చేసుకోవడానికి టెక్నాలజీని, యంత్రాలను, పుస్తకాలను నమ్ముకున్నాడు. కానీ జంతువులు ప్రకృతి ఇచ్చిన శరీరాన్ని, అనుభవాన్ని నమ్ముకున్నాయి. మనిషి మెదడుతో ఆలోచిస్తే.. జంతువులు గుండెతో ఫీల్ అవుతాయి. అందుకే, ప్రకృతి ఇచ్చే నిజమైన ముందస్తు హెచ్చరికను ప్రస్తుత టెక్నాలజీ, శాటిలైట్ల కంటే ముందు... మన ఇంటి ముందున్న కుక్కల అరుపుల్లో, చెట్టు మీద ఉన్న పక్షుల రెక్కల్లో, నేల మీద పాకే జీవుల కదలికల్లో వెతకాలి. ఎందుకంటే.. మనకన్నా ముందే, మనకన్నా నిజాయితీగా ప్రకృతిని చదివేది ఆ మూగజీవాలే.

– డా. మొహమ్మద్ నయీమ్, అసోసియేట్ ప్రొఫెసర్, భౌతిక శాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి

## గెలాక్సీ ట్యాబ్ ఏ11+ వచ్చేసింది

సామ్‌సంగ్ సంస్థ మనదేశంలో గెలాక్సీ ట్యాబ్ ఏ11+ పరిచయం చేసింది. దీంతో గత సెప్టెంబరులోనే ప్రపంచ మార్కెట్లోకి వచ్చిన ఇదిప్పుడు మనకూ అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. ఇది మీడియాటెక్ ఎంటీ8775 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత వన్ యూఐ 8 ఇంటర్ఫేస్‌తో పనిచేస్తుంది. 90హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 11 అంగుళాల టీఎఫ్‌టీ ఎల్‌సీడీ డిస్‌ప్లే, డాల్బీ ఆటమ్స్‌ను సపోర్టు చేసే క్వాడ్ స్పీకర్లు, 25డబ్ల్యూ వైర్డ్ ఛార్జింగ్ సపోర్టుతో కూడిన 7,040 ఎంఏహెచ్ బ్యాటరీతో ఆకర్షిస్తోంది. వెనకాల 8ఎంపీ కెమెరా, ముందు 5ఎంపీ కెమెరా ఉన్నాయి. కంపాటబుల్ మానిటర్ ఉన్నట్టయితే దీన్ని డెక్స్ మోడ్‌లో పీసీలోనూ వాడుకోవచ్చు. కనెక్టివిటీ, స్టోరేజీ పరంగా నాలుగు రకాల్లో ఈ ట్యాబ్లెట్ అందుబాటులో ఉంటుంది. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీలో కేవలం వై-ఫై మాత్రమే గల ట్యాబ్లెట్ ధర రూ.22,999. అదే వై-ఫై, సెల్యులర్ రెండూ ఉన్నదైతే రూ.26,999. 8జీబీ+256జీబీలో ఓన్లీ వై-ఫై రకం ధర రూ.28,999.. వై-ఫై, సెల్యులర్ రకం ధర రూ.32,999.




## లైట్‌గా నథింగ్ ఫోన్ 3ఏ

మధ్యశ్రేణి వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని నథింగ్ సంస్థ మనదేశంలో ఫోన్ 3ఏ లైట్‌ను ఆవిష్కరించింది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రో, ఆండ్రాయిడ్ 15 ఆధారిత నథింగ్ ఓఎస్ 3.5తో పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 3,000 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.77 అంగుళాల ఎమోలెడ్ తెర, ముందూ వెనకా పాండా గ్లాస్ రక్షణ, దుమ్ము-నీటిని తట్టుకునే ఐపీ54 రేటింగ్, ఎసెన్షియల్ కీ/ఎసెన్షియల్ స్పేస్, గ్లిఫ్ లైట్, పారదర్శక డిజైన్ వంటి ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. 33డబ్ల్యూ ఛార్జింగ్, 5డబ్ల్యూ రివర్స్ ఛార్జింగ్‌ను సపోర్టు చేసే 5000 ఎంఏహెచ్ బ్యాటరీ కలిగుంది. వెనకాల 50 ఎంపీ ప్రధాన సామ్‌సంగ్ సెన్సర్, 8 ఎంపీ అల్ట్రావైడ్ లెన్స్, 2 ఎంపీ మ్యాక్రో కెమెరా వ్యవస్థ.. ముందు సెల్ఫీల కోసం 16 ఎంపీ కెమెరా ఉన్నాయి. 8జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీతో వస్తోంది. మైక్రోఎస్‌డీ కార్డుతో 2టీబీ వరకూ స్టోరేజీని పెంచుకోవచ్చు. మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ ప్యాచెస్ అందుతాయి. నలుపు, తెలుపు, నీలం రంగుల్లో లభించే దీని ప్రారంభ ధర రూ.20,999. 256జీబీ స్టోరేజీ రకం ధర రూ.22,999. డిసెంబరు 5 నుంచి అమ్మకాలు మొదలవుతాయి.



## ఇన్‌స్టాలో ఏఐ వాయిస్ ట్రాన్స్‌లేషన్



ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను వేర్వేరు భాషల్లోకి అనువాదం చేసుకోవాలని అనుకుంటున్నారా? అయితే మెటా ఏఐ వాయిస్ ట్రాన్స్‌లేషన్ సాయం తీసుకోవచ్చు. మెటా సంస్థ ఇటీవల ముంబైలో నిర్వహించిన హౌజ్ ఆఫ్ ఇన్‌స్టాగ్రామ్ కార్యక్రమంలో దీన్ని ప్రకటించింది. ఇది బెంగాలీ, తమిళం, తెలుగు, కన్నడ, మరాఠీ భాషల్లోకి రీల్స్‌ను అనువాదం చేయగలదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది వీక్షకులకు రీల్స్ అందుబాటులోకి రాగలవు. ఏఐ వాయిస్ ట్రాన్స్‌లేషన్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్ ఎడిట్స్‌లో భారతీయ ఫాంట్స్‌నూ మెటా పరిచయం చేసింది. హిందీ, మరాఠీ, బెంగాలీ, అస్సామీ భాషల్లోని టెక్స్ట్/క్యాప్షన్లను దేవనాగరి, బెంగాలీ, అస్సామీ స్క్రిప్ట్ శైలుల్లో రాసుకోవచ్చు.

## స్మార్ట్ పోయి ల్యాండ్ వచ్చె..



పిల్లల దగ్గరి నుంచి పెద్దల వరకూ ఎవరి చేతుల్లో చూసినా స్మార్ట్‌ఫోన్లే. ఇలాంటి కాలంలో పాత ల్యాండ్‌లైన్ ఫోన్ వాడాలని ఎవరైనా అనుకుంటారా? ఆ ఆలోచన వస్తేనే బిత్తరపోయి చూస్తారు. అలాంటిది ఒకప్పటి ల్యాండ్‌లైన్ టెలిఫోన్‌ను పోలిన పరికరాన్ని రూపొందించి, వాడటమే కాదు.. వాటిని తయారుచేసి కొద్దిరోజుల్లోనే కోట్లాది రూపాయలను సంపాదిస్తే? టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో క్యాట్‌జీపీటీగా పేరొందిన క్యాట్ గోయెట్జ్ అదే సాధించారు.

స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని వదిలేయాలనే క్యాట్ ప్రయత్నమే కొత్తరకం ల్యాండ్ ఫోన్ రూపకల్పనకు.. చివరికి ఫిజికల్ ఫోన్స్ అనే కంపెనీ స్థాపనకు దారితీసింది. రెండేళ్ల క్రితం ఆమెకో విచిత్రమైన ఆలోచన వచ్చింది. 'ఇప్పుడూ ల్యాండ్‌లైన్ ఫోన్ ఉన్నట్టయితే, దాని పక్కన కూర్చొని.. ఒక చేత్తో రిసీవర్‌ను ఎత్తి పట్టుకొని, మరో చేత్తో ఫోన్ తీగను వేళ్లకు చుట్టుకుంటూ మాట్లాడుతుంటే ఎంత అందంగా కనిపిస్తానో' అని అనుకున్నారు. అప్పటికే స్మార్ట్‌ఫోన్ తెర అంటే విసిగిపోయిన ఆమె వెంటనే ల్యాండ్‌లైన్ ఫోన్ కోసం ప్రయత్నించారు. కానీ దాని కోసం కొత్త నంబరు తీసుకోవాలని, ఫోన్ బిగించటానికి ఖర్చవుతుందని చెప్పటంతో కొత్తగా ప్రయత్నించారు. ల్యాండ్‌లైన్ ఫోన్ పనిచేసే తీరునే మార్చేశారు. బ్లూటూత్ ద్వారా ఐఫోన్, ఆండ్రాయిడ్ ఫోన్లతో అనుసంధానమయ్యేలా తీర్చిదిద్దారు. మొబైల్‌ఫోన్‌కు కాల్ వస్తే ఇదే రింగ్ అవుతుంది. వాట్సప్ వంటి యాప్స్ నుంచి వచ్చే కాల్స్‌నూ ఇదే తీసుకుంటుంది. అప్పుడు రిసీవర్ ఎత్తి మాట్లాడుకోవచ్చు. డయల్‌ను తిప్పుతూ గానీ నంబర్లను నొక్కుతూ గానీ కాల్స్ చేసుకోవచ్చు. క్యాట్ గత జులైలో ఈ ఫోన్‌ను ఆన్‌లైన్‌లో పరిచయం చేశారు. ఓ 10, 15 ఫోన్లకు ఆర్డర్ వస్తే గొప్ప అనుకున్నారు. కానీ వేలాది ఫోన్లకు ఆర్డర్లు వచ్చి పడ్డాయి. మూడు రోజుల్లోనే రూ.కోటి విలువైన అమ్మకాలు సాగించారు. అక్టోబరు నాటికివి రూ.2.5 కోట్లకు ఎగబాకాయి. వీటిని ఫిజికల్ ఫోన్స్ అనే పేరుతో అమ్ముతున్నారు. ధర రూ.8వేల నుంచి రూ.9,800 పలుకుతున్నాయి. క్యాట్ ఇప్పుడు ఓ తయారీదారుతోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు. డిసెంబరులో తొలి బ్యాచ్ రవాణా కాగలదని భావిస్తున్నారు.

## ఓక్లే మెటా స్మార్ట్‌గ్లాసెస్



మెటా, ఓక్లే సంస్థలు మనదేశంలో ఏఐ ఆధారిత స్మార్ట్‌గ్లాసెస్‌ను పరిచయం చేశాయి. ఓక్లే మెటా హెచ్‌ఎస్‌టీఎన్ పేరుతో వచ్చిన ఇవి హిందీ వాయిస్‌నూ సపోర్టు చేస్తుండటం విశేషం. ముఖ్యంగా అథ్లెట్లు, క్రీడాకారుల వంటి వారిని దృష్టిలో పెట్టుకొని వీటిని డిజైన్ చేశారు. నీటిని తట్టుకోవటంలో ఐపీఎక్స్4 రేటింగ్ కలిగిన వీటికి 8 గంటల వరకూ బ్యాటరీ బ్యాకప్ ఉంటుందని కంపెనీ చెబుతోంది. ఫాస్ట్ ఛార్జింగ్ ఆప్షన్, ఛార్జింగ్ కేస్‌తోనూ వస్తున్నాయి. ఈ కేస్‌తోనైతే అదనంగా 48 గంటల బ్యాకప్ లభిస్తుంది. పూర్తిస్థాయి కెమెరాను సమ్మిళితం చేయటం వల్ల యూజర్లు అల్ట్రా హెచ్‌డీ 3కే వీడియోలను రికార్డు చేసుకోవచ్చు. ఓపెన్ ఇయర్ స్పీకర్లు కూడా ఉన్నాయి. వీటిల్లోని మెటా ఏఐ మౌఖిక ఆదేశాలనూ అనుసరిస్తుంది. హే మెటా అని పిలిచి ఏదైనా అడగొచ్చు. ఆయా పనులు చేసి పెట్టమని చెప్పొచ్చు. సెలబ్రిటీ ఏఐ వాయిస్‌కు ప్రముఖ నటి దీపికా పదుకొణె గొంతు ఇవ్వటం మరో ఆకర్షణ. ఈ గ్లాసెస్‌తో వాట్సప్ లింక్డ్ బ్యాంకు ఖాతా ద్వారా నేరుగా యూపీఐ క్యూఆర్ కోడ్ చెల్లింపులు చేయటం మీద ప్రస్తుతం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే గ్లాసెస్ ధరించి క్యూఆర్ కోడ్‌ను చూసి 'హే మెటా స్కాన్ అండ్ పే' అని ఆదేశిస్తే చాలు. యూపీఐ లైట్ పేమెంట్ పూర్తవుతుంది. ఆరు ఫ్రేములు, లెన్స్ రంగుల్లో అందుబాటులో ఉండే వీటి ప్రారంభ ధర రూ.41,800.

## టూల్స్ నిండా ఏఐ గమ్మత్తు!


కృత్రిమ మేధ అనగానే చాలామందికి గుర్తొచ్చేది చాట్‌జీపీటీ వంటి చాట్‌బాట్సే. కానీ ఏఐ వీటికే పరిమితం కాదు. మరెన్నో వినూత్నమైన టూల్స్, సేవలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. చాట్‌బాట్‌తో ముచ్చటించటం, వినోదభరిత ఇమేజెస్‌ను సృష్టించుకోవటమే కాకుండా రోజువారీ వ్యవహారాల్లోనూ ఎంతో సాయం చేస్తుంది. ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా వీడియో ఎడిటింగ్ దగ్గరి నుంచి మీటింగ్‌లను అక్షరబద్ధం చేయటం వరకూ ఎన్నెన్నో పనులను మరింత త్వరగా, సమర్థంగా, తక్కువ శ్రమతో చేసుకోవటానికి ఉపయోగపడుతోంది. వెబ్‌సైట్లు, యాప్స్ రూపంలో ఉన్న అలాంటి కొన్ని ఏఐ టూల్స్ ఇవిగో..

### ఆటర్ (Otter)



ఆన్‌లైన్ గానీ ఆఫ్‌లైన్ గానీ ఎలాంటి మీటింగ్‌నైనా పూర్తిగా ట్రాన్స్‌క్రిప్ట్ చేయటం దీని ప్రత్యేకత. మీటింగ్ మొదలైనప్పుడు రికార్డు బటన్ మీద క్లిక్ చేస్తే చాలు అప్పటికప్పుడు కళ్ల ముందే ట్రాన్స్‌క్రిప్షన్ ప్రత్యక్షమవుతుంది. సమావేశం ముగిసిన తర్వాత ఆటర్ దాని సారాంశాన్నీ క్రోడీకరించగలదు. కాల్‌లో చర్చకు వచ్చిన పనుల జాబితానూ రూపొందిస్తుంది. ఈ యాప్‌ను గూగుల్ క్యాలెండర్‌కూ కనెక్ట్ చేయొచ్చు. ఇది మీ తరఫున జూమ్, గూగుల్ మీట్ వంటి ప్రముఖ టూల్స్ ద్వారా సమావేశాల్లో జాయిన్ కాగలదు. అనంతరం వాటి ట్రాన్స్‌క్రిప్షన్, సారాంశాన్ని ముందుంచుతుంది. మీటింగు గురించి ఏవైనా ప్రశ్నలు అడిగినా జవాబులు ఇస్తుంది. ఆన్‌లైన్ బిజినెస్ మీటింగులు, కాలేజీ ఉపన్యాసాలు, వ్యక్తిగత చర్చల వంటి వాటికిది ఎంతగానో ఉపయోగపడుతుంది.

### క్యాల్ ఏఐ (Cal AI)



మీరు బరువు తగ్గించుకోవాలని అనుకున్నారు. వ్యాయామం చేయటానికి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ ఆహారం మీద దృష్టి పెట్టటమే కష్టంగా ఉంది. దేనిలో ఎన్ని క్యాలరీలున్నాయో తెలుసుకోలేకపోతున్నారు. ఇక్కడే క్యాల్ ఏఐ యాప్ సాయం చేస్తుంది. యాప్ కెమెరాతో పళ్లాన్ని ఫొటో తీస్తే సరి. ఏయే పదార్థాలు ఎంత పెట్టుకున్నారనే దాన్ని బట్టి వాటిల్లో ఎన్ని క్యాలరీలు ఉన్నాయో చెప్పేస్తుంది. పైగా ఇది ఫిట్‌నెస్ యాప్ కూడా. మీ లక్ష్యాలను ఇందులో సెట్ చేసుకోవచ్చు. కొవ్వు తగ్గుతోందా? కండర మోతాదు పెరుగుతోందా? అనేవీ తెలుసుకోవచ్చు.

### రీడ్‌వైజ్ రీడర్ (Readwise Reader)



ఇది మీరు చదువుతున్న వాటన్నింటినీ ఒకదగ్గర స్టోర్ చేసేస్తుంది. వెబ్, పీడీఎఫ్స్, ఈపీయూబీ ఫైల్స్, చివరికి న్యూస్‌లెటర్లు.. ఇలా ఏవైనా కావొచ్చు. వెబ్ పోస్టుల విషయంలోనైతే యాడ్స్, పాపప్స్ వంటి అనవసర అంశాలను పక్కన పెట్టేస్తుంది కూడా. అంటే చదవటానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తుందన్నమాట. దేని గురించైనా మరింత లోతుగా తెలుసుకోవాలని అనుకుంటే ఆయా వాక్యాలను, పేరాలను హైలైట్ చేస్తే చాలు. యాప్‌లోని ఏఐ రంగంలోకి దిగి వాటిని విశ్లేషించి, సరళంగా వివరిస్తుంది. డాక్యుమెంట్ చాలా పెద్దగా ఉంటే మొత్తమంతా చదవటానికి సమయం లేనప్పుడు దాని గురించి ప్రశ్నలు అడగొచ్చు. వెంటనే జవాబులు ఇస్తుంది. రీడ్‌వైజ్ రీడర్‌కు సైనప్ అయితే 30 రోజుల వరకు ఉచితంగా వాడుకోవచ్చు.

### రీక్లెయిమ్ (Reclaim)

reclaimai

దీన్ని డ్రాప్‌బాక్స్ రూపొందించింది. సమయాన్ని ఆదా చేసుకోవటానికి బాగా తోడ్పడుతుంది. మీ గూగుల్ లేదా అవుట్‌లుక్‌తో కనెక్ట్ అవటమే కాకుండా ఆటోమేటిగ్గా ఆయా పనులు, హాబీల కోసం స్లాట్స్‌ను వెతుకుతుంది. ఉదాహరణకు- మీకు ఆదివారం వ్యాయామం చేసే అలవాటు ఉందనుకోండి, దాన్ని హ్యాబిట్ జాబితాలో చేర్చి, సమయాన్ని నిర్దేశిస్తే చాలు. మీ రోజువారీ పనుల షెడ్యూల్‌ను పరిశీలించి ఏ సమయంలో వ్యాయామం చేయటానికి అనువుగా ఉంటుందో చెబుతుంది. వ్యాయామం చేయాల్సిన సమయంలోనే అర్జంటుగా ఏదైనా మీటింగులో పాల్గొనాల్సి వస్తే దాన్ని మరో సమయానికి మార్చేస్తుంది. అంటే మనకు అనుగుణంగా వర్క్ షెడ్యూల్‌ను సవరిస్తుందన్నమాట. క్యాలెండర్‌లో మాన్యువల్‌గా మ్యానేజ్ చేయాల్సిన అవసరముండదు. రీక్లెయిమ్‌ను ఉచితంగానే వాడుకోవచ్చు. మరిన్ని ఫీచర్లు కావాలంటే చందా కట్టాలి.

### డీస్క్రిప్ట్ (Descript)

descript

వెబ్‌సైట్ కోసమో, యూట్యూబ్ వ్లాగ్ కోసమో వీడియో రూపొందించారు. కానీ బాగా రాలేదు. దాని ఎడిటింగ్ అంటే మాటలు కాదు. బోలెడంత సమయం పడుతుంది. ఇలాంటి సమయంలోనే డీస్క్రిప్ట్ చేదోడుగా నిలుస్తుంది. ఎడిటింగ్‌ను వేగంగా పూర్తి చేసుకోవటానికి తోడ్పడుతుంది. దీనిలోకి వీడియోను అప్‌లోడ్ చేస్తే, ట్రాన్స్‌క్రిప్ట్‌ను సృష్టిస్తుంది. వద్దనుకునే వాక్యాన్ని లేదా పేరాను డిలీట్ చేస్తే చాలు. డీస్క్రిప్ట్ దానంతటదే ఆ మేరకు వీడియోను తొలగించేస్తుంది. ఊ.. ఆ.. వంటి ఊత పదాలను సైతం తీసేస్తుంది. వీడియోను రికార్డు చేస్తున్నప్పుడు స్క్రిప్టును చదువుతున్నా కూడా మీరు కెమెరా వంక చూస్తున్నట్టుగా సవరిస్తుంది. ఇది ఉచిత ప్లాన్‌లో నెలకు 60 నిమిషాల వీడియో వరకే అనుమతిస్తుంది. మరింత పెద్ద వీడియోల కోసమైతే పెయిడ్ ప్లాన్ తీసుకోవాలి.

## కరెంట్ అఫైర్స్



◆ 2025లో ఇంటర్నేషనల్ సోషల్ సెక్యూరిటీ అసోసియేషన్ (ఐఎస్ఎస్ఏ) పురస్కారాన్ని ఏ దేశం గెలుచుకుంది?

జ: భారత్ (కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచ

### మాదిరి ప్రశ్నలు

సామాజిక భద్రతా వేదిక (డబ్ల్యూఎస్ఎస్ఎఫ్)-2025లో సామాజిక భద్రతలో అత్యుత్తమ పనితీరుకు గుర్తుగా భారత్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. 2015లో దేశంలో సామాజిక భద్రతా కవరేజీ 19 శాతం కాగా, 2025 నాటికి ఇది 64.3 శాతానికి చేరుకుంది.)

◆ ఐక్యరాజ్యసమితి ప్రత్యేక సంస్థ అయిన ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ (ఐసీఏఓ) కౌన్సిల్ పార్ట్-2కి ఇటీవల ఏ దేశం తిరిగి ఎన్నికైంది? జ: భారత్ (కెనడాలోని మాంట్రియల్‌లో జరిగిన 42వ ఐసీఏఓ అసెంబ్లీలో ఈ ఎన్నిక జరిగింది.)

◆ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారతదేశ ఆర్థికవృద్ధి అంచనాను ఆసియా అభివృద్ధి బ్యాంకు ఎంత శాతానికి సవరించింది?

జ: 6.5 శాతం (గతంలో ఈ అంచనా 6.7 శాతంగా ఉంది.)

మరింత సమాచారం

## దరఖాస్తు చేశారా?



☛ ఇండియన్ రైల్వేస్‌లో అండర్ గ్రాడ్యుయేట్ ఉద్యోగాలు (3,058)
చివరి తేదీ: 4.12.2025

☛ సెయిల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ (టెక్నికల్) ఖాళీలు (124)
చివరి తేదీ: 5.12.2025

---

## సీనియర్ ఇంటర్ తెలుగు పద్యభాగం

## సత్య ప్రాశస్త్యం



**ఫైనల్ పరీక్షలు - 2026**
**ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు**

**3 మార్కులు**

**1. పురుషుడి కార్యాలను ఎల్లప్పుడూ ఏవి చూస్తాయి?**

జ: వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయ సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు ఎల్లప్పుడూ పురుషుడి కార్యాలను చూస్తూ ఉంటాయి.

**2. సత్యవాక్యం వేటి కంటే గొప్పది?**

జ: నూరు మంచినీటి నూతుల కంటే ఒక దిగుడు బావి గొప్పది. నూరు బావుల కంటే ఒక మంచి యజ్ఞం గొప్పది. నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు గొప్పవాడు. అలాంటి నూరు మంది పుత్రుల కంటే సత్యవాక్యం మంచిది. వేయి అశ్వమేధ యాగాల ఫలం ఒక సత్యవాక్యంతో సాటి రాదు. ధర్మజ్ఞులైన ఋషులు అన్ని ధర్మాల కంటే సత్యమే గొప్పదని చెబుతారు.

**3. దుర్మతి కిహముం బరముఁ గలదె.**

జ: **కవి పరిచయం:** ఈ వాక్యం నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతంలోని చతుర్థాశ్వాసం నుంచి గ్రహించిన 'సత్య పాశస్త్యం' అనే పద్య భాగంలోనిది.

**సందర్భం:** శకుంతల తన కుమారుడు భరతుడిని వెంట పెట్టుకుని దుష్యంతుడి వద్దకు వచ్చి తనకు ఇచ్చిన మాట ప్రకారం కుమారుడిని, తనను స్వీకరించమని కోరింది. దుష్యంతుడు తాను ఆమెను ఎరుగనని చెప్పాడు. పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతైన భార్యను తిరస్కార దృష్టితో చూసి అవమానించిన దుర్బుద్ధికి ఇహ పర సుఖాలు రెండూ ఉండవని, అప్పుడు శకుంతల దుష్యంతుడితో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం:** బుద్ధితో బాగా పరిశీలిస్తే దుర్బుద్ధికి ఇహపరలోక సౌఖ్యాలు ఉండవు.

**వ్యాఖ్య:** యోగ్యురాలైన భార్యను అవమానించి, తిరస్కరిస్తే ఆ భర్తకు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖం ఉండదని శకుంతల భర్తకు గుర్తు చేసింది.

**1 మార్కు**

**1. నన్నయకు ఉన్న బిరుదులేవి?**

జ: నన్నయకు ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) అనే బిరుదులు ఉన్నాయి.

**2. నన్నయ ఎవరి ఆస్థాన కవి?**

జ: నన్నయ చాళుక్య ప్రభువైన రాజరాజ నరేంద్రుడి ఆస్థాన కవి.

**3. శకుంతలను పెంచిన తండ్రి ఎవరు?**

జ. శకుంతలను పెంచిన తండ్రి పేరు కణ్వ మహర్షి.

**4. శకుంతలను దుష్యంతుడు ఏ పద్ధతిలో వివాహం చేసుకున్నాడు?**

జ: దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహ పద్ధతిలో వివాహం చేసుకున్నాడు.

**5. శకుంతల, దుష్యంతుడికి జన్మించినదెవరు?**

జ: శకుంతల, దుష్యంతులకు భరతుడు అనే కుమారుడు జన్మించాడు.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు


రచయిత: మండ్ల మహేశ్వరనాయుడు

---

# రేఖాగణితానికి నాలుగు స్తంభాలు!

## జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్


భూములు, వివిధ నిర్మాణాలు, భవనాలు, గదులు, కిటికీలు, వంతెనలు, రోడ్లు సహా అన్నీ దాదాపు చతురస్రాల ఆకారంలోనే ఉంటాయి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కొలవడానికి, రూపొందించడానికి, అర్థం చేసుకోడానికి అవి సాయపడతాయి. నాలుగు భుజాలు, నాలుగు కోణాలు, నాలుగు శీర్షాలు కలిగిన ఒక మూసి ఉన్న బహుభుజి చతుర్భుజం. పోటీ పరీక్షల్లో రకరకాల చతురస్రాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. అందుకే రేఖాగణితానికి నాలుగు స్తంభాల లాంటి చతురస్రాల లక్షణాలను, ధర్మాలను అభ్యర్థులు తెలుసుకోవాలి. వాటి వైశాల్యాలను, చుట్టుకొలతలను లెక్కించడం నేర్చుకోవాలి. ఇందుకోసం బిందువులు, రేఖలు, కోణాలపై అవగాహన కలిగి ఉండాలి. పైథాగరస్ సిద్ధాంతంపై కూడా పట్టు పెంచుకోవాలి.




## చతుర్భుజాలు

### చతుర్భుజం


1. నాలుగు రేఖాఖండాలతో ఏర్పడిన సరళ సంవృత పటం.
2. చతుర్భుజంలో నాలుగు కోణాల మొత్తం = 360°




$A + B + C + D = 360^\circ$


3. చతుర్భుజం నిర్మించడానికి ఐదు కొలతలు కావాలి.
4. చతుర్భుజ వైశాల్యం $= \frac{1}{2} d(h_1 + h_2)$

### ట్రెపీజియం/సమలంబ చతుర్భుజం





1. చతుర్భుజంలో ఒక జత భుజాలు సమాంతరం అయితే అది ట్రెపీజియం.
2. ట్రెపీజియం నిర్మించడానికి 4 కొలతలు అవసరం.
3. ట్రెపీజియం వైశాల్యం $= \frac{1}{2} h(a + b)$
4. ట్రెపీజియంలో అసమాంతర భుజాలు సమానమైతే అది సమద్విబాహు ట్రెపీజియం అవుతుంది.






AD = BC

### సమాంతర చతుర్భుజం




1. చతుర్భుజంలో ఎదురెదురు భుజాలు సమాంతరం లేదా సమానం.

$AB \parallel CD,\ AD \parallel BC$

$AB = CD,\ AD = BC$

2. ఎ) సమాంతర చతుర్భుజంలో ఆసన్న కోణాల మొత్తం 180°.

$A + B = B + C = C + D = D + A = 180^\circ$


బి) సమాంతర చతుర్భుజంలో ఎదురెదురు కోణాలు సమానం.

$\angle A = \angle C,\ \angle B = \angle D$

3. దీనిలో కర్ణాలు సమద్విఖండన చేసుకుంటాయి.


$AO = OC$

$BO = OD$




4. సమాంతర చతుర్భుజ వైశాల్యం = bh
5. దీనిని నిర్మించడానికి కావాల్సిన కొలతల సంఖ్య = 3

### దీర్ఘ చతురస్రం





1. సమాంతర చతుర్భుజంలో ఒక కోణం 90° అయితే అది దీర్ఘచతురస్రం.
2. కర్ణాలు సమానం, సమద్విఖండన చేసుకుంటాయి.

AC = BD

3. దీర్ఘచతురస్రం నిర్మించడానికి కొలతలు = 2
4. దీర్ఘచతురస్ర వైశాల్యం = $lb$
5. దీర్ఘచతురస్ర చుట్టుకొలత $= 2(l + b)$




### రాంబస్/సమ చతుర్భుజం





1. సమాంతర చతుర్భుజంలో ఆసన్న భుజాలు సమానమైతే అది రాంబస్.
2. కర్ణాలు లంబ సమద్విఖండన చేసుకుంటాయి.
3. రాంబస్ నిర్మించడానికి కొలతలు = 2
4. రాంబస్ వైశాల్యం $= \frac{1}{2} d_1 d_2$ ($\because d_1 d_2$ లు రాంబస్ కర్ణాలు)

రాంబస్ చుట్టుకొలత = 4a (లేదా) $2\sqrt{d_1^2 + d_2^2}$

### చతురస్రం




1. చతురస్రంలో నాలుగు భుజాలు ఉంటాయి.
2. కర్ణాలు లంబసమద్విఖండన చేసుకుంటాయి, కర్ణాలు సమానం.
3. చతురస్రం భ్రమణ సౌష్ఠవ కోణం = 90°
4. చతురస్రానికి సౌష్ఠవ అక్షాలు = 4
5. చతురస్ర నిర్మాణానికి కొలతలు = 1
6. చతురస్ర వైశాల్యం = $a^2$ (లేదా) $\frac{d^2}{2}$



⇒ చతురస్ర కర్ణం $= a\sqrt{2}$  ⇒ చతురస్రం చుట్టుకొలత = 4a

**నోట్:** ◆ చతుర్భుజం వైశాల్యం $= \frac{1}{2} d(h_1 + h_2)$



◆ ట్రెపీజియం వైశాల్యం $= \frac{1}{2} h(a + b)$

◆ సమాంతర చతుర్భుజ వైశాల్యం = bh ◆ రాంబస్ వైశాల్యం $= \frac{1}{2} d_1 d_2$

◆ దీర్ఘచతురస్ర వైశాల్యం = $lb$ ◆ చతురస్ర వైశాల్యం = $a^2$ (లేదా) $\frac{d^2}{2}$

### మాదిరి ప్రశ్నలు

**1.** ఒక చతుర్భుజం వైశాల్యం 28 సెం.మీ.$^2$ దానిలో కర్ణం మీదకు గీసిన లంబాలు 4 సెం.మీ., 3 సెం.మీ. అయితే కర్ణం కొలత ఎంత?

1) 4 2) 6 3) 12 4) 8

**వివరణ:** చతుర్భుజ కర్ణం = d

లంబాలు $= h_1 = 4,\ h_2 = 3$

చతుర్భుజ వైశాల్యం

$= \frac{1}{2} d(h_1 + h_2) = 28$

$\frac{1}{2} d(4 + 3) = 28$


$\Rightarrow d(7) = 56 \Rightarrow d = 8$ **జ: 4**

**2.** ఒక సమలంబ చతుర్భుజం వైశాల్యం 24 మీ.$^2$, సమాంతర భుజాలు 3 మీ., 5 మీ. అయితే ఎత్తు ఎంత?

1) 6 మీ. 2) 3 మీ. 3) 5 మీ. 4) 10 మీ.

**వివరణ:** సమలంబ చతుర్భుజం/ట్రెపీజియం వైశాల్యం

$= \frac{1}{2} h(a + b)$




$24 = \frac{1}{2} h(3 + 5)$

$48 = h \times 8$

h = 6 మీ.

**జ: 1**




రచయిత: పిరాది నరేష్

---

# ప్రారంభానికి సమన్స్.. వాయిదాకి ప్రోరోగ్!

దేశ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రాతినిధ్యం వహించే అత్యున్నత చట్టసభ లోక్‌సభ. సార్వత్రిక ఎన్నికల ద్వారా అయిదేళ్లకోసారి కొలువుదీరి పార్లమెంటులో ప్రధాన విధులను నిర్వహిస్తుంది. దిగువ సభగా, ప్రజల సభగా చట్టాల రూపకల్పన, పాలనా ప్రక్రియల్లో చురుగ్గా వ్యవహరిస్తుంది. దీని కూర్పు, విధులు - బాధ్యతలపై రాజ్యాంగంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. లోక్‌సభ సభ్యుల ఎన్నిక విధానం, ఎన్నికల్లో పోటీ పడే అభ్యర్థుల అర్హతలు, సభలో రిజర్వేషన్లు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించిన స్థానాలు, సమావేశాల నిర్వహణ నిబంధనలు, స్పీకర్ పదవికి ఉన్న ప్రాధాన్యం తదితరాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. డీలిమిటేషన్ కోసం ఏర్పాటైన కమిషన్‌లు, వాటి సిఫార్సులతో ఇప్పటి వరకు జరిగిన మార్పులపై అవగాహన కలిగి ఉండాలి.




భారత పార్లమెంటు భవనం

## ఇండియన్ పాలిటీ

### పార్లమెంటు - లోక్‌సభ


1. ప్రపంచ పార్లమెంటులకు 'మాత'గా ఏ దేశ పార్లమెంటును పేర్కొంటారు?
   1) అమెరికా 2) బ్రిటన్ 3) ఇండియా 4) ఫ్రాన్స్
2. ఏ చట్టం ప్రకారం మన దేశంలో తొలిసారిగా కేంద్రంలో 'లెజిస్లేటివ్ కౌన్సిల్' ఏర్పాటు చేశారు?
   1) చార్టర్ చట్టం, 1813
   2) చార్టర్ చట్టం, 1833
   3) చార్టర్ చట్టం, 1853
   4) రెగ్యులేటింగ్ చట్టం 1773
3. 'కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌'లో ఏ చట్టం ప్రకారం ముగ్గురు భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించారు?
   1) కౌన్సిల్ చట్టం, 1861
   2) కౌన్సిల్ చట్టం, 1892
   3) కౌన్సిల్ చట్టం, 1909
   4) చార్టర్ చట్టం, 1833
4. మన దేశంలో ఏ చట్టం ప్రకారం లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యులను ఎన్నుకునే పద్ధతి ప్రవేశపెట్టారు?




   1) కౌన్సిల్ చట్టం, 1861 2) చార్టర్ చట్టం, 1813
   3) మింటో-మార్లే సంస్కరణల చట్టం, 1909
   4) రెగ్యులేటింగ్ చట్టం, 1773
5. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) మనదేశంలో 1921 నుంచి ద్విసభా విధానం అమలులోకి వచ్చింది.
   బి) మన దేశ పార్లమెంటరీ భవన రూపకర్త ఎడ్వర్డ్ బేకర్.
   సి) మాంటేగ్ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టాన్ని అనుసరించి మనదేశ కేంద్ర శాసనసభను 'ద్విసభ' విధానంగా మార్పు చేశారు.
   1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి
6. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) 1952, ఏప్రిల్ 3న రాజ్యసభ ఏర్పడింది.
   బి) 1952, ఏప్రిల్ 17న లోక్‌సభ ఏర్పడింది.
   సి) 1952, మే 13న పార్లమెంటు తొలి సమావేశం జరిగింది.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
7. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా లోక్‌సభ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.
   బి) లోక్‌సభ పదవీ కాలం నిర్దిష్టంగా 5 సంవత్సరాలు అని రాజ్యాంగంలో పేర్కొన్నారు.
   సి) లోక్‌సభను దిగువ సభ, ప్రజల సభ, అనిశ్చిత సభగా పేర్కొంటారు.
   1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి
8. మొదటి డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు 1950లో లోక్‌సభ సభ్యుల సంఖ్యను ఎంతగా నిర్ణయించారు?
   1) 449 2) 492 3) 489 4) 543
9. రెండో డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు 1962లో లోక్‌సభ సభ్యుల సంఖ్యను ఎంతగా నిర్ణయించారు?
   1) 525 2) 543 3) 550 4) 555
10. మూడో డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు 1972లో లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్యను ఎంతగా నిర్ణయించారు?
    1) 550 2) 549 3) 560 4) 535
11. ఏ సంవత్సర జనాభా గణాంకాల ఆధారంగా లోక్‌సభ సభ్యుల సంఖ్యను కొనసాగిస్తున్నారు?
    1) 1961 2) 1971 3) 2001 4) 2011
12. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (ఎస్సీ, ఎస్టీ) వర్గాల జనాభాలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఎవరి నేతృత్వంలో ఏర్పడిన నాలుగో డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించారు?



    1) జస్టిస్ కుల్‌దీప్ సింగ్ 2) జస్టిస్ రోషన్ మల్హోత్రా
    3) జస్టిస్ జగదీష్ శరణ్‌వర్మ
    4) జస్టిస్ రంగనాథ్ మిశ్రా
13. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను కింది విధంగా పేర్కొంటారు?
    1) ఈల్డింగ్ ది ఫ్లోర్ 2) క్యాలెండర్ ఆఫ్ సెట్టింగ్
    3) గెర్రీ మాండరింగ్ 4) స్పిరిట్ ఆఫ్ లాస్
14. 2001 జనాభా గణాంకాల ఆధారంగా వేటి ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించారు?
    1) జనాభా, భౌగోళిక అంశాలు
    2) రిజర్వేషన్లు, భౌగోళిక అంశాలు
    3) జనాభా, రిజర్వేషన్ అంశాలు
    4) జనాభా, చారిత్రక అంశాలు
15. నాలుగో డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించారు?
    1) 84వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002
    2) 85వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002
    3) 87వ రాజ్యాంగ సవరణ చట్టం, 2003
    4) 89వ రాజ్యాంగ సవరణ చట్టం, 2003
16. నాలుగో డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా లోక్‌సభలో షెడ్యూల్డు కులాల (ఎస్సీ) వారికి కేటాయించిన సీట్ల సంఖ్యను ఎంతకు పెంచారు?
    1) 49 నుంచి 54 2) 63 నుంచి 71
    3) 79 నుంచి 84 4) 81 నుంచి 84
17. నాలుగో డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా లోక్‌సభలో షెడ్యూల్డు తెగలు (ఎస్టీ) వారికి కేటాయించిన సీట్ల సంఖ్యను ఎంతకు పెంచారు?
    1) 41 నుంచి 47 2) 49 నుంచి 51
    3) 63 నుంచి 64 3) 56 నుంచి 62
18. 2026 వరకు చట్టసభల సభ్యుల సంఖ్యలో మార్పు చేయరాదని ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా నిర్ణయించారు?
    1) 83వ రాజ్యాంగ సవరణ చట్టం, 2000
    2) 84వ రాజ్యాంగ సవరణ చట్టం, 2001
    3) 85వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002
    4) 86వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002
19. లోక్‌సభలో వివిధ రాష్ట్రాలకు నిర్దేశించిన స్థానాలకు సంబంధించి సరికానిది ఏది?
    1) ఆంధ్రప్రదేశ్ - 25 2) రాజస్థాన్ - 25
    3) మధ్యప్రదేశ్ - 29 4) కేరళ - 23
20. లోక్‌సభలో కేవలం ఒకే స్థానం చొప్పున ఉన్న రాష్ట్రాలను గుర్తించండి.
    1) మిజోరాం, సిక్కిం, నాగాలాండ్
    2) సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్
    3) సిక్కిం, నాగాలాండ్, హిమాచల్‌ప్రదేశ్
    4) గోవా, మేఘాలయ, త్రిపుర
21. లోక్‌సభలో వివిధ రాష్ట్రాలకు కేటాయించిన స్థానాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ఉత్తర్‌ప్రదేశ్ - 80, మహారాష్ట్ర - 48, పశ్చిమ బెంగాల్ - 42
    బి) బిహార్ - 40, తమిళనాడు - 39, మధ్యప్రదేశ్ - 29
    సి) గుజరాత్ - 26, కర్ణాటక - 28, తెలంగాణ - 17
    డి) అస్సాం - 14, ఝార్ఖండ్ - 14, పంజాబ్ - 13
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి, 4) ఎ, బి, సి, డి
22. లోక్‌సభలో వివిధ కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించిన స్థానాలకు సంబంధించి సరికాని దాన్ని గుర్తించండి.
    1) దిల్లీ - 7 2) జమ్ముకశ్మీర్ - 5
    3) పుదుచ్చేరి - 2 4) చండీగఢ్ - 1
23. లోక్‌సభ పదవీకాలానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



    ఎ) రాజ్యాంగంలోని ఆర్టికల్ 83 లోక్‌సభ పదవీ కాలం గురించి వివరిస్తుంది.
    బి) సాధారణంగా లోక్‌సభ పదవీకాలం 5 సంవత్సరాలు.
    సి) పదవీకాలం ముగియక ముందే లోక్‌సభను రాష్ట్రపతి రద్దు చేయగలరు.
    డి) జాతీయ అత్యవసర పరిస్థితి అమలులో ఉన్న సమయంలో లోక్‌సభ పదవీకాలాన్ని ఒక సంవత్సరం పొడిగించవచ్చు.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
24. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఉండాల్సిన అర్హతలను గుర్తించండి.
    ఎ) భారతీయ పౌరుడై ఉండాలి. దివాళా తీసి ఉండరాదు.
    బి) 25 సంవత్సరాల వయసు నిండి ఉండాలి.
    సి) కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలలో ఆదాయాన్నిచ్చే ఉద్యోగం చేయరాదు.
    డి) ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా పేరు నమోదై ఉండాలి.
    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
25. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఏ షరతును పూర్తి చేయాల్సి ఉంటుంది?
    ఎ) సెక్యూరిటీ డిపాజిట్‌ను సాధారణ అభ్యర్థులు అయితే రూ.25,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ.12,500 చెల్లించాలి.
    బి) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, 1989 ప్రకారం శిక్షకు గురై ఉండరాదు.
    సి) వ్యక్తిగత వివరాలతో కూడిన అఫిడవిట్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి.
    డి) ఎన్నికల వ్యయపరిమితి రూ.84 లక్షలు మించరాదు.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
26. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) రాష్ట్రపతి లోక్‌సభ సమావేశాలను ప్రారంభించడాన్ని 'సైపోస్' అంటారు.
    బి) రాష్ట్రపతి పార్లమెంటు సమావేశాలను ప్రారంభించడాన్ని 'సమన్స్' అంటారు.
    సి) రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేయడాన్ని 'డిసాల్వ్' అంటారు.
    డి) రాష్ట్రపతి పార్లమెంటు సమావేశాలను దీర్ఘకాలం పాటు వాయిదా వేయడాన్ని 'ప్రోరోగ్' అంటారు.
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
27. కింద పేర్కొన్న అంశాలలో సరైన జవాబును గుర్తించండి.
    ఎ) లోక్‌సభ సభ్యులు తమలో నుంచి ఒకరిని స్పీకర్‌గా, మరొకరిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకుంటారు.
    బి) స్పీకర్ రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించాలి.
    సి) స్పీకర్ లోక్‌సభ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.
    1) ఎ, సి 2) ఎ, బి
    3) బి, సి 4) ఎ, బి, సి



రచయిత: బంగారు సత్యనారాయణ

### సమాధానాలు

1-2; 2-3; 3-1; 4-3; 5-4; 6-4; 7-1; 8-3; 9-1; 10-1; 11-2; 12-1; 13-3; 14-2; 15-3; 16-3; 17-1; 18-2; 19-4; 20-1; 21-4; 22-3; 23-4; 24-4; 25-1; 26-3; 27-1.

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి దాగి ఉన్న చిత్రాలకు (Embedded Figures) సంబంధించిన ప్రశ్నలు అడుగుతుంటారు. దీనిలో మొదట ఒక చిత్రం, దాన్ని అనుసరించి నాలుగు ఐచ్ఛికాలు ఇస్తారు. తొలి చిత్రం రూపం ఇచ్చిన ఆప్షన్లలో ఏ చిత్రంలో దాగి ఉందో అభ్యర్థులు కనిపెట్టాలి. గజిబిజి చిత్రాల్లో మొదటి చిత్ర రూపం ఏదో ఒక దాంట్లో అంతర్లిఖించి ఉంటుంది. ఆకృతి, కోణాలు, గీతల పొడవు లాంటివి గుర్తించగలగాలి. అలాగే మాదిరి ప్రశ్నలను ఎక్కువగా సాధన చేస్తే జవాబు కనుక్కోవడం తేలిక.





ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్


# ఆకృతిని పట్టుకోగలిగితే.. సులువుగా సమాధానం!


## దాగి ఉన్న చిత్రాలు


సూచన (ప్ర. 1 – 10): దిగువ చిత్ర రూపం ఇచ్చిన ఐచ్ఛికాల్లో దేనిలో అంతర్లిఖించి ఉందో కనుక్కోండి.


1.

X)
1) 2) 3) 4)


2.

X)
1) 2) 3) 4)



3.

X)
1) 2) 3) 4)


4.

X)
1) 2) 3) 4)


5.

X)
1) 2) 3) 4)

6.

X)
1) 2) 3) 4)

7.

X)
1) 2) 3) 4)

8.

X)

1) 2) 3) 4)

9.

X)
1) 2) 3) 4)

10.

X)
1) 2) 3) 4)

**సమాధానాలు**

1-3, 2-3, 3-2, 4-4, 5-4, 6-1, 7-2, 8-2, 9-2, 10-1.



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

## Word of the Day 849

### *Vicinity*

***Telugu meaning:*** సమీపం, దగ్గర

***English meaning:*** The word vicinity (విసినిటీ) is a noun that refers to the area near or surrounding a particular place.

***Synonyms:*** Surroundings, Proximity

***Antonyms:*** Distance, Remoteness

***Usage:*** **1.** There are several banks and grocery stores in the vicinity of the railway station, making it convenient for daily commuters.

**2.** Residents were advised to stay indoors as a wildfire was reported in the vicinity of the village.

## *Latest Updates*

### *Faculty Jobs*

ESIC Super Speciality Hospital, Sanathnagar, Hyderabad, is conducting interviews for the Professor, Associate Professor, Assistant Professor, and Senior Resident on a contractual basis. The total no. of posts is 45. Eligible candidates can appear for the interview on 2025 December 10, 11, 12, 15, 16.

### *Jobs In RGSSH*

Rajiv Gandhi Super Speciality Hospital (RGSSH) in Delhi is inviting applications for the Professor, Associate Professor, and Assistant Professor posts on a contractual basis. The total no.of posts is 41. The last date for online applications is 15 December 2025.

### *Apprentice Trainee posts*

Mishra Dhatu Nigam Limited (MIDHANI), Kanchanbagh, Hyderabad, has released a notification for Trade, Technician, and Graduate Apprenticeship posts in various departments for the year 2025. The total no.of posts is 210. Eligible candidates can apply online before 10 December 2025

### *Did You Apply..?*

*Today (December 3) is the last date for the following Jobs*

☛ Relationship Manager posts in NSIC Limited.
***Eligibility:*** Diploma, Degree.

☛ Project Associate posts at IIT Madras.
***Eligibility:*** B.Tech/ M.Tech/ M.Sc.

☛ Nurse Jobs in AIIMS Bhopal.
***Eligibility:*** Diploma, Degree, MBBS, BDS.

☛ Project Associate posts in CSIR-NGRI.
***Eligibility:*** B.Sc, M.Sc, M.Tech.

*For more information and other notifications - scan QR code*

## డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు

శాస్త్రవేత్తలు విశేషాలు

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు భారతదేశానికి చెందిన ప్రముఖ జీవరసాయన (biochemist) శాస్త్రవేత్త. ఈయన శరీరధర్మశాస్త్రం, జీవరసాయనశాస్త్రం, వైద్యశాస్త్రాన్ని అనుసంధానించి అనేక ప్రయోగాలు నిర్వహించారు. ఈయన చేసిన పరిశోధనలు, ఆవిష్కరణలు ఆధునిక వైద్యం, ఔషధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయి. కాలేజీ రోజుల్లో భారత స్వాతంత్ర్యోద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. కణంలో ప్రాథమిక శక్తి వనరుగా Adenosine triphosphate (ATP) పనితీరును గుర్తించారు. 20వ శతాబ్దపు అత్యంత గొప్ప శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరుగాంచిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!

### పరిశోధనలు – ఆవిష్కరణలు


1925లో డాక్టర్ సైరస్ ఫిస్కేతో కలిసి శరీర ద్రవాలు, కణజాలాల్లో భాస్వరాన్ని అంచనా వేసే ఫిస్కే - సుబ్బారావు పద్ధతిని అభివృద్ధి చేశారు.

✦ 1927లో కండరాల కణజాలంలో ఫాస్ఫోక్రియాటిన్‌ను కనుక్కున్నారు.

✦ 1929లో కణంలో ప్రాథమిక శక్తి వనరుగా ATP పనితీరును గుర్తించారు.

✦ 1943లో కాలేయ స్రవాల్లో ఫోలిక్ ఆమ్లాన్ని కనుక్కున్నారు.


**చివరగా:** మనుషులకు సోకే అనేక రుగ్మతలకు ఆయన మందులు కనిపెట్టారు. మానవాళికి యాంటీ బయాటిక్స్‌ను అందించిన గొప్ప శాస్త్రవేత్తగా పేరొందారు. తన ఆవిష్కరణలు అందరికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతో వాటికి పేటెంట్లు కూడా తీసుకోలేదు. ఈయన 1948, ఆగస్టు 8న మరణించారు.



ఎల్లాప్రగడ సుబ్బారావు వృత్తి జీవితం, పొందిన గౌరవాలు ఇతర జీవిత విశేషాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

### బ్రిటిష్ కాలంలో రైతాంగ, గిరిజన తిరుగుబాట్లు




వర్తకం కోసం భారత్‌లోకి ప్రవేశించిన ఈస్ట్ ఇండియా కంపెనీ క్రమంగా స్వదేశీ వ్యవహారాల్లో కలగజేసుకోవడం మొదలుపెట్టింది. యుద్ధాలు, పలు రకాల విధానాలతో ఎదురులేని శక్తిగా అవతరించింది. తమ సామ్రాజ్యాన్ని అన్ని దిశలకు విస్తరించింది. ఈ క్రమంలోనే వారు ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వల్ల దేశంలోని రైతులు, గిరిజనులు అనేక ఇక్కట్లు పడ్డారు. శ్రమ, ఆర్థిక దోపిడీకి గురయ్యారు. వీరంతా పరాయి పాలనకు వ్యతిరేకంగా గళం విప్పి, ఉద్యమాలు చేపట్టారు. భావితరాలకు పోరాటస్ఫూర్తిని నేర్పారు. ఇవన్నీ దేశ చరిత్రలో కీలక పరిణామాలుగా నిలిచాయి.

### బిల్ గిరిజనుల తిరుగుబాటు

వారెన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా పనిచేస్తున్న రోజుల్లో పశ్చిమ కనుమల్లోని ఖాందేశ్ ప్రాంతంలో నివసించే బిల్ తెగ గిరిజనులు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను నిరసిస్తూ తిరుగుబాటు చేశారు.

✦ బిల్ తెగ వారు 1846 వరకు పోరాటాన్ని కొనసాగించారు.

### రమోసే తెగ తిరుగుబాట్లు

భారతదేశంలోని పశ్చిమ కనుమల్లో నివసించే ఆటవిక, గిరిజన తెగల్లో రమోసేలు కూడా ముఖ్యులు. వీరు బ్రిటిష్ పరిపాలన వల్ల నష్టపోయినందువల్ల తిరుగుబాటు చేయడానికి సిద్ధపడ్డారు.

### కోల్ గిరిజనుల తిరుగుబాటు

బ్రిటిష్ పాలకుల చట్టాలు, ఆర్థిక దోపిడీ, గిరిజనుల సామాజిక ఆచార వ్యవహారాల్లో జోక్యాన్ని నిరసిస్తూ కోల్ తెగవారు 1831-32లో తిరుగుబాటు చేశారు.

పాట్నా రైతుల తిరుగుబాట్లు, నీలి మందు రైతుల తిరుగుబాటు, మహారాష్ట్రలో తిరుగుబాట్లు, రంపా తిరుగుబాటు, ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన తిరుగుబాట్లు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## కరెంట్ అఫైర్స్




దేశీయంగా 2025 నవంబరులో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.1,70,276 కోట్లుగా నమోదయ్యాయి. 2024 నవంబరు నాటి రూ.1,69,016 కోట్లతో పోలిస్తే, ఇవి 0.7% మాత్రమే ఎక్కువ. 2025, అక్టోబరులో రూ.1.95 లక్షల కోట్లు పన్ను కింద వసూలయ్యాయి.



దీర్ఘశ్రేణి సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను భారత సైన్యం 2025, డిసెంబరు 1న విజయవంతంగా పరీక్షించింది. బంగాళాఖాతం వెంట ఒక ప్రయోగవేదిక నుంచి ఈ అస్త్రం దూసుకెళ్లింది. సైన్యంలోని దక్షిణ విభాగానికి చెందిన బ్రహ్మోస్ యూనిట్ దీన్ని చేపట్టింది. అండమాన్, నికోబార్‌లోని త్రివిధ దళాల విభాగం సమన్వయంతో ఇది సాగింది.

కృష్ణా బోర్డు ఛైర్మన్‌గా ఎస్.బిశ్వాస్‌ను నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ 2025, డిసెంబరు 1న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జల సంఘం ఛైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఇప్పటివరకూ మానవసహిత యుద్ధవిమానాలు రాడార్ మార్గనిర్దేశకత్వంలో మరో లక్ష్యాన్ని నేలకూల్చగా.. తొలిసారిగా ఒక డ్రోన్ ఈ సత్తాను చాటింది. తుర్కియేకు చెందిన మానవరహిత యుద్ధవిమానం కిజిలెల్మా ఈ ఘనతను సాధించింది. సినోప్ ఫైరింగ్ రేంజ్ వద్ద సాగర జలాలపై ఈ పరీక్ష జరిగింది. ఇందులో కిజిలెల్మా డ్రోన్‌కు జెట్ ఇంజిన్‌తో నడిచే ఒక గగనతల లక్ష్యాన్ని నేలకూల్చే బాధ్యతను అప్పజెప్పారు. ఈ మానవరహిత యుద్ధవిమానంలో మురాద్ ఏఈఎస్ఏ రాడార్ ఉంది. ఇది చాలా దూరంలోని లక్ష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించగలదు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## *Bank Exams*

### *English*

## *Double Usage Vocabulary*

***Directions (Qs. 1 - 16):*** *In the following question, two sentences are given with a blank in each sentence. Five options are given, and only one word fits in both contexts. Choose the correct answer.*

**1.** i. The committee agreed to ........ the proposal after careful discussion.
ii. The department will soon ........ a new circular for all employees.
A) approve B) issue C) release
D) circulate E) pass

**2.** i. The scientist tried to ........ the results before presenting them at the conference.
ii. The police were able to ........ the suspect's location using CCTV footage.
A) confirm B) verify C) track
D) identify E) establish

**3.** i. The festival aims to ........ the cultural traditions of the region.
ii. The CEO wanted to ........ a positive work environment within the organisation.
A) build B) foster C) promote
D) raise E) strengthen

**4.** i. The school committee decided to ........ the outdated rules.
ii. The city plans to ........ a new park near the river.
A) scrap B) build C) revise
D) develop E) start

**5.** i. The company aims to ........ its customer base by offering better services.
ii. The university plans to ........ its research facilities next year.
A) improve B) extend C) grow
D) expand E) strengthen

**6.** i. The school decided to ........ the number of students in each classroom.
ii. The government will ........ the spread of misinformation on social media.
A) stop B) halt C) check
D) reduce E) control

**7.** i. The board asked the secretary to ........ the minutes of the meeting.
ii. The witness could not ........ the events clearly due to shock.
A) recall B) write C) review
D) record E) state

**8.** i. The fire brigade was quick to ........ the flames before they spread further.
ii. The company hopes to ........ the rising fear among investors.
A) stop B) diminish C) control
D) curb E) contain

**9.** i. The teacher tried to ........ the importance of discipline to her students.
ii. Continuous stress can ........ serious health problems.
A) cause B) impress upon
C) explain D) impress
E) highlight

**10.** i. The company had to ........ the expansion plans due to financial losses.
ii. The pilot decided to ........ the flight because of bad weather.
A) delay B) postpone
C) cancel D) abandon
E) hold

**11.** i. The school decided to ........ the names of students who scored above 95%.
ii. The organisers will ........ the list of selected candidates by evening.
A) post B) publish
C) reveal D) update
E) upload

**12.** i. The investigators tried to ........ the truth behind the mysterious disappearance.
ii. The gardeners worked to ........ the roots before transplanting the tree.
A) uncover B) expose
C) dig D) loosen
E) discover

**13.** i. The minister refused to ........ further on the controversial issue.
ii. The committee asked him to ........ his views clearly in the final report.
A) respond B) comment
C) mention D) express
E) elaborate

**14.** i. The manager had to ........ the project timeline due to unexpected delays.
ii. The tailor will ........ your coat to make it fit better.
A) modify B) shorten C) alter
D) revise E) adjust

**15.** i. The speaker tried to ........ her voice over the noise of the crowd.
ii. The company hopes to ........ competition by improving its service quality.
A) increase B) raise C) boost
D) amplify E) elevate

**16.** i. The government is working to ........ awareness about digital safety.
ii. The warm-up exercises help to ........ blood circulation in the body.
A) boost B) improve
C) stimulate
D) promote
E) encourage

*Scan the QR code for Key*

***Writer:*** *P. Manoj Kumar, Subject Expert*

# ఇంటర్న్‌షిప్స్

## వర్క్ ఫ్రమ్ హోమ్

### కంటెంట్ అండ్ సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: కోడ్‌ఫోబ్
నైపుణ్యాలు: కమ్యూనికేషన్, క్రియేటివిటీ
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/3ACMN

### మీడియా అండ్ పబ్లిక్ రిలేషన్స్ (పీఆర్)

సంస్థ: పాజ్ ఫౌండేషన్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటం
స్టైపెండ్: రూ.1,500-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/RJYzD

### సోషల్‌మీడియా మార్కెటింగ్

సంస్థ: సమ్మున్నత్ ఎల్ఎల్‌సీ
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ ఎడిటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, పోస్టర్ డిజైన్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.1,000-1,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/mrkDW

### రియాక్ట్ నేటివ్ డెవలప్‌మెంట్

సంస్థ: బృహత్ ఇన్ఫోటెక్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎక్స్‌ప్రెస్.జేఎస్, ఐఓఎస్, నెస్ట్.జేఎస్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/ZyUb0

## హైదరాబాద్‌లో

### వీడియో కంటెంట్ క్రియేషన్

సంస్థ: క్రియో నైపుణ్యాలు: ఏఐ ఇమేజ్ జనరేషన్, ఏఐ వీడియో జనరేషన్, ఏఐ వాయిస్‌ఓవర్, కేన్వా, క్యాప్‌కట్, గ్రాఫిక్ డిజైనింగ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.13,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 24
☛ https://shorturl.at/52E1f

### క్యాంపస్ ఫీల్డ్ మార్కెటింగ్

సంస్థ: కృష్ణ కన్సల్టెంట్స్ నైపుణ్యాలు: కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్, ప్రజంటేషన్ స్కిల్స్
స్టైపెండ్: రూ.7,500-12,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/RJRet

### డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: దయాడిక్ హెల్త్ నైపుణ్యాలు: కేన్వా కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్, డిజిటల్, పర్ఫార్మెన్స్, సోషల్‌మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, డావిన్సీ రిజాల్వ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/ha26D

### ఫీల్డ్ సేల్స్

సంస్థ: మినిపై ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజంటేషన్ స్కిల్స్, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.7,500-20,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 25
☛ https://shorturl.at/4DJWC

బహుళ జాతి సంస్థలకూ, ప్రతిభావంతులైన ఉద్యోగార్థులకూ.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)లు ఉభయ తారకంగా అవతరిస్తున్నాయి. భారత్‌లో వీటి ఏర్పాటుకు విఖ్యాత సంస్థలు వరుస కడుతున్నాయి. విదేశాల్లో కొలువు కంటే ఉన్నచోటే ఉపాధి పొందగలగడం ఉద్యోగార్థికి కలిసివస్తోన్న అదృష్టం. మన దేశంలో వచ్చే ఐదేళ్లలో మేటి సంస్థలు నెలకొల్పే జీసీసీల్లో సేవలందించడానికి 20 లక్షల మంది నిపుణులు అవసరమని నివేదికలు చెబుతున్నాయి.



# కొత్త కొలువులొస్తున్నాయ్.. అప్రమత్తం అవ్వండి!

అమెరికా లేదా యూరప్ దేశాలలో ఉండే బహుళ జాతి సంస్థ(ఎంఎన్‌సీ) తమ వాణిజ్య లక్ష్యాలకు అనుగుణంగా మరో దేశంలో పూర్తిస్థాయి కేంద్రాన్ని స్థాపించడమే.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ). కంపెనీ ప్రధాన కేంద్రానికి ఇది శాఖా కాదు, కాంట్రాక్ట్ కార్యాలయమూ కాదు. ప్రధాన కేంద్రానికి తీసిపోని విధంగా, సర్వ సామర్థ్యాలతో నెలకొల్పే వ్యవస్థ. వివిధ విదేశీ వాణిజ్య సంస్థల జీసీసీలు భారత్‌లో ప్రస్తుతం 1700 ఉండగా 10 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల సానుకూల వైఖరి, ప్రోత్సాహకాల రీత్యా భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు ఎంఎన్‌సీలు ముందుకొస్తున్నాయి. 2030 నాటికి పెద్ద సంఖ్యలో ఇవి ఆవిర్భవించనున్న నేపథ్యంలో వీటిలో ఉండే వివిధ విభాగాలు, హోదాలు, అవకాశాలపై అవగాహన ఏర్పర్చుకుంటే కెరియర్‌ను మలుచుకోవచ్చు.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

## ఐదు విభాగాలలో..

ఒకప్పుడు జీసీసీలు అంటే.. ఎంఎన్‌సీలు వ్యయ ఆదా కోసం నడిపే కేంద్రాలుగా చూసేవారు. తమ దేశంలో ఉద్యోగుల జీతభత్యాలు, మౌలిక వసతులపై ఖర్చు, పన్నులతో పోలిస్తే.. అవి ఏ దేశంలో తక్కువగా ఉన్నాయో పరిశీలించేవారు. అక్కడ ఓ కేంద్రం పెట్టి, కార్యకలాపాలలో కొంత భాగాన్ని బదలాయించి, వార్షిక వ్యయ భారాన్ని తగ్గించుకునేవారు. అయితే, గత పదేళ్ల నుంచీ ఈ విషయంలో ఎంఎన్‌సీల దృక్పథం పూర్తిగా మారిపోయింది. ఇండియాలో సైన్స్ అండ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ చదివిన ఫ్రెషర్స్ నుంచీ ప్రొఫెషనల్స్ వరకూ ఎక్కువ సంఖ్యలో లభ్యం కావడం, భారతీయ వృత్తి నిపుణులు సేవలు ఇతర దేశాల వారి కంటే పై చేయిగా ఉండటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలూ, ముఖ్యంగా ఆ సంస్థల ప్రధాన క్లయింట్లు, మార్కెట్ ఇండియాలోనే ఉండటంతో జీసీసీలకు మన దేశం స్వర్గధామంగా మారింది. సాధారణంగా వీటిలో ఐదు రకాల విభాగాలు కీలకంగా నిలుస్తున్నాయి. సంస్థ ప్రధాన లక్ష్యాలను బట్టి హోదాలు ఉంటాయి.



**టెక్నాలజీ, ఐటీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - మెషీన్ లెర్నింగ్(ఏఐ-ఎంఎల్) రాజ్యమేలుతూ.. ఆటోమేషన్, అనలిటిక్స్. క్లౌడ్ కంప్యూటింగ్‌కి కీలకమవుతున్న తరుణంలో జీసీసీల్లో టెక్నాలజీ, ఐటీ విభాగం అత్యంత శక్తిమంతంగా అవతరించింది. కొత్త బిజినెస్ అవకాశాలు గుర్తించడానికీ, పనితీరు మెరుగు పరుచుకోవడానికీ, వినియోగదారులకు కొత్త అనుభవాన్ని కల్పించడానికీ ఈ విభాగం దోహదపడుతుంది. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, డేటా అనలిస్ట్, డేటా సైంటిస్ట్, వెబ్ అడ్మినిస్ట్రేటర్, క్వాలిటీ అస్యూరెన్స్ ఇంజినీర్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ వంటి హోదాలు ఉంటాయి. ఇంజినీరింగ్ కోర్సుల ఎంపిక సమయంలోనే స్పష్టమైన గమ్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల ఉన్నత హోదాల్లోకి ప్రవేశించవచ్చు.

టెక్నాలజీ, ఐటీ విభాగం జీసీసీల్లో నూతన ఆవిష్కరణలకు నెలవుగా మారింది. ఏఐ-ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించు కుంటూ వినూత్న సేవలు, ఉత్పత్తులను తీసుకువస్తోంది. అంటే ఎంఎన్‌సీలకు జీసీసీల్లోని ఈ విభాగమే బంగారు బాతు గుడ్డు. వార్షిక బ్యాలెన్స్ షీట్లను లాభాలతో నింపే జీసీసీల్లోని ఈ ఇన్నొవేషన్ హబ్‌లను ఎంఎన్‌సీలు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాయి. ఈ విభాగంలోకి ప్రవేశించగలిగే యువత భవిష్యత్తుకు డోకా లేదు.

**నిర్ణయ శక్తి:** వినియోగదారులు లక్షల్లో, లావాదేవీలు కోట్లలో ఉంటాయి. దీంతో అధిక మొత్తంలో డేటా పోగవుతుంది. ఈ డేటామైన్ నుంచి భవిష్యత్తు వర్తకానికి ఆధారంగా నిలిచే సమాచారాన్ని వెలికితీసి, కొనుగోలు సరళిని ఆవిష్కరించగలిగే డేటా అనాలిసిస్‌కు జీసీసీలు జీవనాడిలా నిలుస్తున్నాయి. వేల కోట్ల రూపాయల వ్యాపార పరిమాణాన్ని సృష్టించేందుకు వెలుగు దివ్వెలా టెక్నాలజీ విభాగం నిలుస్తోంది.

**సామర్థ్యం పెంపు:** పదే పదే చేయాల్సిన పనులను సాంకేతికతతో చక్కదిద్ది, సృజనాత్మకత అవసరమయ్యే విధులపై దృష్టి పెట్టేందుకు జీసీసీల్లోని టెక్నాలజీ విభాగం అవకాశం కల్పిస్తోంది. హెచ్.ఆర్., ఫైనాన్స్, ప్రొక్యూర్‌మెంట్ (మెటీరియల్ సేకరణ) వంటి పనులను సునాయాసంగా చేయగలిగే సామర్థ్యాన్ని రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ సాంకేతికతలు అవకాశం కల్పిస్తున్నాయి. జీసీసీల్లో టెక్నాలజీ విభాగం సామర్థ్య మెరుగుదలకు వీలు కల్పిస్తోంది.

**డిజిటల్ పరిష్కారాలు:** ఏఐ-ఎంఎల్ సాంకేతికతల వినియోగం ద్వారా వివిధ ఉత్పత్తులు లేదా సేవలను త్వరితగతిన వృద్ధి చేసి, పరీక్షలు నిర్వహించి, అవసరమైన దిద్దుబాట్ల అనంతరం డిజిటల్ పరిష్కారాలను టెక్నాలజీ, ఐటీ విభాగాలు ఇవ్వగలుగుతున్నాయి. దీంతో జీసీసీల్లో వీటి ప్రాధాన్యం మరింతగా పెరుగుతోంది.

**మెరుగైన వినియోగదారుల అనుభవం:** నేడు చాలా సంస్థలు తమ ఉత్పత్తులనో, సేవలనో విక్రయించడం లేదు. అనుభూతి (ఎక్స్‌పీరియన్స్)ని అమ్ముతున్నాయి. మల్టీప్లెక్స్ థియేటర్లో సినిమా చూడటం ఒక అనుభూతి. మొబైల్ షాపింగ్ చేయడం వేరొక అనుభూతి. చివరికి తాజా కూరగాయలు కొనడాన్నీ ఒక ఎక్స్‌పీరియన్స్‌గా మార్చి కాసుల పంట పండిస్తున్న రోజులివి. జీసీసీల్లోని టెక్నాలజీ విభాగాలు ఇటువంటి కస్టమర్ ఎక్స్‌పీరియన్స్‌ని సృష్టించడంలో అందెవేసిన చేయిగా రాణిస్తున్నాయి.

మొత్తం మీద కొత్త కొలువులు తీసుకొస్తున్న జీసీసీల్లో టెక్నాలజీ, ఐటీ విభాగాలు బలమైన శక్తిగా నిలిచాయి. జీసీసీల్లో కోర్‌గా పరిగణించే ఈ విభాగంలో చోటు సాధిస్తే.. ఉజ్వల కెరియర్‌కు లోటు ఉండదు. దీంతో పాటూ ఇతర విభాగాలైన.. ఫైనాన్స్, ఆపరేషన్స్, సప్లయ్ చెయిన్, సేల్స్, మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ విభాగాలలోనూ ప్రకాశించే కెరియర్లు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకొని, విద్యానేపథ్యాన్ని బట్టి ఆ దిశగా అడుగులు వేయవచ్చు.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

## కేంద్ర సాయుధ బలగాల్లో.. 25,487 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. కేంద్ర సాయుధ బలగాల్లో 25,487 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది.

- సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్: 14,595
- సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్: 5,490
- సశస్త్ర సీమా బల్: 1,764
- అస్సాం రైఫిల్స్: 1,706
- ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్: 1,293
- బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్: 616
- సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్: 23

**విద్యార్హత:** పదో తరగతి ఉత్తీర్ణత.
**వయసు:** 01.01.2026 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
**వేతన శ్రేణి:** నెలకు రూ.21,700 - రూ.69,100.
**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్టు, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్టు, వైద్య పరీక్షలతో.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31.12.2025.
**దరఖాస్తు ఫీజు:** రూ.100. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, మహిళలకు ఫీజు లేదు.
**ఆన్‌లైన్ పరీక్షలు:** ఫిబ్రవరి - ఏప్రిల్, 2026లో ఉంటాయి.
**వెబ్‌సైట్:** https://ssc.gov.in/

## ఎస్‌బీఐలో స్పెషలిస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబయి.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 996 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వీపీ వెల్త్(ఎస్ఆర్ఎం): 506
- ఏవీపీ వెల్త్(ఆర్ఎం): 206
- కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్: 284

**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
**వయసు:** పోస్టులను అనుసరించి 2025 మే 1వ తేదీ నాటికి 20 నుంచి 42 ఏళ్లు ఉండాలి. ఓబీసీకి మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
**దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.750. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 23.
**ఎంపిక:** ఇంటర్వ్యూతో.
**వెబ్‌సైట్:** https://sbi.bank.in/web/careers/current-openings

## రైట్స్ లిమిటెడ్‌లో..

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్, గురుగ్రామ్.. ఒప్పంద ప్రాతిపదికన ఇండివిడ్యువల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఇండివిడ్యువల్ కన్సల్టెంట్: క్యూసీ/క్యూఏ ఎక్స్‌పర్ట్: 12


**అర్హత:** సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీతోపాటూ పని అనుభవం ఉండాలి. **వయసు:** 62 ఏళ్లకు మించకూడదు.
**వేతనం:** నెలకు రూ.1,00,000.
**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.600, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.300.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 14.
ఎంపిక: ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీలు:** డిసెంబరు 16, 17. **వెబ్‌సైట్:** https://www.rites.com/Career

ఎమ్మెస్సీ అనలిటికల్ కెమిస్ట్రీ పూర్తిచేశాను. ఇప్పుడు బీఎల్ఐఎస్సీ, తర్వాత ఎంఎల్ఐఎస్సీ చదవాలనుంది. ఈ కోర్సులతో లాభమేనా? ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - హారీష్ వర్మ

## లైబ్రరీ సైన్స్‌తో.. లాభమేనా?

■ ఎమ్మెస్సీ అనలిటికల్ కెమిస్ట్రీ పూర్తి చేసిన తర్వాత లైబ్రరీ సైన్స్ రంగంలోకి ప్రవేశించడం ఆహ్వానించదగ్గ పరిణామమే. ప్రస్తుత డిజిటల్ నాలెడ్జ్ యుగంలో.. పుస్తకాలు, గ్రంథాలయాలు, సమాచారం, శాస్త్రీయ నివేదికలు, ఆర్కైవ్ పత్రాలకు రోజురోజుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో లైబ్రరీ సైన్స్ రంగానికి కూడా క్రమంగా డిమాండ్ పెరుగుతూ ఉంది. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివిధ ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

✦ లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ లేదా పీజీ చేసిన వారికి విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ జూనియర్/డిగ్రీ/పీజీ కళాశాలల్లో లైబ్రరీ అసిస్టెంట్, లైబ్రేరియన్, సీనియర్ లైబ్రేరియన్, ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో, కేంద్రీయ విద్యాలయాల్లో, నవోదయ విద్యాలయాల్లో, గురుకుల పాఠశాలల్లో కూడా స్కూల్ లైబ్రేరియన్, లైబ్రరీ అసిస్టెంట్ ఉద్యోగాలు ఉంటాయి.



సీఎస్ఐఆర్ వంటి కేంద్ర పరిశోధనా సంస్థల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, లైబ్రరీ సైన్స్ కలయిక ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది. శాస్త్రీయ సమాచారం, పరిశోధన పత్రాల వర్గీకరణ, గ్రంథాలయ నిర్వహణలో నైపుణ్యాలు ఉన్న వారికి ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, డాక్యుమెంటేషన్ అసిస్టెంట్, లైబ్రేరియన్ లాంటి ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయి.

✦ డీఆర్‌డీవో, ఐసీఎంఆర్, ఐసీఏఆర్, ఇస్రో వంటి ప్రముఖ శాస్త్రీయ పరిశోధన సంస్థల్లో కూడా గ్రంథాలయ సేవలు అత్యవసరం కావడంతో, లైబ్రరీ సైన్స్ చదివిన వారికి మంచి డిమాండ్ ఉంది.

✦ ప్రైవేట్ రంగంలోనూ లైబ్రరీ సైన్స్‌కు విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ కళాశాలల్లో లైబ్రేరియన్, లైబ్రరీ అసిస్టెంట్, ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ లాంటి ఉద్యోగాల కోసం ప్రయత్నించవచ్చు. కార్పొరేట్ పాఠశాలల్లో, అంతర్జాతీయ విద్యాసంస్థల్లో కూడా లైబ్రేరియన్ల అవసరం ఉంది.

✦ ఫార్మా, బయోటెక్, రసాయన పరిశ్రమల్లో ఎమ్మెస్సీ అనలిటికల్ కెమిస్ట్రీ, లైబ్రరీ సైన్స్ కలయికతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. శాస్త్రీయ నివేదికలు, ప్రయోగాల డేటా, ప్రమాణాలు, ఫార్ములేషన్ల సమాచారాన్ని నిర్వహించేందుకు ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ వంటి పోస్టులకు అర్హత పొందవచ్చు.

✦ ఐటీ సంస్థల్లో డిజిటల్ గ్రంథాలయ నిర్వహణ కోసం ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, కంటెంట్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ల అవసరం ఉంటుంది.

✦ లైబ్రరీ సైన్స్‌లో పీజీ పూర్తిచేసిన తర్వాత యూజీసీ నెట్‌లో అర్హత సాధిస్తే ఉన్నత ఉద్యోగాలకు, పీహెచ్‌డీ ప్రవేశానికి, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక వృత్తిలో చేరడానికి వీలవుతుంది.

చివరిగా, లైబ్రరీ సైన్స్ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో డిగ్రీతోపాటు నైపుణ్యాలు కూడా అత్యంత కీలకం. పుస్తకాల వర్గీకరణ, గ్రంథాలయ ఆటోమేషన్, డిజిటల్ ఆర్కైవింగ్, సమాచార శోధన విధానాల్లో నైపుణ్యం ఉన్న వారికే ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఐబీఎఫ్)... 10 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీచేయనుంది. బీకాం అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.



## ఐఐబీఎఫ్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

పోస్టుల సంఖ్యను ఇంకా పెంచే అవకాశముంది. ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్హతల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

రాత పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రంలో ఐదు సెక్షన్లు ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 140 నిమిషాలు. అయితే ప్రతి సెక్షన్‌నూ నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలి.

రీజనింగ్ 50 ప్రశ్నలకు 40 నిమిషాలు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలకు 30 నిమిషాలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలకు 40 నిమిషాలు. జనరల్ అవేర్‌నెస్ (బ్యాంకింగ్) 40 ప్రశ్నలకు 20 నిమిషాలు, కంప్యూటర్ నాలెడ్జ్ 20 ప్రశ్నలకు 10 నిమిషాలు. రాత పరీక్షలో ప్రతిభ చూపినవారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీంట్లోనూ విజయవంతమైన వారిని వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.

**సన్నద్ధత:** బ్యాంక్, ఆర్ఆర్‌బీ పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ప్రశ్నపత్రాన్ని గమనిస్తే.. ప్రతి సెక్షన్‌లోనూ ప్రశ్నల సంఖ్య కంటే వ్యవధి తక్కువగా ఉంది. కాబట్టి సమాధానాలను వేగంగా గుర్తించగలగడం సాధన చేయాలి. ఇందుకోసం మాక్ టెస్టులు ఉపయోగపడతాయి. వీటిని ఎక్కువగా రాయడం వల్ల సమయ నిర్వహణపై పట్టు సాధించగలుగుతారు. రాత పరీక్షతేదీని ఇంకా ప్రకటించలేదు. ఇప్పటినుంచీ సన్నద్ధతను మొదలుపెడితే అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

### గమనించాల్సినవి

✦ కాల్ లెటర్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ సమాచారాన్ని ఈమెయిల్/ ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు.
✦ తాజా సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
✦ ఎంపికైనవారిని ముంబయి, న్యూదిల్లీ, కోల్‌కతా, చెన్నై, గువాహటీల్లో ఎక్కడైనా నియమించవచ్చు.

### ముఖ్యాంశాలు

**అర్హతలు:** కామర్స్/ ఎకనామిక్స్/ బిజినెస్ మేనేజ్‌మెంట్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిగ్రీ 60 శాతంతో పూర్తిచేయాలి.
✦ ఎంకాం/ ఎంఏ (ఎకనామిక్స్)/ ఎంబీఏ/ సీఏ/ సీఎంఏ/ సీఎస్/ సీఎఫ్ఏ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ డిప్లొమా చేసినవారికి ప్రాధాన్యం.
**వయసు:** 01.11.2025 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు.
**దరఖాస్తు ఫీజు:** రూ.700 (జీఎస్టీ అదనం).
**వేతన శ్రేణి:** నెలకు రూ.40,400-1,30,400. మూలవేతనానికి అదనంగా వసతి నిమిత్తం నెలకు రూ.18 వేల నుంచి రూ.20 వేలు చెల్లిస్తారు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 28.12.2025
**వెబ్‌సైట్:** http://www.iibf.org.in/

## ఓరియంటల్ ఇన్స్యూరెన్స్‌లో..

ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జనరలిస్ట్ ఆఫీసర్: 285
- హిందీ ఆఫీసర్(రాజభాష): 15

**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ ఉండాలి.
**వయసు:** నవంబరు 30, 2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
**వేతనం:** నెలకు రూ.85,000. **దరఖాస్తు ఫీజు:** జనరల్‌కు రూ.1000. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.250.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివది తేదీ:** డిసెంబరు 15.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/careers

## మునిషన్స్ ఇండియా లిమిటెడ్‌లో..

రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన మునిషన్స్ ఇండియా లిమిటెడ్.. డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఇంజినీర్): 25
- డిప్లొమా అప్రెంటిస్(టెక్నీషియన్): 25

**విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ప్రొడక్షన్.
**అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/బీటెక్.
**స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300. డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.10,900.
**దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** డిసెంబరు 10
**వెబ్‌సైట్:** https://munitionsindia.in/career/

## ఎన్ఐఈపీఎండీలో కన్సల్టెంట్లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజేబిలిటీస్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**విభాగాలు:** స్పెషల్ ఎడ్యుకేషన్, ఆక్యుపేషనల్ థెరపీ, ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ క్లినికల్ సైకాలజీ. **ఖాళీలు:** 25 **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఎంఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 56 ఏళ్లలోపు ఉండాలి.
**వేతనం:** నెలకు పోస్టులను అనుసరించి రూ.25,000 నుంచి రూ.80,000.
**దరఖాస్తు ఫీజు:** రూ.590. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళలు, ట్రాన్స్ జెండర్‌లకు ఫీజు లేదు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 26.
**వెబ్‌సైట్:** https://niepmd.nic.in/notice-category/recruitments/

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

చదువు
మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మం.,
రామోజీ ఫిల్మ్‌సిటీ 501 512
edc@eenadu.in

## ఖాలిదా జియాకు చికిత్స అందించేందుకు విదేశీ వైద్య బృందం



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఖాలిదా జియా(80) ఆరోగ్యం తీవ్రంగా క్షీణించడంతో ఆమెకు చికిత్స అందించేందుకు వివిధ దేశాలు ముందుకు వచ్చాయి. బ్రిటన్, చైనా, అమెరికా, ఖతార్, సౌదీ అరేబియా, పాకిస్థాన్లు ఈ జాబితాలో ఉన్నాయి. అంతేకాదు, చైనా నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక వైద్య నిపుణుల బృందం సోమవారం బంగ్లాకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఖాలిదా చేరిన ఎవర్కేర్ ఆస్పత్రి ఆవరణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మరో వైపు, జియా కుమారుడు, బీఎన్పీ తాత్కాలిక ఛైర్మన్ తారిక్ రెహమాన్ త్వరలోనే లండన్ నుంచి బంగ్లాకు రానున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేతలు తెలిపారు.

## బిహార్ అసెంబ్లీ స్పీకర్గా ప్రేమ్ కుమార్



పట్నా: బిహార్ అసెంబ్లీ స్పీకర్గా భాజపా సీనియర్ నాయకుడు ప్రేమ్ కుమార్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 74 ఏళ్ల కుమార్ ఇటీవల ఎనిమిదో సారి గయా టౌన్ సీటును సొంతం చేసుకున్నారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ల సమక్షంలో ప్రేమ్ కుమార్ అసెంబ్లీ స్పీకర్ పదవిని చేపట్టనున్నారు.

## మాదకద్రవ్య అడ్డాగా గుజరాత్: రాహుల్



దిల్లీ: గుజరాత్లో మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, నేరాలు పెరిగిపోవడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, డబుల్ ఇంజిన్ సర్కారు ఉన్నా మునిగిపోతున్న నావలా ఆ రాష్ట్రం మారిందని లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. గుజరాత్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జనాక్రోశ యాత్ర జరిగినపుడు ఎందరో ప్రజలు, ముఖ్యంగా మహిళలు తమ గోడు వెళ్లబుచ్చారని తెలిపారు. మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్ల జన్మభూమి అయిన గుజరాత్లో ఒకప్పుడు శాంతి, నైతిక విలువలు, న్యాయానికి పట్టంకట్టేవారనీ, ఇప్పుడు రాష్ట్ర యువత భవిష్యత్తు మత్తుమందులు, నేరాల ఊబిలో చిక్కుకుపోయిందని రాహుల్ పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా భాజపా ఎందుకు మౌనం వహిస్తోందని నిలదేశారు.

## చనిపోయాడనుకొన్న కుమారుడు.. 35 ఏళ్ల తర్వాత ఇంటికి వచ్చాడు



ఈటీవీ భారత్: పశ్చిమబెంగాల్లోని మాల్దా జిల్లా నవ్దా జాదుపుర్ గ్రామంలో చనిపోయాడని కుటుంబం ఆశలు వదులుకొన్న ఓ వ్యక్తి 35 ఏళ్ల తర్వాత ఇంటికి తిరిగివచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా జాహిద్ షేక్ 13 ఏళ్ల వయసులో బాలకార్మికుడిగా పంజాబ్కు వెళ్లాడు. అక్కడ పనులు చేసుకొంటూ ఒకరోజు అకస్మాత్తుగా పత్తా లేకుండా పోయాడు. ఎంత వెదికినా జాడ తెలియలేదు. కొంతకాలానికి ఇక ఆశలు వదులుకున్న తల్లిదండ్రులు కుమారుడు చనిపోయి ఉంటాడని భావించి, సంప్రదాయం ప్రకారం కర్మకాండల్లాంటి క్రతువులు కూడా పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో జాహిద్ అనూహ్యంగా ఇంటికి తిరిగి వచ్చాడు. "పంజాబ్లో నాకు ఘోర ప్రమాదం జరిగింది. చాలా రోజులు స్పృహ లేకుండా ఆసుపత్రిలోనే ఉన్నా. దాదాపు రెండేళ్లు చికిత్స పొందాను. ఆ సమయంలో నన్ను ఆదుకొన్న వ్యక్తి వెంట గాజియాబాద్కు వెళ్లి అక్కడే స్థిరపడి.. స్థానిక యువతిని పెళ్లాడా. నా ఏడుగురు పిల్లల్లో ఇద్దరికి పెళ్లిళ్లు కూడా చేశా. ఇప్పుడు నా పిల్లలు నేను పుట్టిన ఇంటిని చూడాలని కోరుకున్నారు. అందుకే తిరిగి వచ్చా" అని జాహిద్ వివరించాడు.

## భారీగా హెరాన్ డ్రోన్ల కొనుగోలు



టెల్ అవీవ్: అత్యవసర నిబంధనల కింద అదనంగా హెరాన్ మార్క్-2 డ్రోన్లను కొనుగోలు చేయడానికి భారత్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఇజ్రాయెల్ రక్షణ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ భారత సైనిక దళాలకు ఇవి బాగా ఉపయోగపడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

హెరాన్ మార్క్-2 డ్రోన్లు ఇప్పటికే భారత సైన్యం, వాయుసేన అమ్ములపొదిలో ఉన్నాయి. ఇప్పుడు వాటిని నౌకాదళంలోనూ ప్రవేశపెట్టబోతున్నట్లు ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అధికారి ఒకరు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అత్యవసర కొనుగోలు నిబంధనల కింద వీటిని సమీకరించుకునేందుకు భారత త్రివిధ దళాలు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. అయితే నిర్దిష్టంగా ఎన్ని డ్రోన్లను కొనుగోలు చేస్తున్నారన్నది వెల్లడించలేదు. ఈ అధునాతన డ్రోన్లను సరఫరా చేయడమే కాకుండా భారత్లో తయారీకి తోడ్పాటు అందిస్తామని ఆ అధికారి తెలిపారు. హెరాన్ మార్క్-2 డ్రోన్.. మధ్యస్థ ఎత్తులో ఎగురుతూ ఎక్కువ సేపు గాల్లో ఉండగలదు. దీన్ని ఎంఏఎల్ఈ తరగతిగా పేర్కొంటారు. ఇది 35వేల అడుగుల ఎత్తులో ఏకబిగిన 45 గంటల పాటు గాల్లో ఉండగలదు. శాటిలైట్ లింక్ కలిగిన ఈ డ్రోన్లను శత్రువుపై నిఘా వేయడానికి ఉపయోగిస్తారు.

# స్వదేశీ యుద్ధవిమాన ఎస్కేప్ వ్యవస్థ పరీక్ష విజయవంతం



దిల్లీ: యుద్ధవిమానంలో సాంకేతిక లోపం తలెత్తినప్పుడు దాని నుంచి బయటపడేందుకు పైలట్కు సహాయపడే ఎస్కేప్ వ్యవస్థను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) విజయవంతంగా పరీక్షించింది. పైలట్ను క్షేమంగా వెలుపలికి తీసుకురావడంతో సహా భద్రతకు సంబంధించిన కీలక అంశాలను ఈ సందర్భంగా ధ్రువీకరించుకున్నట్లు రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. దీంతో సొంతంగా ఇలాంటి పరీక్ష సామర్థ్యాన్ని కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

హైస్పీడ్ రాకెట్ స్లెడ్ టెస్ట్ అనే ఈ పరీక్షను చండీగఢ్లో డీఆర్డీవోకు చెందిన టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ ల్యాబ్ (టీబీఆర్ఎల్)లో నిర్వహించారు. ఇందులో తేజస్ యుద్ధవిమానానికి సంబంధించిన ముందు భాగాన్ని ఉపయోగించారు. దీనికి ఘన రాకెట్ మోటార్లను అమర్చారు. కాక్పిట్లో ఒక బొమ్మ పైలట్ను ఉంచారు. ఈ వ్యవస్థ మొత్తాన్ని జంట రైలుపట్టాలపై ఉంచారు. రాకెట్ మోటార్లను దశలవారీగా మండించడం ద్వారా నియంత్రిత పద్ధతిలో ఆ విమాన నమూనాను పట్టాలపై వేగంగా దూసుకెళ్లేలా చేశారు. తద్వారా గాల్లో వేగంగా కదులుతున్న యుద్ధవిమానాన్ని ఇది అనుకరించింది. గంటకు 800 కిలోమీటర్ల వేగం వద్ద ఎస్కేప్ వ్యవస్థను పరీక్షించారు. ఇందులో.. కాక్పిట్పైనున్న గాజు తొడుగు ముక్కలు కావడం, కాక్పిట్లో నుంచి పైలట్ సీటు దూసుకురావడం, ఆ వెంటనే పారాచూట్ విచ్చుకొని పైలట్ (బొమ్మ) సురక్షితంగా బయటపడటం.. క్రమపద్ధతిలో సాగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎదురయ్యే ఏరోడైనమిక్ బలాలు, త్వరణం వంటి వాటిని పరిశోధకులు నమోదు చేశారు. వీటిని ప్రస్తుత, భవిష్యత్తులో రూపొందించబోయే యుద్ధవిమానాల కోసం స్వదేశీ ఎస్కేప్ పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగిస్తారు. తాజా పరీక్షను విజయవంతంగా నిర్వహించడంపై రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్.. డీఆర్డీవో, వాయుసేన, ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్లను అభినందించారు. రక్షణ రంగంలో స్వయం ప్రతిపత్తి సాధన దిశగా ఇది పెద్ద మైలురాయి అని కొనియాడారు.

## నగరాల విస్తరణతో మౌలిక వసతులకు కొరత

దిల్లీ: నగరాలు ఒక్కచోటనే పొందికగా, దట్టంగా కేంద్రీకృతమైతే పౌరులకు తాగునీరు, మురుగు పారుదల వంటి మౌలిక వసతులను అందించడం సులువు అవుతుందనీ, అలా కాకుండా పూర్వ పరిధిని దాటి విస్తరిస్తూపోయే నగరాలకు ఈ సౌలభ్యం ఉండదని ఆస్ట్రియా, ప్రపంచ బ్యాంకు పరిశోధకులు తేల్చారు. వారు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో 100 నగరాలను అధ్యయనం చేశారు. అవి ఒక్కచోటనే ఉంటే 22 కోట్ల మందికి కొళాయిల ద్వారా తాగునీరు, 19 కోట్లమందికి మురుగు పారుదల వ్యవస్థలను అందించవచ్చని తెలిపారు. పూర్వ పరిధిని దాటి విస్తరించిన నగరాల్లో తాగునీటి బిల్లులు 75 శాతం ఎక్కువగా ఉంటాయి. ఆ నగరాలు ఇంకా దూరాలకు విస్తరిస్తే పైపుల ద్వారా నీటి సరఫరా 50 శాతం తగ్గిపోతుంది. నగర కేంద్రానికి దూరంగా నివసిస్తున్న ప్రజలకు తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు 40 శాతం తక్కువగా అందుబాటులో ఉంటాయి. 2050కల్లా ఆఫ్రికా, ఆసియాలలో నగర జనాభా మరింత విస్తరించనున్నది. ఆఫ్రికాలో నగర కేంద్రాలలో నివసించేవారి సంఖ్య 12 శాతమైతే, ఆసియాలో 23 శాతం. ఈ పరిస్థితులను గమనించి నగరాలు పొందికగా పెరిగేలా ప్రణాళికలు రచించి అమలు చేయాలని అధ్యయనకర్తలు సూచించారు.

## రష్యా చమురు నౌకపై ఉక్రెయిన్ దాడి

అంకారా (తుర్కియే): నల్ల సముద్ర మార్గంలో రష్యా నుంచి జార్జియాకు పొద్దుతిరుగుడు నూనె తీసుకెళ్తున్న చమురు ట్యాంకర్పై ఉక్రెయిన్ దాడి చేసిందని తుర్కియేకు చెందిన నావికాదళ అధికారులు వెల్లడించారు. తుర్కియే తీరానికి 130 కిలోమీటర్ల దూరంలో మిడ్వోల్గా-2 అనే నౌకపై ఈ దాడి జరిగినట్టు టర్కిష్ మారిటైమ్ వ్యవహారాల డైరెక్టరేట్ జనరల్ కార్యాలయం వెల్లడించింది. ట్యాంకర్లో 13 మంది సిబ్బంది ఉండగా వారందరూ సురక్షితంగా బయటపడ్డారని వివరించారు.

### అరుదైన ఘనత సాధించిన

# వేద పారంగతుడికి మోదీ ప్రశంసలు


దిల్లీ: అత్యంత అరుదైన దండక్రమ పారాయణంలో భాగంగా శుక్ల యజుర్వేదంలోని 20 వేల మంత్రాలను 50 రోజుల పాటు నిరాటంకంగా పఠించిన ఒక యువ పండితునిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కాశీలో జరిగిన ఓ కార్యక్రమంలో దేవవ్రత్ మహేశ్ రేఖే అనే యువ పారంగతుడు వేద పారాయణ పద్ధతుల్లో అత్యున్నతమైనదిగా పరిగణించే దండక్రమ పారాయణం ద్వారా తన పాండిత్యాన్ని ప్రదర్శించి సభికుల మన్ననలు పొందారు. దాదాపు రెండు శతాబ్దాల తర్వాత ఇలాంటి స్వచ్ఛమైన పారాయణం జరిగిందని శృంగేరీ మఠం తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొంది. చరిత్రలో కేవలం మూడుసార్లే దండక్రమ పారాయణం జరిగిందని మఠం తెలిపింది. "వేదమూర్తి దేవవ్రత్ రేఖే సాధించిన ఘనతను భావి తరాలు గుర్తుంచుకుంటాయి" అని ప్రధాని మోదీ మంగళవారం తన ఎక్స్ పోస్టులో వ్యాఖ్యానించారు. "భారతీయ సంస్కృతిపట్ల అభిరుచి కలిగిన ప్రతి ఒక్కరూ వేదమూర్తి సాధించిన ఘనతపై గర్వ పడాలి. 50 రోజుల్లో ఆయన శుక్ల యజుర్వేద మధ్యందిన శాఖకు చెందిన 2 వేల మంత్రాలను నిరంతర పారాయణం చేశారు. ఇందులో భాగంగా ఆయన అనేక వైదిక శ్లోకాలను, పవిత్ర పదాలను ఏమాత్రం తప్పులు లేకుండా పఠించారు. ఆయన అత్యున్నత గురుపరంపరకు ప్రతీక" అని ప్రధాని అన్నారు. కాశీ పార్లమెంటు సభ్యునిగా, నా నియోజకవర్గమైన పవిత్ర నగరిలో ఈ అసాధారణ క్రతువు జరగడం అమితానందాన్నిచ్చింది, అని మోదీ వ్యాఖ్యానించారు. "వేదమూర్తి కుటుంబ సభ్యులకు, ఆయనకు మద్దతు ఇచ్చిన పలువురు సాధువులు, పండితులు, సంస్థలు తదితరులందరికీ నా ప్రణామం" అని మోదీ పేర్కొన్నారు. అరుదైన ఈ పారాయణం అక్టోబరు 2 నుంచి నవంబరు 30 వరకూ వల్లభరామ్ శాలిగ్రాం సంగ్వేద్ విద్యాలయంలో జరిగిందని శృంగేరీ మఠం తెలిపింది.




దండకర్మ పారాయణం పూర్తి చేసిన దేవవ్రత మహేశ్ రేఖే

# 'సర్' నిర్వహణకు ఈసీ కారణాలు సాకులే

- దశాబ్దాల క్రితం నుంచే పట్టణీకరణ జరుగుతోంది
- సుప్రీంకోర్టులో పిటిషనర్ల తరఫున వాదనలు



దిల్లీ: దేశంలో పట్టణీకరణ వేగంపుంజుకోవడం, పౌరుల వలసలు అధికంగా ఉండడం వంటి కారణాల వల్లే ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను చేపట్టామంటున్న ఎన్నికల సంఘం (ఈసీ) వాదనలు సమర్థనీయం కాదని పిటిషనర్ల తరఫు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. ఏ నియోజకవర్గంలోనైనా ఓటర్ల జాబితాను సవరించటానికి ఉన్న వెసులుబాటును దేశవ్యాప్తంగా 'సర్'ను చేపట్టడానికి ఇచ్చిన అధికారంగా ఈసీ భావించటం తగదని పేర్కొన్నారు. 'సర్' కసరత్తు నిర్వహణలో ఈసీకున్న చట్టబద్ధతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణలో భాగంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మల్యా బాగ్చి ధర్మాసనం ముందు మంగళవారం వాదనలు కొనసాగాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. దేశంలో పట్టణీకరణ కొన్ని దశాబ్దాలుగా జరుగుతోందని, ఉపాధి కోసం ప్రజలు వలస పోవడం ఎప్పటి నుంచో ఉందని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21 కింద లభించిన అధికారాలను ఈసీ అతిక్రమించిందని ఆరోపించారు. పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం ఎన్నికల సంఘానికి లేదని తెలిపారు. చట్టపరిధులకు లోబడే 'సర్'ను నిర్వహించాలన్నారు. పిటిషనర్ల తరఫు మరో న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వినియోగించిన కొన్ని పదాలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎన్నికల సంఘాన్ని నిరంకుశపాలకులతో పోల్చడం సరికాదని పేర్కొన్నారు. తీవ్ర వ్యాఖ్యలు చేయడం తగదని, వాదనలు వినిపించడానికే పరిమితం కావాలని హితవు పలికారు. గురువారం విచారణ కొనసాగనుంది.

### సివిల్ వివాదాల ఛార్జిషీట్లలో జాగ్రత్తగా ఉండండి

దిల్లీ: సివిల్ వివాదం పెండింగులో ఉన్నప్పుడు అందులో ఒకరి ఫిర్యాదు మేరకు మరొకరిపై క్రిమినల్ ఛార్జిషీటు దాఖలు చేసే విషయంలో పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించాలని, అభియోగాలు నమోదు చేసే విషయంలో క్రిమినల్ కోర్టులూ అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. సేకరించిన సాక్ష్యాధారాలు నేర నిర్ధారణకు ఉపయోగపడతాయా అనేది గుర్తించి విచారణాధికారి ప్రవర్తించాలని జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్, జస్టిస్ మన్మోహన్ల ధర్మాసనం పేర్కొంది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఒక తీర్పును కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ సమగ్రత, సామర్థ్యాలు నిలబడాలంటే ఇలాంటి కేసుల్లో గట్టి అనుమానం ఉన్నప్పుడు మాత్రమే ఛార్జిషీట్ల తయారీని, అభియోగాల నమోదును చేపట్టాలి. అలాలేని కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేయడం న్యాయవ్యవస్థను స్తంభింపజేస్తుంది. నిరపరాధిత్వం నిరూపించేందుకు మాత్రమే న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, ప్రాసిక్యూటర్లు తమ సమయాన్ని వెచ్చించాల్సి వస్తుంది. దీనివల్ల పెండింగ్ కేసులు పెరిగిపోతాయి. నేరం నిరూపితమయ్యే అవకాశాల్లేని కేసుల్లో ప్రభుత్వం పౌరుల్ని నిందితులుగా పేర్కొనరాదన్నది న్యాయశాస్త్ర ప్రాథమిక సూత్రం" అని తెలిపింది.

### ఆరుబయట జైళ్లను వినియోగించుకోకపోవడం తీవ్రమైన విషయం

దిల్లీ: ఒకవైపు జైళ్లు కిక్కిరిసిపోతుండగా మరోవైపు ఆరుబయట కారాగారాలను ప్రభుత్వం పూర్తిగా వినియోగించుకోకపోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ఖైదీలు సమాజంలో పునరావాసం పొందేందుకు వీలుగా ఆరుబయట జైళ్లు, పాక్షిక ఆరుబయట జైళ్ల ప్రక్రియను ప్రవేశపెట్టారు. 457 ఎకరాల విస్తీర్ణం కలిగివున్న ఒక ఆరుబయట జైలుకు చెందిన భూమిలోంచి 257 ఎకరాలను బ్రహ్మోస్ తదితర ప్రాజెక్టులకు కేటాయించేందుకు అనుమతి కోరుతూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ను విచారణకు స్వీకరిస్తూ జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బ్రహ్మోస్ ప్రాజెక్టు ఏర్పాటుకు 180 ఎకరాల భూమి అవసరమని, సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్బీ)కు మరో 45 ఎకరాలు అవసరమని కేరళ ప్రభుత్వం పేర్కొంది. మరో 32 ఎకరాలు జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ లేబరేటరీ ఏర్పాటుకు అవసరమని తెలిపింది. కేరళ ప్రభుత్వ పిటిషన్ను అనుమతించాలని సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ కోరారు. బ్రహ్మోస్ ప్రాజెక్టు జాతీయ రక్షణ ప్రాజెక్టు అని కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు అన్నారు. దీంతో ధర్మాసనం కేరళ ప్రభుత్వ దరఖాస్తుకు అనుమతి మంజూరు చేసింది.

## శ్రీలంకకు పాక్ 'గడువు ముగిసిన' సాయం?

ఇంటర్నెట్ డెస్క్: దిత్వా తుపాను ప్రభావంతో వణుకుతున్న శ్రీలంకకు భారత్ సహా పలు దేశాలు సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి.. వారికి గడువు ముగిసిన వస్తువులను సాయంగా పంపించిందనే వార్తలు వస్తున్నాయి. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

తుపాను ప్రభావంతో అల్లాడుతున్న శ్రీలంకకు సాయంగా ఆహారం, ఔషధాలను పాకిస్థాన్ పంపించింది. ఇవి కొలంబోకు చేరుకున్న విషయాన్ని తెలియజేస్తూ.. "శ్రీలంకకు పాకిస్థాన్ ఇప్పుడు, ఎప్పుడూ అండగా ఉంటుంది" అని ముద్రించిన ప్యాకెట్లను శ్రీలంకలోని పాకిస్థాన్ హైకమిషన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే, ప్యాకెట్లపై గడువు తేదీ 2024 అక్టోబరులోనే ముగిసినట్లు ఉంది. ఇది గమనించిన శ్రీలంక అధికారులు.. ఈ విషయాన్ని పాక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు తమ అసంతృప్తిని తెలియజేసినట్లు సమాచారం. పాకిస్థాన్ గతంలోనూ ఇలాంటి విమర్శలే ఎదుర్కొంది.

## కరోండా బెర్రీలతో చెర్రీలు



ఈటీవీ భారత్: రాజస్థాన్లోని పుష్కర్.. ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి గాంచింది. అక్కడ చిన్నతరహా పరిశ్రమ కూడా ఉంది. అందులో పుల్లని కరోండా బెర్రీలను ప్రాసెస్ చేసి తియ్యని చెర్రీలుగా మారుస్తున్నారు. చెర్రీల భారాన్ని భరించలేదని వారికి ఇది చౌకైన చెర్రీగా అందుబాటులో ఉంటోంది. అంతేకాదు.. పచ్చి బొప్పాయిని టూటీ ఫ్రూటీగానూ ఇక్కడ తయారుచేస్తున్నారు. పుష్కర్లో ఇటువంటి ప్రాసెసింగ్ పరిశ్రమలు 10 నుంచి 12 వరకూ ఉన్నాయి. ఏడాదిలో సుమారు 9 నెలలపాటు పనిచేసే ఈ పరిశ్రమలు దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాలకూ వీటిని ఎగుమతి చేస్తున్నాయి. ఇప్పటికే ఉసిరితోపాటు గులాబీల పంటలకు పుష్కర్ ప్రసిద్ధి. ఇప్పుడు ఈ పరిశ్రమలతోనూ ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

## పాక్ కోసం భారతీయ నంబర్లతో వాట్సప్ ఖాతాలు..!

- రాజస్థాన్లో వ్యక్తి అరెస్టు

జైపుర్: ఇతరుల ఫోను నంబర్లతో వాట్సప్ ఖాతాలు తెరచి...పాకిస్థాన్కు నిఘా సమాచారాన్ని చేరవేసిన ఓ వ్యక్తిని రాజస్థాన్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం పనిచేస్తున్నాడని తెలిపారు. రాజస్థాన్లోని గంగానగర్లో సాధువాలి మిలిటరీ జోన్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించడంతో పంజాబ్కు చెందిన ప్రకాశ్ సింగ్ అలియాస్ బాదల్ (34)ను అరెస్టు చేశారు. ఆ తర్వాత దర్యాప్తులో భాగంగా అతడి ఫోనును తనిఖీ చేయగా...పాకిస్థాన్ నెంబర్లతో చాట్లు కనిపించాయి. ఆపరేషన్ సిందూర్ నాటినుంచి రాజస్థాన్, పంజాబ్, గుజరాత్లలోని భారత సైన్య కదలికలకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను అతడు వాట్సప్ ద్వారా ఐఎస్ఐకు చేరవేస్తున్నాడు. స్థానికుల ఫోను నంబర్లతో ఓటీపీ సేకరించి, వారి పేర్లతోనే వాట్సప్ ఖాతాలు తెరిచాడు. ఈ అకౌంట్లతో పాకిస్థాన్కు చెందిన హ్యాండ్లర్లకు నిఘా సమాచారాన్ని చేరవేసేవాడు. ఇందుకుగాను అతడు పెద్ద మొత్తంలో డబ్బు పొందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి అతడి నెట్వర్క్లోని మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

## దేశాన్ని వీడేందుకు సిద్ధం.. కానీ!

- ట్రంప్తో ఫోన్కాల్లో మదురో

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో జరిగిన చర్చల్లో.. తన కుటుంబంతో సహా దేశాన్ని వీడేందుకు సిద్ధంగా ఉన్నానని వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన షరతులకు అంగీకరిస్తేనే దేశాన్ని వీడతానని మెలిక పెట్టినట్లు ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ కథనంలో పేర్కొంది. దీని ప్రకారం.. గత నెలలో ట్రంప్, మదురోలు ఫోన్లో మాట్లాడుకున్నారు. 15 నిమిషాలలోపే ముగిసిన ఆ సంభాషణలో తనకు, తన కుటుంబానికి ఆంక్షల నుంచి పూర్తి ఉపశమనం లభిస్తే.. తాను వెనెజువెలాను వీడేందుకు సిద్ధంగా ఉన్నానని మదురో తెలిపినట్లు సమాచారం. తనతో పాటు మరో 100 మందికి పైగా వెనెజువెలా అధికారులపై అమెరికా విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేయాలని, అంతర్జాతీయ నేర కోర్టు నుంచి తాను ఎదుర్కొంటున్న కేసును మూసివేయాలని కోరారు. మదురో షరతుల్లో చాలావాటిని ట్రంప్ తిరస్కరించినట్లు వార్తా కథనం పేర్కొంది. ఇక, మదురోతో ఫోన్లో మాట్లాడిన విషయాన్ని ట్రంప్ ఆదివారం ధ్రువీకరించారు. అయితే, వారి మధ్య జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను మాత్రం బయటపెట్టలేదు.

## రానున్న పదేళ్లలో అణుయుద్ధం..!

- ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అణుయుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే అయిదు, పదేళ్లలో అణుయుద్ధం జరగొచ్చని పేర్కొన్నారు. ఎక్స్లో ఓ యూజర్ పోస్టుకు సమాధానంగా మస్క్ ఈ వ్యాఖ్యలు చేశారు. హంటర్ యాష్ అనే ఓ యూజర్ ఎక్స్లో ఓ పోస్టు పెట్టాడు. 'అణ్వాయుధాలు ప్రధాన శక్తుల మధ్య యుద్ధాన్ని, యుద్ధ ముప్పును నిరోధిస్తాయని ఇప్పుడు ఉన్న ప్రభుత్వాలు బలంగా నమ్ముతున్నాయి. కాబట్టి.. ఆ ప్రభుత్వాలపై బయటి శక్తుల నుంచి ఎలాంటి ఒత్తిడి ఉండదు' అని రాసుకొచ్చాడు. దీనికి ఎలాన్ మస్క్ బదులిస్తూ యుద్ధం కచ్చితంగా జరుగుతుందని పేర్కొన్నారు. 'యుద్ధం అనివార్యం. 5, 10 ఏళ్లలో ఇది జరుగుతుంది' అని పేర్కొన్నారు. అయితే, తన వ్యాఖ్యలపై మస్క్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటుచేసిన డోజ్ శాఖలో పని చేసిన మస్క్.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.

## త్వరలో నేవీలోకి మూడో అణు జలాంతర్గామి: నౌకాదళాధిపతి వెల్లడి



దిల్లీ: భారత అణు సంబంధ త్రిశక్తిలో నౌకాదళ భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నట్లు నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి పేర్కొన్నారు. అణుశక్తితో నడిచే స్వదేశీ జలాంతర్గామి అరిదమన్ను త్వరలో నౌకాదళంలో ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. దీనిపై సముద్ర పరీక్షలు జరుగుతున్నాయని, అవి తుది దశలో ఉన్నాయన్నారు. పోరాట సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడంపై తాము దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఈ నెల 4న నౌకాదళ దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో మంగళవారం ఆయన దిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు 75ఐ కింద ఆరు స్టెల్త్ జలాంతర్గాముల కొనుగోలుకు ఒప్పందాన్ని ఖరారుచేసుకునే ప్రక్రియ త్వరలో పూర్తికానుందని వివరించారు. నేవీకి ఫ్రాన్స్ నుంచి సరఫరా కావాల్సిన 26 రఫేల్-ఎం యుద్ధవిమానాల్లో మొదటి నాలుగు జెట్లు 2028లో అందనున్నాయని తెలిపారు.

## చేయూత అందించడంలో భారత్ ముందుంది: దిసనాయకే



బదుల్లాలో వరద ప్రభావిత ప్రాంతంలో సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

కొలంబో: క్లిష్టపరిస్థితుల్లో సాయం అందించడంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే కొనియాడారు. తుపానుతో అతలాకుతలం అవుతోన్న శ్రీలంకలో పలువురు మృతి చెందడం పట్ల భారత ప్రధానిమోదీ విచారం వ్యక్తంచేశారని ఆయన తెలిపారు. శ్రీలంకకు 'ఆపరేషన్ సాగర్ బంధు' ద్వారా భారత్ చేయూతనందిస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఓ నిండు గర్భిణిని భారత్కు చెందిన జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) మంగళవారం రక్షించింది. మంగళవారం వరకు ఇక్కడ వరదల కారణంగా 400 మందికిపైగా మృతిచెందగా.. 336 మంది గల్లంతయ్యారు.

*1,300 మందికి పైగా మంది మృతి!*

వరదల కారణంగా ఇండోనేసియా, శ్రీలంక, థాయ్లాండ్లలో మంగళవారం వరకు 1,300 మందికి పైగా మృతిచెందారు. 800 మందికి పైగా గల్లంతయ్యారు. కేవలం ఇండోనేసియాలోనే 712 మరణించగా.. శ్రీలంకలో 410, థాయ్లాండ్లో 181 మంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు.

## శ్రీలంకకు విమాన అనుమతిపై పాక్ దుష్ప్రచారం... తిప్పికొట్టిన భారత్

దిల్లీ/ఇస్లామాబాద్: తుపాను, వరదలతో కుదేలైన శ్రీలంకకు మానవతా సాయాన్ని చేరవేయకుండా అడ్డుకున్నారంటూ పాకిస్థాన్ తనపై చేసిన ఆరోపణలను భారత్ గట్టిగా తిప్పికొట్టింది. భారత గగనతలం మీదుగా శ్రీలంకకు చేరుకోవడానికి గాను విమాన అనుమతుల కోసం ఇస్లామాబాద్ నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అభ్యర్థన రాగా నాలుగున్న గంటల వ్యవధిలోని మంజూరు చేశామని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. అయితే, అభ్యర్థన చేసిన 48 గంటల తర్వాత కాని తమకు భారత్ నుంచి గగనతల అనుమతి లభించలేదని, అదీ కూడా ఒకవైపు వెళ్లేందుకు మాత్రమే ఇచ్చారంటూ ఇస్లామాబాద్లోని పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించింది. విమాన అనుమతుల జాప్యంవల్లే శ్రీలంకకు సకాలంలో సహాయ సామగ్రిని చేరవేయలేకపోయామని ఆక్షేపించింది. ఈ ఆరోపణలను భారత ప్రతినిధి తోసిపుచ్చారు.

## పోలవరం అనుసంధాన పనులకు రూ.542 కోట్లు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు ఎడమ, కుడి వైపు అనుసంధాన రహదారుల నిర్మాణంతో పాటు అఖండ గోదావరి ఎడమగట్టు రక్షణ పనులకు రూ.542.85 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ మేరకు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం పాలనామోద ఉత్తర్వులు ఇచ్చారు. మంత్రి మండలి నిర్ణయం మేరకు ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

## రూ.3,000 కోట్ల రుణం సమీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో రూ.3,000 కోట్ల రుణం సమీకరించింది. రిజర్వు బ్యాంక్ నిర్వహించిన సెక్యూరిటీల వేలంలో పాల్గొని రూ.1,000 కోట్లు చొప్పున మూడు తరహాల్లో ఈ మొత్తం తీసుకుంది. 11 ఏళ్ల కాలపరిమితితో తీర్చేలా 7.35% వడ్డీకి రూ.1,000 కోట్లు, 15 ఏళ్ల కాలపరిమితికి 7.53% వడ్డీకి మరో రూ.1,000 కోట్లు, 19 ఏళ్లలో తిరిగి తీర్చేలా 7.59% వడ్డీకి మరో రూ.1,000 కోట్ల రుణం స్వీకరించింది.

## గ్రో బ్యాగ్ కిట్ల టెండర్ల ఖరారుకు కమిటీ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రిగార్డెన్స్ అభివృద్ధికి గ్రో బ్యాగ్ కిట్ల సరఫరాకు టెండర్ల ఖరారుకు కమిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీకి మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ ఛైర్మన్‌గా, అదనపు డైరెక్టర్ సభ్య-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా వ్యవసాయ, ఉద్యాన శాఖల డైరెక్టర్లు, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ, సమగ్ర శిక్షా ఫైనాన్స్ కంట్రోలర్ ఉంటారు. ఈ బ్యాగుల్లో న్యూట్రిగార్డెన్స్ పెంచుతారు.

## మారిటైం బోర్డులో పదోన్నతులకు కమిటీ

ఈనాడు, అమరావతి: ఏపీ మారిటైం బోర్డులో మొదటి, రెండో కేడర్ గెజిటెడ్ పోస్టుల్లో ఉన్న సిబ్బంది పదోన్నతుల వ్యవహారాల పరిశీలనకు 'డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ' ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ మారిటైం బోర్డు సీఈవో కమిటీ మెంబర్/కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, ఇన్‌క్యాప్ ఎండీ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ విభాగం ప్రత్యేక కార్యదర్శి/ఉప కార్యదర్శి/సంయుక్త కార్యదర్శి/అదనపు కార్యదర్శి సభ్యులుగా ఉంటారని పేర్కొంది. కమిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి రెండేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపింది.

## ఈ నెల 10 నుంచి టెట్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఈ నెల 10 నుంచి నిర్వహించనున్నట్లు ఏపీ టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12గంటలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రోజుకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. టెట్‌కు మొత్తం 2,41,509 మంది అభ్యర్థులు 2,71,692 దరఖాస్తులు సమర్పించారు.

## సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ వేయండి

### సీఐడీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ఏ6 నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు శ్రీధర్‌రెడ్డి తరఫు న్యాయవాది నగేశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు ఏసీబీ కోర్టు నాలుగు బెయిలు పిటిషన్లను కొట్టేసిందన్నారు. సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలని కోరారు.

## మంగళగిరి బంగారు ఆభరణాల తయారీ క్లస్టర్‌కు రూ.75 లక్షలు

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలో బంగారు ఆభరణాల తయారీ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వ వాటా కింద విడుదలచేసిన మొత్తంలో రూ.75 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రూ.9.99 కోట్లతో సీఎఫ్‌సీ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందులో కేంద్ర వాటా(80%) కింద రూ.7.99 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం (15%) కింద రూ.1.49 కోట్లు, సీఎఫ్‌సీ పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన ఎస్పీవీ రూ.50 లక్షలు భరిస్తాయి.

కోకోనట్ క్లస్టర్‌లో...: పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో కోకోనట్ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వ వాటా కింద భరించాల్సిన మొత్తంలో రూ.2.25 కోట్లు విడుదల చేసేందుకు పాలనాపరమైన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రూ.29.97 కోట్లతో సీఎఫ్‌సీ ఏర్పాటు చేసేందుకు రాష్ట్రం ప్రతిపాదించింది. అందులో కేంద్రం రూ.20.98 కోట్లు భరిస్తుంది. రాష్ట్రప్రభుత్వం రూ.4.50 కోట్లు, సీఎఫ్‌సీ పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన ఎస్పీవీ వాటా కింద రూ.3.99 కోట్లు, బ్యాంకు రుణంగా 50 లక్షలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## సీఐడీలో సీనియర్ కన్సల్టెంట్‌గా అఖిల్‌చౌదరి నియామకం

ఈనాడు, అమరావతి: సీఐడీలో సీనియర్ లెవెల్ కన్సల్టెంట్‌గా న్యాయవాది ఉన్నం అఖిల్‌చౌదరి నియమితులయ్యారు. ఏడాదిపాటు ఒప్పంద ప్రాతిపదికన ఆయనను నియమిస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నియామక విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీకి సూచించారు.

## ముగిసిన తెదేపా మండల అధ్యక్షుల శిక్షణ

ఈనాడు, అమరావతి: తెదేపా మండల అధ్యక్షుల రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యశాలలో సూపర్ సిక్స్, కార్యకర్తలకు పార్టీ అందించే బీమా, సాధికారత, సామాజిక మాధ్యమాల వినియోగం, సాంకేతికత, మై టీడీపీ యాప్ వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎమ్మెల్యేలు కూన రవికుమార్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ తదితరులు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. 'వైకాపా తప్పుడు ప్రచారాలు- నాయకుల అప్రమత్తత' అంశంపై తెదేపా జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న అవగాహన కల్పించారు.

# 17 నెలల్లోనే సాగునీటి రంగం ప్రగతి పథం

- పోలవరం నిర్వాసితులకు రూ.1,900 కోట్లు ఇచ్చాం
- రూ.3,850 కోట్లతో హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం పెంచాం
- జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



ఈనాడు, అమరావతి: జగన్ హయాంలో కుదేలైన సాగునీటి రంగాన్ని చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 17 నెలల్లోనే ప్రగతిపథంలో నిలబెట్టిందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు, డ్యామ్‌లు, కాలువల మరమ్మతులు, నిర్వహణకు నిధులివ్వలేదని, చివరి ఆయకట్టుకు సాగునీరు సరిగా అందక ప్రతి నియోజకవర్గంలో 5-20 వేల ఎకరాల వరకు సాగుబడి తగ్గి దిగుబడి తగ్గిపోయిందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. 'జగన్ రివర్స్ టెండరింగ్‌తో ప్రాజెక్టుల పనులన్నీ రద్దుచేశారు. ఇసుక మాఫియా వల్ల అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 42 మంది ప్రాణాలు కోల్పోయారు. పింఛా, గుండ్లకమ్మ, పులిచింతల ప్రాజెక్టుల గేట్లు ఆయన హయాంలోనే కొట్టుకుపోయాయి. అందుకే ఎన్డీయే ప్రభుత్వం ప్రాజెక్టుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ శ్రీశైలం మరమ్మతులకు రూ.200 కోట్లు, కాటన్ బ్యారేజికి రూ.150 కోట్లు, ఇతర డ్రెయిన్లు, రిజర్వాయర్ల మరమ్మతులకు రూ.344 కోట్లు ఖర్చుచేస్తోంది' అని వివరించారు.

### పుష్కరాల కన్నా ముందే పోలవరం

'జగన్ హయాంలో 2020లోనే డయాఫ్రం వాల్ ధ్వంసమైతే ఆయనకు 2022 వరకు తెలియలేదు. పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో కూడా చెప్పలేని స్థితిలో ఆ ప్రభుత్వం ఉండేది. ఇప్పుడు 2027 గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం పూర్తిచేయాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నాం. పోలవరం నిర్వాసితులకు రూ.1,900 కోట్లు ఒక ఏడాదిలోనే అందించాం. రూ.3,870 కోట్లతో హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం పెంచే పనులు ఏడాదిలో పూర్తిచేశాం. సీమలో 738 కి.మీ. మేర కృష్ణాజలాలు ప్రవహించేలా చేశాం. 2026 జూన్ నాటికి వెలిగొండ పనులు పూర్తయ్యేలా పని చేస్తున్నాం' అనిఅన్నారు.

### కృష్ణా వివాదాల పాపం జగన్‌దే..

'కృష్ణా నీటి కేటాయింపులను పునఃసమీక్ష చేసే అవకాశం ఇచ్చింది నాటి సీఎం జగన్. ఆయన అసమర్థతే అందుకు కారణం. 2020 అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ ఈ ప్రతిపాదన తీసుకువస్తే కనీసం అడ్డుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు' అని రామానాయుడు పేర్కొన్నారు.

# రూ.4 కోట్లకు బీమా చేయించి అన్నను చంపాడు

- అప్పులు తీర్చడానికి తమ్ముడి ఘాతుకం
- తెలంగాణలో ఘటన.. ముగ్గురి అరెస్టు

ఈనాడు, కరీంనగర్- న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు: చేసిన అప్పులు తీర్చడానికి మానసిక పరిపక్వత లేని అన్న పేరిట బీమా చేయించి.. దారుణంగా అంతమొందించి ప్రమాదంగా చిత్రీకరించిన ఘటన కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో జరిగింది. బీమా సంస్థ ప్రతినిధుల అనుమానంతో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు సహా ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు వివరాలు తెలంగాణలోని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం వెల్లడించారు. రామడుగుకు చెందిన మామిడి నరేశ్(30) మూడేళ్ల కిందట రెండు టిప్పర్‌లను కొనుగోలు చేసి వాటిని అద్దెకిస్తూ జీవిస్తున్నాడు. కొన్నాళ్లుగా వ్యాపారం సరిగ్గా సాగకపోవడంతో ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బందులు పడ్డాడు. తెలిసినవారి దగ్గర అప్పులు చేశాడు. దీంతోపాటు స్టాక్ మార్కెట్లోనూ పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. ఇలా రూ.1.50 కోట్ల వరకు అప్పులయ్యాయి. దీంతో తనతోపాటు ఇంట్లోనే ఉంటున్న మానసికంగా పరిపక్వత లేని, అవివాహితుడైన అన్న వెంకటేశ్(37)ను చంపాలని కుట్ర చేశాడు. ప్రణాళిక ప్రకారం రెండు నెలల కిందటి నుంచి వెంకటేశ్ పేరుపై నాలుగు ప్రైవేటు బీమా సంస్థలతో పాటు ప్రభుత్వ బీమా సంస్థల నుంచి వేర్వేరుగా రూ.4.14 కోట్ల బీమాను చేయించాడు.



హత్యకు గురైన వెంకటేశ్



నిందితుడు నరేశ్

- ఇదే సమయంలో నముండ్ల రాకేశ్(28) అనే వ్యక్తి తనకు చెల్లించాల్సిన రూ.7 లక్షల కోసం నరేశ్‌పైన ఒత్తిడి పెంచాడు. దీంతో తన అన్నని ప్రణాళిక ప్రకారం చంపుతున్నానని సహకరిస్తే ఇవ్వాల్సిన రూ.7 లక్షలకు అదనంగా రూ.13 లక్షలు ఇస్తానని చెప్పాడు. రూ.2 లక్షలు ఇస్తానని టిప్పర్ డ్రైవర్ ప్రదీప్(29)ను సైతం ఒప్పించాడు. ఒకవేళ తప్పిదం బయటపడితే అందరం శిక్షను భరించాలని ముగ్గురూ కనపడే విధంగా ఒప్పంద సమయంలోనే వీడియో తీసుకున్నారు. పథకంలో భాగంగా గత నెల 29న రాత్రి గ్రామ శివారులో టిప్పర్ ఆగిపోయిందని డ్రైవర్ ఫోన్ చేసి నరేశ్‌కు చెప్పాడు. తన అల్లుడు సాయి బైక్‌పై అన్న వెంకటేశ్‌ను టిప్పర్ వద్దకు పంపించాడు. వెనకాలే నరేశ్ వెళ్లాడు. టిప్పర్ చక్రం కింద జాకీ పెట్టాలని.. వెంకటేశ్‌ని కింద పడుకోబెట్టి నరేశ్ టిప్పర్‌ను నడుపుతూ ముందుకు కదిలించాడు. దీంతో వెంకటేశ్ టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదవశాత్తు జరిగిందని పోలీసులకు చెప్పాడు. 30వ తేదీన బీమా సంస్థ ప్రతినిధులు రాగా సంఘటన గురించి నరేశ్ చెప్పిన విధానంపై వారికి అనుమానం వచ్చి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పూర్తిస్థాయిలో విచారణ చేయగా హత్య చేసినట్లు తేలడంతో నరేశ్‌తోపాటు రాకేశ్, ప్రదీప్‌లను అరెస్టు చేశారు.

# పీపీపీ విధానంలో వైద్యకళాశాలల నిర్మాణ ఒప్పందాల్లో సవరణలకు ఆమోదం

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: పీపీపీ విధానంలో తొలిదశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి ఆర్‌ఎఫ్‌పీ, డ్రాఫ్ట్ కన్సెషన్ ఒప్పందాల్లో సవరణలకు రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. సెప్టెంబరు 18న టెండర్లు పిలిచి, అక్టోబరు 6, 23 తేదీల్లో ప్రీబిడ్ సమావేశాలు నిర్వహించారు. ఇందులో చర్చించిన అంశాల మేరకు చిన్నచిన్న సవరణలకు టెండర్ కమిటీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్రతిపాదనలకు గత నెల 28న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం దక్కడంతో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సవరణలు ఇవీ..

- నాలుగు వైద్య కళాశాలలకు 257.60 ఎకరాల భూమి ఉంటే.. అందులో 197.71 ఎకరాలే లీజుకు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆదోని వైద్య కళాశాలకు 49.64 ఎకరాలు, మదనపల్లె 52.47 ఎకరాలు, మార్కాపురం 47.10 ఎకరాలు, పులివెందుల వైద్య కళాశాలకు 48.50 ఎకరాలు కేటాయించింది. ఇందులో 625 పడకల ఆసుపత్రి, 150 యూజీ సీట్లు, 24 పీజీ సీట్లతో వైద్య కళాశాల, విద్యార్థులు- అధ్యాపకుల వసతిగృహాలు, సిబ్బంది నివాసాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలి. మిగిలిన భూమిని భవిష్యత్తులో నర్సింగ్, పారా మెడికల్ శిక్షణ కేంద్రం, దంత వైద్య కళాశాల, టెలిమెడిసిన్, ఫిజియోథెరపీ, ఆయుష్ కేంద్రాలతోపాటు పడకలు, సీట్ల పెంపు లాంటి వైద్య అవసరాలకే వినియోగించాలి. నాన్ క్లినికల్, వాణిజ్య అవసరాలకు ఈ భూమి వినియోగించకూడదు.
- ఒప్పందం అమల్లోకి వచ్చినరోజు నుంచి (ఎఫెక్టివ్ డేట్) రెండేళ్లపాటే ఆయా కళాశాలకు కేటాయించిన వైద్య, వైద్యేతర సిబ్బంది జీతాలు ప్రభుత్వం భరించేలా సవరణ చేశారు. ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు అదనపు సిబ్బంది, నియామక ఖర్చు నిర్వహణ సంస్థ భరించాలి. ఆసుపత్రి, వైద్య కళాశాల నిర్వహణకు ప్రభుత్వం ఖర్చులేవీ ఇవ్వదు. రెండోదశ పూర్తయిన తర్వాత ప్రభుత్వ అనుమతితో భవిష్యత్తులో నర్సింగ్ కళాశాల, దంత వైద్యశాల, ఆయుష్ కేంద్రాలు, పడకలు, సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు. వీటి ద్వారా వచ్చే ఆదాయంలో 3% ప్రభుత్వానికి చెల్లించాలి.
- పీపీపీ విధానంలో నిర్మించే వైద్యకళాశాలకు 'ప్రభుత్వ వైద్య కళాశాల- ఆసుపత్రి' అని పేరు పెట్టాలి (ఫాంట్ సైజ్: 70).. పీపీపీ ద్వారా అభివృద్ధి చేసిన సంస్థ పేరు (ఫాంట్ సైజ్: 30) దిగువన రాసుకోవచ్చు.
- పీపీపీ విధానంలో భాగస్వామ్యం అయ్యే సంస్థలో సభ్యులు ముగ్గురికి మించకూడదు. ◆ ఆసుపత్రిలో 70% పడకలు పేదరోగులకు కేటాయించాలి. భవిష్యత్తులో పడకల సంఖ్య పెరిగితే వాటికీ ఇదే నిబంధన వర్తిస్తుంది.

# భాజపాకు ప్రత్యామ్నాయం ప్రాంతీయ పార్టీలే

- భవిష్యత్తులో థర్డ్ ఫ్రంట్ సాధ్యం
- శివ్‌నాడార్ 'ఇగ్నిషన్' కార్యక్రమంలో కేటీఆర్



ఈనాడు-చెన్నై: భవిష్యత్తులో కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి ఎప్పటికైనా ప్రత్యామ్నాయం ప్రాంతీయ పార్టీలేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టంచేశారు. శివ్‌నాడార్ ఫౌండేషన్ చెన్నైలో మంగళవారం ఏర్పాటుచేసిన 'ఇగ్నిషన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో మాట్లాడుతూ.. తన తండ్రి కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ కోసం చాలా కష్టపడ్డారని, పలు ప్రాంతీయ పార్టీలకు పిలుపునిచ్చినా వారు ముందుకు రాలేదని తెలిపారు. భవిష్యత్తులో థర్డ్ ఫ్రంట్ సాధ్యమనేనన్నారు. కేంద్రంలో బలంగా ఉన్న భాజపా, కాంగ్రెస్‌లను పైకి రాకుండా చేయడంలో తమిళనాడు రాజకీయాలు చక్కగా పనిచేస్తున్నాయని వివరించారు.

### రాహుల్‌కు విజన్ ఏమిటో తెలియడంలేదు

దేశంలోని ప్రతిపక్షాల్లో ఐక్యత లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని కేటీఆర్ అన్నారు. "కాంగ్రెస్ పార్టీ వ్యక్తుల్ని ఎంచుకోవడంలో విఫలమవుతోంది. ఆ పార్టీ పునరాలోచించాల్సిన అవసరముంది. ప్రతిపక్షంలో ఉన్న రాహుల్‌గాంధీకి దేశంపై ఉన్న విజన్ ఏమిటనేది నాకైతే తెలియడంలేదు. ఆయన ఏ రోజూ స్టార్టప్స్, ఆవిష్కరణలు, ప్రపంచ స్థాయి యూనివర్సిటీల గురించి మాట్లాడటం నేను వినలేదు. ఈ తరహా ప్రవర్తనతో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులోని డీఎంకేకి కాంగ్రెస్‌తో ముప్పు వాటిల్లవచ్చు. మరోవైపు భాజపా నేతలు జాతి వ్యతిరేక భావాలతో ముందుకెళ్తున్నారు. ఎప్పుడూ పాకిస్థాన్, బంగ్లాదేశ్, హిందూ, ముస్లింల గురించే మాట్లాడుతుంటారు. ఆ పార్టీని వచ్చే ఏడాది తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్‌లలో ప్రజలు గట్టిగా వ్యతిరేకిస్తారు" అని అన్నారు. బ్యూరోక్రసీ నిర్వహణ రాజకీయ నేతలకు ఎదురయ్యే పెద్ద సమస్య అని ఓ ప్రశ్నకు కేటీఆర్ బదులిచ్చారు. 'మేం ఎన్నో ఏళ్లుంటాం. ఆ లీడర్లు ఐదేళ్లే ఉంటారు' అనే భావన అధికారిక వ్యవస్థలో ఉందన్నారు. నేతలకు న్యాయవ్యవస్థ రెండో సమస్యగా ఉందన్నారు. కోర్టుల్లో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నా వాటి పరిష్కారానికి పకడ్బందీ వ్యవస్థ తీసుకురాలేదన్నారు. ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతున్నాయనే ప్రశ్నకు కేటీఆర్ బదులిస్తూ ఏఐ అనేది ముప్పు కాదని, బ్రహ్మాండమైన అవకాశమని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్డీయే అధికారంలో ఉన్న రాష్ట్రాలకెళ్లి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటున్నారని, అదే నిజమైతే, దేశంలో 28 డబుల్ ఇంజిన్లు బాగా పనిచేసి దేశాన్ని ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిపేవన్నారు.

# జేపీ నడ్డాకు జన్మదిన శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి, దిల్లీ: : భాజపా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆరోగ్యం, దీర్ఘాయుస్సు కోసం ప్రార్థిస్తున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

◆ 'మీరు ఆరోగ్యంగా, ఆనందంతో.. దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అని మంత్రి లోకేశ్ నడ్డాకు శుభాకాంక్షలు తెలిపారు.



జేపీ నడ్డాకు శుభాకాంక్షలు తెలిపిన ఏపీ భాజపా, తెదేపా నాయకులు

### నడ్డాను కలిసిన రాష్ట్ర నేతలు

జేపీ నడ్డా జన్మదినం సందర్భంగా మంగళవారం ఏపీ భాజపా, తెదేపా నేతలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా నాయకుడు, కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, తెదేపా మాజీ ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, కనకమేడల రవీంద్రకుమార్, భాజపా మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, పార్టీ నాయకులు మాదాల శ్రీనివాసరావు పార్లమెంటు భవనంలో జేపీ నడ్డాను కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

◆ భాజపా అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మతో కలిసి ఆ శాఖ క్యాబినెట్ మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో భారీ పరిశ్రమల స్థాపనతోపాటు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

# శంషాబాద్-కువైట్ విమానానికి బాంబు బెదిరింపు

### ముంబయిలో అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్, న్యూస్‌టుడే: 'హైదరాబాద్‌కు టేకాఫ్ తీసుకున్న ఓ అంతర్జాతీయ విమాన సర్వీస్‌లో బాంబులు ఉన్నాయి. శంషాబాద్‌లో ల్యాండింగ్ అయ్యేలోపు పేల్చేస్తాం' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఎయిర్‌పోర్ట్ మెయిల్‌కు సందేశం పంపించారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం... ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఇ-1234 విమానం కువైట్ నుంచి 235 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. అందులో బాంబులు ఉన్నాయంటూ

శంషాబాద్ విమానాశ్రయానికి మంగళవారం తెల్లవారుజామున సందేశం రావడంతో భద్రతాధికారులు ఉలిక్కిపడ్డారు. విమానాన్ని పైలట్ వెంటనే దారి మళ్లించి ముంబయి విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండింగ్ చేయడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాన్ని నిర్జన ప్రదేశానికి తరలించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విమానంలో ఎలాంటి పేలుడు పదార్థాలు దొరకలేదు. అనంతరం ఆ విమానం శంషాబాద్‌కు సాయంత్రం 3.45కు చేరుకుంది. నెల రోజుల్లో విమాన సర్వీసులకు బాంబు బెదిరింపు సందేశాలు రావడం ఇది ఎనిమిదోసారి. జీహెచ్ఐఏఎల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్జీఐఏ ఓపీ ఇన్‌స్పెక్టర్ సంపతి కనకయ్య తెలిపారు.

### 8 దేశీయ విమాన సర్వీసులు రద్దు

ప్రతికూల వాతావరణం, నిర్వహణ కారణాలతో మంగళవారం హైదరాబాద్ నుంచి కోయంబత్తూర్, రాయ్‌పుర్, ఉదయ్‌పుర్, అహ్మదాబాద్‌లకు రాకపోకలు సాగించాల్సిన 8 దేశీయ విమాన సర్వీసులు అర్ధంతరంగా రద్దయ్యాయి. దీంతో అప్పటికే విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. రీషెడ్యూల్ విమాన సర్వీసుల్లో పంపిస్తామని ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో నిమ్మళించారు.

# పశువులకు సోకే ముద్దచర్మ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి: పశుసంవర్ధక శాఖ

ఈనాడు, అమరావతి: పశువులలో కంటే వాటి దూడల్లో ముద్దచర్మ వ్యాధి (లంపీస్కిన్) ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దీనిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు సూచించారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులు 2-3 వారాల్లో కోలుకున్నా.. కొన్నివారాల పాటు వాటిలో పాల ఉత్పత్తి తక్కువగా ఉంటుందని చెప్పారు. లంపీస్కిన్ సోకిన పశువుల్లో మొదట 2-3 రోజుల పాటు స్వల్ప జ్వరం ఉంటుందని, తర్వాత వాటి శరీరంపై 2-5 సెం.మీ.ల వ్యాసంతో ముద్దలు ఏర్పడతాయని, మరణాల రేటు 1-5 శాతం వరకు ఉంటుందని వివరించారు.

### నివారణకు తీసుకోవాల్సిన చర్యలు

◆ 3 నెలల వయసున్న పశువులన్నింటికీ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి. ◆ వ్యాధి సోకిన పశువులకు వాడిన మేత, నీటిని మిగతా పశువులకు వేయకూడదు. ◆ వ్యాధి ప్రబలిన ప్రాంతాలకు ఆరోగ్యంగా ఉన్న పశువులను తీసుకెళ్లకూడదు. ◆ వ్యాధి ప్రబలిన ప్రాంతాల చుట్టూ 10 కి.మీ.ల పరిధిలోని పశువుల మార్కెట్లను మూసేయాలి.

# జీఎస్టీ వసూళ్లపై ప్రతినెలా పరిశీలన

- నెలాఖరు నుంచి డేటాలేక్ ద్వారా సమాచార విశ్లేషణ
- ఆర్టీజీఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

ఈనాడు, అమరావతి: ప్రతినెలా జీఎస్టీ వసూళ్లతో సహా ఎకనమిక్ ఇండికేటర్లను పరిశీలించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కేంద్రానికి పంపే నివేదికలు కూడా 'కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు' ఆధారంగా ఉంటాయన్నారు. ఆ మేరకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు సామర్థ్యాలు పెంచుకోవాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఏపీలో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తోన్న వివిధ సంస్థలు, కాంట్రాక్టర్లు నిబంధనల మేరకు పన్నులు చెల్లించేలా డేటా విశ్లేషించాలి. డిసెంబరు నెలాఖరులోగా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన 794 సేవలు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ శాఖల సమాచారాన్ని క్రోడీకరించి డేటాలేక్ ద్వారా ఈ నెలాఖరు నుంచి విశ్లేషిస్తాం. ప్రభుత్వశాఖలు అన్నింటికీ కామన్ డేటా సెంటర్‌గా ఆర్టీజీఎస్ వ్యవహరిస్తుంది. ప్రజల్లో సానుకూలత వ్యక్తమయ్యేలా పౌరసేవలు మెరుగ్గా అందించాలి. ప్రజల నుంచి వస్తోన్న సమాచారాన్ని విశ్లేషించి.. సేవలు మరింత సులభతరం చేయాలి. ప్రభుత్వం చేపట్టే వివిధ పథకాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని వెల్లడించారు.

### ఆలయాల్లో సరైన సేవలు అందించలేరా?

రాష్ట్రంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలకు వచ్చే భక్తుల నుంచి వస్తున్న అభిప్రాయాలు చూస్తే వారి సంతృప్తి స్థాయి ఏమాత్రం బాగోలేదని, సేవలు కల్పించడంలో ఎందుకు విఫలం అవుతున్నారంటూ దేవాదాయ శాఖ అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులు, దర్శనాలు తదితరాల్లో సంతృప్తి స్థాయి చాలా తక్కువగా ఉండడమేంటని ప్రశ్నించారు. అన్నీ ఆన్‌లైన్ సేవలు ఎందుకు అందించలేకపోతున్నారు, పొరుగు సేవల సిబ్బందిని నియమించుకుని కూడా సరైన నిర్వహణ చేయలేకపోతే ఎలాగని ప్రశ్నించారు. వీటన్నింటిపై బుధవారం సీఎస్ వద్ద చర్చించి తన వద్దకు రావాలని ఆదేశించారు.

# వైద్య కళాశాలలను రాక్షసుల్లా అడ్డుకుంటున్నారు

- తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: 'పూర్వం ప్రజాశ్రేయస్సు కోసం చేసే యజ్ఞాలను రాక్షసులు భగ్నం చేసినట్లు పురాణాల్లో చదువుకున్నాం. నేడు పేదలకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు కడుతుంటే జగన్ అడ్డుకుంటున్నారు' అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేద రోగులకు, వైద్య విద్య చదివే పేద విద్యార్థులకు మేలు చేసే పీపీపీ వైద్య కళాశాలలను అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ కళాశాలలు ఏర్పాటైతే రాష్ట్రానికి అదనంగా 220 మెడికల్ సీట్లు వస్తాయని, 625 పడకలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా బోధనాసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. నర్సింగ్, దంత వైద్య కళాశాలలు, టెలిమెడిసిన్, ఆయుష్ కేంద్రాలు ఏర్పాటవుతాయని, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుందని తెలిపారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలను రెండేళ్లలో నిర్మించనున్నారని, జగన్ చెప్పిన పద్ధతిలో కట్టాలంటే 15 ఏళ్లు పడుతుందని వర్ల రామయ్య పేర్కొన్నారు.

# రూ.48 కోట్లతో 6 బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతి

ఈనాడు, అమరావతి: స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) కింద రాష్ట్రంలో రూ.48 కోట్లతో ఆరు బయో-కంప్రెస్డ్ బయోగ్యాస్ (బయో-సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, కాకినాడ, ఒంగోలు, కర్నూలులో రోజూ 25 టన్నుల సామర్థ్యంగల ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటికి లోటు భర్తీ నిధి (వీజీఎఫ్) కింద ప్రభుత్వం రూ.14.40 కోట్లు కేటాయించింది. ప్లాంట్లలో ఉత్పత్తి ఆధారంగా దశల వారీగా వీజీఎఫ్ నిధులు విడుదల చేయనున్నారు. ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన భూమిని నగరపాలక సంస్థలు లీజుపై కేటాయించనున్నాయి. ఇందుకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు స్వచ్ఛాంధ్ర సంస్థకు అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్రానికి రూ.8,517 కోట్ల కేటాయింపు శుభపరిణామం

### 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 104 పట్టణాల్లో 552 ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరా, సులభతర జీవనానికి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.8,517.69 కోట్లు కేటాయించడం శుభపరిణామమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం వాటాలతో ఈ నిధులు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014-19 మధ్య జగన్ హయాంలో అమృత్ 1.0 పనులకు వైకాపా ప్రభుత్వం నిధులు సక్రమంగా ఇవ్వకుండా, నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీ నిధులు సీఎఫ్‌ఎంఎస్ ద్వారా మళ్లించడంతో అభివృద్ధి కుంటుపడి లక్ష్యం నెరవేరలేదని ఆరోపించారు. అమృత్ 2.0 ద్వారా అసంపూర్తిగా నిలిచిన పనులు పూర్తిచేస్తూ.. భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే పనులు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని ఈ సందర్భంగా లంకా దినకర్ తెలిపారు.

# ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ముందులు కూడా అందించాలి: ఈయూ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వంలో విలీనం తర్వాత రిటైరైన ఆర్టీసీ ఉద్యోగులకు గతంలోలాగే ఆర్టీసీ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) కోరింది. ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమయ్యాక ఆర్ఈఎంఎస్ నిలిపేయగా.. రిటైర్డ్, మెడికల్ అన్‌ఫిట్ అయిన, వీఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగుల దంపతులకు ఈహెచ్ఎస్ వైద్యం, ఆర్టీసీ ఆసుపత్రులు, డిస్పెన్సరీలో చికిత్సకు ఇటీవల అనుమతించారు. మందులు పొందే విషయంలో స్పష్టత లేదు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సంస్థ ఎండీకి లేఖ రాసినట్లు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నరసయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# మెగా పీటీఎంలో రాజకీయాలొద్దు: సీపీఎం

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లో జరగనున్న తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని (పీటీఎం) రాజకీయ ప్రచారవేదికలుగా మార్చొద్దని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. 'మెగా పీటీఎంలో తెదేపా కార్యకర్తలు పాల్గొనాలని సీఎం చంద్రబాబు చెప్పడం.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తేడా లేకుండా చేయడమే. విద్యాపరమైన కార్యకలాపాలను అధికార పార్టీ రాజకీయ ప్రచారానికి వాడుకోవడం సరికాదు. విద్యా కమిటీలు, తల్లిదండ్రులు, విద్యార్థి-ఉపాధ్యాయ సంఘాలనే ఈ సమావేశాలకు అనుమతించాలి. ఓ పక్క బయటి వ్యక్తులు, విద్యార్థిసంఘాలు విద్యాసంస్థల్లోకి ప్రవేశించరాదని జీవో ఇచ్చి, మరోపక్క తమ పార్టీ కార్యకర్తలను పాల్గొనాలని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వెల్లడిస్తోంది'' అని శ్రీనివాసరావు విమర్శించారు.

# ఐఐఎఫ్‌టీ క్యాంపస్ నిర్మాణ వ్యయ ప్రతిపాదనలో మార్పు!

ఈనాడు, అమరావతి: కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) క్యాంపస్ నిర్మాణానికయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించేలా ప్రతిపాదనలో మార్పులు చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.114.90 కోట్లు భరించాలి. అందులో మిగిలిన రూ.57.10 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసేందుకు అనుమతించింది. 2025-26లో క్యాంపస్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. క్యాంపస్ నిర్మాణ వ్యయాన్ని కేంద్రం 50%, రాష్ట్ర ప్రభుత్వం 35%, మిగిలిన 15 శాతాన్ని పారిశ్రామికవర్గాలు భరించేలా ఉన్న ప్రతిపాదనలో మార్పులు చేసింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ డైరెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## రాష్ట్రంలో స్టూడియోల ఏర్పాటుకు పలు సంస్థల ఆసక్తి

సినిమాటోగ్రఫీ, పర్యాటకశాఖల మంత్రి కందుల దుర్గేష్



**ఈనాడు, అమరావతి:** రాష్ట్రంలో ప్రత్యేకించి విశాఖలో డిజిటల్ స్టూడియోల ఏర్పాటుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ముంబయిలో నిర్వహిస్తున్న 12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమిట్-2025కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను బుక్ మై షో ప్రతినిధులు అనిల్ మఖీజా, చిరాగ్ సరైయా, 91 ఫిల్మ్ స్టూడియోస్ వ్యవస్థాపకుడు నవీన్ చంద్ర, గగన్ విహార్ స్పేస్‌సిటీ ఎగ్జిక్యూటివ్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ కోడెబోయిన, అమెరికాకు చెందిన బ్లూ ఐ సాఫ్ట్ కార్ప్, బీఈఎస్ స్పేస్ ప్రతినిధులు, డెల్టా అడ్వెంచర్ పార్క్ ఫౌండర్ జమ్మి మిస్త్రీ, ఐలైన్ స్టూడియోస్ డైరెక్టర్ డి.రాజేష్ కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు మంత్రి వారికి వివరించారు.

## స్క్రబ్ టైఫస్‌పై అధికారులు అప్రమత్తం

కావాలి: మంత్రి సత్యకుమార్

**ఈనాడు, అమరావతి:** స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అధికారులు అప్రమత్తం కావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈ కేసుల నమోదు, చేపట్టాల్సిన చర్యలపై వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, ఇతర అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కాకినాడ, చిత్తూరు, విశాఖ, కడప, నెల్లూరు, కర్నూలు, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పాజిటివ్ కేసులు గుర్తించామని అధికారులు వివరించారు. ఈ జ్వర పీడితులకు ఇచ్చే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ మాత్రలు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ పద్మావతి తెలిపారు. దీనిపై ప్రజలు ఆందోళన చెందొద్దని, జ్వరం వచ్చి మూడు రోజులైనా తగ్గకపోతే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు.

## పదో తరగతి పరీక్ష ఫీజు విద్యార్థులే చెల్లించొచ్చు

**ఈనాడు, అమరావతి:** పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. విద్యార్థులు తామే ఫీజు చెల్లిస్తే ఆ విషయాన్ని ప్రధానోపాధ్యాయులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. పాఠశాలలు అధిక ఫీజు డిమాండు చేస్తే విద్యార్థులు ఆన్‌లైన్‌లో చెల్లించుకోవచ్చని, కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో పరీక్ష ఫీజు రూ.125 కంటే అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అధికంగా వసూలుచేసే ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత బడులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనధికార వసూళ్లపై విద్యార్థులు, తల్లిదండ్రులు మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు ఫిర్యాదులు చేయొచ్చని సూచించారు.

# రాజధాని పనులకు 6.56 కోట్ల క్యూబిక్ మీటర్ల మెటీరియల్

- ఇందులో గ్రావెల్, మెటల్, ఇసుక
- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి సరఫరాకు ఏర్పాట్లు
- గుత్తేదారు సంస్థలకు వెంటనే లీజులు మంజూరు చేసేలా చర్యలు

**ఈనాడు, అమరావతి:** రాజధాని అమరావతిలో చేపడుతున్న నిర్మాణ పనులకు 6.56 కోట్ల క్యూబిక్ మీటర్ల మేర మెటీరియల్ అవసరమవుతుందని లెక్క తేలింది. ఇందులో గ్రావెల్ 2.70 కోట్ల క్యూబిక్ మీటర్లు, మెటల్ 2.02 కోట్ల క్యూబిక్ మీటర్లు, ఇసుక 1.66 కోట్ల క్యూబిక్ మీటర్ల మేర ఉంది. సీఆర్‌డీఏ పనులు చేస్తున్న గుత్తేదారులకు గ్రావెల్, మెటల్ లీజులు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఆర్‌డీఏ కూడా కొన్ని లీజులు తీసుకోనుంది.

✦ ఇప్పటి వరకు సీఆర్‌డీఏ 86 ఎకరాల్లో గ్రావెల్ లీజులకు దరఖాస్తు చేసింది. ఇంకా కృష్ణా జిల్లాలో 370 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 19 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 21 ఎకరాల్లో గ్రావెల్ లీజులకు దరఖాస్తు చేయనుంది.

✦ బాపులపాడు, గన్నవరంల్లో 3.40 కోట్ల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. వీటిలో లీజుల కోసం సంయుక్త తనిఖీలు నిర్వహిస్తున్నారు.

✦ గుంటూరు జిల్లాలో 22 లక్షల క్యూబిక్ మీటర్ల నిల్వ ఉన్న మెటల్ లీజులను గుత్తేదారులకు సీఆర్‌డీఏకు మంజూరుచేసింది. ఎన్టీఆర్ జిల్లా పరిటాలలో మెటల్ తీసుకోవడంపైనా దృష్టిపెట్టారు.

✦ ప్రకాశం బ్యారేజీకి ఎగువన 1.70 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకను డీసిల్టింగ్ ద్వారా సీఆర్‌డీఏ పనులకు వినియోగించనున్నారు. దీనికోసం పర్యావరణ అనుమతులు పొందేందుకు సీఆర్‌డీఏ దరఖాస్తు చేసుకుంది. డీసిల్టింగ్ ద్వారా ఇసుక తవ్వి, సరఫరా చేసే గుత్తేదారు ఎంపికకు టెండర్లు పిలవనుంది.

### లీజుల మంజూరుకు కమిటీ

సీఆర్‌డీఏ పరిధిలో పనులు చేస్తున్న కీలక గుత్తేదారు సంస్థలైన మేఘా, పీవీఆర్ ప్రాజెక్ట్స్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా, ఎన్‌సీసీ, బీఎస్‌సీపీఎల్, ఎల్‌అండ్‌టీలు.. గ్రావెల్, మెటల్ లీజులకు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ లీజుల మంజూరు విషయంలో సీఆర్‌డీఏ, గనుల శాఖ, పర్యావరణ మదింపు సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి, ఆయా జిల్లాల్లోని సంబంధిత శాఖలతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసి, అవసరమైన చర్యలు తీసుకోనున్నారు.




## జాతీయ స్థాయి పన్ను వసూళ్లలో ఏపీ వాటా 2.97%

**ఈనాడు, దిల్లీ:** దేశవ్యాప్తంగా 2020-21 నుంచి 2024-25 మధ్యకాలంలో ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ వసూళ్లలో ఏపీ వాటా 2.97%గా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. ఈ ఐదేళ్లలో అన్ని రాష్ట్రాల్లో కలిపి రూ.111.75 లక్షల కోట్ల పన్నులు వసూలు కాగా, ఏపీలో అది రూ.3.32 లక్షల కోట్ల మేర ఉంది. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి రూ.40.30 లక్షల కోట్లు (36.07%), కర్ణాటక నుంచి రూ.14.14 లక్షల కోట్లు (12.66%), తమిళనాడు నుంచి రూ.8.50 లక్షల కోట్లు (7.61%) వసూలయ్యాయి. ఇదే సమయంలో కేంద్ర పన్నుల్లో వాటా, ఆర్థిక సంఘం గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఏపీకి రూ.3.23 లక్షల కోట్లు వచ్చాయి. ఇది దేశం మొత్తంలో 4.30%. కేంద్ర నిధుల్లో మహారాష్ట్రకు 6.65%, కర్ణాటకకు 3.90%, తమిళనాడుకు 4.66% దక్కాయి. అత్యధిక మొత్తం ఉత్తర్‌ప్రదేశ్‌కు 15.82%, బిహార్‌కు 8.66%, మధ్యప్రదేశ్‌కు 7.40% చెందాయి' అని మంత్రి వివరించారు.

### ఏపీలో 5,643 పశు వైద్యులు

ఏపీలో 5,643 మంది రిజిస్టర్డ్ పశువుల వైద్యులు ఉన్నట్లు కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 87,914 మంది వైద్యుల్లో ఏపీ వాటా 6.41%గా పేర్కొన్నారు.

### రాష్ట్రానికి ఉపాధి బకాయిలు రూ.939 కోట్లు

ఉపాధి హామీ పథకం కింద ఏపీకి రూ.938.98 కోట్ల బకాయిలున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఇందులో మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.530.45 కోట్లు, వేతనాల కింద రూ.381.02 కోట్లు, పరిపాలనా ఖర్చుల కింద రూ.27.51 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

### పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. 2022లో 73,536 కేసులు గుర్తించగా, 2023 నాటికి ఆ సంఖ్య 75,086కి, 2024 కల్లా 76,708కి పెరిగింది. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ రాజ్యసభలో ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలున్నాయి.


## ఐటీ హార్డ్‌వేర్ సరఫరా సంస్థకు రూ.5 కోట్ల చెల్లింపు

**ఈనాడు, అమరావతి:** సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, ఏపీ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీకి ఐటీ హార్డ్‌వేర్ సరఫరా చేసిన సంస్థకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం రూ.5 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీటీఎస్ ద్వారా బకాయిలు చెల్లించాలని అందులో పేర్కొంది.

## 8 నుంచి 'సివిల్స్' అభ్యర్థులకు ముఖాముఖి: యూపీఎస్సీ

**ఈనాడు, హైదరాబాద్:** సివిల్ సర్వీసెస్-2025 అభ్యర్థులకు 8వ తేదీ నుంచి ముఖాముఖిలు(పర్సనాలిటీ టెస్ట్) ప్రారంభమవుతాయని యూపీఎస్సీ మంగళవారం వెల్లడించింది. మెయిన్ పరీక్షల ఫలితాలను నవంబరు 11న వెల్లడించిన యూపీఎస్సీ.. 2,736 మందిని ముఖాముఖికి ఎంపిక చేసింది. వారిలో 649 మందికి 8-19వ తేదీ మధ్య జరుపుతామని, మిగిలిన వారికి త్వరలో తేదీలను వెల్లడిస్తామని పేర్కొంది.

# పైసల కొద్దీ పీఠం!




- తెలంగాణలో ఆగని 'వేలం పంచాయితీలు'!
- కాసులున్నోళ్లకే పదవులు
- రూపుమారుతున్న ఏకగ్రీవం

**ఈనాడు– కరీంనగర్, సంగారెడ్డి, సూర్యాపేట, నిజామాబాద్, మహబూబ్‌నగర్:** పంచాయతీ పదవుల కోసం తెలంగాణలోని కొన్ని పల్లెల్లో పైసల బేరసారాలు నడుస్తున్నాయి. ఏకగ్రీవమనే ముసుగులో.. రూ. లక్షలు ఆశచూపి సర్పంచి, ఉప సర్పంచి స్థానాల్ని కొందరు కైవసం చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత నామినేషన్ల దాఖలు ప్రక్రియ మంగళవారం ముగిసింది. చివరి విడత ఎన్నికలకు బుధవారం నుంచి మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటి వరకు దాఖలు చేసిన నామినేషన్లలో కొందరిని ఒప్పించి ఏకగ్రీవం చేయాలనే ప్రయత్నాలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. బలవంతపు ఏకగ్రీవాలు చెల్లవంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవలే ఉత్తర్వులిచ్చినా బేరసారాలు ఆగలేదు. ఒక స్థానానికి ఒకే అభ్యర్థి నామినేషన్ వేసిన పక్షంలో స్వీయ ధ్రువీకరణ పత్రాలు రాయించుకునే విధంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నా.. వేలం పాటల 'పంచాయితీ' కొనసాగుతూనే ఉంది.

### నిర్మాణాలకు నిధులిస్తామంటూ..

ఒకప్పుడు ఊరిని ఆదర్శంగా నిలిపేందుకు అంతా ఏకతాటిపై నిలబడి మంచి అభ్యర్థిని సర్పంచిగా ఏకగ్రీవం చేసుకునేవారు. గ్రామానికి అవసరమైన అన్నిరకాల పనుల్ని చేపట్టే బాధ్యతను కలిసికట్టుగా ఎంచుకున్న పాలకవర్గానికి అప్పగించేవారు. కానీ ఇప్పుడు ధన ప్రభావంతో ఏకగ్రీవానికి అర్థం మారిపోతోంది. డబ్బున్నవారే పదవుల్ని కొనుక్కునే పరిస్థితులు నెలకొన్నాయి. వారిచ్చే నిధులతో ఊరి అవసరాల్ని తీర్చుకోవచ్చంటూ.. గ్రామ పెద్దలు కూడా ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికి పదవులను కట్టబెట్టేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో స్థిరాస్తి వ్యాపారులు, ఆర్థికంగా బలం ఉన్నవారు సులభంగా డబ్బును ఎరవేస్తూ ఈ పీఠంపై కూర్చుంటున్నారు. వేళ్ల మీద లెక్క పెట్టే స్థాయిలో అక్కడక్కడా నిజాయతీగా ఏకగ్రీవాల్ని చేపడుతున్న గ్రామ పంచాయతీలు కూడా ఉంటున్నాయి.

### ఇలా ఇష్టానుసారంగా..

✦ సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో మంచి ఆదాయమున్న పంచాయతీల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని చిన్న పంచాయతీల్లో ఎక్కువగా ఈ విధానంలో సర్పంచి, ఉప సర్పంచి పదవుల్ని కొందరికి కట్టబెడుతున్నారు. బయటకు ఒకే నామినేషన్ దాఖలవుతున్నా.. లోపల పైసల తతంగం నడుస్తోంది.


✦ ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఓ పంచాయతీ కోసం రూ.70 లక్షలు ఇస్తానని ఓ అభ్యర్థి హామీ ఇచ్చినట్లు తెలిసింది. మరోచోట సర్పంచి పదవిని రూ.50 లక్షలకు, ఉప సర్పంచి పదవిని రూ.10 లక్షలకు దక్కించుకున్నారు. ఇక్కడి మూడు జిల్లాల్లోని నాలుగైదు పంచాయతీల్లో ఇలా 'డబ్బు' పోటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరిగిందని సమాచారం.

✦ జోగులాంబ గద్వాల జిల్లాలోని 10కి పైగా గ్రామాల్లో రూ.10 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు వేలంతో పలువురిని ఎంపిక చేశారు. పోటీ లేకుండా కేవలం వారినే సర్పంచులు, వార్డు సభ్యులుగా నామినేషన్లు వేయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అంతటా ఇలాంటివి జరుగుతున్నా బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు.

✦ నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ గ్రామంలో పోటీకి దిగిన ఏడుగురిలో రూ.25 లక్షలిస్తానన్న వ్యక్తికే గ్రామపెద్దలు జైకొట్టారు. నామినేషన్ ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మరో పోటీదారు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా.. అధికారుల దృష్టికి వెళ్లడంతో.. గ్రామస్థులతో సమావేశం నిర్వహించి నిబంధనల్ని ఉల్లంఘిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

✦ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ పలు తండాల్లో ఇదే తరహా ఒప్పందాలతో రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడి ఓటర్లను బట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఇస్తామనే బేరాలు నడుస్తున్నాయి. ఓ గ్రామంలో ఈసారి కొత్త వ్యక్తిని సర్పంచిగా ఎన్నుకోవాలని నిర్ణయించగా...గతంలో సర్పంచిగా అవకాశం ఇచ్చిన వ్యక్తి మళ్లీ పోటీచేస్తానని పట్టుపట్టారు. దీంతో ఎన్నికలను బహిష్కరిస్తామంటూ ఊరి ముఖ్యులు హెచ్చరించారు.

# శునకాలతో.. బడి పిల్లల పరిస్థితి భయానకం



- 7,472 సర్కారు బడులకు ప్రహరీల్లేవు
- సుప్రీంకోర్టు చెప్పినా మారని తీరు

● ఇది మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పాంబండ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల. ఇందులోనే అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. ప్రహరీకి మూడు గేట్లు ఉన్నాయి. బడి గేటు మూసినా పంచాయతీ కార్యాలయం గేటు తెరిచే ఉండటంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రంలోని ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అయినా ఇప్పటికీ కుక్కల బెడద తప్పడం లేదు.

● ఇది వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌నగర్ ప్రాథమిక పాఠశాల. చుట్టూ ప్రహరీ ఉన్నా గేటు అమర్చలేదు. దీంతో కుక్కలు, గేదెలు, పందులు నిత్యం పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తున్నాయి. ఈ పరిస్థితి చిన్నారులకు ముప్పుగా మారిందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

### రూ.వెయ్యికోట్లు అవసరం

'జనసమ్మర్ద ప్రాంతాల్లో వీధి కుక్కలు కనిపించొద్దు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల దరిదాపుల్లోకి వాటిని రానివ్వకుండా ఎనిమిది వారాల్లో ప్రహరీ గోడలు లేదా కంచెలు నిర్మించాలి' అని తాజాగా సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా కుక్కకాటు బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల గణాంకాలను పరిశీలించగా ఏకంగా 28.64 శాతం బడులకు ప్రహరీ గోడలు లేవని తేలింది. అంటే మొత్తం 26,087 సర్కారు బడుల్లో 7,472 చోట్ల ప్రహరీలు లేవని విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఫలితంగా కుక్కలు, పందులు, గేదెలు యథేచ్ఛగా పాఠశాలల ఆవరణల్లో తిరుగుతున్నాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు తిన్న తర్వాత మిగిలిన పదార్థాల కోసం గుంపులుగా వస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వంద మీటర్ల ప్రహరీకి దాదాపు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షలు ఖర్చవుతుంది. దీని ప్రకారం అన్ని బడుల్లో కొత్తగా ప్రహరీలు నిర్మించాలంటే కనీసం రూ.వెయ్యి కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. విద్యాశాఖ మాత్రం సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా ఈ సమస్యపై దృష్టి సారించలేదు. అనేకచోట్ల ప్రహరీల నిర్మాణానికి స్థల వివాదాలు కూడా ఉన్నా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు.



శివ్వంపేట మండలం పాంబండ పాఠశాల ఆవరణలో కుక్కలు

### ఇతర కార్యాలయాల నిర్వహణతో..

చాలాచోట్ల పాఠశాలల ప్రాంగణాల్లో పంచాయతీ కార్యాలయాలు, పీహెచ్‌సీలు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రహరీలు ఉన్నా.. గేట్లు తెరిచి ఉంచాల్సిన పరిస్థితి. దాంతో ఎవరైనా తేలికగా లోపలికి వస్తుండటంతో ముఖ్యంగా బాలికలకు రక్షణ సమస్యగా మారిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని పాఠశాలల్లో గుళ్లు కూడా ఉండటం గమనార్హం. కరీంనగర్ లాంటి జిల్లాల్లో అనేకచోట్ల విద్యుత్తు సబ్‌స్టేషన్లు కూడా బడి ఆవరణలోనే ఉన్నాయి. చాలా బడుల్లో శౌచాలయాలు పనికి రాకుండా ఉండటం, అసలే లేకపోవడంతో విద్యార్థులు మూత్రవిసర్జనకు బయటకు వెళ్తున్నారు. ఆసమయంలో గేటు తీయగానే కుక్కలు చొరబడుతున్నాయి.

- ఈనాడు, హైదరాబాద్

## భర్తలేని లోకంలో ఉండలేనంటూ..

రెండేళ్ల కుమారుడితో కలిసి వివాహిత ఆత్మహత్య



కుమారుడు శ్రీయాన్‌గౌడ్‌తో అఖిల

**చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే:** కడదాకా కలిసి ఉంటాడనుకున్న భర్త అర్ధాంతరంగా చనిపోయాడు. చిన్నవయసు కావడంతో మరో పెళ్లి చేసుకొని, కొత్త జీవితం ప్రారంభించమని అత్తామామలు హితవు పలికారు. కానీ భర్త తోడు లేని జీవితం నాకొద్దనుకున్న ఆ వివాహిత.. రెండేళ్ల కుమారుడితో కలిసి బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర ఘటన తెలంగాణలోని మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాపూర్‌కు చెందిన ప్రవీణ్‌గౌడ్, అఖిల (25) దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి రెండేళ్ల కుమారుడు శ్రీయాన్‌గౌడ్ ఉన్నాడు. ఉన్నంతలో వారి జీవితం సాఫీగానే సాగిపోతుండగా.. అనారోగ్య సమస్యలతో ఏడాది కిందట ప్రవీణ్ మృతి చెందాడు. అప్పటినుంచి కుమారుడితో కలిసి అత్తారింట్లో ఉంటోంది అఖిల. తరచూ భర్తను గుర్తు చేసుకుంటూ మనోవేదన చెందేది. ఆమె బాధ చూసిన అత్తామామలు జమున, ప్రకాష్‌గౌడ్‌లు మరో వివాహం చేసుకోవాలని కోడలికి పలుమార్లు సూచించారు. కానీ ఆ మాటలు పట్టించుకోకుండా మనస్తాపంతోనే ఉండేదామె. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కుమారుడికి ఉరేసి, తాను ఉరేసుకుంది అఖిల. కాసేపటికి ఇంటికొచ్చిన జమున స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. శ్రీయాన్ ఊపిరితో ఉన్నట్లు అనిపించి రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అఖిల మేనమామ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

## శబరిమలకు 10 ప్రత్యేక రైలు సర్వీసులు

**ఈనాడు, హైదరాబాద్:** శబరిమలకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని డిసెంబరు 13 నుంచి జనవరి 2 వరకు జోన్ పరిధిలోని చర్లపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, హజూర్‌సాహిబ్ నాందేడ్ స్టేషన్ల నుంచి కేరళలోని కొల్లం జంక్షన్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ద.మ. రైల్వే ప్రకటించింది. రానుపోను కలిపి 10 ప్రత్యేక రైలు సర్వీసులు అందుబాటులో ఉంటాయని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. డిసెంబరు 3న టికెట్ల బుకింగ్ మొదలవుతుందని పేర్కొంది. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి కొల్లం ప్రత్యేక రైలు(నం.07117) డిసెంబరు 13న బయల్దేరనుంది. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్, కేసముద్రం, మహబూబాబాద్, ఖమ్మం స్టేషన్లలో ఆగుతుంది. విజయవాడ, తిరుపతి మీదుగా కొల్లం వెళుతుంది. చర్లపల్లి నుంచి కొల్లంకు ప్రత్యేక రైళ్లు(నం.07119, 07121) డిసెంబరు 17, 20, 31 తేదీల్లో బయల్దేరుతాయి. సికింద్రాబాద్, బేగంపేట, లింగంపల్లి, శంకర్‌పల్లి వికారాబాద్, తాండూరు మీదుగా గుంతకల్, చిత్తూరు, కాట్పాడి రూట్‌లో ఈ రైళ్లు వెళతాయి. హజూర్‌సాహిబ్ నాందేడ్-కొల్లం ప్రత్యేక రైలు(నం.07123) డిసెంబరు 24న బయల్దేరుతుంది. నిజామాబాద్, ఆర్మూర్, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్, ఖమ్మం మీదుగా విజయవాడ, తిరుపతి, కొట్టాయం మీదుగా గమ్యస్థానం చేరుకుంటుంది. కొల్లం జంక్షన్ నుంచి చర్లపల్లికి డిసెంబరు 15, 19, 22, 26 జనవరి 2 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు ఉంటాయి.

# మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి

- తెగిన చెవి, ఒళ్లంతా తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలు



గాయపడిన ప్రేమ్‌చంద్

**ఈనాడు, హైదరాబాద్, మన్సూరాబాద్, న్యూస్‌టుడే:** 15 నుంచి 20 వీధి కుక్కలు ఒకేసారి దాడి చేయడంతో ఓ మూగ బాలుడు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. ప్రకాశం జిల్లాకు చెందిన సీహెచ్ తిరుపతిరావు, చంద్రకళ దంపతులు హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ మన్సూరాబాద్ సమీపంలోని శివంగంగ కాలనీలో ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రేమ్‌చంద్ (చింటు) పుట్టుకతో మూగ. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వీధిలోకి వెళ్లినప్పుడు ఒక్కసారిగా కుక్కలు తరుముతూ అతడిపై దాడి చేశాయి. దుస్తులు కొరికేసి మరీ కరిచాయి. గమనించిన ఓ స్థానికుడు కర్రతో కుక్కలను అదిలించి 108కు సమాచారం ఇచ్చారు. తొలుత నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రికి, వైద్యుల సూచనతో నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అత్యవసర వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో బాలుడి చెవి తెగింది. తల, నడుము, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. కాస్త ఆలస్యమైతే కుక్కల దాడిలో ప్రేమ్‌చంద్ ప్రాణాలు కోల్పోయేవాడని వైద్యులు తెలిపారు.


### చీఫ్ వెటర్నరీ అధికారి హాజరుకు హైకోర్టు ఆదేశం

వీధి కుక్కల నియంత్రణలో భాగంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాల్సిందేనంటూ ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీకి మంగళవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కలను పట్టుకొని స్టెరిలైజేషన్ చేసి, టీకాలు వేసిన తరువాత ఆశ్రయ కేంద్రాలకు తరలించాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈనెల 9న చీఫ్ వెటర్నరీ అధికారి వ్యక్తిగతంగాకానీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారాగానీ హాజరుకావాలని ఆదేశించింది. వీధి కుక్కల నియంత్రణలో న్యాయస్థానం మార్గదర్శకాలను అమలు చేయాలన్న వినతి పత్రాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ అసోసియేషన్ ఫర్ యానిమల్ షెల్టర్ అండ్ రెస్క్యూ ఎయిడ్ (ఆస్రా) సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలను విన్న తర్వాత రెండు యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాలను సందర్శించి మొబైల్‌తో చిత్రీకరించడానికి పిటిషనర్‌కు అనుమతించాలని, ఇందులో ఎలాంటి ఇబ్బందులు సృష్టించరాదంటూ విచారణను 9వ తేదీకి వాయిదా వేశారు.

## వసతి గృహంలో 14 మంది విద్యార్థులకు అస్వస్థత

- పురుగులున్న ఉప్మా, మురిగిపోయిన అరటిపండ్లు తినడమే కారణం

**గద్వాల అర్బన్, కృష్ణవేణి చౌక్(గద్వాల) న్యూస్‌టుడే:** తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని భీంనగర్‌లో ఉన్న ఎస్టీ సంక్షేమ వసతి గృహంలో మంగళవారం 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇక్కడ 120 మంది విద్యార్థులుండగా... మంగళవారం ఉదయం ఉప్మా, పుట్నాల పొడి వడ్డించారు. ఉప్మాలో పురుగులు కనిపించడంతో వార్డెన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బిస్కెట్లు, అరటి పండ్లు ఇచ్చారు. అరటి పండ్లు కూడా మురిగిపోయాయని, వాటిలోనూ పురుగులు వచ్చాయని విద్యార్థులు తెలిపారు. అప్పటికే ఉప్మా, అరటిపండ్లు తిన్న 14 మంది పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. వారిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స తర్వాత కోలుకున్న 12 మందిని తిరిగి పంపించారు. ఇద్దరిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. జిల్లా సంక్షేమశాఖాధికారిణి నుషిత, డిప్యూటీ తహసీల్దార్ దర్వేష, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు. అనంతరం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో హాస్టల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఉప్మాలో పురుగులు వచ్చాయని వార్డెన్‌కు చెబితే.. ఏమీ కాదంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారంటూ విద్యార్థులు వాపోయారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ హాస్టల్ వద్ద ఆందోళన చేపట్టి, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తూర్పు కనుమల్లోని ఓ జలవనరులో ఆల్గల్ బ్లూమ్

## తూర్పు కనుమల్లోని బ్యాక్టీరియాలో వైవిధ్యం

సీసీఎంబీ-లాకోన్స్ శాస్త్రవేత్తల అధ్యయనంలో గుర్తింపు

**ఈనాడు, హైదరాబాద్:** జీవవైవిధ్యానికి నిలయంగా ఉండే తూర్పు కనుమల ప్రాంతంలోని సరస్సులు, చెరువులు, నదుల్లోని బ్యాక్టీరియాపై సీసీఎంబీ-లాకోన్స్ శాస్త్రవేత్తలు అధ్యయనం చేయగా ఆశ్చర్యకరమైన ఫలితాలు వెల్లడయ్యాయి. ఎన్విరాన్‌మెంటల్ డీఎన్ఏ ఉపయోగించి... వేర్వేరు ప్రాంతాల్లోని 23 జలాశయాల్లో 40 నీటి నమూనాలను సేకరించి వారు అధ్యయనం చేశారు. ఒకచోట ఉన్న బ్యాక్టీరియా దాదాపుగా మరోచోట కన్పించలేదు. అవి ఎంతో వైవిధ్యంగా, ప్రత్యేకంగా ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఎక్కువగా హానికారక బ్యాక్టీరియా ఉందని... ఇది చెరువుల్లో ఉంచే నాచు వంటి ఆల్గల్ బ్లూమ్ అని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ బ్యాక్టీరియా మనుషుల ఆరోగ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. తూర్పు కనుమల ప్రాంతంలో బ్యాక్టీరియా జీవవైవిధ్యంపై తాము జరిపిన పరిశోధనే మొట్టమొదటిదని తెలిపారు.